కన్నీటి కడలి

(ఉత్తమ కథల సంపుటి)



నాగార్జున సాంస్కృతిక కేంద్రం
(ఉత్తర) విజయపురి.

ప్రథమ ముద్రణ
జనవరి 1964

వెల- 3-50

గ్రామస్వరాజ్య ప్రెస్
విజయవాడ -2

మనవి

"కృషితో నాస్తి దుర్భిక్షం, జపతో నాస్తి పాతకం"
అన్న నగ్నసత్యం సయితం నిర్వచనంగా నిలచిపోయిన నేడు మే మీ కార్యానికి పూనుకోవటం సాహసంగానే వుంటుంది. ఉన్నత సమాజానికి ఉత్తమ సాహిత్యం అవసరం యెంతయినా వున్నదని భావించి సమకాలీన దేశ సాంఘిక పరిస్థితులు ప్రతిబింబింపజేసే సాహిత్యాన్ని సృష్టించి, తద్వారా సంఘానికి సేవచేయాలనే సంకల్పంతో కొద్దిమంది రచయితల, రచయిత్రుల సహకారాన్ని అర్థించి, ఆ ఫలితంగా యీ కథానిక సంపుటాన్ని వెలువరించుతున్నాము.

మా యీ సంకల్పం సమర్థనీయమైనదేనని నిర్ణయించవలసిన బాధ్యత సహృదయులైన పాఠకుల మీ దున్నది.

ఇందులోని కథలు-కథకుల వుద్దేశ్యాలూగూడా యివే. ఏదో ఉన్నతసంస్కారజీవితం మన ముందున్నదని భ్రమించి-ఆశించినది పొందలేక సహజమైన జీవితంలో ఓటమి పొందేకంటే, వాస్తవజీవితంలో వున్న మంచి-చెడునే సహృదయంతో చూచి మంచీ- చెడూ ప్రక్క-ప్రక్కలనే వున్నవనే సత్యాన్ని నిరూపించటమే యీ కథానికల అంతర్యం. ఈ రెండు భిన్న భావాలనూ ఏకమతంచేసి చూచినపుడే వాస్తవ జీవితం బోధపడుతుంది.

మా యీ సంకల్పాన్ని ఆచరణలో చూపెట్టాలనే తహతహతప్ప వ్యాపారదృష్టితో మేమీపని చేయటంలేదు పై చెప్పిన లక్ష్యాలతో మేమికముందుగూడా కృషిచేస్తామని, మీ ఆదరాభిమానాలుంటాయని ఆశిస్తాము.

ఇట్లు,
సంకలనకర్తలు.

ఇందులో:- కధలు కధకులు.

కన్నీటి కథలు

శ్రీమతి జి. ఎస్. పి. శర్మ

జీవిత ఎడారిలో ఒయాసిస్సులాంటిది బాల్యదశ... అందులో తొమ్మిది- పధ్నాలుగు సంవత్సరాల మధ్యకాలము నిజముగా బంగారుదశే అని చెప్పుకోవాలి... బరువు బాధ్యతలు లేని కాలము అది. ఈరోజు ఆజీవితాన్ని స్థిమితంగా తలచుకుంటుంటే ఏవేవో మరపురాని ఊహాలతో ప్రమీల జీవితం కూడా గుర్తుకువస్తుంది నాకు... అందరికీ అందరాని ఊహాసుందరి సినీమాతార ప్రమీల నా చిన్ననాటి స్నేహితురాలు... కాని అభాగ్యజీవి... డబ్బు వున్నా సుఖంలేదు. ప్రేమాభిమానాలు కరువైన నిర్భాగ్యురాలు... తలచుకుంటే ఆమె జీవితం కన్నీరు తప్పితే ఏమీలేదు... స్కూలులో ప్రమీల, నేను క్లాస్‌మేట్సు... చివరిదాకా కలిసి చదువుకొనుటవలన యిద్దరిదీ విడరాని బంధమే అయింది. సమాజంలో మా ఇద్దరి కుటుంబాలకు సహస్రాంశము తేడా ఉన్నా మా యిద్దరి మైత్రీ మాత్రము చెరగరానిదై వన్నెలు చిన్నెలుగా గడిచిపోయింది... ప్రమీల శాస్త్రకట్టుగా భరతనాట్యము నేర్చుకొనక పోయినా ప్రతిసినిమాలో డాన్సులు తూ. చా. తప్పకుండా చేస్తూ ఉండేది... చక్కని కోకిల

కంఠము. నల్లని కాటుక కళ్ళు, గుండ్రని బొట్టుపెట్టిన కళ్ళు.
చామన ఛాయ అయినా చూపరులను ఇట్టే ఆకర్షించే అందం పరిమళది... పరిమళ అక్క లలిత మా పై క్లాస్ చదువుతుండేది. అక్కా-చెల్లెళ్ళయినా వాళ్ళిద్దరిలో చాలా తేడా వుండేది... అప్పుడే విచ్చి సౌరభ్యము వెదజల్లే మల్లెలాంటిది పరిమళ అయితే, రంగు రంగుల కాగితంపువ్వు లలిత... అందరికన్నా పైవన్నెలు ఎక్కువ లలితలో... విలువైన బట్టలు నగలు ధరించేది. పరిమళ మాత్రము సామాన్యమైనవి, చిరిగినవి వేసుకొనేది...

మధ్యాహ్నము ఇంటర్వెల్‌లో ఇళ్ళు దూరం అవటం వలన భోజనం స్కూలుకే పంపించేవారు... చల్లని మామిడి చెట్టు నీడలో కారియర్‌లు పెట్టుకుని ఒకళ్ళ పదార్థాలు ఒకళ్ళు రుచి చూసుకుంటూ పరిమళ, నేను భోజనాలు చేసేవాళ్ళము. ఒకరోజు అనుకుంటా పరిమళ అన్నము పాసిపోయింది... "అదేమిటి పరిమళా! అలాంటి అన్నము పంపారు?" అన్నాను... ఏమీ మాట్లాడలేదు..." కళ్ళనీరు కుక్కుకుంటూ "ఇప్పుడు నన్నేం అడగకు శశీ! ఎప్పుడో నా కథంతా నీకు చెపుతాను... నీకన్న నాకు ఆప్తులెవరున్నారు? నువ్వూ, అమ్మ ఇద్దరే నాకు కావాల్సినవారు"...అని చెయ్యి కడిగివేసుకుంది.

కాలగమనంలో తొమ్మిది నెలలు గడిచి పోయాయి. చైత్రమాసము. రోళ్ళు పగిలే రోహిణీ కార్తె ప్రవేశిస్తోంది. మాకు పబ్లిక్ పరీక్షలు ఊపిరిసలపడం లేదు ... రెండు

ఫ్రూటలా పరీక్షలు ... ఆరోజు ఇంగ్లీషు ... పొద్దున్నే మామూలుగా స్కూలుకు వచ్చి చదువుకుంటున్నాను. 9 అయింది, గంట కొట్టారు. ఇంకా ప్రమీల రాలేదు. మనస్సు నిలవలేదు. ఇంగ్లీషులో తప్పితే మొత్తము పరీక్ష అంతా పోతుంది. వాళ్ళ అక్క దగ్గరకి వెళ్ళి అడిగాను ... "ఏమో! నాకేం తెలుసు ఆ దరిద్రురాలి సంగతి ? ... అని కసిరింది. పరీక్ష రాశానన్న మాటేగాని మాటిమాటికి ప్రమీలే గుర్తుకువచ్చింది. మధ్యాహ్నం యింటర్వెల్ లో వాయువేగంతో వాళ్ళింటికి వెళ్ళాను. ఇదివరకు ఎప్పుడూ నేను వాళ్ళింటికి వెళ్ళలేదు.

"ప్రమీలా, ప్రమీలా!" అని పిల్చాను.

"ఎవరు నువ్వు? ప్రమీలతో నీకేంపని !" ఎవరో సినిమాలో విలన్ లాగా బుర్రమీసాలు, మెర్రకళ్ళు, ఏదో వాసన, తూలుతున్నాడు ఒకాయన ... "ప్రమీల పరీక్షకు రాలేదని వచ్చాను" అన్నాను వణుకుతూ. లోపలుంది వెళ్ళు" అన్నాడు ... బ్రతుకుజీవుడా అని లోపలకు వెళ్ళాను. చీకటిగదిలో ప్రమీల మంచం మీద పడుకుని మూలుగుతోంది. వాళ్ళమ్మ కాబోలు కాపడం పెడుతోంది. ఇంకాపరీక్షగాచూసేసరికి వళ్ళంతా దద్దులు... వాతలు. "ప్రమీలా!" అన్నాను. ఉలిక్కిపడింది. "నువ్వా శశీ! ఎందుకువచ్చావు ఈ నరకంలోకి? వెళ్ళిపో శశీ, నువ్వు చూడలేవు" అన్నది.

"అదేమిటే! ఆ అమ్మాయి నిన్ను చూడాలని ఎంతో వస్తే వెళ్ళమంటావు? ... నువ్వేనమ్మా శశి అంటే మా పద్మిమీల నిన్ను గురించి చెబుతుంటుంది రామ్మా కూర్చో!" అంది. ... పద్మిమీల మంచంమీద కూర్చున్నాను ... ఏమిటో అంతా అగమ్యగోచరంగా వుంది ... ఇంకో కావిడ వళ్ళంతా నగలతో మెరుస్తూ ఆ గదిలోకి వస్తూనే "ఏం సుభద్రమ్మా! ఏమన్నా దారిలోకి వచ్చిందా? లేకపోతే మళ్ళీ దెబ్బలు కావాలా? అన్నది.

"చెబుతున్నానమ్మా! అరవకు అసలే జ్వరం వచ్చింది అంది.

"ఆఁ! ఈ జ్వరాలకే మొచ్చులే? అసలుసంగతి తేల్చి చెప్పు. మేము చెప్పినట్లు వినకపోతే మీదారి మీరు చూచుకోవాలి. మిమ్నల్నందర్నీ మేపటానికిక్కడేం ఎస్టేట్లు లేవు ... అంటూ విసురుగా వెళ్ళిపోయింది... పద్మిమీల చెప్పింది ఆవిడ పిన్నిఅని ... కాసేపుకూర్చొని ఇంటికి వచ్చేశాను...

2

శలవలిచ్చేశారు... నెల్రోజులయింది. పద్మిమీల సంగతి ఏమీ తెలియలేదు. ఆరోజు చూడటమే... వెళ్ళుదామంటే వాళ్ళింటికి ఏదో భయంవేసేది. ఆరోజు ఏదో సినిమాచూసి వస్తున్నాము. నేను, అమ్మ నాన్నగారు... బస్ స్టాండు దగ్గ

రికి వచ్చాను ఆ బస్‌స్టాండు వెనుకగా దిక్కులేనివాళ్ళం
దరూ నాలుగు కర్రల ఆధారంమీద చుట్టుగుడిసెలుకట్టుకుని
దానిమీద ఈతాకులు కప్పి తలదాచుకుంటారు ... ఆరు
బయట చిన్నచిన్న గోతులుత్రవ్వి, ఏరుకొచ్చిన పుల్లా
పుడకలతో ఆ గుంటలో మంటచేసి గంజికాచుకు తాగుతూ
వుంటారు... కొంతమంది అదీలేనివాళ్ళు వుంటారు. ఈతా
కుల చాపలుఅల్లి, అమ్మి రంగురంగుల బుట్టలుఅల్లి, కూలి
మోసి-రిక్షాలులాగి సంపాదించినదాంట్లో మ్యునిసిపల్‌వాళ్ళు
పన్ను రూపంలో కొంత లాక్కుపోగా మిగిలినదే వాళ్ళకి
ఆధారము... లేనినాడు పస్తే... దారిద్ర్యం, నిరాశ వారి
మొహాలలో తాండవిస్తూ ఉంటుంది. అంటువ్యాధులు ఆ
ప్రదేశంలో విలయతాండవం చేస్తూ వుంటాయి. ఆ నిర్భా
గ్యులను పరిశీలిస్తూ నడుస్తున్నాను ఒకగుడిసెమీద పరిచిత
మైన ఓణీ ఒకటి ఆరగట్టి కనపడింది... అది ప్రమీలదే...
అమ్మా. నాన్నని వెళ్ళమని చెప్పి ఆ గుడిసెదగ్గరకువెళ్ళాను.
అక్కడ చూసినదృశ్యం... ఏమని చెప్పను? ... ప్రమీలా
వాళ్ళఅమ్మ. మూలుగుతూ పడివున్నది. ప్రమీల కాసిని
నూకలులో రాళ్ళు ఏరుతోంది...మనిషినిచూస్తే భోజనంచేసి
ఏ వారంరోజులోఅయిందేమో అన్పించేట్లుగావున్నది. నన్ను
చూసిగతుక్కుమంది “శశీ! నేను ఇక్కడున్నట్లు నీకెలా తెలుసు?”
అంది. “నీ ఓణి చూసి గుర్తుపట్టి వచ్చానులే? ఇక్కడెందు
కున్నారు ప్రమీలా” అన్నాను. “ఏం చెప్పను శశీ...
మానాభిమానాలు చంపుకోలేక అర్ధరాత్రి ఆయింటిలోనుండి
పారిపోయి వచ్చి ఇక్కడ తలదాచుకున్నాము. ఏదైనా

ఉద్యోగం చూసుకుందామని అనుకుంటున్నాను... నా స్థితి నాకే అగమ్యగోచరంగా వుంది" అంది.

"అయితే ప్రమీలా! మీరు భోజనం చేసి ఎన్ని రోజులయింది"? అన్నాను.

" రోజూ తింటూనే వున్నాముగా:" అని మాట తప్పించబోయింది.

"ప్రమీలా! ప్రాణస్నేహితురాలైన నాదగ్గరకూడా ఎందుకు దాస్తావ్! పాలిపోయిన నీ మొహం, గుంటలుపడ్డ కళ్ళు నాకు నీవిషయం చెప్పటం లేదా! ... తిండిలేక మాడేకన్నా బ్రతికుండి ఏదన్నా సాధించాలి... ఆడదానవు... అబలవు నిస్సహాయురాలవు... ఎవరిసహాయం లేకుండా ఎన్నాళ్ళు గడుపుతావ్... మాయింటికి రాకపోయావా?... నేను ఏమైపోయా ననుకున్నావ్ ! నా నీస్నేహం యింతేనన్నమాట" అన్నాను నిష్ఠూరంగా.

"అదేం లేదు శశీ!... వద్దామనుకుంటే అమ్మకు జ్వరం వచ్చింది. ఇంతలో నువ్వే వచ్చావ్"! అన్నది...

"నువ్వు నాతోరా. తర్వాత సంగతి చూద్దాం! అని లాక్కెళ్ళి అమ్మతో చెప్పి కడుపునిండా అన్నము పెట్టించాను. వాళ్ళమ్మకు కూడా కారియర్ తీసికెళ్ళి తినిపించాను.

తర్వాత ఆగుడిసె ఖాళీచేయించి మాయింటిదగ్గర ఒక యిల్లు ఉండేందుకు ఏర్పాట్లుచేశాము... ప్రమీలకి రేడియోల్లో నాటకాల్లో వేస్తుంటే ఫస్టో సెకండో వచ్చేది...

వాళ్ళమ్మ మిషను కుట్టి కొంత సంపాదించేది మొత్తము మీద రోజులు సాఫీగా వెళుతున్నయ్ ...

ఆరోజు యిద్దరం దొడ్లో జామచెట్టుక్రింద కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నాము...

“ప్రమీలా! నువ్వేమీ అనుకోకుండా వుంటే నీకథ వినాలని వున్నది చెప్పవూ!”అన్నాను.

“చెబుతాను శశీ! కాని నువ్వు నన్ను ఇదివరకు లాగా ప్రేమించలేవు పైగా అసహ్యించుకుంటావుకూడాను.”

. “నీకలాంటి అనుమాన మేమీవద్దు ప్రమీలా! ఎలాంటిపరిస్థితులలోనయినా మన మైత్రికి ఎడబాటు కలగదని ఒట్టు వేస్తున్నాను” అని చేతిలో చేయివేశాను.

గాఢంగా నిట్టూర్చి తన విషాదగాథ చెప్పింది ప్రమీల ...

ప్రమీలతల్లి సుభద్రమ్మమంచి ఆర్షేయపౌరుషేయాలు గల సద్బ్రాహ్మణ కుటుంబంలో జన్మించింది.ఆమెతండ్రి పురోహితుడు. దేశంలో నాస్తికత్వం ప్రబలిపోయి పూజలు,తద్దినాలు తగ్గిపోయాక సుభద్రమ్మ తండ్రి రామావధాని కూడా ఆదాయము తగ్గిపోయి వేదపండితుడయి యుండికూడా—జాగిత్రం బుతో యాయవారము చేసేవాడు. ఊరిలో
బియ్యము కూరలుతో భారంగా రోజులు వెళ్ళ
నకు వయసు వచ్చిన ఆయన కూతురు గుండెలమీ
టిలాగా తయారయింది ... పెద్దదే సుభద్రమ్మ.

మగపిల్లవాడు ... మూడో కాన్పువచ్చినప్పుడు వచ్చి ఆయనభార్యకు ఆనాటి నుంచి ఉన్న గర్భస్రావం అయి చాపుబ్రతుకుల్లో ఆస్పత్రిలో చేర్పించాలిసి వచ్చింది ... ఆస్పత్రి అంటే మాటలా 400 రు దాక ఖర్చు అయింది. ఆవూరి పెద్ద, కరణం సుబ్బావధాని దగ్గర అప్పుచేసి గండం గడిపించేశాడు ... అంతా జరిగి నెలరోజులయ్యాక సుబ్బావధాని కబురు చేశాడు. "తక్షణం అప్పు తీర్చమని లేకపోతే కూతురు సుభద్రమ్మను యిచ్చి వివాహం చేయమని" ... ఆప్యాయంగా తనకు అప్పుయివ్వడంలో ఆంతర్యం అప్పుడుగాని బోధపడలేదు రామావధానికి ... సుబ్బావధానికి లోగడ రెండు పెండ్లిళ్ళు అయ్యాయి ... వాళ్ళిద్దరూ పోయారు ... యిది తృతీయం ... లోకులు ఆ యిద్దరు భార్యలు బలవంతపు చావు చచ్చారని చెప్పుకొనుటవలన ఎవరూ పిల్లనివ్వడానికి ముందుకు రాలేదు. వయసు ముదిరినా వాంఛలు ముదరని సుబ్బావధాని సుభద్రమ్మ మీంద కన్నువేసి రామావధానిని ఎరలో పడిన చేప లాగా చేశాడు. గత్యంతరంలేక, అప్పుతీర్చలేక బిడ్డ అయినా భాగ్యంతో వుంటుందని తన యీడుగల సుబ్బావధానికియిచ్చి సుభద్రమ్మను వివాహం చేసి చేతులు దులుపుకున్నాడు రామావధాని. అంతే ! సుభద్రమ్మ జీవితం ...న పోకచెక్క లా అయిపోయింది ... సుబ్బావ ...అనుమానం ... ఇంట్లో ఆమెను బెట్టి బయట ...వెళ్ళేవాడు ... ఇలాంటి పరిస్థితుల్లో ఆమె అదృష్ట ... సుభద్రమ్మ గర్భవతైంది సుబ్బావధానిగూడా సంతానము లేకపోవుటవలన సుభద్రమ్మను గారా

బంగానే చూసేవాడు... కాని ఆ దురదృష్టవంతుడు సంతానాన్ని చూసుకోకుండానే హఠాత్తుగా గుండె ఆగి చచ్చి పోయాడు. దాయాదులు ఆస్తి అంతా లాక్కొని అమాయకురాలయిన సుభద్రమ్మను నిండు చూలాలిని ఇంట్లోనుంచి గెంట సాగారు... అప్పటికే ఆమె తండ్రి రామావధాని కూడ చనిపోవటంచేత ఆమె తల్లి వంటకుకుదిరి పిల్లలనుకూడా యజమానుల ప్రాపకంలో చదివించు కొంటోంది. ఇటువంటిపరిస్థితులలో తల్లికి కూడా భారంకావటం యిష్టం లేక పట్నంవెళ్ళి ఒంటినవున్న నగా నట్రా అమ్మి ఒకయిల్లు అద్దెకు తీసుకు వుండేది... ప్రసవ మయింది-ప్రమీలపుట్టింది. చేతిలో వున్న డబ్బు హరించుకుపోయింది... పిల్లలకు పాలు లేవు... అటువంటి పరిస్థితులలో ప్రక్క వాటాలో వున్న రంగయ్య అనే టాక్సీ డ్రైవరు ఆమెను పెండ్లిచేసుకుంటాననీ, ఏలోటూ రానియ్యననీ చెప్పటం వలన అతనికి లోబడి పోయింది. అన్నట్టుగానే రంగయ్య ఆమెకు గుళ్ళో పుస్తెకట్టి సుమంగళిని చేశాడు ... ఇక తన జీవితం నిశ్చయంగా వెళ్ళదీయచ్చని సుభద్రమ్మ ఆశ యెంతోకాలం నిలవలేదు. రాను రానూ రంగయ్య తాగివచ్చిఆమెను కొట్టటం... పరపురుషులను తీసుకువచ్చి వాళ్ళకులోబడమనటంచేయసాగాడు. తనప్రాణం పోయినా అటువంటి వృత్తి చేయనని మొరాయించింది... ఆమె ఇక లొంగదని నిశ్చయించుకున్న రంగయ్య ఆమెనువేరే యింకొక కొంప మార్చివేశాడు... అక్కడ ఒక మేడలో తల్లీ, ఐదేళ్ళ పిల్లయున్నారు... వాళ్ళు తన మొదటి భార్య, కూతురు లలిత అని, వాళ్ళకి

చాకిరీ చేయటమే నీపనని, సుభద్రమ్మను శాశించాడు... సుభద్రమ్మ ఎక్కడికన్నా పారిపోదామనుకున్నది. కాని తాను కులట. గౌరవంలేనిది. ఎక్కడతను పోషించగలదు బిడ్డని... ఇక్కడన్నా వుంటే తిండి, గుడ్డకు లోపం వుండదు.... అనుకుని తన కూతురు ప్రమీలమీద ఆశలు పెంచుకుని 14 ఏండ్లు గడిపివేసింది... రాత్రి అయేసరికి ఆ మేడ రకరకాల పురుషులకు నిలయం... స్త్రీ అక్కడ బజారు వస్తువు... అది ఒక నరకకూపం... పేరుకు క్రయివరులయినా జమీందారు ఫాయిదాలో వుండేటి ఆ యింటి పరిస్థితి... అదంతా అవినీతి సంపాదన... కాలం గడిచేసరికి లలితకి తోడుగా ప్రమీలను గూడా వృత్తిలోకిదింపి ఇంకా సంపాదించాలని రంగయ్యకి ఆశ పుట్టింది... రంగయ్యకి ప్రమీల ససేమిరా ఇష్టపడలేదు. చచ్చేట్లు కొట్టాడు... లొంగలేదు. బలవంతంగానయినా చెడగొట్టాలని ప్రయత్నించి ఒక షావుకారును ఆమె గదిలోకి పంపించాడట. ప్రమీల వాణ్ని మొహంమీదకొట్టి గది తలుపుతీసుకుని బయటపడి... అర్ధరాత్రి తల్లినితీసుకుని వచ్చేసింది.

"ఇదీకథ... సమాజంలో నాకు స్థానం లేదు...కులట కూతురు అని ఎవరూ ఆదరించరు... నా కథ విన్నా ఇంకా నన్ను ప్రేమించగలవా శశీ!" అన్నది.

"ఇందులో నీ తప్పేముంది ప్రమీలా ... అనాదిగా మనదేశంలో స్త్రీలు పడే పాట్లకు మీ అమ్మగారికథ ఒక నిదర్శనం... అందుకే స్త్రీలు బాగా చదువుకుంటే ఈ బాధ వుండదు కదా ! ..." అన్నాను.

"అవును శశీ!... నిజమే. అందుకే అమ్మ నన్ను చదివించాలనుకుంటోంది... ఏమవుతుందో ఏమో!...

"నీ కోర్కె తప్పక నెరవేరుతుంది ప్రమీలా" అని లేచాను.

3

నాన్నగారికి బదిలీ అయిపోవటంతో మేము వేరేవూరు మారిపోయాము. ప్రమీలని వదిలివెళ్ళటం కష్టంగావున్నా గత్యంతరము లేదుకదా!... ఇద్దరం తరచు వుత్తరాలు వ్రాసుకుంటూ వుండేవాళ్ళము. ఇంతలో నాకు పెళ్ళి కుదిరింది. నా అభిరుచుల కనుగుణంగా అనుకూలమయిన భర్త దొరికాడు... అతడు రవి. గ్రాడ్యుయేట్, అందగాడు-ఆస్తిపరుడు ... ప్రమీలకు వుత్తరం వ్రాసి ఆహ్వానం పంపాను. కాని ఆశ్చర్యంగా ఆహ్వాన ఉత్తరం తిరిగి వచ్చేసింది. ప్రమీల ఏమయిపోయిందా అని అనేకవిధాలుగా ఆందోళనపడ్డాను. నాన్నగారుతో అన్నాను ఈ సంగతి. "పెండ్లి హడావుడి అవనీ! తరువాత కనుక్కుందాము" అన్నారు. పెండ్లి నిర్విఘ్నంగా అయిపోయింది. ప్రమీల లేకపోయింది కదా అని ఎంతో బాధపడ్డాను. మూడునిద్రలయి యింటికి వచ్చాను. ఆరోజు వీక్లీ తిరగేస్తున్నాను. హటాత్తుగా ఒక వార్త నన్ను ఆశ్చర్యంలో ముంచివేసింది. బాబ్డ్ హెయిర్, ఫ్యాషన్ బుష్ జాకెట్-నైలాన్ చీర- వింతనగలు - ప్రమీల ఫోటో క్రింద వర్ధమాన తార ప్రమీల- ఈమె ఫలాని చిత్రంలో [illegible] హీరోయిన్‌గా బుక్ అయ్యింది అని

వ్రాసిప్పుంది. నాకళ్ళను నేనే నమ్మలేక పోయాను. ఆ సినిమా కంపెనీ కేరాఫ్‌తో వెంటనే ప్రిమీలకు వుత్తరం వ్రాశాను. మూడ్రోజ్లకి జవాబువచ్చింది— శశీ! నీ వుత్తరంచూసి ఎంత ఆనందపడ్డానో తెలుసా! నీ వివాహం అయిపోయిందా? నే నెంత దురదృష్టవంతురాల్ని శశీ! నా ప్రియ స్నేహితురాలి వివాహం చూడలేకపోయాను. నీకు సుఖమైన దాంపత్య జీవితం యిమ్మని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఇక నాసంగతి— ఆ వూర్లో మేము పరువుగావుండటం రంగయ్యకి యిష్టంలేక పోయింది. అబద్ధ ప్రచారంచేసి మా యింటిమీదకి రౌడీలను వుసికొల్పాడు. ఇద్దరం ఆడవాళ్ళం— మాకు రక్షణలేదు— ఇంక అక్కడవుండలేమని మద్రాసువచ్చాము— ఏదన్నా సినిమాలో ప్లేబాక్ గాయకిగా ప్రయత్నిద్దామని. మాకు తెలిసిన డైరెక్టరుగారి యింటికివెళ్ళి ఈసంగతి చెప్పాను. నా అదృష్టమో యేమో ఆయన, "అమ్మాయీ! నీది ఫొటోజనిక్ ఫేస్— నిన్ను మా సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా బుక్ చేస్తాను. నీ కిష్టమేనా?" అన్నాడు.

అదృష్టం పూలదండయి వరించింది. ఇంతకన్నా యేం చెప్పను? ఒప్పుకొన్నాను.ఆయన చెప్పడంవలన యితరకంపెనీ వాళ్ళుగూడా అయిదు, ఆరు సినిమాల్లో బుక్ చేశారు.భగవంతుడి దయవలన రోజులు సుఖంగా వెళ్ళిపోతున్నాయ్. అమ్మ మొహంలో ఆనందం వెలిగిపోతోంది. ఇన్నిరోజులకి నా కన్న తల్లి కష్టాలు గట్టెక్కాయిగదా అని తృప్తిగా వున్నది అని వ్రాసింది. ప్రమీల కష్టాలు తీరాయిగదా అని మనసులో ఆనందపడ్డాను.

నేను కాపరానికి వెళ్ళడం, శ్రీవారితో సినిమాలు, షికార్లు. యింట్లోపని కొత్త. తీరికలేక ప్రమీలకి వుత్తరం వ్రాయడం 4 నెలలు వాయిదాపడింది. ఆ రోజు ప్రమీల దగ్గరనుండి వుత్తరంవచ్చింది-

శశీ! కొత్త కాపరం... నిన్ను డిస్టర్బ్ చేయుటం ఎందుకని వుత్తరంవ్రాయలేదు. కాని నాకు ఒక ముఖ్యవిషయంలో నీ సలహా కావల్సివచ్చింది. అందుకని రాయక తప్పలేదు. శశీ! జీవితంలో వివాహం యెంతో ముఖ్యఘట్టం. వివాహమయిన స్త్రీని అందరూ గౌరవిస్తారు. నేనూ ఒకర్ని ప్రేమించాను. వాళ్ళు మరాఠీవాళ్ళు. ఆయన రాధూకర్. పెద్ద ప్రొడ్యూసర్. పేరు వినే వుంటావు. మా యిద్దరికి మనసులు కలిశాయి. కాని ఆయనికి యిదివరకే పెళ్ళి అయింది. ఆమెకు క్షయ. నలుగురు పిల్లలు. మా వివాహానికి ఆమె అభ్యంతరమేమీ వుండదు. ఇదీ సంగతి. నీ సలహా యేమిటి?... అని వ్రాసివుంది

ప్రమీలా! పరిస్థితుల ఒత్తిడికి అతని మొదటి భార్య ఈ వివాహానికి అంగీకరించినదేమోగాని మనస్ఫూర్తిగా యే స్త్రీకూడా భర్తయొక్క ప్రేమను పంచడానికి అంగీకరించదు. అయినా యెప్పుడూ మనస్సే నీకు అద్దంవంటిది. ఆత్మపరిశీలన చేసుకొని ఇష్టమయితే తప్పక వివాహంచేసుకో. నేను చెప్పేదేమీ లేదు. పరిస్థితులకు బానిసవుకాకుండా భగవంతుడు నిన్ను దాంపత్యజీవితంలో విజేతగా చేయుగలడని ప్రార్థిస్తున్నాను. నీ శశి [illegible]

నాలుగు నెలలకా ప్రమీల వివాహం ... రాధాకర్ తో అయిపోయింది మతములు వేరు, భాషలు వేరు. రాష్ట్రాలు వేరు. వారిద్దరి దాంపత్యము యెలావున్నదో అనుకున్నాను. ప్రముఖ తార ప్రమీల వివాహం... అని పత్రికలన్నీ పతాక శీర్షికలతో ఫొటోలతో ప్రచురించాయి. ప్రమీల అప్పటికే తారగా స్థిరపడింది. ఆమె యే సినిమాలో వేసినా అది విజయవంతంగా నడుచుటవలన ఆమెకు బుకింగ్సు యెక్కువయ్యాయ్. మద్రాసులో మేడ, కారు... విరాళాలు. సభాప్రారంభాలు, బహుమతిప్రదానాలు- ప్రమీల తీరికలేని తారఅయింది.

◆ ◆ ◆ ◆

కాలచక్రంలో నాలుగుసంవత్సరాలు వెనక్కు వెళ్ళిపోయాయ్. నేను ముగ్గురు బిడ్డల తల్లినయ్యాను. ప్రమీల గూడా యిద్దరి బాబులకు తల్లిఅయింది బరువు బాధ్యతలతో క్షణంతీరికలేని కాలం అది. ఆ రోజు ప్రమీల యాక్టు చేసిన చిత్రం శతదినోత్సవం... వీలుచేసుకొని బసకు వెళ్ళాను. తమ అభిమాన తారను చూడడానికి జనము తండోపతండాలుగావచ్చారు. ప్రమీల గట్టిగాకౌగలించుకొంది. ఇద్దరమూ యెన్నియేళ్ళకు కలుసుకున్నాము శశీ! అంది. నాకూ అంతే. తన్మయత్వంలో మాటరాలేదు. ఇద్దరిజీవితాల్లో యెంత మార్పు! తను అందాలతార. నేను బాధ్యతగల గృహిణిని. ప్రమీల చెప్పింది— తన భర్త రాధాకర్ మొదటి భార్యకు తనంటే అసూయఅని. ; వాళ్ళ భాషలో నోటుటో తిట్టిపోస్తుందట. [illegible] ఎంత ప్రేమగా పిల్చినా [illegible] [illegible]

కూడా కొనియిస్తుందిట. కాని ఆమె అందరితో తనపాలిట దాపురించిన శని అని చెబుతుందట.

"మరి నీ భర్త ఏమంటాడు?" అన్నాను.

"ఏమీ మాట్లాడరు అసలు రాధాకర్ కి యింటి సంగతే పట్టదు. ఎంతసేపూ తనూ, సినిమాలు. తప్పితే నన్ను మాత్రం యెంతో ప్రేమగా చూస్తాడు."

"పోనీలె; నీకు కావల్సినది అదేకదా... వాళ్లెవర్నీ లెక్కచేయకు" అన్నాను. మీటింగ్ టైమ్ అయిందని శశి లేచింది... నేను వచ్చేశాను.

* * *

తిరుపతి వెడదామని అనుకుని వారంరోజులు శెలవుపెట్టి శ్రీవారు, నేను పిల్లలు బయలుదేరాము ... దేవుడ్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని మద్రాసు వెళ్ళాము. ప్రమీల స్టేషన్ కి వచ్చింది... మనిషంతా నల్లకప్పువేసి రోగిష్ఠి దానిలాగా తయారయింది.

"ప్రమీలా! ఒంట్లో బాగాలేదా?" అన్నాను.

"బాగానేవుంది." అని పేలవంగా నవ్వింది.

ఇంటికి వెళ్ళేసరికి వీధిలో రంగయ్యా చుట్ట కాల్చుకుంటూ కనపడ్డాడు.

"ఏమ్మా కులాసానా? అన్నాడు. ఎంతమార్పు! ఒకప్పుడు నన్ను కసిరినవాడేనా ఈ రంగయ్య!

ప్రమీల చెప్పింది- లలిత, తల్లి రంగయ్యని వెళ్ళగొట్టేశారని... అంతిమదశలో తన దగ్గరవుండాలని వుందని వచ్చాడని... ప్రయాణబడలిక తీర్చుకుని హోటలో కూర్చ

న్నాము ప్రమీలా నేనూ. శ్రీవారు స్నేహితుల్ని చూసి వస్తానని వెళ్ళారు. పిల్లలు ఆడుకుంటున్నారు అంతవరకు ప్రమీల భర్త కనపడకపోవటం ఆశ్చర్యము వేసింది. "ప్రమీలా! మీ శ్రీవారు కనపడరేం" అన్నాను. ఏదో తడబడుతూ "Out door షూటింగుకి ఊటీ వెళ్ళారులే" అంది. "ప్రమీలా నానుంచి ఎందుకు తప్పించుకుంటావు. నీ కళ్ళలో గూడుకట్టిన వేదన నీవేదో దాస్తున్నట్లు చెబుతోంది. నాకు నిజం చెప్పవూ ?" అని అన్నాను లాలనగా.

ఒక్కసారి భోరుమంది ... కట్టలు తెగి ప్రవాహమే అయింది కన్నీరు ...

"వారు నన్ను వదలివేశారు శశీ" అంది నా ఒళ్ళో తల దాచుకుంటూ.

నిర్ఘాంతపోయాను... "అసలు జరిగిందేమిటి ప్రమీలా" అన్నాను.

వారు చంచలచిత్తులు... శశీ ... నేనే తెల్సుకోలేక పోయాను. నామీద మోజు తీరిపోయింది. ఇంకొక ప్రసిద్ధ తారతో స్నేహం చేసుకున్నాడు ... నేను గట్టిగా అడిగితే— "సినిమా వాళ్ళకి పవిత్రత, శీలం ఏమిటి? నువ్వెంతమందితో తిరుగుతున్నావో నేను చూశానా! ఎవరి దారి వారిది... నన్ను నువ్వు ప్రశ్నించవద్దు - నిన్ను నేను ప్రశ్నించను" అన్నారు. భగవంతుని సాక్షిగా నేను పవిత్రురాల్ని శశీ ... డబ్బుకోసం సినిమాలలో వేస్తున్నా, మనసా, వాచా అతనిని భర్తగా భావించాను. నేను పవిత్రురాల్ని... పవిత్రమైన భర్తనే కోరాను... అదే నా తప్పు అయింది శశీ ... నా

మీద అభాండాలుమోపి విడాకులుయిచ్చి వెళ్ళిపోయారు. ఆ తారతో వారంరోజుల్లో వివాహం... ఈ విధంగా ఆయన వలలో చిక్కుకున్నవాళ్ళలో నేను నాలుగవదాన్ని... ఇంకా ఎంతమంది ఆయన వలలో పడాలో... బాబులిద్దరికోసం బ్రతికి ఉన్నాను. లేకపోతే యెప్పుడో ఈ ప్రమీల శవాన్ని చూసేదానివి... అంది.

"పూరుకో ప్రమీలా! విధాత కొందరినుదుట బంగారు కలంతో రాస్తాడు ...కొంతమందికి వంకర రాతలు రాస్తాడు. జ్ఞానదాత లీలలు మనుష్యమాత్రులము కనుక్కో లేము కదా!" అన్నాను ఓదారుస్తూ.

తాత్కాలికమే నా ఓదార్పు... ఆమె విచారబాధ నాకు తెలుసు మండిపోయే హృదయము. తిరస్కరించబడిన స్త్రీ ఆమె... అందరికీ లోకువే. నాలుగురోజులువుండి ఇంటికి తిరిగి వచ్చేశాము.

* * *

ఆరోజు ప్రమీలదగ్గరనుండి చాలా పెద్ద వుత్తరం వచ్చింది. అంతకుముందే పేపరులో "ప్రసిద్ధతార ప్రమీల సినిమారంగంనుండి విరమించింది" అన్నవార్త చదివినందు వలన ఆ వుత్తరంలో ముఖ్యవిషయాలే వుండవచ్చు అను కుంటూ విప్పాను.

"శశీ! సినిమారంగం నుండి విరమించుకున్నాను. అంతేగాదు. యిల్లు గూడా అద్దెకిచ్చేశాను. కారు అమ్మే శాను. ఈ రోజు నాపేర 50 లక్షల దాకా ఆస్తి వున్నది. డబ్బు- అదంటేనే అసహ్యం కలుగుతోంది. ఒకనాడు చేతిలో

కానీ లేక అలమటించాను. ఈనాడు ఈడబ్బుకి ఎంత దూరంగా పారిపోదామా అనిపిస్తోంది. కడుపునిండా తిండి లేదు. కంటికినిద్రలేదు. తిండి తింటే లావవుతానేమోనని భయం. ముడిగోధుమ అన్నం, నా ఆహారం. వుండీ అనుభవించే యోగం లేదు. అంతా వంచకులే నా చుట్టూ తాను. ఒక్క-క్షణం తీరిక లేని షూటింగులలోను, విరాళాలకోసం స్తోత్రపాఠాలు చేసేభట్రాజులతోను, విసిగిపోయాను. రాధాకర్ చేసిన ప్రచారం యితరనటుల మీద, బృందం మీద బాగా పని చేసింది. నన్నెలాగయినా వశపరచుకుని నా ఆస్థి,శీలం కాజే ద్దామని కాకులులాగా ఎదురు చూస్తున్నారు. శశీ! నువ్వు నమ్ముతావో నమ్మవో - నన్ను పెండ్లి చేసుకుంటామని రోజుకు రెండువందల వుత్తరాలు వస్తున్నాయి. పెండ్లయిన స్త్రీని, అందులోమాతృమూర్తిని వివాహంవీళ్ళందరూ ఎందుకు చేసుకుంటామంటున్నారో తెలుసా? నా డబ్బుకోసం, నాకు వివాహంమీదే కాదు, ఈ మనుష్యులమీద, జీవితంమీదకూడా ఆశపోయింది. శశీ... ఈ విషవలయం నుండి బయటపడాలని ప్రయత్నించే ఈ నిర్ణయానికి వచ్చాను. ఇకపైన నీకు వుత్త రాలు కూడా రాయనేమో ... దగాపడిన స్త్రీ వంచకు రాలైనా అవుతుంది. ఆత్మహత్య అయినా చేసుకుంటుంది అంటారు పెద్దలు. నేను రెండూ చేయను. ఋషీకేశ్ లో స్వామి దగ్గర సన్యాసను స్వీకరించి అక్కడే ఉండిపోవాలని ఆలోచించుకున్నాను. బాబులు యిద్దర్నీ కాన్వెంట్ హాస్ట లులో చేర్పించాను. నా ఆస్థి చెరిసగం యిద్దరి పేరా బ్యాంకులో వేశాను. భగవంతుడు వాళ్ళనయినా చల్లగా చూస్తే అంతే

చాలు. రేపే ఋషీకేశ్ వెళ్తున్నాను మళ్ళీ కనపడనేమో! ఎప్పుడన్నా గుర్తుకు వస్తే యీపరిమళాలకొఱకు ఒక కన్నీటి బొట్టు రాల్చు చాలు; నీ పరిమళాల...

కళ్ళంబడ ధారాపాతంగా కారుతున్న నీటిని చూచి అప్పుడే ఆఫీసునుండి వచ్చిన శ్రీవారు, "ఎందుకు శశీ ఏడుస్తున్నావ్" అన్నారు. మౌనంగా వుత్తరం చేతిలో పెట్టాను.



మారిన బాంధవ్యాలు

రచన : శివరామప్రసాద్.

"రాజశేఖరంగారిల్లేదండీ ? " అన్నాడు వేణు ట్రావెలింగ్ బ్యాగ్ ఎడంచేతిలోంచి కుడిచేతిలోకి మార్చుకుంటూ.

వంతెనమీదకూర్చున్న ఆ పెద్దమనిషి చుట్టనోట్లోంచి తీసి తుపుక్కున వూసి " అదుగో, కాగితంపూలచెట్టుంది చూశావూ ? అదే రాజశేఖరంగారి డాబా" అన్నాడు వేణుని పరకాయించి చూస్తూ.

వేణు అక్కడనుంచి వెళ్ళటానికి సంసిద్ధుడవగానే మళ్ళీ అన్నాడాయన– "మీకు రాజశేఖరంగారు ఏంకావాలి ?"

"ఆయన మా మేనమామండీ" అని అతివినయంగా సమాధానంచెప్పి సంభాషణ పెంచకుండా జారుకున్నాడు.

వేణు ముఱికిగావున్న అగ్రహారం ఏడుగొందుల సందులను తిట్టుకుంటూ, ప్రతివాకిలిముందున్న పాచి కుప్పలను అసహ్యంగా చూస్తూ, తోకలూపుకుంటూ స్వాగతమిస్తున్న వరహాలను తప్పుకుంటూ రాజశేఖరంగారి డాబా రాగానే ఆగిపోయాడు. ప్రహారీగోడకున్న తలుపు మూసివుంది.

ఎవరినిపిలవాలో, ఏమని పిలవాలో, ఎలా పిలవాలో పదిసార్లురిహార్సలు వేసుకుని తలుపుకున్న గొళ్ళెంతోగట్టిగా కొట్టాడు, 'ఏమండోయ్' అని అరిచాడు.

కాసేపటికి 'ఎవరూ' అని అస్పష్టంగా గోడవతలనుంచి వినిపించింది.

"నేనండీ! ... నేను ... నేను ..." తడబడ్డాడు.

"అంటే" అన్నదా గొంతు.

"మీ చుట్టాన్ని"

ఇనపగడి బరబరాలాగినట్లు శబ్దమయింది. తలుపులు తెరుచుకున్నాయి. వేణు ట్రావెలింగ్ బ్యాగు పట్టుకుని నిల్చున్నాడు లోనికి వెళ్ళటానికి రెడీగా. కాని, అతని కాళ్ళు కదలలేదు. భూమికి అంటుకుపోయినంతపనయింది.

ఆః ... తలుపుతీసిన భారతి వంక రెప్పవాల్చకుండా చూశాడు. భారతి ఇతగాడు వేసే నేత్రబాణాల ధాటికి తట్టుకోలేక నేలవంక చూస్తూ అన్నది- " ఎవరూ... ?" అని.

వేణు తెప్పరిల్లుకుని "రాజశేఖరరావుగా రున్నారా" అన్నాడు.

భారతి తల అడ్డంగా వూపుతూ అన్నది- " లేరండీ. ఏం కావాలి? "

వేణు జవాబుగా జేబులోంచి కవరుతీసి భారతి చేతికిచ్చాడు. భారతి అర్ధంకానట్లు కవరు అందుకుని చించబోతూ, "లోనికిరండి" ఆహ్వానించింది అతిథిని.

వేణు భారతి వెంట లోనికి వెళ్ళి హాల్లో ఆమె చూపించిన కుర్చీలో కూర్చున్నాడు. భారతి గదిలోకి వెళ్ళి కవరు చించి చదివింది. అందులో యిలా వుంది-

హైదరాబాదు.

మహారాజశ్రీ రాజశేఖరరావు అన్నగారికి -

మీ చెల్లెలు రాజ్యలక్ష్మి అనేక నమస్కారములు చేసి వ్రాయునది ఏమనగా యిచట అంతా క్షేమము. మీ

క్షేమము తెలుపగోర్తాను. లోగడ నేను వ్రాసిన జాబుకు సమాధానం చేరింది. నీవు మన యిద్దరిమధ్యవున్న తగాదాలు మర్చిపోయేవుంటావు. ఈనాటికి మన కుటుంబాల మధ్య లోతయిన అగాధాలు పూడిపోయాయనితలుస్తాను. వదినకూడా పాతికేళ్ళనాటి కక్షలు మరచి పోయిందనుకుంటాను. మీ అమ్మాయికి పెండ్లి సంబంధం చూస్తున్నానని వ్రాశావు. మా వేణు యం.బి బి.యస్. చదువుతున్నాడు. ఈ సంవత్స రంలో ఆఖరయిపోతుంది. వాడికి మీ అమ్మాయి సంగతి చెప్పాను. పిల్లను చూస్తేగాని యే సంగతి చెప్పలేనన్నాడు. వాడిని ఈరోజే మీ యింటికి పంపిస్తు న్నాను. వాడికి మీఅమ్మాయినచ్చితే బావగారుకూడా ఒప్పు కుంటానన్నారు మాకు కట్నాలూ, కానుకలు అక్కరలేదు. నీతో రక్తం పంచుకుని పుట్టిన నాకు మీ అమ్మాయిని కోడ లుగా తెచ్చుకోవాలనే కోరిక సహజం. మేనరికం చేసుకోవా లని ఏచెల్లెలికి వుండదు? నువ్వు నాకోరికను మన్నిస్తావనే ఆశ నాకుంది. నీహృదయం నాకు బాగా తెలుసు. ప్రతిక్షణం మన తగాదాలు తలుచుకొని కుమిలి పోతూ వుంటాను. అన్నయ్యా! మనం మళ్ళీ వెనకటిలా కలసి మెలసి ఉండాలంటే ఈ వివాహం వంతెన వంటిది.

ప్రేమతో

రాజ్యలక్ష్మి

వేణుకూ, తనకూ వున్న బాంధవ్యం ఏమిటో ఇప్పుడు బోధ పడింది భారతికి. "ఈసారి హాల్లోవున్న వేణు దగ్గరికి వెళ్ళాలంటే సిగ్గుగానే వుంది. ఇన్నాళ్ళనుంచీ తనకో అందమైన బావ వున్నాడని తెలియదు. ఎంత ముచ్చటగా ఉన్నాడని! అచ్చంగా సినిమా హీరోలా వున్నాడు. అందమైన చందమామలాంటి పచ్చటి ముఖమూ, నొక్కుల జుట్టు, మిలమిలలాడే నల్లటికళ్ళు నవ్వకపోయినానవ్వినట్లుండే ఆ పెదిమలూ, అంతకంటే ఆకర్షణీయంగావున్న వేషధారణ-దొరబాబులాగ వున్నాడు. ఈ దొరతో యింకా మూడు రోజులు ఒంటరిగా యెలా? అమ్మా, నాన్నా పెళ్ళికివెళ్ళారు. ఇంకా మూడురోజులవరకూ రారు. తనింట్లో ఒక్కతే. తమ్ముడుకూడా వెళ్ళిపోయాడు పనిమనిషిమాత్రం తనతో పడుకుంటుంది" అనుకుంటూ హాల్లోకివెళ్ళింది భారతి.

"కాఫీ తాగుతారా ?" అన్నది వేణుని పరీక్షగా చూస్తూ.

"లేదండి. తాగేవచ్చాను" అన్నాడు వేణు.

"స్నానం చేస్తారా ?"

చేస్తానన్నట్లు తలూపాడు వేణు. భారతి లోనికివెళ్ళి టవలు అందించింది. వేణు టవలు చుట్టుకున్నాడు.

భారతి వచ్చి 'రండి' అంది.

ఆమెను అనుసరించాడు వేణు. బావిదగ్గర బక్కెట్టులో వేడినీళ్ళు పొగలు వస్తున్నాయి. మరొక బిందెలో చల్లటినీళ్ళు, బావిగట్టున మైసూర్ శాండిల్ సబ్బు ఉన్నాయి. వేణు స్నానంచేస్తుంటే భారతి వంటింటి కిటికీలోంచి కసరత్తు చేసి

కండలు పెంచుకున్న వేణుశరీరాన్ని తనివితీరాచూసి ముగ్ధురాలయిపోయింది పచ్చటి వేణుశరీరం ఎండలో తళతళలాడుతుంటే భారతి మురిసిపోయింది.

"వేణుబావ తనని చూసిపోవటానికి వచ్చాడన్నమాట. ఎవరూ లేనప్పుడుచూసి వచ్చాడు. అయితే తనకో మేనత్త హైదరాబాదులో ఉన్నట్లు ఇప్పటివరకూ తెలియదు. పాతికేళ్ళనాటి తగాదాలు తనకేం తెలుస్తాయి? తనకింకా పదహేడేళ్ళే. కనీసం అమ్మయినా తనకీసంగతి చెప్పలేదు. వేణుబావకి తను నచ్చుతుందో, లేదో!" భారతి ఊహల్లో తేలిపోతోంది.

వేణు స్నానం ముగించి తుడుచుకోటానికి టవలు తెస్తుందేమోనని ఎదురు చూస్తున్నాడు. ఎంతసేపటికీ రాకపోయే సరికి నీరు కారుతున్న శరీరాన్ని చేతులతో రుద్దుతున్నాడు. భారతి వేణు అవస్థ చూచి నవ్వుకుని టవలు తెచ్చి వేణు కిచ్చి "స్నానం పూర్తి చేసి చాలా సేపయినట్లుంది. నన్ను పిలవక పోయారా?" అన్నది.

"ఏమని పిలవాలో!" అన్నాడు వేణు భారతిని కోరగంట చూస్తూ.

భారతి సిగ్గుపడి "భారతి" అంది.

"సరే! ఇకనుంచి భారతి అని పిలుస్తాను. మీ ఇంట్లో ఇంకెవరూ వున్నట్లు లేరే!" అన్నాడు వేణు.

"పెళ్ళికి వెళ్ళారు"

"పెళ్ళికి వెళ్ళారా? ఎవరిపెళ్ళి?"

"మా అమ్మ అన్నగారి కూతురి పెళ్ళి."

"ఎప్పుడు వస్తారు?"

"నిన్ననే వెళ్ళారు. మూడురోజులలో వస్తారు."

"నేను రేపు వెళ్ళిపోతున్నాను" అన్నాడు వేణు.

"అదేమిటండీ! హైదరాబాదు నుండి వచ్చి అప్పుడే వెళ్తారా?"

"వెళ్ళక యింకెందుకు? నేను వచ్చిన పని నీకు తెలుసనుకుంటాను!" కొంటెగా చూశాడు వేణు.

భారతికి తగని సిగ్గు వేసింది.

"ఒంటరిగా వున్న మరదలుపిల్లతో మూడురోజులున్నానంటే యిరుగుపొరుగు లేమనుకుంటారు?"

"ఏమనుకుంటారు...?"

"ఇదేమి చోద్యమమ్మా! పెండ్లి కాకముందే వీళ్ళ పకపకలు వికవికలు ..."

భారతి ముసిముసి నవ్వులు నవ్వుకుంటు వెళ్ళిపోయింది. వేణు నవ్వుతూ వళ్ళు తుడుచుకున్నాడు. ట్రావెలింగ్ బ్యాగ్ వున్న పైజమా లాల్చీ వేసుకున్నాడు. భారతి "అలా గదిలో కూర్చోండి. మాగజయిన్ చదువుకుంటారా? ఈ వారం ప్రభ వుంది, పత్రిక వుంది" అన్నది.

"ఆఁ ... ఏం చదువుతాను? రెండువందల మైళ్ళు పైగా ప్రయాణం చేసి వళ్ళు హూనమైంది. ఒక కునుకు తీసి మరీ చదువుతాను, ఏమంటావు? అన్నాడు వేణు.

"ఇకనుంచి నన్ను బహువచనంలో పిలవకండి" అంది భారతి.

ఏమని పిలవాలంటారు?"

"భారతీ" అనండి

"సరే. భారతీ అంటాను. మరి నన్ను వేణూ అంటావా?"

"ఉహూ ..."

"భారతీ! ఏం చదువుకున్నావు?

"యస్.యస్.యల్.సీ. ప్యాసయ్యాను."

"సరే భారతీ ! నన్ను నిద్రాదేవి కౌగలించుకున్నదా ! అన్నట్లు నిద్రముంచుకువస్తోంది. ఏదయినా పడక ఏర్పాటు..."

"అలా గదిలోకి వెళ్ళి పడుకోండి. అక్కడే రేడియో సెట్టు, పత్రికలు వున్నాయి. మీకు మంచి కాలక్షేపం" అన్నది భారతి వంటింటివయిపు దారితీస్తూ.

వేణు గదిలోకి వెళ్ళి పట్టిమంచంమీద నడుంవాల్చాడు. కళ్ళు మూసుకున్నా నిద్రపట్టలేదు. ప్రయాణబడలికవలన వొళ్ళునొప్పులుగావుంది. "భారతి ! ఎంత అందమయిన పేరు! భారతిని చూడగానే అనుకున్నాడు—మామయ్య కూతురని, తనకో అందమైన మరదలుందని యింతవరకూ తెలియనే లేదు. తను ప్రత్యేకంగా హైదరాబాదునుంచి గుంటూరు వచ్చింది ఈపిల్లని చూడటానికే. తన కిష్టంలేకపోయినా ఇంట్లో పోరు పడలేక వచ్చాడు. భారతి ఇంత ముచ్చటగా వుంటుందని తను ఊహించలేక పోయాడు. కాలేజీకి వారం రోజులు సెలవుపెట్టి మరీ వచ్చాడు. వచ్చినందుకు ఫలితం తృప్తిగా వుంది. భారతిముందు ఈక్యాలెండర్లలోని సినిమా తారలందరూ దిగతుడుపే. అందం కంటే గూడా గుణ గణాలు మెచ్చుకో తగ్గవి. ఆ మర్యాద, ఆప్యాయత, వినయం, చనువూ... అనుకూలవతి అంటే అలావుండాలి. స్కూలుఫై

నలు ప్యాసయిందని మామయ్య ఉత్తరంలో వ్రాశాడు బస్తీ పిల్ల గదా యని మరీ సన్నగా, పొట్టిగా లేదు. అయిద డుగుల నాలుగు అంగుళాలు ఎత్తుంటుందేమో. బలంగా బొద్దుగా వుంటుంది. పదిహేడేళ్ళుంటాయి. యవ్వనంలో బిర్రబిగిసివుంది. తనే పసుపురంగనుకుంటే తనకంటే పదిరెట్లు బంగారు ఛాయతో కళకళ లాడుతూంది. బిగువైన అంగ సౌష్టవం చూసి అమ్మగూడా ముగ్ధురాలయి పోతుంది. మామయ్య ప్లీడరని అమ్మ చెప్పింది. కాని బయట బోర్డు కూడా లేదే! బజార్లో యెక్కడైనా ఆఫీసుందేమో..." అలా ఊహల్లో విహరిస్తూ నిద్రపోయాడు వేణు.

గడియారం పన్నెండు గంటలు కొట్టాక భారతి గది లోకి వచ్చింది వేణుని లేపటానికి. వేణు మైమరచి నిద్ర స్తున్నాడు- ప్రయాణ బడలికవలన.

"బావ బుగ్గలు యెంత నునుపుగా వున్నాయ్! కొరి కేయాలనిపిస్తూంది" అనుకుని వెంటనే సిగ్గుపడింది.

"లేవండి...భోజనానికి" అంటూ వేణుని చేతితో తట్టింది.

వేణు బద్ధకంగా వళ్ళువిరుచుకున్నాడు లేచి.

"బావిదగ్గర నీళ్ళున్నాయి. కాళ్ళుకడుక్కుని భోజనా నికి రండి" అని వెళ్ళింది.

వేణు భోజనంచేసి రేడియో ట్యూన్ చేశాడు. ఆరు గంటల ప్రాంతంలో బయలుదేరి 'భారతీ! అలా బజారుకి వెళ్ళివస్తాను' అన్నాడు.

భారతి గుమ్మంలో నుంచుని 'మరీదూరం వెళ్ళేరుసుమా! మారిపోగలరు" అంది నవ్వుతూ.

వేణు భారతినవ్వుతో శృతికలిపి వెళ్ళిపోయాడు. కాలేజి రోడ్ మీదగా నడుస్తున్నప్పుడు స్టేట్ రీజనల్ లైబ్రరి కనపట గానే అందులో దూరాడు. ఏదో పుస్తకం తీసుకుని వేరే ధ్యాసలేకుండా అందులో మునిగిపోయాడు. లైబ్రేరియన్ ఏడింటికి బెల్ కొట్టాక బలవంతంగా బయటపడ్డాడు. ఆ నవల లోని పాత్రలనుగురించి ఆలోచిస్తూ, ఓవర్ బ్రిడ్జిమీదగా నడుస్తూ బ్రాడీపేట సెంటరుకు వెళ్ళాడు. ఇంకా కొద్ది దూరం నడిచి "శంకర్ కేఫ్"లో కాఫీతాగి మళ్ళీ వెనక్కి నడిచాడు. హిందూ... కాలేజి... గాంధీపార్కు... జిన్నా టవరు చూస్తూ పూలకొట్లవద్దకు చేరుకున్నాడు. భారతి కోస మని పావలాయిచ్చి మల్లెపూలు కొన్నాడు. ఇంటికి వెళ్ళే సరికి ఎనిమిదయిందన్నట్లు సైరన్ కూసింది.

భారతి తలుపు తీస్తూనే "ఇంతసేపు యెక్కడున్నారు మీరు! ఎంతసేపటికీ రాకపోయేసరికి మారిపోయారనే అను కున్నాను" అన్నది నవ్వుతూ.

వేణునవ్వి మల్లెపూలపొట్లం అందిస్తూ లోపలికి వచ్చాడు.

"ఏమిటిది..." అంటూనే పొట్లం విప్పింది. మల్లె పూలు చూసి మహానందం పొందింది.

వేణు భోజనంచేసి సిలోన్ హిందీ రికార్డులువింటూ తన్మయత్వంలో మంచమీద వెల్లికిలా పడుకున్న వేణుకు మల్లెలవాసన గుబాళించింది. భారతి నిండుగా మల్లెలుజడలో

తురుముకుని కుర్చీలో కూర్చుంది. భారతిముఖంలోకి తీయగా చూస్తూ వుండిపోయాడు. మధురమైన ఊహలు మనసులో మెసిలాయి.

భారతిని చూస్తుంటే శరీరంలో ఉద్రేకం కలుగుతోంది. అమాంతంగా కౌగలించుకుందామా ? అనిపిస్తోంది. తను గాఢంగా ప్రేమించాడుగదా ! తనకు కాబోయే భార్యే గదా ! అయితేమాత్రం అంతచనువు కూడదు. పశువాంఛ తీరాక భారతిమీద నాకు మోజు తగ్గుతుందేమో ? ఇంకా యెన్నాళ్ళు ! పెళ్ళయాక భారతి శాశ్వతంగా తనది ఈ లోగా తను తొందరపడటం మంచిదికాదుకూడా.

మూడురోజులూ మూడు క్షణాలవలె గడిచిపోయాయి. ఆ మూడు రోజులూ తను భారతితో సంసారం చేసినట్లేవుంది. భారతిని పెళ్ళిచేసుకుంటే రోజులు యెంత మాధురంగా వుంటాయి ! అనుకున్నాడు వేణు.

మూడోరోజురాత్రి వేణు మొదటిఆట సినిమాకు వెళ్ళాడు. ఆరాత్రి ఎనిమిదింటికి రాజశేఖరరావుగారు,ఆయన సతీమణి రంగనాయకమ్మగారు, కుమారుడు గోపి వచ్చారు.

బట్టలస్టాండుకు ప్యాంటులు, చొక్కాలు చూచి రంగనాయకమ్మగారు విస్తుపోయి "అదేమిటి భారతీ ! ఆ ప్యాంటులూ, చొక్కాలూ యెవరివీ" అన్నది.

"వేణుబావొచ్చాడమ్మా ! " అన్నది భారతి సంతోషంగా ముఖం యింతచేసుకుని.

రంగనాయకమ్మ అర్థంకానట్లుచూసి "వేణుబావ ఎవరు ?" అన్నది.

"మన నాన్నకు చెల్లెలి కొడుకు. వాళ్ళకీ మనకీ ఎప్పటి నుంచో మాటలు లేవటగా...?"

"ఈ ట్రావిలింగ్ బ్యాగు ఎవరిదే?" అంటూ గది బయటకు వచ్చారు రాజశేఖరంగారు.

"అది వేణుబావది నాన్నా!" అన్నది భారతి.

"ఆయనెవరు?" అన్నారు రాజశేఖరంగారు.

"మీ చెల్లెలి కొడుకటగా..." అన్నది రంగనాయకమ్మ.

రాజశేఖరం ఉలిక్కిపడి "నాచెల్లెలెవరు?" అన్నాడు.

హైదరాబాదులో వుంటున్నారట... రాజ్యలక్ష్మి అన్నది భారతి.

"ఇదేదో చిత్రంగా వుందే. నారక్తం పంచుకొని పుట్టిన చెల్లెలెవరూ లేరే..." అన్నాడు.

"వాడెవడో దొంగనచ్చినాడండీ. ఇంట్లో ఏమైనా చేతి కందినవి ఎత్తుకు పోవటానికి వచ్చి నాటకం ఆడుతు న్నాడు" అన్నది రంగనాయకమ్మ.

"నాటకమో... ఇంద్రజాలమో..." అన్నాడు రాజశేఖరం.

"అయినా నీకు బుద్ధి ఉండక్కరలేదు టే భారతీ? అవ్వ! పరాయి మగాడు వస్తే ఎలా రానిచ్చావే? ఇంట్లో ఎవరూ లేరని తలుపులు వేసుకోమని చెప్పానా లేదా? అయ్యో! ఈ సంగతి నలుగురి నోట్లోపడితే ఏమైనా వుందా..." అన్నది రంగనాయకమ్మ మందలింపు స్వరంతో.

"అతనొచ్చి ఎన్నిరోజులయింది...?" అన్నాడు రాజశేఖరరావు.

"మూడు రోజులయింది..." అన్నది భారతి వణుకుతున్న కంఠంతో.

"అతను హైదరాబాదునుంచి వచ్చాననని చెప్పాడా?" అన్నది రంగనాయకమ్మ భారతిని గుచ్చి గుచ్చి చూస్తూ.

"లేదు. ఏదో కవరిచ్చాడు..." అంటూ రాజశేఖరం చేతికి కవరిచ్చింది భారతి కళ్ళ నీళ్ళ పర్యంతమై. మనుష్యులు ఎంత అనుమానస్థులు అనుకుంది భారతి రంగనాయకమ్మ తన వంక అలా చూడటం చూసి.

రాజశేఖరరావుగారు ఉత్తరం చదువుకుని "అతను ఎక్కడికి వెళ్ళాడమ్మా!" అన్నాడు.

"ఏదో సినిమాకి వెళ్తానన్నారు..."

సర్లే! ఆ దొంగ యింకా మనింటికి వస్తాడటండీ! మీరిచ్చిగాని... ఆ ఇనప్పెట్టె అవీ చూడండి సరిగ్గా వున్నయ్యో ఏమిటో..." అన్నది రంగనాయకమ్మ తనధోరణిలో తాను.

"నువ్వూరుకోవే ... అతను రాగానే భోజనం అవీ పెట్టి గదిలోకి పంపించు అతనితో ఈ విషయాలేవీ అనవద్దు మామూలుగానే వుండు..." అన్నాడు.

పదిన్నరకు వేణు తలుపు కొట్టాడు. రంగనాయకమ్మగారు మెలకువతో వుండికూడా లేవలేదు. భారతి లేచి తలుపు తీసింది. భారతిలో క్రిమ్ముకున్న విషాదచ్ఛాయలు చూసి వేణు "అలా వున్నావేం? భారతీ!" అన్నాడు.

"ఎలా వున్నాను? అన్నది తెచ్చిపెట్టుకున్న చిరు నవ్వుతో.

భారతి వేణుకు భోజనం పెట్టేటప్పుడు రంగనాయకమ్మ గారు లేచి తలుపుసందుల్లోంచి తొంగి చూసింది. వేణుమీద అదివరకున్న దురభిప్రాయం వేణుని చూడగానే తొలగి పోయింది "అంత అందమైన అల్లుడు దొరికితే ఇంకా కావల సిన దేమున్నది" భారతి వేణుకు నెయ్యి వేస్తున్నప్పుడు, నిజంగా చిలకా గోరింకల్లాగా వున్నారు! కాని భారతి ముభా వంగా వుండి వడ్డించడం రంగనాయకమ్మకే నచ్చలేదు. కష్టంగా తోచింది గూడా. అతను సినిమాలో కబుర్లేవో చెప్పుతూ నవ్వుతున్నాడు. "ఇదంతా కలా" అని కళ్ళు నలు పుకుంది రంగనాయకమ్మ.

"నమస్కారం! మామయ్యగారూ!" అన్నాడు వేణు గదిలో ప్రవేశిస్తూ.

"ఆఁ! అలా కూర్చో. హైదరాబాదు నుండి ఎప్పు డొచ్చావు?" అన్నాడు రాజశేఖరం గారు.

"ఇవాల్టికి మూడురోజులయిందండి! నేను వచ్చిన ప్పుడు మీరు పెళ్ళికి వెళ్ళారట. వెంటనే వెళ్ళిపోదామను కున్నాను. కాని భారతి పట్టుదల మీద వున్నాను" అన్నాడు వేణు.

దానికేముందిగాని, మీనాన్న అక్కడ ఏం చేస్తుం టారు?

"మా నాన్న హైకోర్టు ప్లీడరు."

"మీకు మేడ అదీ వుందా?"

"ఆ. రెండు మేడలున్నాయి. ఒకటి అద్దెకిచ్చాం. ఒకటి మేము వాడుకుంటున్నాం."

"నువ్వు యం.బి బి.యస్. చదువుతున్నావటగా?"

"అవునండీ ..."

"మా అమ్మాయిని చూడటానికి వచ్చావట. పిల్ల వచ్చిందా?"

వేణు సిగ్గుపడి తలవంచుకు నవ్వుతున్నాడు.

"అంతా బాగానే వుంది. కాని నువ్వు దారితప్పి మా యింటికి వచ్చావోయ్!" అన్నాడు రాజశేఖరరావు.

వేణు తుళ్ళిపడి "ఏమిటి!" అన్నాడు.

"నా పేరు రాజశేఖరరావు అవటం వలన నువ్వు మారి పోవటం జరిగింది. ఇదిగో ఈ కవరుమీద చూడు రాజశేఖ రరావు: అడ్వకేటు ఎ టి. అగ్రహారం అని వుంది. అంటే ఆనందతీర్థ అగ్రహారం. కాని నా అడ్రసు రాజశేఖరరావు ఆర్. అగ్రహారం అంటే రామచంద్రపుర అగ్రహారం. రిక్షా లోనే వచ్చావా?

"అవునండి! నేను అగ్రహారం పోనివ్వమన్నాను."

"అందుకే యింతపని జరిగింది. మా గుంటూరులో రెండు అగ్రహారాలుండటం వలన ఇటువారటు, అటువారిటు మారుతుంటారు. సరే, రేపు ఉదయం మీ మామయ్యగారిని యిక్కడకు రప్పిస్తాను. అందాకా యిక్కడే వుండు. పరాయి ఇల్లుగా భావించవద్దు. నేను వెళ్ళుతున్నాను" అంటూ రాజ శేఖరరావుగారు వెళ్ళిపోయారు.

వేణు కిదంతా మాయగా తోచింది. తను పొరపడ్డాడు. రేపు ఈయింట్లోంచి వెళ్ళిపోయి అసలు మేనమామ యింట్లోకి చేరాలన్నమాట. అక్కడొక సుందరి నాకోసం కాచుక్కూర్చుం టుంది. ఇదంతా దైవమాయలాగావుంది. యీ గుంటూరులో రెండు అగ్రహారాలుండడమేమిటి? ఈ అగ్రహారంలో కూడా రాజశేఖరరావు అంటూ వుండడమేమిటి! ఈయన కూతురు అప్సరసలాగా వుండడమేమిటి? అంతాచిత్రం. యిందజాలం తనకొక విషమస్థితి. తను భారతిని గాఢంగా ప్రేమించాడు. తన మామయ్య కూతురనే అలా ప్రేమించడం జరిగింది. తన దృష్టి ఇక మరల్చుకోలేడు. మరల్చుకోడు కూడా.

పాపం! భారతి అమాయకురాలు. ఎంతకుమిలిపోతోం దో! ఆవేళ రాత్రి తన ప్రక్కన కూర్చున్నప్పుడు "భారతీ! నిన్ను తప్పకుండా చేసుకుంటాను. నువ్వు నాకు నచ్చావు" అని ఆప్యాయంగా గడ్డం మీద చెయ్యి వేసిన సంఘటన భారతికాని, తనుగాని మర్చిపోగలరా? ఆనందతీర్థ అగ్రహారం లో వున్న అసలుమామ కూతురు భారతికంటె అందగత్తె కావచ్చు కాని తన ప్రేమ భారతి మీదే ఉంటుంది.

మరునాడు ఉదయం నకలు రాజశేఖరం మామయ్య అసలు రాజశేఖరంకు ఫోను చేశాడు. జరిగిన పొరపాటు చెప్పాడు. అసలు రాజశేఖరరావుగారు టాక్సీ తీసుకువచ్చాడు అల్లుడిని తీసుకువెళ్ళటానికి. వేణుకు ఆయన వెంట వెళ్ళడం యిష్టం లేకపోయినా వెళ్ళక తప్పలేదు.

వెళుతున్నాను భారతీ! అని చెప్పినప్పుడు భారతికి కన్నీళ్ళు ఆగలేదు. "నన్ను మోసంచేసిపోతావా!" అన్నట్లు దీనంగా చూసింది.

"నిన్ను తప్పకచేసుకుంటానుభారతీ! నామాటనమ్మ! నీ ఫోటో ఒకటివ్వు అమ్మకు చూపిస్తాను" అన్నాడువేణు.

భారతి గోడకు తగిలించివున్న తన ఫోటో ఇచ్చింది. వేణు ట్రావెలింగ్ బ్యాగ్‌లో భద్రపరిచాడు. నకలు మేన మామకు, మేనత్తకు 'వెడుతున్నానండీ' అని టాక్సీ స్సి ఎక్కాడు వేణు.

నకలుమేనమామగారింట్లో నాలుగురోజులున్న వె అసలు మామయ్యగారింట్లో రెండురోజులుకూడా వుండలేదు˙ అసలు మామయ్యకూతురు కమల వేణుకి నచ్చలేదు. భారతికీ, కమలకూ పోటీపెట్టటానికి వీలులేదు. కమల ఆధునిక నాగరికతలో మిడిసిపడుతోంది. వేణు యింటికి వెళ్ళగానే 'హల్లో బ్రదరిల్లా!' అంటూ షేక్‌హాండ్ యిచ్చింది. ఆ దెబ్బతో వేణుతల గిర్రున తిరిగింది. భారతీయ సాంప్రదాయాలను గౌరవించే వేణుకు కమలప్రవర్తన రుచించలేదు. ఇంట్లోనే బూట్లతోతిరిగే కమల వేణుదృష్టిని ఆకర్షించుకోలేక పోయింది. రెండు జడలూ, చేతికి రిష్టువాచీ, కాలికి ఎత్తు మడమల బూట్లు, పద్దెనిమిదేండ్లునిండినా ఇంకా లంగాలుకట్టే పసితనం, శరీరంలో వంపులన్నీ బయటకు కనిపించేటట్లు నైలాన్ ఓణీలు- ఇవన్నీ చూసేకొలదీ వేణుకు చలిజ్వరం వచ్చినట్లయింది.

వేణు హైదరాబాదు వెళ్ళిపోయాడు. భారతికిమాత్రం దిగులుగా వుంది. వేణు తనని చేసుకుంటాడా లేదా? వాళ్ళ మేనమామకూతుర్ని చేసుకుంటాడేమో ? ఎప్పుడూ ఆ విషయమేఆలోచించేది. వేణు తనింట్లో గడిపినరోజులు గుర్తుకు తెచ్చుకునేది. పనులుచెయ్యటంలో అశ్రద్ధచూసి రంగనాయకమ్మగారు సంగతంతా గ్రహించింది, నవ్వుతుని భర్తతో ఆ సంగతి చెప్పేసింది. నకలురాజశేఖరరావు నవ్వుకున్నాడు. అసలు రాజశేఖరరావు మా వాడికి మీపిల్ల నచ్చింది ! అని చెల్లెలిదగ్గరనుంచి వుత్తరం వస్తుందేమోనని ఎదురు చూస్తున్నారు.

వేణు తండ్రి రంగనాధరావు గారి దగ్గరనుంచి నకలు రాజశేఖరరావు గారికి, అసలు రాజశేఖరరావు గారికి ఒకే రోజున ఉత్తరాలు వచ్చాయి.

అసలు రాజశేఖరరావు కవరు చించి చదివాడు-

హైదరాబాదు

మహారాజశ్రీ రాజశేఖరరావు బావగారికి రంగనాధరావు నమస్కరించి వ్రాయునది. మా వాడికి మీఅమ్మాయి నచ్చలేదట. వాడిపెళ్ళి విషయంలో వాడికిష్టమయిన వారిని చేయదలిచాము. ఏమీ అనుకోవద్దు ...

ఇక తరువాతచదవకుండానే విసురుగా బల్లమీద కొట్టి వెళ్ళిపోయాడు అసలు రాజశేఖరరావు.

నకలు రాజశేఖరరావు ఈకవరు ఎక్కడినుండివచ్చిందా అనుకుంటూ విప్పి చదివారు.

హైదరాబాదు.

మహారాజశ్రీ రాజశేఖరరావుగారికి రంగనాధరావు నమస్కరించి వ్రాయునది. వేణు జరిగినదంతా మాకు చెప్పాడు. మావాడు భారతినితప్ప వేరేయెవరినీ చేసుకోనని మంకు పట్టు పట్టాడు. భారతి ఫొటోచూసి మేముగూడా ముచ్చట పడ్డాము. మేము కట్నాలూ, కానుకలూ కోరము. ఆ విషయాలన్నీ మాట్లాడుకోవడానికి మీరు ఒక్కసారి హైదరాబాదు రావలసింది. మీరు వచ్చేవిషయం తెలియపరిస్తే స్టేషన్ వద్దకు మా వేణు వస్తాడు.

"ఏమోయ్!" అంటూ గావుకేక పెట్టాడు రాజశేఖరరావు!

"ఏమిటండీ!" అంటూ వచ్చింది రంగనాయకమ్మ, ఆ వెనుకనే భారతి.

"మన భారతి అదృష్టం చూశావా! ఆ వేణు మన భారతిని తప్ప యింకెవర్నీ చేసుకోనన్నాడట. అందుకని నన్ను పెళ్ళివిషయాలు మాట్లాడుకోటానికి రమ్మన్నారు. కట్నంగూడా అడగరట." అన్నాడు రాజశేఖరరావు సంతోషంతో.

"మానాయనే. ఎంతమంచివాడు. పదివేలు కట్నం యివ్వందే భారతి కదులుతుందనుకోలేదు. చూశావా భారతీ! నీ బావ యెంత పని చేశాడో!" అన్నది రంగనాయకమ్మ ఉక్కిరిబిక్కిరై.

"భారతికి తెలుసు లేవే. దానికెప్పుడో చెప్పివుంటాడు దాని బావ" అన్నాడు రాజశేఖరరావు ఆనందంగా.

భారతికి పట్టరాని అనందం కట్టలు తెగింది. ఆనందాశ్రువులు భారతి కనుకొలుకులనుండి బంగారుచెక్కిళ్ళ మీదకు జరజరా ముత్యాలవలె జారిపడ్డాయి.

4-12-1960

పత్రిజామత — బెంగుళూరు.

కోడలు

రచన : తన్నీరు లక్ష్మీనారాయణ.

'రామూ! బావకు ఒక వుత్తరం వ్రాయి నాయనా-లక్ష్మిని తీసుకుని పండుగకి ఒకసారి వచ్చి పొమ్మనమని. పిల్ల వెళ్ళి పదినెలలయింది. పదిరోజులపాటు ఉండిపోతుంది' అన్నది సుభద్రమ్మగారు కొడుకుతో.

"అమ్మా! కూతురుని చూడాలనివుంటే నీవే ఒకసారి పోయిరాకూడదూ" అన్నాడు రామం చూస్తున్న పేపరు అవతల వేస్తూ.

"అదేమిటిరా! నీకు మాటుకు లేదూ చెల్లెలును చూడ వలెనని? కొత్తగా కాపురానికి వెళ్ళిన పిల్ల. పదినెలలయినా మళ్ళీ మనియింటికి తీసుకరాక పోతిమి. అసలు సెలవుపెట్టి నీవే ఒకసారి వెళ్ళి చెల్లెలనూ, బావనూ తీసుకవస్తా వనుకు న్నాను. శెలవివ్వరన్నావు కనుకనే ఒక ఉత్తరముక్క అయినా వ్రాయిస్తే బాగుంటుందను కొన్నాను. అంతేగాని నేనేమని వెళ్ళేదిరా అమ్మాయి దగ్గరకు?" అని అన్నది తల్లి కుమారునితో.

"అది కాదమ్మా! పండుగకు రమ్మనంగానే సరిపో యిందా. వాళ్ళు రైళ్ళకి బోలెడంత తగలేసి రావాలి. పైగా వాళ్ళని పదిరోజులుంచుకుని సాగనంపటానికి మనకూ వంద రూపాయలు వదుల్తవి. నీవు వెళ్ళివస్తే పాతికరూపాయలతో పోతుంది.

అబ్బాయ్! అన్నింటికి ఖర్చంటే ఎలాగురా? అయ్యో ఖర్చులలో యిదీ ఒకటి. మరి అక్కలు చెల్లెండ్లూ అని వుంటే ఇటువంటి ఖర్చులెలా తప్పుతవిరా? దానికీ అక్కడ ఇన్నాళ్ళు గావుంటే ఎలాగుందో? పదిరోజులు మనదగ్గరవుంటే వానికీ సరదాగా వుంటుంది. సువ్వూ, నేను తప్ప దానికి మటుకు ఇంకెవరున్నారురా?

"అమ్మా! యింకా నీకు పిచ్చికాని, దాని భర్తతో అది హాయిగా కాలక్షేపం చేసుకుంటున్నదికదా! యెందుకే యిప్పుడిదంతాను అయినా దానికి మనలను చూడవలెనని వుంటే అదే వస్తుంది బావతో చెప్పి"

"అదేమిటిరా బావ పంపుతాడా? మీ అన్నయ్య వుత్తరంరాస్తే పోదువుగాని అని అనడూ! పిలుపులేనిదే ఎలా గొస్తుందిరా యెంత పుట్టింటికయినాను! ఒకవుత్తరంవ్రాయి నాయనా. అయ్యో ఖర్చులేమిటో పొలంలోవచ్చేమక్తాలో వాడుదువుగానిలే... నీ జీతం డబ్బులలో దమ్మిడీకూడా యివ్వనక్కరలేదులే" అని నిష్ఠురమాడింది సుభద్రమ్మగారు.

"అదేమిటమ్మా అలాగంటావు! నా జీతండబ్బులు మటుకు చాలితేకదా పొలంపైకం నీకివ్వటానికి! యీ రోజులలో జీతండబ్బులతోనే కాపురం గడిపేవాండ్లెక్కడున్నా రమ్మా! ఆ పొలాలమక్తా కలిస్తేనే ఇల్లు గడవటం కష్టంగా వుంది. నీకు తెలియని దేమున్నదిచెప్పు మొన్న నీ కోడలికి జబ్బుచేస్తే డాక్టరుకు డబ్బివ్వలేకనేకదా వాళ్ళ అమ్మగారింటికి పంపింది... దానికి యెలాగయినా యీ పండక్కి ఒక పట్టుచీర తీయవలెనని అనుకున్నాను. ఆమాత్రంఅయినా ఇవ్వట.

లేకపోతే ఇహ పెండ్లి చేసుకున్నదెందుకు? చెప్పూ!" అని తల్లి వంక చూశాడు రామం.

"అబ్బాయి రామూ! యెంత తెలివితక్కువరా నీకు! మీ అత్తగారికేం, వాళ్ళు లక్షాధికారులు. వాళ్ళమ్మాయికి యెంతయినా పెట్టగలరు. నీకు కూడా సాయం చేయగలరు. వాళ్ళకేంలోటని నీవు నీ పెళ్ళానికి చీరెలు - సొమ్ములూ యివ్వాలిరా!

ఏదో కల సంబంధం అని చేస్తే నీవుకూడా యిలా అంటే మన లక్ష్మికి ఎవరున్నారురా? యీసారికి నామాటవిని గట్టిగా రమ్మని వుత్తరం రాయి నాయనా. పండక్కి నలుగురు యింట్లోవుంటే ఎంతో యిదిగా వుంటుందినాకు" అని అన్నది సుభద్రమ్మగారు.

"అయితే మేముంటే చాలదన్నమాట. అవునులే, ఎంతయినా తల్లికి కూతురుమీదవుండే ప్రేమ కొడుకుమీద యెందుకుంటుందీ? నా కష్టాలు నీకెందుకూ. కూతురు అల్లుడు వచ్చి మేసిపోతే నీకంతేచాలు. ఇవతల చచ్చేది నేనేగా. అంటూ కుర్చీలోంచి లేచాడు రామం.

"ఎందుకురా అలా విసుక్కుంటావు చిన్నప్పటినుంచీ అన్నయ్యా, వదినా అంటూ నీవన్నా, నీ పెండ్లామన్నా అంత ఇదయ్యే లక్ష్మిఅంటే నీకెందుకురా అంత కోపం? తిని పోతేనే ఖర్చని లెక్కలువేస్తే యెలాగురా? అన్నింటికీ రూపాయిజోలి తెస్తే యిహ తల్లి-కూతురని, అన్నా-చెల్లెలు అని అనుకోటం దేనికిరా! యేదో సమర్థుడవని అనిపించుకోవాలే కాని, డబ్బుకోసమని సంబంధంమానుకుంటారురా ఎక్క-

డయినా ! బాగానేవుంది, నువ్వూ నీ మాటలూనూ. నీవు వ్రాయకపోతే యెవరిచేతనన్నా నేనే వ్రాయించుకుంటాలే ! " అంటూ సుభద్రమ్మగారు లోనికివెళ్ళారు-

2

"ఏమిటి లక్ష్మి ! ఇవ్వాళ ఇంత హుషారు" అన్నాడు శేఖరం ఆఫీసునుంచివచ్చి కోటవిప్పుతూ వంటయింట్లో కూని రాగాలు తీస్తున్న లక్ష్మితో.

"ఏమండోయ్, వచ్చారూ. ఇంత ఆలస్యంచేశారేం టివ్వాళ? మనం రేపే మా వూరు వెళ్ళాలి. పదిరోజులు ఆఫీసుకు శెలవుపెడుదురూ"అంది లక్ష్మి చేతిలోవుత్తరం శేఖరానికందిస్తూ.

"ఓహో!, యిదా సంగతి. పుట్టింటిమీద గాలిమళ్ళ బట్టే నన్నమాట యీవుషారంతా! అయినా ఈ ఆడవాండ్లకు ఎందుకో యింత మమకారం పుట్టింటిమీద."

"అదేమిటండీ! పదహారేండ్లు పుట్టిపెరిగిన యిల్లు. మా అమ్మా, అన్నయ్యా, వదినెవాండ్లను వదిలి యిక్కడికి వచ్చి ఏడాది గావస్తున్నది. ఒకసారి వెళ్ళిరావలెనని ఉందండి."

"అయితే నేనుమాత్రం మాఅమ్మా నాన్నను వదిలి యిక్కడుండటం లేదూ! మావూరు వెళ్ళాలని నాకుండదెందుకు?

"ఆ! అలా అంటారుకాని మీరుపోవలసివస్తే మరింత హుషారు చూపిస్తారు! సరేకాని మనం రేపే బయలు దేరాలి. పదిరోజులు సెలవు వ్రాయండి"

"లక్ష్మీ! మా ఆఫీసు తనిఖీకని ఆఫీసర్లు వస్తున్నట్లు తెలియ పర్చారు. నాకు యిప్పుడు తీరిక చిక్కదు. నిన్ను రేపు మెయిల్లో ఎక్కించి వస్తాను. తర్వాత పది పదిహేను రోజులలో వచ్చి మళ్ళీ తీసుకవస్తాను."

"అయితే మీకీ పదిరోజులు భోజనం ఎలా?"

"ఆఁ! వీలయితే వండుకుంటాను. లేకపోతే మనహోటలు బంధువులున్నారుగా. పదిరోజులకేం పరవాలేదులే నీవు మాత్రం వెళ్ళిరా" అంటూ శేఖరం స్నానానికి వెళ్ళాడు.

భర్త రావటానికి వీల్లేకపోయెనే యని కొంచెం బాధ కలిగినా అమ్మనూ అన్నయ్యనూ చూడవచ్చుగదా అనే ఉబలాటంతో ఆ బెంగ మాయమయింది లక్ష్మికి. ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు మెయిలు ఎక్కుదామా అన్న ఆలోచనలతో నిద్రపోయింది లక్ష్మి ఆరాత్రి.

3

"యిదిగో చూడు రాజ్యం. యీచీర నీకునచ్చుతుందో లేదో!" అంటూ పొట్లం చేతికందించాడు రామం.

"బాగుంది. ఎవరు కొనమన్నారండి యీ చీరెను. అసలే డబ్బులేక యిబ్బంది పడుతున్నారు గదా. ఎందుకండి యింతఖర్చు పెట్టి యీ చీరె కొన్నది! ఎంత అయిందండీ యీ చీరె!"

"ఆఁ ఎంతలే, నూటపది రూపాయలు. యీ మూడేండ్లకి నీకు ఒక చీరె కొనిపెట్టలేదే అని అనుకున్నాను. ఎప్పుడు

వుండే ఖర్చులే గదా. ఈ పండక్కన్నా ఒక చీర కొందామను కొని కొనేశాను.

"అయితే డబ్బెక్కడిదండీ?"

"పొలాల మక్తాల క్రింద మొన్ననే రెండు వందలు యిచ్చిపోయినాడు సుబ్బన్న. యింకావుంటే ఖర్చయి పోతుం దని చీరె కొనుక్కువచ్చాను."

"అదేమిటండి మీ అమ్మతో చెప్పారా"

"ఆ. మొన్ననే చెప్పాను- ఇక మక్తా పైకం ఆమెకు యిచ్చేదిలేదని."

"బాగుందండీ. ఆమె పైకం కూడా మనమే వాడు కోవటమా?"

రాజ్యం! ఆమెకెక్కడిదే పైకం. ఆ పొలంమటుకు నాదికాదూ! ఆమెమటుకు ఏంచేసుకుంటుంది. ఆ డబ్బును. యిన్నాళ్ళు అవస్థ పడుతున్నా జీతంచాలక యిక మక్తా కూడా ఆమెకే యిచ్చేస్తే కాపురము గడిచేదెట్లా రాజ్యం?"

"పోనీయండి ఆమె పెద్దది. యాత్రిలకు, దానధర్మా లకు, ఆడపిల్ల కూడా వున్నదామె! ఆమె యిష్టం వచ్చినట్లు ఖర్చుచేసుకోనివ్వరూ ఆ మక్తా డబ్బులను."

"చాల్లే. అసలే ధరలు పెరిగిచస్తుంటే యాత్రిలు, ధర్మాలూను నీకు తెలియదు ఊరుకో రాజ్యం" అంటూ ముగించాడు రాము తల్లిని చూసి.

చూడండి అత్తయ్యా! పండక్కని చీరెకొన్నారుట మీ అబ్బాయి" అంట్లూ రాజ్యం చీరెను అత్తగారికి ఇచ్చింది

"బాగుందమ్మా లేతరంగు జరీ కూడా నాణ్యంగా యుంటే. పోనీలే తల్లీ! యిన్నాళ్ళకయి ఒక్క చీరె తెచ్చారు. పండక్కు కట్టుకో తల్లీ" అంటూ తిరిగి యిచ్చింది సుభద్రమ్మగారు. తల్లి ఏమి విసుక్కోనందుకు రామానికి ఆశ్చర్యం కూడా వేసింది.

4

"అమ్మా! అన్నయ్య స్టేషనుకు రాలేదేమే" అంది లక్ష్మి జట్కా దిగి ఇంట్లోకి వస్తూనే.

"అదేమిటి లక్ష్మీ ఉత్తరం ముక్కగూడా లేకుండా వచ్చేశావు! ఒక్కదానివే వచ్చేశావేమిటి" అంటూ కాళ్ళకు నీళ్ళిచ్చింది రాజ్యం.

"వారికి శలవు దొరకలేదు వదినా! అన్నయ్యను స్టేషనుకు రమ్మని టెలిగ్రాం యిచ్చి నన్ను నిన్న మెయిలెక్కించారు. స్టేషనులో అన్నయ్య కనిపించలేదు నేనే బండీ చేసుకొని వచ్చాను" అన్నది లక్ష్మి.

ఇంతలో రామం ఇంటికి వచ్చాడు "ఏమే లక్ష్మీ! తిన్నంగా వచ్చావా" అన్నాడు చెల్లెలుతో.

"ఆఁ కులాసాగానే వచ్చానన్నయ్యా! బావ యిచ్చిన టెలిగ్రాం అందలేదా అన్నయ్యా" అన్నది లక్ష్మి.

"అందిందమ్మా. ఆఫీసు పనితొందరవల్ల స్టేషనుకు రాలేను. అయినా ఇది నీకు క్రొత్తచోటు కాదుగదా!" అనేశాడు రామం.

నాలుగయిదు రోజులు గడిచిపోయినవి రాము చెల్లెలుతో మాట్లాడలేదు. లక్ష్మికి కారణం తెలియలేదు. ఒక నాడు సాయంకాలం వంటయింట్లో వున్న తల్లితో అంది-
"అమ్మా ఎందుకమ్మా అన్నయ్య అదో రకంగా వున్నాడు? యిదివరకు మాదిరి సరదాగా మాట్లాడటమే మానేశాడు. శావను గురించి అడగనన్నా లేదు. ఏమి జరిగిందమ్మా యీ మధ్య ?"

"ఏముంది లక్ష్మి; వాడిప్పుడు పూర్తిగా మారిపోయాడు అన్నింటికీ రూపాయిలూ అణాలూ అంటాడు. నేను నువ్వు తింటేనే అంతా అయిపోతున్నట్లు మాట్లాడతాడు. వెనకటి అన్నయ్య కాదమ్మా ఇప్పుడు! ఏంజేస్తాం" అని కంట తడి పెట్టింది సుభద్రమ్మగారు.

"అయితే నన్నెందుకు రమ్మని వ్రాయించావమ్మా. ఏదో కష్టమో, సుఖమో అక్కడనే వుండిపోయేదాన్ని. పోనీ మనం ఇద్దరం పండగ వెళ్ళంగానే అక్కడికి పోదాం. నీవంటే మా కేం తక్కువలేదమ్మా. వారు కూడా ఎంత మంచి వారనుకున్నావు! ఇక్కడ అన్నయ్య బాధ తగ్గుతుంది.

"అదేం మాట తల్లీ! నీ వంటే సరిపోయింది గాని నే నెందుకమ్మ అక్కడకు. కన్నకొడుక్కే భారమయితే పరాయమ్మ గన్నకొడుక్కుమటుకు భారంగాదూ ? వద్దు లక్ష్మి! ఏదో వచ్చి చూశావు అంతే చాలుతల్లీ. అప్పుడప్పుడు వచ్చి పోతుండమ్మా. పండగ వెళ్ళంగానే వెళ్ళిరామ్మా. పాపం. ఆయన హోటలుతిండితో బాధపడుతున్నాడుగాబోలు" అన్నది సుభద్రమ్మగారు. రాజ్యం ప్రక్క హాల్లో కూర్చుని యీ

సంభాషణ అంతావింటూనే వున్నది. తనభర్త తప్పుతో వలలో పడ్డాడు కదా అని విచారించింది.

5

"అదేమిటి రాజ్యం! పండగపూట కొత్త చీర కట్టుకోనన్నా లేదు !" అంది సుభద్రమ్మగారు కోడలితో.

"ఆఁ. ఎందుకులే అత్తయ్యా అందరకూ లేని పండుగ నాకేమిటి ?" అన్నది ముక్తసరిగా.

"బాగుందమ్మా ఏదో ముచ్చటపడి వాడు కొన్నాడు. చీరె కట్టుకుంటే నీదేం పోయింది వదినా" అన్నది లక్ష్మి రాజ్యంతో

"ఊరుకో లక్ష్మి అని మాత్రం అన్నది రాజ్యం. ఆ రాత్రి రామం అడిగాడు రాజ్యాన్ని- "రాజ్యం నేనెంతో సరదాపడి చీరకొంటే నీవు కట్టుకోనన్నా లేదు ఎందుకని ?"

"తర్వాత మీకే తెలుస్తుంది లేండి" అని మాత్రం అనేసి ఊరుకుంది.

మర్నాడే లక్ష్మి తన వూరికి బయలుదేరింది. ఏరా రామం అమ్మాయి యివ్వాళే వెళ్ళిపోతుందిట ఏదన్నా తేలికలో ఒక చీర, రవిక గుడ్డా తీసుకురా నాయనా కట్టుకు పోతుంది. అని అడిగింది సుభద్రమ్మగారు

"ఇప్పుడు డబ్బెక్కడ నుంచి వచ్చినదమ్మా- చీరెలు నారెలు కొంటానికి రైలు ఛార్జీలకే పది రూపాయలువెట్లాగా అని చస్తుంటేను అయినా తళతళలాడే చీరె లెక్కడినుంచి

వస్తవి చెప్పు? ఏదో వచ్చి చూసిపోతే సరిపోయిందిగాని అన్నాడు రామం.

"అబ్బాయీ! ఒక్కగా నొక్క కూతురు. అమ్మాయికి ఒక చీర అన్నా పెట్టకపోతే నలుగురు నవ్విపోరూ ?"

"ఆఁ నలుగురూ నవ్వనీ - నా దగ్గర యిప్పుడు చిల్లి గవ్వన్నా లేదు" అన్నాడు రామం పాపం సుభద్రమ్మ చాలా నొచ్చుకుంది. ఏం చేయకలదు మరి! లక్ష్మికి అన్నీ తెలుసు గనకనే ఏమీ అనుకోలేదు.

"అమ్మా! నేను వెళ్ళవస్తానమ్మా!" అంటూ తల్లితో చెప్పినపుడు సుభద్రమ్మగారు కంట తడిపెట్టింది అమ్మాయిని కౌగలించుకొని పోయిరా తల్లీ అని మాత్రం వూరుకొంది.

"వదినా వెళ్ళివస్తానమ్మా" అని రాజ్యం దగ్గరికి వెళ్ళింది. "నీ యిష్టం లక్ష్మి. యిదిగో ఈ చీరె కట్టుకొని మాత్రం వెళ్ళు" అని అంటూ కొత్త పట్టుచీరె మడత చేతికందించింది పసుపుకుంకుమలతో.

"అదేమిటి వదినా! ఈ చీరె నాకెందుకు" అన్నది లక్ష్మి.

"నీకుగాక నాకెందుకు లక్ష్మి, మీ అన్నయ్యకు తెలియకపోయినా నాకు తెలియవద్దా మర్యాద! ఇంటి ఆడపడుచుకు నీకుగాని నాకుటమ్మా చీరెసారెలూను! నాయందు దయయుంచి కట్టుకో తల్లీ! మీ అన్నయ్య తప్పులను మరచిపో లక్ష్మి. ఆయనకు ఇంకా తెలియదు" అని అంటుంటే లక్ష్మి కండ్లు ఆనందంతో చెమ్మగిల్లినవి.

రామం అక్కడకు రావటం యెవ్వరూ గమనించలేదు.

"అమ్మా లక్ష్మీ! మీ వదిన నాకు చక్కని గుణ పాఠం నేర్పిందమ్మా. ఆడవాళ్ళకు ముందు నేనెవరో, నీవె వరో తెలియచెప్పింది. నా తప్పు క్షమించి యిహాల్టికి నీ ప్రయాణం మానుకోవూ! నాలుగురోజులు పోయిన తర్వాత నేనే వచ్చి నిన్ను బావ దగ్గర దిగపెట్టివస్తాను. సంసారం అంటే పెండ్లామేనన్న మోహంలోపడ్డ నాకు, చెల్లెలు అంటే ఏమిటో కూడా తెలిసివచ్చింది." అని బొంగురుపోయిన గొంతుకతో అంటున్న రామాన్నిచూసి అంతా ఆశ్చర్యపోయారు.

సుభద్రమ్మగారెంతో సంతోషించింది.

"అమ్మా రాజ్యం! నిజంగా నీవమ్మా కోడలివంటే" అనిమాత్రం అనగలిగిందంత సంతోషంలో నున్న.



సంతానం

రచన : తన్నీరు లక్ష్మీనారాయణ.

కమలవంటి అదృష్టవంతురాలు లేదన్నారు పదేండ్ల క్రిందట. చదువుకొన్నవాడు, చక్కనివాడు, పైగా బుద్ధిమంతుడు. దమ్మిడీ కట్నంగూడా తీసుకోకుండా పెండ్లిచేసుకున్నాడు రామం కమలని. ఏమిచూసి చేసుకున్నాడంటే ఏమి చూసి అని అన్నారంతా. కమల అంతరూపవతి కాదు. కాలేజీలో చదువనూ లేదు. సంగీత పాఠకురాలూ కాదు. పెద్దఆస్తికి వారసురాలూ కాదు. తండ్రిలేని పిల్ల. అన్న, వదిన ఎక్కడో వుద్యోగము చేసికుంటూ కమలను తల్లికే అప్పజెప్పి పోయినారు. ఆచిన్నవూళ్ళోనే పదిహేనేండ్లవరకు పెరిగి పెద్దదయింది. మంచి సౌమ్యతగల పిల్ల. చామనచాయ. సన్నగా నాజూకుగానే వుంటుంది. తెల్లచీరా పచ్చ జరీఅంచు జాకెట్టూ తొడిగి కరణం గారింట్లో స్నేహితురాలు జానకి పెండ్లికి పేరంటంచేస్తుంటే చూశాడు రామం కమలను. అసలు రామం ఎప్పుడూ పల్లెటూరికి వెళ్ళనే లేదు. గుంటూరులోనే పుట్టి గుంటూరులోనే పెరిగాడు. తన ఇరవైయేండ్లు అక్కడే గడిపాడు. తండ్రి కాలేజీలో లెక్చరరు. బి. ఏ. పరీక్షలు అయినవి ఆ వైశాఖంలో మిత్రుడు వెంకటార్రావు పెండ్లికని ఆ వూరు వెళ్ళాడు సరదాగా నాలుగురోజులు గడపటానికని వెంకటార్రావుతో తోడపెండ్లికొడుకుగా వెళ్ళాడు రామం.

కరణంగారికూతురి పెండ్లి. సుందరమ్మగారింట్లో విడిదీను. సుందరమ్మగారిది పెంకుటిల్లే, అయినా వాకిట్లో యెత్తయిన అరుగులు, ఇంటివెనక దొడ్డి, దొడ్లోకరివేపాకుచెట్టు, బాదం చెట్టు, మల్లెమొక్కలు, గిలకబావి- ఇల్లు చాలా వసతిగల యిల్లేననిపించింది రామానికి చల్లగాలి పంకాలు లేకుండానే వచ్చేది గుంటూరులో తనువుండేడా బాకన్న యిక్కడేఎంతో హాయి అనిపించింది. పెండ్లి మూడవరోజు సాయంకాలం దొడ్లో గిలకబావిదగ్గర స్నానానికి నీళ్ళు తోడబోతుంటే కమల వచ్చి "ఆ గచ్చుతొట్లో నీరు పోసుకోండి ఫరవాలేదు. మేము తరువాత తోడించుకుంటాము" అంటూ చెప్పి పోయింది. పెండ్లిపేరంటానికనిఅందరూపట్టుచీరెలు, జరీచీరెలు కట్టుకుంటే కమలమాత్రం మామూలు తెల్లచీరె కట్టుకోటం చూస్తే రామానికి ఆశ్చర్యం వేసింది. బస్తీలలో పిల్లమాదిరి గాక యెంతో చనువుగా తనతో మాట్లాడినందుకుకూడా మురిసిపోయినాడు. పెండ్లికివచ్చిన బంధువులంతా కరణంగా రింట్లో మేజువాణీ తిలకిస్తున్నారు. రామం స్నానం కాగానే పాంటు, షర్టు తొడిగి పడిది యింట్లోనేమంచంమీదవిశ్రాంతి తీసుకున్నాడు- తనకంతవరకు ధోవతి కట్టుకోవాలనిపించలేదు. కాని, ఆరోజు యెందుకనో తన పాంటుమీద విసుగుపుట్టింది. కట్టుకుందామన్నా తనకు ధోవతిలేదు.

ఇంట్లో సుందరమ్మగారుతప్పితే ఎవ్వరూ లేరు. వాకిట్లో మంచంమీద పడుకొని రామం ఆలోచిస్తున్నాడు.

ఇంతలో సుందరమ్మగారువచ్చి "ఏంనాయనా, ఒక్కడివే యిక్కడున్నావు ఒంట్లో బాగుండలేదా ?" అని పలకరించింది.

"ఆఁ! యేమీ లేదండీ. అయినా యింకా అక్కడ మనతో పనేముందండీ. పెండ్లికొడుకు-నేను కలసి చదువుకున్నాము. పెండ్లికి రమ్మంటే సరదాకని వచ్చాను. యీ మూడు రోజులూ చాలా హాయిగా వెళ్ళిపోయినవండీ. రేపు మళ్ళీ మా గుంటూరు పోవాలిగదా అని అనుకుంటు న్నాను"

"అదేమిటినాయనా, మీగుంటూరు బస్తీ, యిదేదో చిన్న పల్లెటూరు పాపం మీరెట్లాగడిపారో యీ మూడు రోజులున్నా!"

"అయితే మీఅమ్మాయికి ఇంకా పెండ్లికాలేదాండి" అన్నాడురామం చటుక్కున.

"అవునునాయనా యెలాగవుతుంది పెండ్లి ? సంచు లుంటేకదా" అంది సుందరమ్మగారు.

"ఎందుకండీ సంచులు? అమ్మాయి మంచిపిల్ల. బుద్ధి మంతురాలు. నిక్షేపంగా చేసుకుంటారెవరయినా" అన్నాడు రామం.

"ఆఁ! అంత అదృష్టమా నాయనా !" అన్నది సుందరమ్మ

"నేను బి. ఏ.-దాకా చదివానండి. మీ కభ్యంతరం లేకపోతే మా అమ్మను, నాన్నను పంపిస్తాను. మీ అమ్మాయినికూడా కనుక్కోండి. ఆమెకిష్టమయితే నే నామెను తప్ప

కుండా పెండ్లి చేసుకుంటాను. దమ్మిడీకట్నంకూడా లేకుండా" అని అంటుండగానే కమల, యింకో ముగ్గురు పెండ్లి పేరంటాండ్రు వచ్చారు నవ్వుకుంటూ.

"అరె! తోడుపెండ్లికొడుకు యిక్కడున్నాడా పెండ్లి కొడుకు వెతుక్కుంటున్నాడు యీయనగారికోసం" అన్నది ఆ ముత్తయిదువులలో ఒకావిడ

"అవును పిన్నీ, కాస్త విశ్రాంతి కోసం ఇక్కడేవుండి పోయాను. ఏముంది. అక్కడ మనము చేసేది, చూసేదీను- బంతులాటలు- ఆడవారి పాటలు తప్ప" అన్నాడు రామం.

సుందరమ్మగారు రామంపిన్ని ద్వారా అన్ని సంగతులు తెలిసికొన్నది. పిల్లవాడు చాలా బుద్ధిమంతుడు. మంచి సాంప్రదాయం. ఒక అక్కగారు, ఒక తమ్ముడూ వున్నారు. పెద్ద ఆస్తిపరులు కారు. తండ్రి సంపాదన తప్ప ఇంకేమీ లేదు.

మర్నాడు రామం సుందరమ్మగారి వద్ద శలవుతీసికొని అవూరు వదలలేక వదలలేక వెళ్ళాడు. తప్పకుండా మంచిరోజు చూసుకుని తల్లిదండ్రులతో రామ్మని సిందగా చెప్పింది సుందరమ్మగారు. కమలకు కూడా రామం అంటే అదోరకం ఆప్యాయత కలిగింది. ఆ నాలుగురోజులు ముఖం కడుక్కోవటానికి మరచెంబుతో తనే నీళ్ళు పెట్టేది అరుగుమీద. చదువుకున్న కుర్రవాళ్ళ మాదిరి ఆడపిల్లలను చూసి కేరింతలుకొట్టలేదు రామం. అందుకనే కమల రామం అంటే అభిమానపడింది. ఈ సంబంధాని కతని తల్లిదండ్రులు ఒప్పుకుంటే బాగుండునని ఎన్నో విధాల దేముడిని ప్రార్థించుకుంది మనసులోనే కమల.

"ఏమండీ, అబ్బాయి మాత్రమే కాదండీ, మన నరసమ్మ గారు కూడా చెప్పారండి. ఆ అమ్మాయి మంచి కలుపుగోలుతనంగలపిల్లట. చాలాబుద్ధిమంతురాలుగూడానట. ఆపిల్ల ముఖం కళకళలాడుతుండటండీ. వెధవకట్నాలు మనలనేమి వుద్ధరిస్తవండి? ఏదోవాడికి నచ్చినపిల్ల, రేపు దశమినాడు వస్తున్నామని వ్రాయించండి. అని బ్రతిమలాడింది రామం తల్లి రామలక్ష్మమ్మగారు భర్తను. ఏదో ఐదువేలన్నా రావాలని పట్టుబట్టి కూర్చున్న రామచంద్రయ్యగారు కూడ యింత చెబుతుంటే సరే నన్నాడు.

అనుకున్న ప్రకారమే అన్నీ జరిగిపోయినవి. పిల్లకు పిల్లాడునచ్చాడు. పిల్లవాడికి పిల్లనచ్చింది. కట్నాల ప్రస్తావనే లేదు. అయిదురోజులు పెండ్లి వైభవంగా జరిగింది. కరణం గారి కూతురుపెండ్లి చలువ అని అనుకున్నారు కమల, రామారావు గూడా. "అదృష్టమంటే కమలదే అదృష్టం" అని అన్నారు ఆనాడు.

2

వివాహం అయిన ఆరునెలలకే రామానికి వుద్యోగం దొరికింది. జీతం నెలకు నాలుగువందలు. కోడలు వచ్చిన వేళా విశేషం అన్నారు రామలక్ష్మమ్మగారితో అంతా. రామం ఎంతో సంతోషించాడు. కమలతో పాటు అదృష్టం కలసి వచ్చిందనుకున్నాడు. పట్నంలో కొత్త కాపురం పెట్టాడు. ఎంతో హాయిగా గడచి పోయినవి ఐదేండు. చీకు చింతా అనేది ఎరగరా దంపతులు. చాలినంత డబ్బు, కమలకు

కోరినచీర. కోరిననగ. ఒకసారి సుందరమ్మగారు వచ్చి నెలరోజులు కూతురు అల్లుడు కులాసాగావుండడము చూసి వెళ్ళింది. రామం తల్లిదండ్రులు గూడ ఒక వేసవి సెలవులు పట్నంలో గడపి వెళ్ళారు. చిలకా గోరింకల్లా వున్న దంపతులనుచూచి బంధుజనం అంతా సంతోషించారు. నిజంగా అటువంటి కోడలు దొరికినందుకు మరీమరీ సంతోషించింది రామలక్ష్మమ్మగారు.

ఒక నెలరోజులు సెలవుపెట్టి తమ బంధువు ఇండ్లకు, పోయివద్దామని బయలుదేరారు రామం, కమలాను. వారంరోజులు గుంటూరులో వుండి బందరులోవున్న అక్కగారింటికి వెళ్ళాడు రామం భార్యా సమేతంగా. తమ్ముని తమ్ముడి భార్యను ఎంతో మర్యాదచేసింది పంకజమ్మగారు. ఒకరోజున రామంతో అన్నది.

"రామూ! అంతా బాగున్నదికాని, కమలకు ఒక్క కూతురన్నా పుడితే మా నారాయుడికి పెళ్ళాన్ని వెదుకోక్కనక్కరలేదురా. అదొక్కటే కొరతగావుందినాకు" అనిఅన్నది. రామం ఒక చిన్న నవ్వుమాత్రం నవ్వివూరుకున్నాడు కమల వైపు చూసి. కాని కమల మనస్సుమాత్రం చివుక్కుమన్నది. తనలో ఒక కొరతను చూపించిందికదా వదినెగారు అని అనుకొన్నది. బందరునుండి విశాఖపట్నంలోవున్న బావమరిదిగారింటికి బయలుదేరాడు రామం. సింధియాలో చిన్న గుమాస్తాగా పని చేస్తున్నాడు కమల అన్నగారు శంకరం. నెలకు నూరురూపాయలు యిస్తారు. ఒక చిన్న యిల్లు కూడా వూరికే ఇచ్చారు. చాలిచాలని యిల్లు. అందులోనే నలు

గురు పిల్లలతో కాపురం చేస్తున్నాడు శంకరం కాంతానికి అంటే కమల వదినగారికి కమలంటే నిష్కారణంగా కోపం. పెద్ద వుద్యోగస్తుని భార్యననే గర్వం వున్నదని ఆమెకు అనుమానం. అందుకనే కాబోలు "ఆఁ యెంత సంపాదిస్తేమటుకు యేమిలాభం, పిల్లాజెల్లా లేనిదే యెందుకు వందలు వేలూను" అని అవసరం అయినప్పుడు, లేనప్పుడుకూడ అంటుండేదికమలతోను, యిరుగుపొరుగు అమ్మలక్కలతోనూ. కమలకు అన్నయ్యగారింట్లో నాలుగురోజులుండేటప్పటికి పిచ్చెక్కినంత పని అయింది. "యేమండీ యిక మావూరుపోయి శెలవులయింందాకా అక్కడేవుండి పట్నానికి పోదాం" అన్నది రామంతో. సరేనన్నాడు రామం.

అత్తగారింటికి వచ్చారు రామం కమలాను. అక్కడ మాత్రం ఏమయింది. "అయితే సుందరమ్మగారూ! అమ్మాయికి..." అని సణిగేవారే ఆ వూళ్ళో ఆడంగులంతా. "ఆఁ అంత అదృష్టం కలుగలేదింకా." అని సమాధానం చెబుతుండేది వారందరికి సుందరమ్మగారు. "చూశారా, కరణంగారి అమ్మాయికి ఒక కొడుకు ఒకకూతురూను, నిరుడేగదా పంతులుగారి సీతమ్మ అత్తగారింటికి వెళ్ళింది అప్పుడే కంటానికని వచ్చింది. ఏమోనమ్మా, మనుమడిని యెప్పుడు యెత్తుకుంటావో పాపం" అంటూ ఓదార్పుమాటలు వెల్లడిచేసింది పక్కింటి హనుమాయమ్మగారు. ఈ కబురులన్నీ వింటుంటే కమలకు కంటకంగా వుండేవి. "ఏమండీ! శెలవు ఎన్నాళ్ళుంది అనేది రోజూను. "ఏంకమలా! అంత తొందర? రేపే పోదాములే. పట్నంలోనే నాలుగురోజులు విశ్రాంతి తీసుకోవచ్చు.

అని పట్నం వెళ్ళారు. రామం, కమలాను- శలవు యింకా నాలుగురోజులున్నప్పటికినీ

"ఏమండీ! వీళ్ళందరకు ఎందుకండి ఈ బాధ మనకు పిల్లలు లేరని. అబ్బా, యింకా నాలుగు రోజులు ఆ వూళ్ళలో వుంటే తలపగిలిపోయేదనుకోండి!" అని అంటుంటే కమల మీద యెంతో జాలివేసింది రామానికి. "అదేమిటి కమలా! అంత కంగారు దేనికి? పిల్లలు పుట్టకనే బెంగ దేనికి యిప్పుడే? ఐనా ఐదేండ్లకే ఏదో మునిగిపోయినట్లే వీరంతాను..." అని మాత్రం అన్నాడు రామం.

అలానే ఇంకో ఐదేండ్లు గడచినవి ఉద్యోగంలో గూడా ప్రమోషను వచ్చింది రామానికి. ఇప్పుడు నెలకు ఎనిమిది వందలు జీతం. ఒక కారుగూడా యిచ్చారు. ఒకచిన్న బంగళా కూడా యిచ్చారు. కోరినదల్లా వుంది. కాని ఆ కొరతమాత్రం కొరతగానే ఉండిపోయింది. కమలకుగాని రామానికిగాని అది కనపడేది కాదు. కాని హాయిగా వుండనిస్తుందా బంధుజనం చేసకోడలు పెండ్లికి రావలసిందిగా పిలుపు వచ్చింది బందరునుంచి. బందరు వెళ్ళటాని కనంగానే భయంవేసింది కమలకు. "మీరొక్కరే వెళ్ళి రాకూడదూ?" అని అడిగింది. బాగుండదు కమలా అయినా మనల్నేమి చేస్తారు వాండ్లు. పోయివద్దాం అని అన్నాడు రామం, తప్పలేదు ప్రయాణం. పెండ్లికి తన తోడుకోడలు గూడా వచ్చింది. మరిదికి గుంటూరులోనే పుగాకు కంపెనీలో నౌకరీ. నెలకు నూట పాతిక ఇస్తారు. తోడికోడలు నల్లటి పాత చింతపండు- అయినదానికి. కానిదానికి, మొగుడుతో యుద్ధమే "పిల్లాను

ఏడుస్తుంటే వినిపించటంలా- చేటంత చెవులకు. నలుగురితో పేరంటానికి పోవటానికన్నా వీలులేదు వెధవ పిల్లలు తీసుకోండి" అంటూ మరది చేతిలోకి ఆఖరివాడిని వదిలేసి వెళ్ళింది తోడుకోడలు అయినా పెండ్లికి వచ్చిన నలుగురు, తోడుకోడలుకుచూపే మర్యాద తనకు చూపలేదు. పైగా తనతో సవ్యంగా మాట్లాడినవారుకూడా లేరు. వదినెగారు కూడా అన్నిపనులు తోడికోడలుకే చెప్పేది తనంటే ఆఇంట్లో ఎవరికీ ప్రేమగాని, గౌరవంగాని వున్నట్లేలేదు. పైపెచ్చుఅందరికీ తననుచూసినా, తనసొమ్ములు చూసినా, తన చీరెలు చూసినా, అసూయగా వుండేది ఆఖరుకు అత్తగారు కూడా "ఆఁ ఏమిటో. మా రాముం ఖర్మ అలాగుంది. ఎన్నివందలు సంపాదించుకుంటే ఏం, పిల్లా? జెల్లా" అని అనేసింది. కమలను చూసి ఒక్కరు జాలి కనబరుచక పోవటం రామానికి కూడా కష్టం వేసింది.

ఏరా, రామూ! పిల్లలు లేరటగా. ఏదో రామేశ్వరం అన్నా వెళ్ళిరండిరా. శని పిరగడ అవుతుందేమో అని అనే వాళ్ళే అంతాను. రామానికి ఎంతో కష్టం వేసింది ఇన్నాళ్ళు తామెంతో హాయిగా వుంటున్నామనుకుంటున్నారు. కాని వాతావరణంలో తనకేమీ విలువలేదని తేలిపోయింది. మగవాడయి తనే యిలా అయిపోతే కమల సంగతి ఎలావుండివుండాలో వూహించుకుని మరీ విచారించాడు.

మరునాడు పట్నం బయలుదేరాడు భార్యతో.

3

"కమలా ! యెందుకుచెప్పు ఇంతబెంగ ? మనకా అదృష్టం వుందో లేదో, అన్నాడు భార్యతో.

"అదేమిటండీ యెవరికి బెంగ? నాకు పిల్లలు లేరని కాదు గాని మధ్య పిళ్ళందరికీ యెందుకా యింత బాధ అని! వాళ్ళు కంటే కన్నారు. ఇంకా కననుండి. అంతేగాని మనలను చూసి వీళ్ళు ఏడవటం దేనికీ అని. అసలు పిల్లలను కని వీళ్ళే మంత సుఖపడి చస్తున్నారండి ! చూశాంగా మా అన్నయ్య పడే అగచాట్లు. ఒకపూట తింటే రెండవపూటకు దిగులే. మా అన్నయ్యకు వొక్క-కూతురి పెండ్లితోనే తెలిసిందిగా. అయినా మనకు వుండే లోటేమున్నదీ అని. ఉన్నన్నాళ్ళూ తింటాము... తర్వాత సంగతి తర్వాత" అని అన్నది భర్తతో కమల.

"అదికాదులే కమలా ! మనం యెంత తిన్నా యెంత సంపాదించినా సంసారంలో వుండే సుఖాలు—దుఃఖాలు వాటికవే సాటి. అయినా మనంమాత్రం రామేశ్వరంపోయివస్తే వచ్చే ప్రమాద మేముందిచెప్పు. చూసినట్లూ అవుతుంది, ఫలితము వుంటే వుండవచ్చును కూడా. మా ఆంజనేయులు మొన్ననే చెప్పాడు- యిలాగే వాడికి పాతికయేళ్ళకు కూడా పిల్లలు లేరట. వారు,వీరు చెబితే రామేశ్వరం వెళ్ళివచ్చాడట. ఆ సంవత్సరం లోపలనే కొడుకుపుట్టాడట. నీవు వప్పుకుంటే ఈ సంవత్సరమే మనంకూడా వెళ్ళివద్దాం కమలా" అన్నాడు రామం.

"అబ్బా, మీకూపట్టింది, యీ వెర్రి!" ఇన్నాళ్లూ అందరూ అంటుంటే వూరుకున్నానుగాని, మీకుకూడా యిది ఒక కొరతగా వుందని నాకు తెలియలేదు.

"అదేమిటికమలా! పుట్టినతర్వాత పెళ్ళి, పేరంటం అన్నారు. దానితర్వాత మరి సంతానమేగదా కోరేదీను, కావలసిందీను. అదిలేకపోతే కొరతకాదని అనుకోవటమెలా, కొడుకులు-కూతుర్లు కలగటం, వాళ్ళను పెంచి పెద్దచేయటం వృద్ధాప్యంలో వారివలన సుఖపడటం-యివన్నీ జీవితంలో భాగాలేకదా! ఇంతటితో ఆగిపోతే యిది కొరతజీవితమే.

"ఏమిటండీ, ఇన్నాళ్ళూ మీరు యిలా అంటారని అనుకోలేదు. ప్రాప్తంవుంటే పుడతారు- లేకపోతే లేరు. అంతే గాని తృప్తి అనేదిలేకుండా లేనిదానికి వగచి ప్రయోజనం యేమిటండీ! వున్నన్నాళ్ళూ హాయిగావుంటే చాలదా అనిఅను కునేదాన్ని. కానిమీరుగూడ కష్టంపెట్టుకున్నారని అనుకో లేదు. ఏమిచేస్తాను, నా ప్రారబ్ధం. నన్నుకాకుండా మరొకరి నెవరన్నా చేసుకొనివుంటే, మీకీ కష్టమే వుండేదికాదు కాబోలు. అయినా యెందుకండీ మీకుబాధ" అని అడిగింది కమల.

"అదికాదు కమలా! యిటుచూడు. రేపు నాతర్వాత నీవు ఒక్కతవే యీ జీవితం గడపవలసివస్తే..." అనిఅన్నాడు రామం.

"చాలులెద్దురూ పాడుమాటలు, ఛీ వూరుకోండురూ మీ పుణ్యమా" అనిమాత్రం అనేసి వూరుకుంది కమల.

క్రిమేపి వారికి సుఖం అనేది సన్నగిల్లింది విసుగు పుట్టుకొచ్చింది. బంధువులయిళ్ళకు వెళ్ళటం మానివేశాడు. వారు కూడా యిటురావటం మానేశారు. వుత్సాహం తగ్గటం, పైగా మనోవ్యాధి యేర్పడింది కమలకు. అప్పటికిగాని రామానికి తెలిసిరాలేదు తను చేసిన పొర పాటు నలుగురుతోపాటు తనుకూడా కమల మనస్సు పాడు చేశాడు.

కాని చేసేది యేముంది? క్రిమంగా కమల నీరసించి పోయింది... మంచం పట్టింది. యే డాక్టర్లు కుదర్చగలరు మరి మనోవ్యాధిని ? "పిల్లల్నిగన్నతల్లులే భూమిమీద వుండటానికి అర్హులు" అని లోకమంతా అన్నట్లు అనిపించింది కమలకు. పాపం కమల కృంగి కృశించిపోయింది.

ఒకనాడు రామంతో అన్నది-"ఏమండీ, ఇక నేను యెన్నాళ్ళో బ్రతకను. మీరు యింకో కమలను చేసుకొని కొడుకులను, కూతుండ్రను సంపాదించుకోండి" అని. కళ్ళ నీరు తుడుచుకుంటూ 'ఏమిటికమలా! ఈ పిచ్చిమాటలు: నాకు నీవులేకపోయినతరువాత కూతుళ్ళు, కొడుకులు దేనికి. కమలా! నీతోనే నాకు, నీవుంటే నా కదేచాలు. నీకు తిరిగి ఆరోగ్యం చేకూరితే నా కదే పదివేలు. ధైర్యంతెచ్చుకో కమలా. నే నన్నమాటలు మరచిపోవు" అని ఓదార్చాడు కమలను.

కమల స్థితి మరీ నీరసించింది. ఒకరోజున "అమ్మా, ధర్మంపెట్టరూ" అంటూ అరవై యేండ్లు పయిబడినబక్కచిక్కిన ముసలమ్మ గుమ్మంలోకి వచ్చింది. అంత నీరసస్థితిలోగూడ

కమల ముసలమ్మను గుర్తుపట్టింది 'అదేమిటండీ పిన్నిగారూ! ఇలా కివేం రోజులు' అంటూ పలకరించింది.

"ఎవరమ్మామీరు" అంటూ దగ్గరగా వచ్చింది ముసలమ్మ.

"నేనండీ కమలను గుర్తుచిక్కలా" అంటూ లేచి న్నది మంచం మీదనే కమల.

"ఆ నీవా కమలా! అయ్యోతల్లీ! ఎందుకమ్మా ఇలా అయిపోయినావు. నాతల్లీ! ఏమని చెప్పను తల్లీ! నా బ్రతుకు ఇలా తెల్లారుతుందని కలలో కూడా అనుకోలేదు తల్లీ. నలుగురు కొడుకులు నలుగురు కోడళ్ళు ఉండికూడా ముష్టి ఎత్తుకుని బ్రతకవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. తల్లీ- ఏదో కనిపెంచే వరకే సంతానం. ఏం సంతానం తల్లీ. ఉన్నదంతా వాళ్ళచదువులకనీ వాళ్ళపెండ్లిళ్ళకనీ ఖర్చుచేసి చచ్చారు ఆయన. తీరావీళ్ళు పెద్దవాళ్ళయ్యాక తల్లిముండలను చూస్తేనా? కోడళ్ళ మాటలు విని ఒక్కడూ పిడికెడు అన్నము పెడితే ఒట్టుతల్లీ నాకుపెడితేనే అయిపోతుందన్నట్లు. ఇంటినుంచి వెళ్ళగొట్టారమ్మా. ఒక్క వెధవ. కన్నకడుపు మీద కనికరం చూపించాడా. పెద్దవాడికి నెలకు రెండు వందలు వస్తవి ఏం ప్రయోజనం అంతా అమ్మగారి దయ. ఆమె తల్లీ- ఆమె తమ్ముడు తినవచ్చును గాని నేనుండడానికి వీల్లేదు ఆఇంట్లో. రెండోవాడు పెళ్ళానికి నూరేసి రూపాయులు పెట్టి చీరెలు కొంటాడు గాని నాకొక పాతగుడ్డ తీసి ఇవ్వటానికి శక్తి లేదట. ఇక మూడవ వాడు మిలిటరీలో చేరి ఏమూలకు పోయేడో ఎవరికీ తెలియదు. అసలు వున్నాడో చచ్చాడో

తెలియదు. నాలుగవవాడన్నా ఇంత పెడతాడనుకున్నా. "చాలుచాల్లే, పెద్దవాళ్ళందరు ఏమయినారు. అక్కడకేపో. నాకుమటుకు నీవు ఏమిపెట్టావు. ఏదోకష్టపడి చదువుకున్నం దుకు ఈ ఉద్యోగం దొరికింది ఈ సంపాదన నాకే చాలటంలేదు"అన్నాడు వాడు. పెళ్ళాము పౌడరు డబ్బాలకు, సినిమాలకు అయినదాంట్లో సగంవారే స్తే నాజీవితం వెళ్ళిపో తుంది తల్లీ. కానైతే ఏంచేయను. ఒక్కడికీ కనికరం లేదు. కన్నవాళ్ళకే యిలావుంటే ఇక పరాయి అమ్మలు గన్న అ ల్లుండ్ల కేముంటుంది చెప్పు. ఏదో యెంతయినా కన్నప్రేమ కదూ.వారిబ్రతుకులు వారుబ్రతకనీ, అంతే చాలు. మధ్య నేనెందుకు వాళ్ళని వేధించడం అని, ఏదో కాలు,చేయి ఆడి నన్నాళ్ళు నాపొట్టని నేనే పోషించుకుందామని ఈపాత్రింట్లో బ్రతుకుతున్నా నమ్మా.ఏదోశక్తివున్నన్నాళ్ళు యిలాగే తిరు గుతాను. దొరికినవేళ తింటాను. లేని వేళ కృష్ణా రామా అంటూ పడుకుంటాను. ఇలాఅయింది తల్లీనా బ్రతుకు" అని వెళ్ళబోసుకుంది శాంతమ్మగారు.

ఈ మాటలు వింటుంటే కమలకు చెప్పరాని ఆవేదన ఒడలు పట్టరాని సంతోషం వచ్చినవి. "పిన్నిగారూ! పాపం యెటువంటి సంసారం ఏస్థితికి వచ్చిందండీ! చిన్నప్పుడు నేనెన్ని సార్లు మీయింట్లో పాలు,పెరుగులతో అన్నంతినలేదు చెప్పం డి. యిప్పటికీ జ్ఞాపకం వుంది నాకు.వంట్లోకులాసాలేదు.మీరు ఈయింట్లోనే వుండిపోతే నేనెంతోసంతోషిస్తాను" అనిశాంత మ్మగారనెంతో బ్రతిమాలుకుంది. ఒక పదిరోజులు శాంతమ్మ గారు వండి పెట్టారు. కమల మళ్ళీ మనిషిఅయింది. రామం

వెయ్యి దేవుళ్ళకు నమస్కారంచేశాడు. కమలకు యెక్కడలేని వుత్సాహం వచ్చింది శాంతమ్మగారికి కొత్త మల్లు చాపులు తెప్పించింది "పిన్నిగారూ! మీరు నాకెంతోసాయంచేశారు. ఇకనుంచి మీరు పనిచేస్తే వల్లగాదు యీ యిల్లువదలి పోవటానికి గూడ వల్లగాదు. మాకేం డబ్బుకు లోటులేదు మీ వంటి వారికి పెడితే పోయేదిలేదు. ఈరోజు నుండి మీరే మా యింటికి పెద్ద" అని అంటుంటే శాంతమ్మగారు కమలను యెన్నోవిధాల దీవించింది.

"కమలా! నీవు మళ్ళీ జన్మ యెత్తినట్లుంది. కమలా! నాకెంతో సుఖంగా వుందియిప్పుడు. పోయిన ప్రాణం బ్రతికించింది మీ పిన్నిగారు" అన్నాడు రామం.

"నిజంగానండి. పిన్నిగారిని చూస్తే నారోగం ఎగిరి పోయింది. ఎందుకండీ వెధవపిల్లలు! పిల్లలెవరో, తల్లులెవరో. లేరో, లేరో అని ఏడ్వడం తప్పితే ఏముంది చెప్పండి- అంతా మన ఖర్మ తప్ప. ఇంకేమీలేదు. పాపం శాంతమ్మగారికి ఎంత మంది ఉన్నా ఏమిచేశారో చూడండి. ఏదో వృద్ధాప్యంలో మను కొంటాంగాని తీరా వారివల్ల కలిగే సుఖానికన్నా దుఃఖమే ఎక్కువ కనపడ్డది. ఏనాడో జరగబోయేదానికని యిప్పటి నుంచీ ఏడ్వడం ఎంతతప్పో ఇప్పటికన్నా తెలిసి వచ్చిందాండీ! ఇన్నాళ్ళు పిల్లలులేరే అని అఘోరించటం ఎంతో తప్పయింది అసలు మనబంధువులంతా మనకు పిల్లలులేరని కాకండీ విచారించటం. వీళ్ళకు పిల్లలులేరే, వీరుహాయిగాఉంటు న్నారే, వీళ్లకు కష్టాలు లేవే అని లోలోపల అసూయ పడుతూ

పైకి మాత్రం మనకు ఏదో కొరతవున్నట్టు చూపించి మనలను వేడిపించటం తప్ప ..., అంతేనంటారా! " అంది కమల.

"అంతే కమలా, నిజంగా అంతే ఈ అఘోరించేవాళ్ళే రేపొక వేళ మనకే గనక పిల్లలు పుడితే ఇంకా అఘోరిస్తారనుకో.

"నిజంగానే ! " అన్నది కమల

"ముమ్మాటికీ నిజంగా" అన్నాడు రామం.



చోరహృదయం

రచన : భట్ట ఆంజనేయశర్మ.

ఆరోహణ, అవరోహణక్రమాల్లో సాగే నా ఆలోచనలతో నిమిత్తం లేకుండా రైలు మద్రాసువేపు ఒకేవేగంతో పురోగమిస్తోంది. బౌద్ధయువతి నా సహాధ్యాయిని అయిన అఖిలను వివాహం చేసుకొనడంలో మానవుని ఆలోచనలు వెళ్ళగలదూరంవరకు వెళ్ళి తిరుగులేని నిర్ణయానికి వచ్చాను. తెలుగువారయిన అఖిల పూర్వీకులు వందల సంవత్సరాల నాడు వ్యాపారరీత్యా జపానువెళ్ళి స్థిరపడిపోయారు వారి జీవితంలో అక్కడ బౌద్ధమతము స్థానము కల్పించుకుంది. అఖిల తండ్రి జ్ఞానమిత్రమాత్రము స్వదేశాభిమానముతో మద్రాసు వచ్చి న్యాయమూర్తిగా స్థిరపడిపోయారు. మా తల్లిగారు ఏకైకసంతానమైన నన్నుపిడిచి యేడాదితిరగకముందే శాశ్వతంగా కన్ను మూశారు మా నాన్నగారు మళ్ళీ వివాహం చేసుకోకుండా స్వల్పవేతనం లభించే ప్రాథమికవుపాధ్యాయుడి వుద్యోగం నిర్వహిస్తూనే, నన్ను స్వప్రయోజకుణ్ణిచేసి నా పురోభివృద్ధికి శక్తివంచనలేకుండా పాటుబడి యెంతో త్యాగం ప్రదర్శించారు. అందుకు తండ్రిగానేగాక వారిమీద నాకు వ్యక్తిగతమైన గౌరవం యెక్కువయింది. వారికి నేను ఆజన్మాంతం సేవచేసినా ఆ త్యాగఋణం తీరదనిపిస్తుంది.

గుంటూరులో నాన్నగారిదగ్గరేవుంటూ పట్టభద్రుడనయ్యాను. ఎం. ఏ. చదువుకు మద్రాసు వెళ్ళవలసివచ్చింది.

బాల్యంలోనే తల్లిని పోగొట్టుకొని, ఆర్థిక బాధలుపడి చిన్నతనం నుండి నాలో చెరగని శోకముద్ర చిత్రితమైంది అందుకే నేను మితభాషి నయ్యానేమో! ఈ పుట్టుక, జీవనము, మృత్యువు ఒక మాయానాటక మనే భావంతోపాటు నేను జీవించటం కాని, నాద్వారా జీవులు ఉద్భవిల్లి శోకపూరితమయిన ఈ కుటిల లోకంలో మనడం కాని వ్యర్థమనేచింతన నాలో పునాదులు కల్పించుకొంది.

రాజు-పేద అనే ఆర్థిక అంతస్థు, గొప్పపుట్టుక-తక్కువ పుట్టుక అనే వైవిధ్యము, తర్కానికిఅందని మతవిశ్వాసాలు, తిండికోసం, రాజ్యంకోసం జరిగే జీవహింసాకాండ- అధికార మదాంధులయిన ఆడంబరులకే చరిత్రలో స్థానంసమకూరటం ఇవన్నీ నాలో కల్లోలాన్ని, జుగుప్సని కలిగించినవి. సృష్టికర్త యీ ఘోరాన్ని యెందుకు అరికట్టడు! అన్యాయాన్ని ఉపేక్షిస్తూ లోకాధిపతి అనే బిరుదు వహించడానికి ఆయన అర్హుడేనా? తాత్సారంచేసే ఆ పరంధాముడు తన పదవీ విరమణచేయడం సబబనిపిస్తుండేది. 'అఖిల' నా భావాలతో పరిపూర్ణంగా ఏకీభవించింది. ఈ భావసమైక్యత బలవత్తర మయిన బాంధవ్యంగా నేను ఎం. ఏ చదువుతున్న రెండు సంవత్సరాలలోనూ రూపొందింది. ఒకచోట నివసించేందుకు వీలు౧ం శాశ్వత సాన్నిహిత్యంకోసం మాత్రమే మేము వివాహంచేసుకోడానికి నిర్ణయించుకున్నాము. మా ఆధ్యాత్మిక సాధనకు వివాహము ఆటంకం కారాదని తీర్మానించుకున్నాం.

ఈ వేసవి శెలవులలో నాన్నగారికి నా నిర్ణయం తెలిపాను. బౌద్ధయువతిని చేసుకోవడంగాని, వివాహమైనా సన్న్యా

సిగా జీవించటంగాని వారికి యిష్టంలేదు- పైగా ఆయన మిత్రుడు తాసిల్దారు ఆదినారాయణగారికుమార్తె సుమిత్రను చేసుకోమ్మని నిర్బంధించ సాగారు. ఆస్తి కలిసివస్తుందని, ఉన్న మూడువేల అప్పు తీర్చవచ్చునని ఆయన అంచనా.

అప్పు నేను వుద్యోగం చేస్తూ తీర్చగలనని చెప్పినా వారు వినిపించుకోలేదు. ఉపాధ్యాయవృత్తిని విసర్జించి నాతో మద్రాసులో వుంటూ విశ్రాంతితీసుకోమనే సూచనను సైతం తిరస్కరించారు. ఆఖరకు నేను పంపే డబ్బును కూడ తాక నన్నారు. కోపంతో తనకు మొఖంచూపవద్దని ఆదేశించారు. మనశ్శాంతి లేక నేను ఆచరింపవలసిన ధర్మానికి అంతరాత్మ నిర్ణయానికి జరిగిన పోరాటంలో అంతరాత్మకు జయం కలిగింది. ఈ విధమైన ఘర్షణలతో యింటినుండి బయట పడ్డాను. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు ... రైలు కిటికీ నుండి ఎండ మీద పడుతోంది. ఎవరో లేపితే లేచాను. పెట్టె, బెడ్డింగు కోసం పైకి చూస్తే అగుపించలేదు. పెట్టె అంతా గాలించాను. నేను గాఢనిద్రలో వుండగా ఏ మహాశయుడో నాకున్న కొద్ది భౌతిక సంపత్తి నుండి గూడా విముక్తి కలిగించాడు. నాకు కలిగిన విరక్తిలో చోరవిషయం పోలీస్‌కం ప్లెయింట్ చేద్దామని కూడా తోచిందికాదు.

ఒకందుకు మాత్రం విచారం కలిగింది. ఆ పెట్టెలో అఖిలకు పుట్టినరోజు బహుమానంగా యివ్వదలచిన వుంగరం దాచాను. రిక్తహస్తాలతో ఆమెను చూడటానికి మనస్కరించలేదు. కారణం చెప్పలేను గాని మెరుపులాగా మరో ఆలోచన వచ్చింది. మద్రాసులో ఏ కాలేజీలోనన్నా లెక్చరర్

ఉద్యోగం సంపాదించి మళ్ళీ కొత్త వుంగరం చేయించుకుంది కాని ఆ మెను చూడ కూడదనిశించింది. ఆవిధంగా ఆమెకు ఆశ్చర్యసంభ్రమాలు కలిగించాలని వింతకోరిక బలపడసాగింది. స్టేషనుమాష్టరుగారికి నా కథంతా చెప్పాను. టిక్కెట్టుకేని నన్ను శిక్షించ కుండా జాలి కలిగి వదిలేశారు.

స్టేషనునుండి బయటపడి జనరల్‌హాస్పిటల్ వేపు వెడుతున్నాను. ఆప్యాయంగా యెవరో "శాస్త్రి" అని పిలిచారు. వెనక్కి తిరిగి చూశాను. నా బాల్యమిత్రుడు హరి. హరి వేషభాషలలో అధునాతనంగావున్నాడు ఆగర్భశ్రీమంతుడికి మల్లే అగుపించే అతడు ఘరానాదొంగఅని ఎవరూ సంశయించలేరు...! నా వైపు దీనంగా చూశాడు యెందుకో. ...

ఈ హరి ఉదంతం చాలావుంది. తరువాత వివరిస్తాను. ధార్మికవర్తనానికి సంఘజీవనానికి చీడపురుగులయిన దొంగలంటే యెవరికయినా వెగటే. అందులో కొద్ది గంటలకిత్రం దొంగచేత నా సొమ్ము పోగొట్టుకున్న మీందట హరిని చూస్తే అసహ్యము కలిగింది. కా. అఖిల మాటలు జ్ఞాపకంవచ్చాయి.

"అసహ్యించుకోవటం సహజలక్షణం కాజాలదు. పరివర్తన కలిగించటం మానవుని విధి" నా మిత్రుడ్ని ఆప్యాయంగాపలకరించాను. మనస్ఫూర్తిగా అతడిని స్వీకరించడం నాకు ముఖ్య కర్తవ్యం అనిపించింది.

శాశ్వతంగా పోగొట్టుకున్న వస్తువు తిరిగి దొరికితే పొందిన ఆనందంలాంటి అనిర్వచనీయ భావంపొందాడుహరి. తండ్రిగారికి, నాకుగల భేదాభిప్రాయం దగ్గరనుంచి రైలులో

నా సాక్ష్యం బహుమానం దాకా చెప్పాను. నావరుసలో నన్ను తన యింటికి తీసుకు వెళ్ళాడు నా బాల్యమిత్రుడు.

* * *

ప్రయాణ బడలిక తీర్చుకుంటూ ఆ రోజంతా విశ్రాంతిగా గడిపాను యెంతవారించినా వినకుండా మర్నాడు టైలర్ దగ్గరకు నన్ను తీసికెళ్ళి దుస్తుల కొలత యిప్పించాడు. ఆదుస్తులు స్వీకరించడానికి పరివర్తన మార్చుకుండే షరతుమీద అంగీకరించాను. "దొంగతనాలూ ధనాన్ని ఇతరులు దొంగిలించినప్పుడు గాని ఆ బాధ అతడికి తెలిసిరాదు" అని నేనంటుంటే చిత్రంగా చూశాడు నావైపు హరి.

హరి నాతో స్కూలుఫైనలుదాకా గుంటూరులో చదివాడు. పరీక్షతప్పి నాఅన్నవారు లేక మద్రాసు చేరాడు. దుష్టసాంగత్యాలవల్ల, ఉద్యోగంలో చేరలేక దొంగల ముఠాతో కలిసి తిరిగాడు. నాలుగైదుసార్లు పట్టుబడి కారాగృహానికి వెళ్ళినా పరివర్తనకు బదులు ప్రతీకారం అతనిలో వృద్ధికాసాగింది. నేను మద్రాసులో ఎమ్. ఏ. చదివేటప్పుడు యెదురుగా అగుపించేవాడు. ఎంతో అనురాగంలో నన్ను పలకరించడానికి వచ్చినా ముభావంతో అతడ్ని ఎన్నో సార్లు తిరస్కరిస్తూ వచ్చాను. ఒకసారి కాలేజీకి వెడుతున్న అఖిలను దొంగల ముఠాకి సంబంధించినవారు అవమానపరచబోతే నిర్భయంగా వారి నెదుర్కొని చక్కని గుణపాఠం బోధించిందికూడా!... అప్పటినుండీ వారామెజోలికి రాలేదు. పైగా అఖిలను చూస్తే వారికి భయంతోకూడిన గౌరవముకూడా!

మూడురోజులు గడిచిపోయాయి. నాతోపాటు ప్రతి సాయంత్రం హరినికూడా అడయారులోని బౌద్ధారామం తీసుకెళ్ళి ప్రార్థన చేయించేవాడిని. పట్టుబట్టి హరిచేత సిగరెట్లు మానిపించాను. వాడిలోని నీచత్వాన్ని విశ్లేషిస్తూ వచ్చాను. మంత్రముగ్ధుడిలాగ నేను చెప్పిందంతా చేస్తూ వచ్చాడు హరి. ఈ మార్పు అతడి సహచరులలో అలజడికి కారణమైంది. మాతో పోట్లాడటానికి సిద్ధమయ్యారు. వారితో హరి తెగతెంపులు చేసుకుని బయటపడ్డాడు. చీట్లపేకలతోను, మద్యపాన సేవనంతోను, వ్యభిచారిణుల రాకపోకలతోను, క్షోభిస్తున్న ఆ గృహాన్ని విసర్జించి మేము దూరంగా వేరే గదిలోకి మారాము. హరివద్దనున్న రెండువందలు అయిపోక ముందే మేము ఉద్యోగాలుచూసుకోవాలని సంకల్పం గాని కాళ్ళకు బలపాలు కట్టుకు తిరిగినా ఉద్యోగాలు ఎక్కడా లభించలేదు.

ఆరోజు సాయంత్రం హరి విషన్నవదనంతో గదికి వచ్చాడు. "చూశావా శౌరి! దొంగ మారినా సహృదయంతో లోకం వాడిని స్వీకరించదు.... ఉద్యోగం కోసం నేను ప్రయత్నిస్తున్న ప్రతిచోటా నా గత ప్రవర్తనని శంకిస్తూ మాట్లాడేవారే. దానికి అంతగా బాధపడను లోకం తీరే అంత... కాని నామీద కక్ష కట్టిన దొంగలముఠా వారి ప్రతీకారం యిలా నెరవేరుతుందనుకోలేదు" అన్నాడు హరి కుంగిపోతూ... నేను ఎన్నోవిధాల అతడిని ఓదార్చాను. "ఆ ముఠావాళ్ళు నా చరిత్ర వివరిస్తు సిర్మలకు ఆకాశరామన్న ఉత్తరం వ్రాశారు. మామూలుగా ఆమెను ఆఫీసు

నుండి తిరిగివస్తుండగా కలిశాను. ఈ వృత్తాంతం నా ముఖంమీద కొట్టి వంచకుడనని నిందిస్తు చెప్పేది వినిపించుకోకుండా దురుసుగా వెళ్ళిపోయింది. ఈనెలలో వివాహం చేసుకుందా మనుకున్న నిర్ణయం పటాపంచలయింది" అన్నాడు నిట్టూరుస్తు హరి ఆ నిట్టూర్పులో ఒక జీవితనైరాశ్యం తొల్లుబికింది.

"నీ చరిత్ర నిర్మలకు మొదటే స్పష్టంగా చెబితే యీ విఫలత్వం ప్రదయించేదికాదు. నిన్నామె స్వీకరించదని భయపడి, మర్యాదస్తుడిగా నటించి ఆమెను నమ్మించి సత్యం బయటపడగా విఫలమనోరథుడవయినావు. ఇప్పటికైనా నీ పరివర్తనలోని నిజాయితీతో ఆమెను పొందగలవు. కానికొంత వ్యవధి అనివార్య మనిపిస్తోంది..." అన్నాను అతడ్ని లేవదిస్తూ. నిర్మల ఒక పోస్టుమాస్టరుగారి కుమార్తె. ఇంటరు ప్యాసయింది. ప్రస్తుతం తండ్రిగారి ఆఫీసులోనే గుమాస్తాగా పనిచేస్తోందట. తనను నిర్మల బాగా అర్థంచేసుకున్నదని, త్వరలోనే వివాహంచేసుకుంటామని నాకు హరి యిదివరకే చెప్పాడు.

"ఈ ఒక్కరోజు నన్ను క్షమించు...నా మనశ్శాంతి కోసం కాసేపు యీలోకాన్ని మరచిపోవాలి... నువ్వూ నాతో రావాలి...దొంగతనానికిమాత్రం కాదు..."అంటూ నేను వారిస్తున్నా వినక హరి తనతో లాక్కుపోయాడు. ఊరంతా పిచ్చిగా తిరిగాము. లోకాన్ని అంధకారం అలుముకుంటే దానితో బాటు మా మనస్సులుకూడా బరువెక్కాయి

రాత్రి 8 గంటల సమయం. హరి హైకోర్టుఎదురుగావుండే గల్లీలోవున్న హోటలులోకి లాక్కుపోయాడు. అక్కడ బ్రెడ్ బిస్కట్లదగ్గరనుండి వివిధ తినుబండారాలు, రకరకాల పానీయాలు గాజుబీరువాల్లో అందంగా అమర్చారు. కొంత సేపు పిచ్చాపాటి మాట్లాడుతూ ఫలహారంచేశాము. సర్వరు రెండు గ్లాసుల్లో పానీయాలు బల్లమీదుంచి వెళ్ళిపోయాడు. హరి తాగుతూ సందేహిస్తున్న నన్నుచూచి అది మామూలు డ్రింకే, తాగమని బలవంతం చేశాడు. తాగినతర్వాత తెలిసీ తెలియని మైకం ఆవహించింది... నా ఉద్యోగప్రయత్నాల లోని వైఫల్యాన్ని తాత్కాలికంగా మరచాననే కొద్ది ఊరట లాటిది కలిగింది. స్పష్టంగా తప్పని తెలిసినా కొన్నిపనులు చేస్తుంటాము... అలాటిదే నాకు యిది. హరి గ్లాసుమీద గ్లాసు పుచ్చుకుంటూనే వున్నాడు. నాకు మైకంలాగా వచ్చి కుర్చీమీద తల ఆనించి కళ్ళు మూసుకున్నాను.

ఎంతసేపు అలావున్నానో తెలియదు. ఏదో ఘర్షణ లాంటిది విని కళ్ళుతెరిచాను. ఎవరో హరి జేబులో పర్సుకాజేశారట. హరి బిల్లుతాలూకుడబ్బు తర్వాత. యిస్తానన్నా హోటలుయజమాని పరుషంగా మాట్లాడుతున్నాడు. టెలిఫోను తీసి పోలీసులను రమ్మంటున్నాడు. నాకు మైకం పూర్తిగావదిలింది. "నావిషాదాన్ని మరచిపోవటానికి యిక్కడికితీసుకువచ్చి, నిన్ను ఆపదలో యిరికించాను. నేను పోలీసులకు పరిచయమయిన పాత నేరస్థుడనే ......నాకు జైలుకెళ్ళటం అలవాటే. నాతోపాటు నిన్ను అరెస్టుచేయించటం నా కిష్టంలేదు... అవమానంతోబాటు నిర్మలలాగా

అఖిలకూడా నిన్ను త్యజించవచ్చు. యెవరూ చూడకుండా పారిపో. తర్వాత చూచుకుందాం!"

"నాకోసం ఆలోచించకు నీ క్షేమంకోరి చెబుతున్నాను" అని హరి మెల్లగా నా చెవిలో గొణిగాడు. మద్యపాన, చౌర్య దుష్ఫలితాలు అతడి కళ్ళలో విలయ నృత్యం చేస్తున్నవి. హరి వద్దనున్న రెండు వందలు మినహా గదికెళ్ళి తెద్దామన్నా యిద్దరివద్దా ఏమీ లేవు. మొదట ఈనేరంలో నామిత్రుడితో బాటు పాలు పంచుకుంటూ గౌరవప్రదంగా అరెస్టుకావడానికి నిశ్చయించుకున్నాను. కాని వంద గజాల దూరంలో సర్కిల్ ఇన్‌స్పెక్టరుని చూచేసరికి మతిపోయింది. అరెస్టు అవుతానని కాదు, ఆయన సాక్షాత్తు అఖిల అన్నగారే... మరో విషయం గుర్తువచ్చింది. అఖిలతండ్రి మద్రాసులో న్యాయమూర్తి పదవి నిర్వహిస్తున్నారు. నన్ను యిన్నాళ్ళూ ఎంతో గౌరవిస్తున్న, కాబోయే మామగారి చేత దోషిగా విచారింపబడి శిక్షింపబడటం గొప్ప అవమానంగా భావించాను. దొంగల్ని ఈసడిస్తూ అఖిలవద్ద మాన్యుడుగా పరిగణింపబడుతున్న నేను, ఈనాడు ఆమె అన్నగారి చేత దోషిగా బంధించబడటం దుర్భర మనిపించింది. అంతే. మెరుపులాటి నిర్ణయంతో చీకట్లోకి బాణంలాగా దూసుకు పోయాను. విశ్వవిద్యాలయ భవనాలదాక రెండు మైళ్ళు పరుగెత్తి వెనక్కి చూశాను-దూరంగా పోలీసులు వెంబడిస్తున్నారు. ఎటూతోచక అయిరన్ బ్రిడ్జి మీదనుంచి పారుతున్న నదిలోకి దూకి పొదల దెసగా ఈదుకుంటూ పోసాగాను. ...

* * *

తడిసిన బట్టలు పిండుకుని ఆ రేపి ఒపొదల్లో రాత్రింతా జాగారం చేశాను. తెల తెలవారుతుండగా బట్టలు తొడుక్కొని నగరంలో ప్రవేశించాను. మాగదికి వెళితే నిఘావేసి పోలీసులు బంధిస్తారని తెలిసి వెళ్ళలేదు. దూరంనుంచి చూస్తే వేసినతాళం వేసినట్లున్నది. ఏక్షణంలోనన్నా పోలీసులు వచ్చి తాళం పగలగొట్టి తనిఖీ చేయవచ్చు. అఖిల దృష్టిలో న్యూనత పొందుతాననే జంకుతో సామాన్యుడనైన నేను తెగించితప్పించుకోగలిగాను. సాహసుడు, యుక్తిపరుడైన వారికి అరెస్టుకాకుండా తప్పించుకోవడం మంచినీళ్ళప్రాయం అనక తప్పదు. నేను అతడి ప్రక్కన లేకుండా ఉంటే పారిపోయి వుండేవాడే!... కాని నాకు తప్పించుకోవడానికి వీలు కల్పించి నేరమంతా తానే భరించటానికి నిశ్చయించుకొని గొప్ప త్యాగభావంతో అరెస్టుకు సిద్ధమయ్యాడు ద్రోహుడిగా హీనుడిగా పరిగణింపబడే ఆ జీవిలోసైతం ఈ గొప్పత్యాగప్రదర్శనం నన్ను చకితుణ్ణి చేసింది. అంతరాంతంలో పదిలంగా దాచుకున్న కన్నీళ్ళు ఆ మహాభావానికి తర్పణ సూచకంగా స్రవించసాగాయి.

రెండురోజులు తెగిన గాలిపటంలాగా నాగమనానికి అర్థంలేదు పంపునీళ్ళు తాగుతూ అగమ్యంగా తిరిగాను. ఆలోచించుకోవడానికికూడా శక్తి సన్నగిల్లింది: లీలగా జ్ఞాపకం: అది చీకటిపడే సమయం. అదో పెద్దతోట. మధ్యగా పర్ణశాల మెల్లగా గేటు తెరచుకొని ఒక చెట్టునీడలో కూర్చుండిపోయాను. మానసికవ్యథతో, శారీరక బలహీనతతో నాకు స్మృతి తప్పిపోతున్నట్లుంది.

సూర్యుడి లేతకిరణాలు సానుభూతితో నన్ను స్పృశిస్తున్నాయ్... ఎవరో మృదువుగా నా తల నిమురుతున్నారు. కళ్ళు తెరిచాను. నా తల ప్రక్కగా చిరునవ్వుతో భిక్కు పవిత్రానందులు... చటుక్కున లేచి వారికి నమస్కరించాను. నా చేత స్నానంచేయించి కొత్త బట్టకట్టించారు భిక్కు ... ఫలహారం ముగిసేదాకా మాట్లాడనీయ లేదు.

భిక్కు పవిత్రానందులు నేను చదువుకున్న ప్రెసిడెన్సీ కళాశాలలో వేదాంతోపన్యాసకులు. ఆయన సింహళ దేశస్థుడు. చిన్నతనంలో సన్యసించారు. అడయారులోని బౌద్ధారామానికి గౌరవ ప్రధానాచార్యులు. ఆయన ప్రబోధానికి లోనయ్యే నేను మొదటిసారిగా ఆరామాన్ని దర్శించాను. నా ఆత్మజ్యోతి అక్కడే ప్రప్రథమంగా రగులుకొంది.

"జ్ఞాపకం లేదా శౌరీ!... నీకేదన్నా కష్టంవస్తే నా దగ్గరకురమ్మని"... అన్నారు భిక్కు కరుణాపూరిత కంఠంతో.

"నేను ఉద్యోగంకోసం చేసే ప్రయత్నాలు సఫలం కాలేదు. మిమ్మల్ని కలుసుకుని ఉద్యోగం సంపాదించుకొందామనుకుంటుండగానే ఒక చిక్కులో పడ్డాను" అంటూ గతగాథంతా సవిస్తరంగా చెప్పాను.

బౌద్ధారామానికి వెళ్ళి కొన్ని బౌద్ధవివాహాలకి అధ్యక్షత వహించవలసివుంది. రాత్రికిగాని తిరిగిరానేమో! ఇదుగో వంద రూపాయలు, వెంటనే ఆహోటలు యజమానికి మీ బిల్లు తాలూకు 50రూ. ఇచ్చివేయి. మిగతా 50 రూ. ఖర్చులకువుంచుకో... మీవివాహానికి ఈరోజే ఒక వుంగరం కొని వుంచుతాను. ఇదిచాలా సుదినం సుమా!... అంటూ

నవ్వుతూ నన్ను కారులో కూర్చొపెట్టుకుని హోటలువద్ద ఆపారు.

హోటలు యజమానితో నామిత్రుడు హరిహర్స హోటలు లోనో, బయటో పోగొట్టుకున్నాడని, అందుకే బిల్లు చెల్లించలేక పోయాడని గతచరిత్ర అపనిందకారణంగా అపార్థం చేసుకోబట్టి అరెస్టుకాబడ్డాడని చెప్పాను. వెంటనే బిల్లు తాలూకు యాభై రూపాయలు చెల్లించాను. భిక్షు పవిత్రానందుల్ని పరిచయంచేశాను. హోటలుయజమాని జరిగినదానికి నొచ్చుకుని, "ఈ రోజే కేసువిచారణకు వస్తుందనీ, తను వెళ్ళి కోర్టులో జరిగినదంతా మనవి చేసుకుని కేసు వుపసంహరించుకోకపోతే హరికి శిక్ష పడగలదని" చెప్పి హడావుడిగా వెళ్ళిపోయాడు.

భిక్షు పవిత్రానందులు నన్ను ఫలహారం చేయుమని అనురాగంతో నాపక్కన కూర్చున్నారు. సగం ఫలహారం పూర్తి చేశానోలేదో దూరంగా బూట్ల చప్పుడు వినిపించింది. ఎవరోకాదు! ... అఖిల అన్న పోలీస్ ఇన్స్పెక్టరు ఆత్మానంద్! ... ప్రొసిక్యూషను సాక్షిగా హోటలు యజమానిని ఈరోజు కేసు విచారణ కొరకు తీసుకు వెళ్ళడానికి వచ్చినట్లున్నాడు. ఒకరి నొకరు పరీక్షగా చూసుకున్నాం! ... ఇనస్పెక్టర్ నన్ను గుర్తించాడు...దోషిగా అరెస్టవక తప్పదు. ఇప్పుడు అరెస్టు అవడంలో నాకేం చిన్నతనమనిపించలేదు. అప్పుడు ఒక చిన్న దౌర్బల్యం నన్ను ఆవేశించడంచేత అరెస్టు తప్పించుకుని పారిపోయాను. నిజంగా అది పిరికితనమనిపించింది. భరించగలిగేవాడు వున్నాడుకదా అని బాల్యమిత్రుడు హరి

మీద నా బరువు తోసి నిజాయితీ పరుడుగా ప్రకటింపబడా లనే సంకుచిత భావం అప్పుడు నన్ను పీడించి వుండాలి... కాని మళ్ళీ బెరుకు!... గురువులు భిక్కు పవిత్రానందుల ముందు అరెస్టు అనే అవమానం జరగటమా అని. ... కాని అన్నిటికీ సిద్ధమయ్యేవున్నాను. ఏం చింతాలేదు. "నేను ఎక్క డికీ తప్పించుకు పోను... ఒక్క ఐదు నిముషాల తర్వాత నన్ను అరెస్టుచేయండి ... ఆమాత్రం కనికరంచాలు" అన్నట్లు ప్రాధేయపూర్వకంగా చూశాను. అది అర్థం చేసుకుని ఆమోదించి నట్లుగా ఇనస్పెక్టరు మాదగ్గరకు వచ్చి భిక్కు పవిత్రానందులకు గౌరవ సూచకంగా శిరః కంపనంచేసి ప్రక్క టేబిల్ వద్ద కూర్చుని కాఫీ తెప్పించుకుని తాగ సాగారు.

నా ఫలహారం పూర్తికాగానే భిక్కుపవిత్రానందులు రాత్రి స్వగృహంలో తనను కలుసుకొమ్మని చెబుతూ వెళ్ళి పోయారు."

"ఆరోజు నేను పారిపోవడం మంచిపనిగాదు... దానికి విచారిస్తున్నాను... బిల్లు ఎగకొట్టే వుద్దేశం మా యిద్దరిలో ఎవరికీ లేదు. ఇంతకిత్రమే హోటలు యజమానికి బిల్లు తాలూకు యాభై రూపాయలు చెల్లించాను. కోర్టు నిర్ణయం తేలేదాకా నేను మీ అధీనంలో చట్టరీత్యా వుండక తప్పదు. నన్ను అరెస్టుచేసి కోర్టువారి ముందర హాజరుపరచండి."... అంటూ చేతులు చాస్తూ ముందర కొచ్చాను.

"ఆనాటి విషమ పరిస్థితులదృష్ట్యా సూక్ష్మంగా పరిశీలిస్తే మీ యిద్దరూ నిర్దోషులే... దాఖలైన కేసు విస్మయా

తేలేదాకా మిమ్మల్ని నా అధీనంలో వుంచక తప్పదు అదినా విధి"... అంటూ ముందరకు దారి తీశాడు ఆత్మానంద్...

"నా చేతులకు బేడీలు తగిలించండి పారిపోతే మీకు యిబ్బందికాదా!..."అన్నాను ఆయన్ని అనుసరిస్తూ...

"మీతో యింతకు ముందు మాట్లాడకి పోయినా మీ రెవరో నాకు తెలుసు... నా సోదరి అఖిల శాశ్వతంగా మిమ్మల్ని అరెస్టు చేస్తుంది అగుపించే సంకెళ్ళకన్నా అగుపించని సంకెళ్ళు బలవత్తరమైనవి. దుర్భేద్యమైనవి" అంటూ హృదయ పూర్వకంగా నవ్వారు ఇనస్పెక్టరు.

కారులో అడుగుపెట్టానో లేదో వెనకసీటులో ప్రక్కనే 'అఖిల'! భిడియంతో కూడిన అభిమానంతో తలవంచుకున్నాను.ఆమె నన్నుసంపూర్ణంగా స్వీకరిస్తున్నట్లు ఒకచూపు చూసింది. మాట్లాడుదామని పెదిమలు కదిలించింది. కాని దుఃఖము, ఆనందము పెనవేసుకున్న వెల్లువ ఆవరించగా నిర్వీణ్ణురాలయింది.ఆమె అశ్రువులు రెండు నా చేతిలో పడి ఏ భాషలోనో పరామర్శించాయ్... ఎంతైనా చివరకి నేను అఖిలను పోగొట్టుకోనలేను. భిక్షు పవిత్రానందుల వరప్రసాద లబ్ధిని. నిరాశ నన్నావరించలేదు...

నిందితుల వుద్దేశంలో ద్రోహచింతన లేక పోవడంతోను, బిల్లు చెల్లించబడటంచేతను, కేసు ఉపసంహరించమని అభ్యర్థించడంతోను కేసుకొట్టివేయ బడింది న్యాయమూర్తి మమ్మల్నిద్దరినీ నిర్దోషులుగా విడుదలచేశారు. అప్పటికి సాయంకాలం అయింది... తీర్పు ప్రకారం విడుదలైన హరి

నన్ను గాఢంగా కౌగలించుకున్నాడు. కారు పవిత్రానందుల యింటి ముఖంగా పయనిస్తోంది.

"అఖిల నీకు దక్కింది నా జీవితం సఫలమైంది..." అన్నాడు హరి. కాదు-వారిని నాకు దక్కించటంకోసం ఆదర్శ జీవివై నిలిచావు ఇటువంటి సోదరుణ్ణి పొందటం నా మహాద్భాగ్యం... అన్నది అఖిల.

"న్యాయస్థానంలో పనిచేసే మామగారిని, ఇంటివద్ద కలుసుకోవడం సబబు కాదనుకున్నారుగాబోలు అల్లుడుగారు" అంటూ న్యాయమూర్తి జ్ఞానమిత్రి సంతోషంతో నా వీపు తరిచారు.

"ఈ గొప్ప పరివర్తనతో తన గత కళంక జీవితాన్ని క్షాళితం చేసుకుని నాకు చిరస్మరణీయుడైన ఆప్తుడైనాడు హరి" అంటూ హరితో కరచాలనం చేశారు ఇన్‌స్పెక్టర్ ఆత్మానంద్ ...

* * *

భిక్షు పవిత్రానందులు ఆ రాత్రి మమ్మల్నందర్నీ ఆదరంతో స్వీకరించి విందు చేశారు నాలుగురోజుల దాకా తన ఆతిధ్యంతో సన్మానించారు. మద్రాసు యూనివర్సిటీ అధికారులతో సంప్రదించి అఖిలకు నాకు తను పనిచేస్తున్న కళాశాలలో అధ్యాపక ఉద్యోగాలు యిప్పించారు. హరిని బౌద్ధారామంలో లెక్కలు వ్రాసేందుకు గుమాస్తాగా నియమించారు. పదోరోజున అఖిలతో నా వివాహం అడయారులోని బౌద్ధారామంలో జరపటానికి నిర్ణయించారు. నేను గుంటూరు వెళ్ళి నాన్నగారిని వివాహానికి రమ్మని మరీమరీబ్రతిమాలాను.

కాని వారు పట్టు విడువలేదు. భిక్షు జీవితానికి ఏమీ అక్కరలేక పోయినా యితర్లకు యివ్వడమే ఆయన జీవిత విధానమైంది. మా సమస్యలన్నీవిని ఆ బాగోగుల భారం వహించడానికి నిశ్చయించుకున్నారు. నాన్నగారి నిరాకరణ అందరికీ కష్టం కలిగించింది. ముఖ్యంగా అఖిల విచార వదనంతో స్తబ్ధురాలైంది. నా వివాహం జరుగటానికి యింక మూడురోజుల వ్యవధి మాత్రమే వుంది. భిక్షు ఏవూరికో ప్రయాణమై వెళ్ళి తిరిగి వచ్చారు.

ఆ రోజు నా వివాహం. అందరం అడయారులోని బౌద్ధవిహారానికి వెళ్ళాము. అప్పటికి సాయంత్రం ఐదు అయింది. ముహూర్తానికి ఒకగంట వ్యవధివుంది. భిక్షు ఆరామంలో తన గదిలో ధ్యాననిష్ఠలో ఉన్నారు.

బౌద్ధారామం కొండవాలున నిర్మితమైన సుందర మందిరం. ఆ పర్వతశ్రేణి ఒక వలయాకారంగా ఏర్పడి ఆరామంనుండి క్రిందకు చూస్తే లోయ కనిపిస్తుంది. పర్వతశ్రేణి మీదుగా ఒక వాగు ప్రవహించి ఆరామంవద్ద మూడు చీలి కలై, జలపాత ధారలుగా నదిలో కలుస్తోంది. ప్రేమతో తల్లి వద్దకు పరుగెత్తే పిల్లలులాగా జల పాతాలు నదిలోకి దుముకు తున్నాయి. మంద్రధ్వనితో గేయా లాలపిస్తున్నాయి! ఆ జల పాతాలలో ప్రకృతి శాంతిగానం చేస్తుందేమో....

కొండమీద చీలికగా మారి సుతారంగా ప్రవ హిస్తున్న ఒక పాయను చూస్తుంటే తన సఖుని మెడమీంద జపరాలు సున్నితంగా చేయి వేసినట్లుంది. ఇటు ఒక జల పాతం వంక చూస్తుంటే కొండకన్య అభ్యంగన స్నానంచేసి

విలాసంగా జుట్టు ఆరవేసుకున్నట్లుంది. మానవుని హింసాకాండకు ప్రకృతి విలపిస్తుందా అన్నట్లు మరో పాయ ఉబికిఉబికి దొర్లిపోతోంది. ప్రతిఫలాపేక్ష లేకుండా ఈ సుందర ప్రకృతి మానవుడికి సేవచేస్తుంది. ప్రకృతికి ఈ సర్వసంగపరిత్యాగి అయిన భిక్కుకు యెంతో సామ్యం గోచరించింది. ప్రకృతితో బాటు వారిని వీక్షిస్తుంటే మాక్రిన్పడి పోతాము. ... ఒక మానవాతీత భావమేదో స్తంభీభూతుల్ని చేస్తుంది. సూర్యభగవానుడు పశ్చిమాద్రిని క్రుంకుతూ వియోగభారంతో యెర్రనయిన కంటితో చూస్తూ తన కన్నీటిని వాగు ద్వారా స్రవింపజేస్తున్నాడా అని అనిపించింది.

చీకటితెరలు మెల్లమెల్లగా వరద వెల్లువగా అన్నివైపుల ఆవరిస్తున్నాయి. ఆరామానికి దూరంగా సమాధులు, వాటిచుట్టు గలగలా పారే నీరు, ఎందుకో వాటిదగ్గరకు వెళ్ళి భక్తితో స్పృశించి మౌనంగా పలకరించాను. నీళ్ళ గలగలలో సమాధుల సందేశం ప్రతిధ్వనించింది.

నా తండ్రిగారు వివాహానికి రాలేదని నాకంటే అఖిలే ఎక్కువ బాధపడుతోంది. ... ఆమెకు అందించడానికి నా వద్ద యిప్పుడు అశ్రువులు మిగలలేదు.

గంట మోగింది. ... ముహూర్తానికి పిలుపువచ్చింది. గర్భగుడిలో అంగరం ప్రవేశించాము. ... ఆశ్చర్యం! మా నాన్నగారు, నిర్మల భిక్కు ప్రక్కన ప్రసన్నవదనాలతో నిలుచుని వున్నారు. మా మనోకాశాలనుండి మబ్బుతెరలు విడివడ్డాయి. ... ఇదంతా భిక్కు చలవే. ... వారే ఈ పున

స్నమాగానికి కారకులు...నా వివాహంతో బాటు నిర్మలతో హరి వివాహం కూడా జయప్రదంగా ముగిసింది. ... భిక్కుడు నూతన దంపతులము మోకరిల్లగా బౌద్ధోక్తంగా ఆశీర్వదించారు. తర్వాత బయట యిసుకతిన్నెల మీది ఉపవిష్ఠులయిన భిక్కు ఈవిధంగా చెప్పసాగారు-

"ఇంకా శౌరి వివాహం రెండురోజులుందనగా గుంటూరు వెళ్ళి వాళ్ళ నాన్నగారిని కలుసుకున్నాను. పవిత్రమయిన ఈ వివాహం మంగళదాయకమని, స్వయముగా వారు ఆశీస్సులు అందజేయవలసివుంటుందని విజ్ఞప్తి చేశాను. వెంటనే వారు నా కోరిక మన్నించి నాతో వచ్చారు. నిర్మలను ఆఫీసులో కలుసుకొని హరి నూతనవ్యక్తిగా మారిపోయాడని అతనిలో కలిగిన పరివర్తనను గురించి చెప్పాను. ఆమె కూడా ప్రమోదంతో హరితో వివాహ సూచనకు సమ్మతించి వచ్చింది. వీరిద్దరిని ఈ ఆరామంలోవుంచి మీకు పెళ్ళికానుకగా ఈ శుభసందర్భములో సమర్పిస్తున్నాను."

"మీ వుపకారం జన్మలో మరచిపోలేము. ఏవిధంగా మీ ఋణం తీర్చుకోవాలో తెలియటంలేదు. ..." అంది అఖిల.

"నా దగ్గర ఋణప్రసక్తి లేదు ...ప్రియమిత్రుని రాక కోసం వీక్షించే వ్యక్తిలాగా మృత్యుదేవతను సైతం ఏ క్షణములోనయినా ఆహ్వానించడానికి సిద్ధంగా వున్నాను. నా జీవిత నాటక చివరిరంగంలో తెర ఎప్పుడన్నా జారవచ్చు. సమాజీవికి సేవ చేయడంలో తప్పక విముక్తి లభిస్తుంది. అది ప్రతి జీవి విధి. యెవరికయినా పెంపొందించేందుకు హక్కు

వుందిగాని నశింపుచేయడానికి లేదు. ఈ ఆదర్శం విస్మరింప బడకుండును గాక ... అన్నాడు భిక్షు!

గృహస్థుఅయినా ప్రలోభానికి అతీతులుగా వున్న ప్పుడే జ్ఞానానందం లభిస్తుంది... అన్నారు జ్ఞానమిత్ర భిక్షుకు నమస్కరిస్తూ.

"జీవితమనే తామరాకుపై మెరిసే జలబిందువే జీవి... అప్పుడు భేదానికి తావులేదు. ..." చిరునవ్వు చిలకరిస్తూ, అన్న పవిత్రానందుల పాదాల్ని భక్తితో స్పృశిస్తూ హరి యిలా అన్నాడు-

"దొంగను సైతం గౌరవనీయుడయిన సంఘజీవిని చేశారు. మీలో నాకుదైవరూపం సాక్షాత్కరిస్తోంది. ..."

దేహంలోచెడిపోయినభాగాన్ని శస్త్రచికిత్స చేయించి తొలగించినట్లుగా సంఘంలోని పతితుల్ని తొలగించి తిరస్క రించలేము. మానసిక సాధనతో వారి అంతస్తును పెంచాలి. దొంగ యెవరు? దేవు డెవరు? ... అయినా దేవుడు కూడా యెంత దొంగో చూడండి ... అంత నను మించిన దొంగ యెవరా అని! సమ్మోహనమైన ప్రకృతినిసృష్టించి తద్వారా మన అంతర్యాలను, అనుక్షణం కొల్లగొట్టేనిరాకారుడు సర్వాం తర్యామి, పరమదయాళువు ఐన ఆ పరమాత్ముడు జగదేక మానసచోరుడు కదూ! అంటూ బౌద్ధమతాచార్యులు చమ త్కరించారు దూరంగా దివంతాలకవతల చూస్తూ ...

శాశ్వతాన్నీ, క్షణికాన్ని ఒక త్రాసులో తూచే ఆ మహాత్ముని పలుకులు చల్లగా స్పృశించగా, పరిపూర్ణ హృద

యంతో ఒక మహాభావాన్ని తలుస్తూ అందరం అచేతనంగా వుండిపోయాము.

"మీరూ చోరులే...నా హృదయాన్ని అపహరించారుగా!..." అంది అఖిల చెవులో మెల్లగా నా మౌనాన్ని భగ్నపరుస్తూ.

నన్ను అరెస్టు కాకుండా తప్పించి ఆ ప్రయత్నంలో తనే అరెస్టు కాబడి, తనలో అంతర్గతంగా వున్న త్యాగ గనిని దోచియిచ్చిన మిత్రుడు హరి ఎంతటి మాన్యుడైన చోరుడు!

తన సహజీవుల సౌభాగ్యం కోసం తన సంపత్తిని వెచ్చించే గురువు భిక్కు పవిత్రానందులు మా అందరి మనస్సుల్ని తస్కరించలేదూ!...

చోరత్వంలో త్యాగం, స్వార్థం రెండూ వున్నవి. దృక్పథాల్లోనే తేడా ... హాని, వర్జనీయం ... శ్రేయస్సు వాంఛనీయం...

చోర హృదయం!...

దొంగ — దొర — దేవుడు!!...

అవును-వీరందరూ చోరహృదయులే!!!...

హృదయాన్ని అర్పిస్తూ, పోగొట్టుకుంటున్న మానవాళిలో ఒకవిధంగా చోరులు కానిదెవరు?

"నాదీ చోరహృదయమే... అఖిలా!...అలా చెప్పకోడానికి ఇకసంచి చింతించను..."

దూరంగా మెరుపు మెరిసింది.

అఖిల గొప్ప తేజస్సుతో వెలిగి పోతున్నది.

వేమన పంచాయతీ గ్రంథాలయం,
తేలప్రోలు :: కృష్ణా జిల్లా.

౯౦

లోకం తీరు

రచన : చోడవరపు బాబూరావు.

రాఘవరావుగారు చనిపోయారనే వార్త తెల్లవారే సరికి నిమిషాలమీద వూరంతా వ్యాపించి అందరిని దిగ్భ్రాంతులిని చేసింది.

సాధారణంగా వుదయం ఆరుగంటలకే లేచి పాచిపనిచేసే మనిషి ఏడుగంటలకు యిల్లంతా తుడిచి రాఘవరావుగారు పడుకునేగదిదగ్గరకు వచ్చేసరికి యింకా పడుకునేవుండటం గమనించి మేడ దిగివెళ్ళి ఆయన భార్య రంగమ్మ గారితో ఆ సంగతే చెప్పింది. ఆవిడకు ఈ సంగతి వింతగా తోచి మేడమీద కెళ్ళి చూసింది. నిద్రపోతున్నట్లే పడుకున్నారు రాఘవరావుగారు. రెండు మూడు సార్లు పిలిచినా ఆయన పలకలేదు. దగ్గరకు వెళ్ళి చేతిమీద చెయ్యివేసి లేపబోయే సరికి చేతికి మంచుగడ్డల్లే తగిలింది. శ్వాస ఆడుతున్నట్లు లేదు. ఒక్కక్షణంలో సంగతంతా గమనించి "అమ్మో" అని బిగ్గరగా ఒక్క కేక వేసి పడిపోయింది.

యింటిల్లిపాదీ అక్కడ రడమూ, తలోవిధంగా ఆయన గుణగణాల్ని పొగడటమూ, యథావిధిగా జరిగిపోయింది అక్కడికొచ్చినవాళ్ళల్లో కొంతమంది సాయంపట్టి శవాన్ని కిందకి చేరవేశారు. అక్కడికి యిర్వైమైళ్ళ దూరంలో వున్న రంగమ్మగారి అన్నగారు శోభనాద్రిగారికి ఎవరో టెలి

గ్రాము పంపారు. ఉదయం తొమ్మిదయేసరికి ఆయన, భార్యా కూతురుతో సహా వచ్చారు.

రాఘవరావు కొడుకు గోపాలానికి మొదట్లో ఇదేమీ సరిగా అర్థం కాలా. అంటే గోపాలం పసిపిల్లవాడని కాదు. అప్పటికి గోపాలానికి పదేళ్ళుంటై గోపాలం చెల్లెలు కమలకు యేడేళ్ళు. రాఘవరావుగారి యిల్లు బంధువులతోను, రాఘవరావుగారి స్నేహితులతోను, యెప్పుడూ సందడిగాను, కోలాహలంగాను వుంటూ వుండేది. కాని ఆసందడికీ, యిప్పటిసందడికీ చాలా తేడావున్నట్లుగ్రహించాడు గోపాలం. అతనికి మొదట్లో అసలేంజరిగిందీ తెలియదు. తల్లి స్పృహలేకుండా పడిపోవటం చూసి గోపాలము, కమలా ఏడుపు మొదలుపెట్టారు. అక్కడ వున్నవాళ్లు వారిని అక్కడనుంచి తీసుకెళ్ళిపోయారు. తరువాత అసలు సంగతి కూడా తెలిసింది. తండ్రి మళ్ళీ తనకు కనపడడని తెలియగానే గోపాలం బిగ్గరగా ఏడ్చేశాడు.

ఇహ రంగమ్మగారి దుఃఖానికి అంతులేదు. ఆవిడకు ప్రపంచమంతా అంధకారబంధురంగా కనిపించింది. రాఘవరావు చనిపోయేటప్పటికి ఆవిడ వయస్సు రమారమి నలభై వుంటుంది. అంతవరకు దుఃఖమంటే ఏమిటోయెరుగని రంగమ్మగారికి యిది ఒక గొడ్డలిపెట్టులాగా తగిలింది. రాఘవరావుగారు బ్రతికినన్నాళ్ళు దర్జాగా బ్రతికిన మనిషి. అతని పెంపుడు తండ్రి దాదాపు రెండు లక్షల రూపాయల ఖరీదు చేసే ఆస్థి సంపాదించి కొడుకు చేతిలో పెట్టి పోయినాడు. ఆయన పోయిన కొద్ది కాలానికే పెంపుడు తల్లి కూడా పోయింది. రాఘవరావు గారు కొంతవరకు యింగ్లీషుచదువు

చదువుకున్నా వుద్యోగం చెయ్యవలసిన అవసరం లేదు కనుక యింటిపట్టునే వుండేవారు. ఆ విషయాన్ని గురించి యెవ్వరూ ఆలోచించనూ లేదు. తండ్రిపోయేనాటికి రాఘవరావుకు యిరవై సంవత్సరాలు వుంటై. అప్పటికే పెళ్ళయింది కాని గోపాలం యింకా పుట్టలేదు. రెండులక్షల రూపాయల ఆస్తికి ఉన్నట్లుండి ఒక్కసారిగా హక్కుదారయిన రాఘవరావుకు లోకంలో మామూలుగా జరుగుతున్నట్లే స్నేహితులు ఎక్కువమంది దొరకటానికి ఎక్కువకాలం పట్టలేదు. అంతకు ముందు మొహమయినా చూపించియెరుగని బంధువులుకూడ పాపం రాఘవరావు తండ్రి చనిపోగానే వచ్చి, రాఘవరావును పరామర్శించి, వాళ్ళకుతోడుగా కొన్నాళ్ళుండి వెడుతూండేవారు. అప్పట్నించి రాఘవరావు యిల్లు బంధుమిత్రాదులతో రోజూ కళకళ్ళాడుతూ వుండేది.

రాఘవరావు కొద్దికాలంలోనే ధర్మాత్ముడని పేరు పడ్డాడు. బంధువులు వచ్చినప్పుడల్లా వాళ్ళను తనస్థితికి తగినట్లుగా ఘనంగా సత్కరించి పంపుతూవుండేవాడు. బంధువుల్లోగాని, మిత్రుల్లోగాని ఎవరికి ఎటువంటి సహాయం కావలసి వచ్చినా వెంటనే ఆదుకునేవాడు. తనని గురించి, తన ఔదార్యాన్ని గురించీ చాలామంది ఘనంగా చెప్పుకోవటం తెలిసినప్పుడు తనకు చెప్పలేని ఆనందం కలిగేది. ఇతరులు తనను గురించి అనుకునే కొన్నిమాటలు – "రాఘవరావువల్ల ఆ వంశానికి కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించినై" "తండ్రిని మించిన ఔదార్యం గలవాడు" ఇంకా ఇటువంటివి ఎన్నో.

ఇటువంటి నమ్మకం కలిగిన రాఘవరావుగారు స... తుల్యుడై నాడు. ఆయనకు డబ్బు గడ్డిపరకతో సమానం. డబ్బు మన సౌఖ్యం కొరకు గాదు, పుణ్యసముపార్జనకు అది ఒక సాధనం ఈ సంగతి తెలుసుకోలేని పామరులు తమ సౌఖ్యము మాత్రమే చూసుకొని పుణ్యాలోకాలకి దూరమవుతున్నారు. తనను మాత్రం ఇటువంటి పామరుడుగా చెయ్యకుండా తనకు ఇటువంటి వివేచన గలిగించి, పుణ్యకార్యోన్ముఖుణ్ణిగా చేసినందుకు భగవంతుడికి రోజూ అతను చేసే నమస్కారాలకు అంతులేదు.

అయితే కాలమొక్క రీతి గడవబోదుగదా! అతని పొలాలు కౌలు తీసుకున్నవాళ్ళు సరిగా తనకు రావలసినది ఇవ్వకపోతేనేమి, తనదగ్గర అప్పులు తీసుకున్నవాళ్ళు ఎగగొట్టటంవల్లనైతేనేమి, తన దానధర్మాలవల్లనేమి రాఘవరావు తండ్రి గతించిన అయిదేళ్ళకే బ్యాంకుకు పంపించిన చెక్కులు తిరిగి రాసాగినై. అయితే దీనికి పొలంచేసేవాళ్ళనుగాని, అతని దగ్గర అప్పుతీసుకున్న వాళ్ళనుగాని అనుకుంటే వాళ్ళను అన్యాయం చేసినట్లే అవుతుంద.

...న్నికుటుంబాలు నిలవగలిగినై! అ
వాళ్ళను నిర్బంధించి అప్పులు వసూలు చెయ్యటమంత
పాపకార్యం చేస్తే తను ఇన్నాళ్ళూ ఆర్జించిన పుణ్యంకాస్తా
హారించిపోవటమేకదా?

రాఘవరావుగారి ఆస్తి హారించిపోవటానికి ఎక్కువ
కాలం పట్టలేదు. తరువాత, ఆయనభార్య వంటిమీద నగలు
హారించిపోవటానికి నిముషాలు పట్టలేదు. రంగమ్మగారు పాపం
చాలా పుణ్యకాలం మనిషి. ఆస్థిసంగతిని గురించి పట్టించుకో
వలసిన అవసరం ఆవిడకు ఎంతమాత్రం పట్టలేదు. భర్త
అడుగు జాడల్లో నడవటమే తనవిధి. తనభర్తకున్నంత కీర్తి
ఆవూళ్ళోనేకాదు, ఆచుట్టుపక్కల వూళ్ళలోకూడా ఎవరికీ
లేదు. అటువంటిభర్తను తు.చ. తప్పకుండా అనుసరించటం
లోనే తనకు పుణ్యం వున్నది.

అటువంటి రాఘవరావు చనిపోయినరోజే అతని బావ
మరిదికి చూచాయగా కొన్ని సంగతులు తెలిసినై - ఆవూళ్ళో

వాళ్ళద్వారా రాఘవరావుగారు చేసిన అప్పులు సామాన్య మైనవి కావు. అయితే ఆ అప్పులు తనకోసంగానీ, తన కుటుంబం కోసం గాని చేసినవి కాదు గదా! ఇతరులకి సహాయం చేయటం కోసమే. అయితే తనకు భగవంతుడు ఇంతటి ధార్మికబుద్ధి కలిగించినప్పుడు, తన ఆస్తిఅయిపోగానే తను చేతులు ముడుచుకు కూర్చోవటం ఏమంతసబబు! ధనవంతులైన ఇతరుల దగ్గరనుండి అప్పుతీసుకు నయినా తనసహాయాన్నర్థించిన వాళ్ళను ఆదుకోవటం తనవిధి!

రాఘవరావు చనిపోయేనాటికి వాళ్ళ ఆర్థికపరిస్థితి ఏ విధంగా వుందో తనచెల్లెలికి తెలియ చెప్పటానికి శోభనాద్రి ప్రియత్నించాడు. మైనారిటీఅయినా వెళ్ళని పిల్లల ముందు సంగతి కూడా ఆలోచించకుండా అతను ఖర్చు చేశాడని, అతను దానధర్మాలని విచ్చలవిడిగా చేసిన ఖర్చుకింద జమకట్టి కొంచెం నింద కూడా తనమాటల్లో కలపటం రంగమ్మకు నచ్చలేదు.

"పోనీలేరా అన్నయ్యా! ఎవరైనా వాళ్ళతో కట్టుకుపోయేదేముంది? కలకాలం నిలిచేది మన పుణ్యకార్యాలే కదా!" అన్నది. ఈమాటలన్నీ, తనభర్త బ్రతికున్నప్పుడు తనకు ఎన్నోసార్లు చెప్పారు.

అన్నగారు కొంచెం విసుక్కుని, ముందుసంగతి ఆలోచించాడు. అయినకాడికి కొంపా గోడూ అమ్మి అప్పు తీర్చటంకంటె గత్యంతరంలేదు. అప్పులకీ, ఆస్తికీ సరిపోయేట్లు వున్నది. కొద్దిరోజుల్లోనే ఇల్లూ, సామానూ, అంతా

అమ్మేసి, అప్పులన్నీ తీర్చి చెల్లెల్నీ పిల్లల్నీ వెంటబెట్టుకొని తమ యింటికి తీసుకు వచ్చేశాడు.

2

శోభనాద్రి పెద్ద ఆస్తిపరుడు కాకపోయినా, కొంచెం వున్నవాళ్ళలోనే జమ. ఆయనకొడుకు సుబ్బారావు గోపాలం కంటె ఏడాది పెద్దవాడు. అవూళ్ళోనే వున్న స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. కూతురు సరోజకి సరిగా గోపాలం చెల్లెలు వయస్సే. తరువాత పిల్లవాడికి మూడేళ్ళు. శోభనాద్రి భార్యకు, తనభర్త చేసినపని ఏమంత నచ్చలేదు. తనకూ పిల్లలున్నారు. చెల్లెలి సంసారమంతా తన నెత్తిన పెట్టుకుంటే తమసంసారం ఏంగాను? అయితే లోకానికి వెఱచి అప్పటికి ఏమీ అనలేక వూరుకుంది. ఇంట్లో వంట; మిగతాపనులన్నీ రంగమ్మగారే తనమీద వేసుకుంది. గోపాలం, శోభనాద్రి చిన్నకొడుకుని ఆడిస్తూ కాలంగడిపే వాడు. వీటన్నిటివల్లా శోభనాద్రి భార్యకు కొంతభారం తగ్గి, వాళ్ళను గురించి ఆందోళన పడటం కొంతకాలంవరకు వాయిదా వేసింది

రాఘవరావు కొడుకు సుబ్బారావు, కూతురు సరోజ బళ్ళోకి వెళ్ళి చదువుకోవటం చూస్తున్న రంగమ్మగారు సుబ్బారావు వయస్సున్న తన కొడుకు వూరికే ఆటపాటలతో కాలంగడపటం చూసి ఒక రోజు రంగమ్మగారు అన్నగారితో కొడుకు చదువు సంగతి ప్రస్తావించింది. రాఘవరావుగారు గోపాలాన్ని చదివించవలసిన అవసరాన్ని వెంటనే గుర్తించి

ఇంతవరకూ ఈ విషయాన్ని గురించి తను అంతగా పట్టించుకో నందుకు నొచ్చుకొని, ఈ సంగతి సమయంచూసి తనభార్య సుందరమ్మకు చెప్పాడు. ఆవిడ ఈ సంగతివిని వెంటనె ఎగిరి పడింది-

"వాడి కిప్పుడు చదువొక్కటే తక్కువయింది! ఇంట్లో కూచుని తినిపెట్టేదికాక ఇదికూడానా? సంతోషిం చాంగాని ఇహఊర్కోండి" అని తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పింది. రాఘువరావు తెల్లబోయాడు. గోపాలం చదువుని గురించి మొదట్లో తనకొడుకు చదువులాగానే మామూలు విషయంలాగా ఆలోచించాడుగాని, ఇది అంతచిన్న విషయం కాదనీ, దీనికి ప్రతి ఘటన తాను ఎదుర్కోవస్తుందనీ అతను వూహించలేదు. కాని గోపాలాన్ని చదివించకుండా వూరికే అతనిచేత చాకిరీచేయించుకోవటం అతనికి కష్టంగా తోచింది. ఇంతాచేస్తే ఇప్పుడతను చదవబోయేది పెద్దచదువేమీకాదు. ఐదోతరగతి! ఈ చదువుకయ్యే ఖర్చు అతనికేమీ కష్టమైనపని కాదు. తను చెయ్యగలిగివుంటే ఆమాత్రం సహాయం చెయ్య లేక పోవటం చూచి లోకం సంగతి అట్లావుంచి తనకే బాగు న్నేదు. సాధారణంగా భార్యతో వాదించవలసిన అవసరం అతనికి ఎప్పుడూ కలగలేదు. కాని ఈ విషయంలో అతను వూరుకోలేకపోయినాడు.

"చిన్నవాడు- చదువుకోవలసిన ఈడు. కోటివాడు మన సుబ్బారావు చదువుకుంటుంటే వాణ్ని ఇంట్లో అట్టేపెట్టి పనిచేయించుకోవటం ఏంబాగుంటుంది? అయినా ఇదేమంత పెద్దచదువు? వాడికి కనీసం కొంచెం అక్షరంముక్కయినా ఒచ్చే

ప్రియత్నం చెయ్యకపోతే లోకం ఏమనుకుంటుంది!" అని చెప్పి చూశాడు. సుందరమ్మ సనేమీ వినలేదు. దీన్నిగురించి వాళ్ళిద్దరికీ కొంచెం ఘర్షణ జరిగింది. చివరికి గోపాలం చదువు సంగతి ఎటూ తేలకుండానే వాదించుకుని వూరుకున్నారు.

ఇదంతా గమనించిన రంగమ్మ, తన అన్నగారు ఒంటరిగా వున్న అవకాశంచూసి అన్నదగ్గరకు వెళ్ళింది.

"అన్నయ్యా! గోపాలం చదువును గురించి నువ్వు బాధపడటం నాకు యిష్టంలేదు. ఇల్లూ పొలాలూ అవన్నీ అమ్మి అప్పుతీర్చగా మిగిలిందేమన్నా వుంటే" అని వూరుకుంది. అప్పులన్నీ పోగా కొంచెం మొత్తం మిగిలిందని అన్నగారు తనతో ఒకసారి అన్న విషయం ఆమెకు జ్ఞాపకం వుంది. కాని ఆ విషయం స్పష్టంగా అడగలేకపోయింది. అయితే శోభనాద్రికి అంతయూ వెంటనే జ్ఞాపకంవచ్చింది.

"అవునమ్మా! కాని ఇటువంటి చిన్నదానికి నీదగ్గరున్న పైకం వాడటమా" అని చూస్తున్నాను.

"పరవాలేదన్నయ్యా! నేనుమాత్రం ఏంచేసుకుంటాను! ఏదో విధంగా వాడికికాస్త నాలుగుముక్కలొచ్చేట్టు చేస్తే బాగుంటుంది. తరువాత వాడి పొట్టకోసం ఏదో తిప్పలు పడతాడు."

శోభనాద్రి కొంచెం ఆలోచించి, "సరేనమ్మా! వెంటనే బళ్ళోచేర్పించే ప్రియత్నం చేస్తాను. దీన్నిగురించి నువ్వేమీ దిగులుపెట్టుకోకు" అని చెల్లెల్ని వూరడించాడు. అన్నమాట ప్రకారం గోపాలాన్ని కొద్దిరోజుల్లోనే బళ్లో

చేర్పించాడు. దానికయ్యేఖర్చు, రంగమ్మే పెట్టుకుంటూ వుండటంవల్ల సుందరమ్మకూడా తరువాత కలుగజేసుకోలేదు.

ఆ తరువాత రోజులు ప్రశాంతంగానే గడవసాగినై. అట్లా జరుగుతుండగానే ఇంకో ఘర్షణకు దారితీసిన సంఘటన మళ్ళీ ఒకటి జరిగింది.

భోజనాలై, తీరుబడిగా కూచుని సుందరమ్మ ఇరుగు పొరుగమ్మలతో ఒకరోజు పిచ్చాపాటీ మాట్లాడుతుండగా, గోపాలం సంగతి వాళ్ళసంభాషణలోకి వచ్చింది.

"శోభనాద్రిగారు తనకొడుకుతోపాటు మేనల్లుణ్ణి కూడా చదివిస్తున్నారంటే [illegible]గా మెచ్చుకో[illegible] [illegible]సం" అని ఒకావిడ మాటలసందర్భంలో అన్నది. దా[illegible] [illegible]మాధానంగా సుందరమ్మ, 'ఆ, దాందేముంది లేవమ్మా!' ఏదో మాపిల్లవాళ్ళతోపాటే వాడూను" అని వూరుకుంది. ఇంకొకావిడ అందుకుని "చదివించి అల్లుణ్ణి చేసుకుంటారుగావును! నిజమే మరి, మేనల్లుడే గదా! చక్కగా ఈడుగాకూడా వుంటుంది" అన్నది. ఈ మాటతో సుందరమ్మకు కారంరాచినట్లయింది.

బాగానే వుందమ్మా, నువ్వు చెప్పేది! చదువంటే చెప్పిస్తున్నాము గాని పెళ్ళిళ్ళు మన చేతుల్లో వున్నయ్యా ఏమిటి!" అన్నది. కొంచందూరంగాకూర్చునివింటున్న రంగమ్మగారికి సుందరమ్మ మాటలు హృదయంలో గుచ్చుకున్నయ్! ఆవిడ చాలాకాలంనుంచి గోపాలానికి, సరోజకు పెళ్ళి ఖాయమనే వుద్దేశ్యంతోనే వుంది. ఆవిడకు ఈ సంబంధం చాలా సహజమైంది గానే కనపడింది కాని తన వదినగారికి ఆ అభి

ప్రాయం లేదనే సంగతి మొట్టమొదటగా గ్రహించగానే ఆవిడకు చెప్పలేని ఆవేదన కలిగింది. కాని ఏం మాట్లాడటానికీ అది సమయం కాదని అప్పటికూరుకుంది. అదీగాక తన అన్నగారికి ఈ పెళ్ళి తప్పకుండా యిష్టమవుతుందనే ఆమె నమ్మకం. అటువంటప్పుడు అన్నగారు తన వదినగారికి ఏదో విధంగా నచ్చచెప్పలేక పోడు. అదీగాక గోపాలం పెళ్ళికిప్పుడు తొందర పడవలసిన అవసరము లేదు కనుక ఆ విషయాన్ని గురించి రంగమ్మగారు కూడా అట్టే మధన పడలేదు.

కాని సుందరమ్మను ఈ విషయం పురుగులాగా తొలిచి బాధించసాగింది. తిండికీ, గుడ్డకు లేని గోపాలానికి తన కూతుర్నిచ్చి పెళ్ళిచేసే విషయం ఆలోచించడానికే ఆవిడకు అసహ్యంగా వుంది. తనభర్త అభిప్రాయం ఏమిటో ఆయన అభిప్రాయం తెలుసుకుని ఆయనకు వాళ్ళ పెళ్ళంటే యిష్టంలేదని తెలుసుకునేదాకా నిశ్చింతగావుండలేకపోయింది. ఒకరోజున తనే భర్తను ఆ విషయమై కదలించింది. అప్పుడు రంగమ్మగారు అక్కడలేరు.

"అమ్మాయి పెళ్ళిసంగతెప్పుడన్నా ఆలోచించారా?" అని అడిగింది భర్తను.

"ఏ అమ్మాయి?"

ఏ అమ్మాయి సంగతో అయితే మనం ఆలోచించటం ఎందుకు? మన అమ్మాయి సంగతే."

"సరోజ సంగతా? నీకేం మతి పోలేదు గద! దాని పెళ్ళికిప్పుడేం తొందరా! యింకా పన్నెండేళ్ళయినా నిండ

లేదుగదా?" అని ఒక్క నిముషం ఆలోచించి, "అయినా దీనికి మనం అంతగా ఆలోచించవలసిందికూడా లేదు గోపాలంచదువు పూర్తయిం తర్వాత ఎప్పుడో ఒకప్పుడు మంచిముహూర్తం చూసి ముడిపెట్టెయ్యటమే"

"ఇప్పుడు మతిపోయిం దెవరికో తెలుస్తూనేవుంది. అందుకే నేనడిగింది. అయితే మీకు ఈ ఉద్దేశమే వుందన్నమాట. ఈబుద్ధి మీకు కలిగిందేనా, లేకపోతే చెల్లెలు అప్పుడే నూరిపోసిందా? నేననుకుంటూనే వున్నా-ఇందులో నా పెత్తనమేమీ వుండదని" అని ఏకబిగిన చదువుకు పోసాగింది.

నిజానికి ఈ ఆలోచన మొదట్లో రాఘవరావుకు అసలు కలగలేదు. తనచెల్లెలూ చెప్పలేదు. కాని ఎరిగున్నవాళ్ళు ఒకళ్ళిద్దరు మాటలసందర్భంలో ఈ ప్రసక్తితీసుకువచ్చి గోపాలాన్ని, తన అల్లుడుగానే చెప్పటం విన్నాడు. తనకూ అందులో అసందర్భమేమీ గోచరించలేదు. ఆ విషయం తనకు ఆమోదయోగ్యంగానే కనపడింది. అందుకనే అంతసహజంగా భార్యతో అన్నారు. దానికి భార్య సుముఖంగాలేదని తెలుసుకుని ఆలోచనలోపడ్డాడు. సుందరమ్మ చెప్పిన విషయాలు కూడా పూర్తిగా తీసివేయ తగ్గవికావని అతను గుర్తించాడు. ఆవిడ చెప్పిన విషయాల్లోకొన్ని ..."

"గోపాలాన్ని చేసుకుని సరోజ ఏంతింటుంది? ఇంతకంటె ఏ బిచ్చగాడికో యిచ్చి చెయ్యండి! మేనరికం అయితే అవచ్చు! అయితే మాత్రం తిండీ గుడ్డా లేని బికారికిచ్చి చెయ్యటం కూతురు గొంతు కొయ్యటంకాదా! చదువంటే చెప్పొస్తున్నారు, సరే. లోకంకోసమని కూతురు గొంతు

కోస్తారా?" ఈ విధంగా ఎన్నో చెప్పింది. మెదలకుండా విన్నారు రాఘవరావుగారు.

ఆయనకుకూడా ఈ విషయంగురించి పెద్దఘర్షణ పెట్టుకోవటం అనుచితంగా కనబడింది. సరోజ కింకా పెళ్ళివయస్సు రాలేదు. ఇంకా నాలుగ్గైదేళ్ళ వరకూ తొందరలేదు. తరువాత ఎట్లాగూ దాని యిష్టంకూడా తెలుసుకోకతప్పదు. అందుచేత ఈ విషయాన్ని గురించి ఇప్పుడే ఆలోచించ వలసిన అవసరంలేదనే నిర్ణయానికి వచ్చేశారు రాఘవరావుగారు.

3

గోపాలం చదువులో ఈ రాజువ్వలాగా పైకి రాసాగాడు. స్కూలుఫైనలు మంచి మార్కులతో ప్యాసైనాడు. దాంతో ఇంట్లో మళ్ళీ చిన్న గాలి దుమారం రేగింది. గోపాలం తనకు కాలేజీలో చేరి చదవాలని వున్నదని మేనమామతో అన్నాడు. అతను స్కూలుఫైనలు వరకూ చదవటానికి,ఎవరికీ ఏయిబ్బంధీ కలగలేదు.వాళ్ళఆస్తిలో మిగిలిన దాంతోనే స్కూలుఫైనలు గట్టెక్కాడు. అయితే దాంతో వాళ్ళ మిగిలిన కాస్త డబ్బూ కూడా ఖర్చయింది. ఇంకా చదవాలంటే ఎవరన్నా సహాయం చెయ్యందే జరగదు.

గోపాలం కాలేజీ చదువుకు ఖర్చుచెయ్యటానికి సుందరమ్మగారికి ఎంతమాత్రమూ ఇష్టంలేదు. ఆ సంగతే కుండబద్దలు కొట్టినట్టు భర్తతో చెప్పింది. రాఘవరావు కూడా కొంచెం ఆలోచించాడు. కాలేజీ చదువంటే మాటలు కాదు

నిజమే తన పెద్దకొడుకు సుబ్బారావుకూడా కాలేజీలోనే చదువు తున్నాడు. కూతురు సరోజ హైస్కూల్లో చదువు తున్నది. ఇప్పుడు వీళ్ళ చదువుకింద తను పెద్దమొత్తంలోనే ఖర్చు పెట్ట వలసి వస్తున్నది. దీంతోపాటు గోపాలం కాలేజీ చదువు కూడా కలిస్తే కొంచెం కష్టమే. తరువాత తన రెండో కొడుకు సంగతి కూడా ఆలోచించాలి ! గోపాలానికి తన తల్లి దగ్గరనుండి కూడా ఆశించినంత సహకారం లభించలేదు. ఆవిడ ఏంచేస్తుంది ! "నాయనా ! మనం ఇంతకంటె ఎక్కువకు నోచుకోలేదు. మీ మామయ్యను కూడా తలకు మించిన భారం మొయ్యమనటం అంత భావ్యంకాదు. ఏదనా గుమాస్తా ఉద్యోగంకోసం మామయ్యను ప్రయత్నించమంటాను. నువ్వు పెద్దఆశలు పెట్టుకోకు." అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

గోపాలానికి ఏంచెయ్యటానికీ తోచలేదు. తన తోటి వాళ్ళు, తనకంటె చాల తక్కువమార్కులు వచ్చినవాళ్ళు, కాలేజీల్లో చేరబోతున్నారు. తనకుమాత్రం ఆ అవకాశం లేకుండా పోతోంది. దీనికేం మార్గంలేదా అని ఆలోచనలో పడ్డ గోపాలానికి తలవని తలంపుగా రాఘవరావు కొడుకు సుబ్బారావే దారి చూపించాడు-

సుబ్బారావుకి గోపాలమంటే చిన్నతనంనుండీ సానుభూతి వున్నది. అయితే తను సాధారణంగా పెద్దవాళ్ళ సంఘర్షణలో జోక్యం కలిగించుకొనేవాడు కాదు. కాని మంచి మార్కులతో ప్యాసయిన గోపాలం చదువుకు ఆటంకం కలిగించటం సుబ్బారావుక్కూడా కొంచెం కష్టం కలిగించింది.

"పోనీ; ఏదన్నా స్కాలర్ షిప్‌కు అప్లైచెయ్యి గోపాలం బావా; అదృష్టముంటే రావచ్చు" అన్నాడు. గడ్డిపోచదొరికినా పట్టుకుని ఒడ్డుచేరే ప్రయత్నంలో ఉన్న గోపాలం వెంటనే అప్లయి చేశాడు. స్కాలర్ షిప్ రానూ వచ్చింది. గోపాలం ఆనందానికి అంతులేదు. సుబ్బారావుకు ఎన్నిసార్లో కృతజ్ఞత చెప్పుకున్నాడు సుబ్బారావు చదువుతున్న కాలేజీలోనే చేరాడు ఈ విషయం ఇంత తేలిగ్గా పరిష్కార మవుతుందని వూహించని రాఘవరావు కూడా చాలా సంతోషించాడు.

తరువాత నాలుగేళ్ళు చెప్పుకోతగ్గ సంఘటనలేవీ లేకుండానే జరిగిపోయినై. గోపాలం బి. ఏ. లో క్లాసులో ప్యాసయినాడు. సుబ్బారావు కూడా అంతకుమునుపే బి. ఏ. ప్యాసయినాడు. సరోజ ఆయేడే కాలేజీలో ప్రవేశించింది. సుబ్బారావు ఉద్యోగంకోసం తిరగటంలో నిమగ్నమైనాడు. గోపాలం చెల్లెలు కమల ఇంగ్లీషు చదువులో ప్రవేశించకుండా ఐదో క్లాసుతోనే చదువు చాలించింది. గోపాలానికి ముందు సంగతేమిటనే సమస్య ఎదురైంది.

"నువ్వు తప్పకుండా పై చదువులు చదవవలసినవాడివి. బాగాపైకొస్తావు" అని అతని లెక్చరర్లలోకూడా కొంతమంది గోపాలంతో అన్నారు కాని ఇంకా పైచదువులు చదవడమంటే మాటలా ? తన చెల్లెలు పెళ్ళి చేయించవలసిన బాధ్యత కూడా తనమీదే వున్నది. తను ఉద్యోగం చూచుకోక తప్పదు. ఈ సంగతే తల్లి కూడా తనతో అన్నది.

గోపాలం తండ్రి రాఘవరావుగారి స్నేహితుడో కా యన ఆదగ్గర్లోని ఒక పట్టణంలో ఒక కంపెనీ మేనేజరుగా వున్నట్లు గోపాలానికి తెలిసి ఆయన్ను తనకేదైనా వుద్యోగం ఇప్పించ వలసిందని ప్రాధేయ పడ్డాడు అదృష్టవశాత్తు ఆ కంపెనీలో వున్న ఒక ఖాళీలో గోపాలానికి ఒకచిన్న గుమాస్తా వుద్యోగం లభించింది. గోపాలం శ్రద్ధగా పనిచేసి అనతికాలం లోనే పై ఆఫీసర్ల మెప్పు సంపాదించగలిగాడు.

గోపాలంవుద్యోగంలో చేరినతరువాత ఇల్లు అద్దెకుతీసుకొని తల్లినీ, చెల్లెల్నీ మేనమామగారి దగ్గరనుండి తీసుకువచ్చాడు. గోపాలం తల్లి, కూతురు పెళ్ళిని గురించి గోపాలాన్ని తొందర చేయసాగింది. గోపాలానికి ఏంచేయటానికీతోచ లేదు. కొన్నా ళ్ళు తల్లిమాటలు విని అట్లాగే చూద్దాంలేఅంటూ వచ్చాడు. ఈవిధంగా మరో మూడేళ్ళుజరిగి పోయినయ్. గోపాలం చెల్లెలు ప్రైవేటుగా చదివి మెట్రిక్ పరీక్షకు కట్టి ప్యాసయింది. అప్పటి నుంచి తల్లి, కూతురుపెళ్ళి గురించి మరీ తొందరచేయ సాగింది.

గోపాలం వుద్యోగం చూసుకొని పట్టణంలో స్థిరపడిన తరువాత శోభనాద్రిగారు అప్పుడప్పుడు వచ్చి చెల్లెల్నిచూసి పోయేవాడు. ఒకసారి రంగమ్మ అన్నగార్ని గోపాలంపెళ్ళి విషయమై కదిపింది. కాని దాన్నిగురించి శోభనాద్రి ఏమంత వుత్సాహంగా మాట్లాడ లేదు. ఆవిషయాన్ని గురించి మాట్లా డకుండా, "కమలకి ఏమన్నా సంబంధాలు చూస్తున్నారా?" అని అడిగాడు.

"నేనేంచూడగలను నాయనా! ఆడదాన్ని. ఇహ గోపాలమంటావా, వాడికసలు నోట్లో నాలికే లేదు. పెద్దవాడివి నువ్వేపూనుకోవాలిరా అన్నయ్యా! అన్నది రంగమ్మగారు.

"ఈ రోజుల్లో ఎవరు పూనుకుని మాత్రం చేయగలిగే దేముంది రంగమ్మా! వేలు కుమ్మరించాలి ఆడపిల్ల పెళ్ళంటే! గోపాలం ఉద్యోగం చేస్తున్నాడు గదా! మరి పిల్ల పెళ్ళికని ఏమన్నా జాగ్రత్త చేశాడా!"

"ఆఁ! వాడి సంపాదన కుటుంబఖర్చులకే చాలీచాల కుండావుంటే ఇంకా జాగ్రత్త చెయ్యటానికేముంటుంది? ఇది కాస్త మీచేతిమీదగానే జరిగేటట్టు చూడాలన్నయ్యా! గంతకుతగ్గ బొంతనుచూసి ముడిపెట్టేద్దామనే వుంది. కాని నేనేం చెయ్యగలను?"

శోభనాద్రి అక్కడితో ఆవిషయంకూడా తుంచేసి ఏదో లోకాభిరామాయణం మాట్లాడి చక్కా బోయాడు. ఆతరువాత అక్కడివాళ్ళ రాకపోకలూ తక్కువైనై. శోభ నాద్రికూడా ఎప్పుడన్నా పనిమీద వచ్చినపుడు చూట్టాని కొచ్చి ముళ్ళమీద వున్నట్లుండి నిముషాలమీద వెళ్ళిపోయే వాడు. ఒక్కొక్కప్పుడు పట్నంవచ్చికూడా వాళ్ళయింటికి వెళ్ళకుండానే తిరిగి వెళ్ళిపోయేవాడు.

అయితే "గంతకుతగ్గబొంత" ని వెతికే శ్రమ ఎవ్వరికీ కలుగకుండా తన "బొంత" ని తనే వెతుక్కుంది కమల. దీనికి కారకుడుకూడా కొంతవరకు శోభనాద్రికొడుకు సుబ్బారావే.

సుబ్బారావు బి. యే ప్యాసయినతరువాత ఉద్యోగం కోసమయితే కొన్నాళ్ళు తిరిగాడుకాని అతనికి ఉద్యోగం చెయ్యాలనే అభిలాష అసలు ఎక్కువగా లేదు. అక్కడికీ తండ్రిప్రోద్బలంమీద ఒకటి రెండు ఉద్యోగాల్లో చేరినా, ఎందులోనూ ఒకటి రెండు నెలలకంటె యెక్కువకాలం వుండేవాడు కాదు. మొదటిసారి అతను ఒక కంపెనీలో గుమాస్తాగా చేరాడు. చేరిన కొద్దిరోజులయిన తర్వాత మేనేజరుకు యెదురుగానున్న ఒక కుర్చీలో కూచుని ఆ కంపెనీ అభివృద్ధికి చెయ్యవలసిన పనులేమిటో చెప్ప సాగాడు.

"నాకు కావలసింది లెక్కలు రాసే గుమాస్తా గాని లెక్చర్లు చెప్పే మనిషి కాదు" అన్నాడు మానేజరు. అక్కడితో ఆ వుద్యోగం సరి.

రెండోసారి ఒక పెద్ద బట్టలకొట్లో గుమాస్తాగా చేరాడు. ఆ ప్రొప్రయిటరుకు, అతనికి ఏదో మాటమీద మాట వచ్చి వుద్యోగంలో చేరిన నెలలోపలే దానికి వుద్వాసన చెప్పాడు. యింతలో ఆ వూళ్ళో నాటకాలు వెయ్యటానికి ఒక కంపెనీ వచ్చింది. ఆ నాటకం చూసిన రాత్రి అతను వెళ్ళి "నన్ను మీకంపెనీలో చేర్చుకోండి" అన్నాడు. తిండి, బట్ట మాత్రం యిచ్చే షరతు మీద వాళ్ళు ఒప్పుకున్నారు. దీనికి శోభనాద్రిగారు ససేమీ వప్పుకోలేదు. తల్లి యేడ్చి రాగాలు పెట్టింది- నాటకాల కంపెనీలో చేరితే మళ్ళీ తన మొహం చూడవద్దన్నాడు శోభనాద్రి. యివేమీ లెక్కచేయకుండా నాటకాల కంపెనీలో చేరాడు సుబ్బారావు మొదట్లో చిన్న

చిన్న పాత్రలు వేస్తూ ఆ కంపెనీ గుమాస్తాగాకూడా పని చేస్తూ వుండేవాడు. ఆకంపెనీవారు వకసారి గోపాలం వున్న వూళ్ళోనే నాటకం ఒకటి వేశారు. సుబ్బారావు, గోపాలం యింట్లో వాళ్ళందరిని బలవంతం చేసి నాటకానికి తీసికెళ్ళాడు. ఆ కంపెనీలోనే వున్న తన స్నేహితుడు చక్రపాణికి కమలని పరిచయం చెయ్యటం ఆ సమయంలోనే జరిగింది.

చక్రపాణి ఆ పట్టణంలోనే చాలా సంపన్న కుటుంబంలో పుట్టినవాడు. తండ్రి లేడు. చేతినిండా ఖర్చుపెట్ట గలిగే ఆస్థి వున్నందువలన అతను కొంతమంది స్నేహితుల్ని కలుపుకుని నాటకాల కంపెనీ స్థాపించాడు. అయితే ఈ కంపెనీ ద్వారా కళాసేవ చేద్దామని గాని లేక లక్షలు లాభాలార్జించుదామని గాని అతని వుద్దేశ్యం కాదు. కేవలం కాలం గడపటానికి యిదొక వ్యాపకంగా పెట్టుకున్నాడు.

ఆ తరువాత చక్రపాణి తనకు గోపాలం కుటుంబంతో కలిగిన పరిచయాన్ని పురస్కరించుకుని వాళ్ళింటికి తరచు వస్తుండేవాడు. ఒకరోజు కమలతో మాట్లాడుతూ మాటల సందర్భంలో "ఈసారి నాటకానికి ఒక హీరోయిన్ కావలసి వున్నది ఎవ్వరూ కనపడటం లేదు." అన్నాడు.

కమలకు వెంటనే ఒక ఆలోచన కలిగింది. కలిగిందే తడవుగా "నేను పనికొస్తాననితోస్తే నన్నే వేసుకోండి" అన్నది. చక్రపాణికి కొండంత సంతోషం కలిగింది.

కమలకు ఆడవాళ్ళ క్లబ్బుకు రోజూ వెళ్ళి వస్తూవుండటము పరిపాటే ఇప్పుడు క్లబ్బు మానేసి రిహార్సల్సుకు వెళ్ళ

టం ప్రారంభించింది. ఈ సంగతి కొన్నాళ్ళవరకు యింట్లో యెవ్వరికి తెలియనివ్వలేదు. కాని చూచాయగా ఒకళ్ళిద్దరి ద్వారా విన్న గోపాలం ఈ సంగతి ఒకరోజు రాత్రి కమల యింటికి వచ్చినప్పుడు అడిగాడు. ఇక దాచినా లాభంలేదనుకొని కమల "నిజమే" అన్నది.

తను విన్నది నిజమేనని గోపాలానికి మొదట్లో అసలు అనిపించలేదు. తెలుసుకుందామని కమలను అడిగాడు. అది నిజమేనని కమల వెంటనే ఒప్పుకోవటంతో గోపాలం వెంటనే యేమీ మాట్లాడలేక పోయాడు. ఆతరువాత తల్లికి కూడా తెలిసింది. రంగమ్మగారు పెద్ద రాద్ధాంతం చేసింది. గోపాలం కూడా రంగమ్మగారిని సమర్ధించాడు. కమల యిల్లుకదిలి ఎక్కడికీ కదలరాదని నిర్బంధించారు. కాని కమల ఎంత మాత్రం జంకలేదు. అయితే కమల పట్టుదల వెనుక నాటకాలలో వేషం వెయ్యాలనే వుబలాటం మాత్రమే వుందనుకొన్న గోపాలం పొరపాటుపడ్డాడు.

రెండురోజులు యింట్లోనే వుండిపోయింది కమల. మూడోరోజు ఎక్కడికో వెళ్ళడం ఎవ్వరూ గమనించలేదు. తిరిగివచ్చింతర్వాత ఎవరు ఎంత నిర్బంధించినా తను ఎక్కడికి వెళ్ళిందీ కమల చెప్పలేదు. ఆతరువాత కమల ఎక్కడికీ వెళ్ళటానికి వీల్లేకుండా కనిపెట్టిచూస్తూవుండేవారు. కాని చిత్రమేమిటంటే కమల మళ్ళీ యెక్కడికీ వెళ్ళేప్రయత్నంలో వున్నట్లే కనిపించలేదు. బయటికివెళ్ళే అవకాశాలు ఒకటి రెండు అవకాశాలు కలిగినా బయటకు వెళ్ళలేదు కమల

మనస్సు మారుతున్నదనుకుని గోపాలం, గోపాలంతల్లీ చాల సంతోషించారు.

షుమారు పదిరోజులయింతర్వాత ఒక స్నేహితురాలి దగ్గర కెళ్ళొస్తానంటూ బయిలుదేరింది కమల- ఒకరోజు ఉదయము షుమారు పదిగంటలకు. గోపాలం అభ్యంతరం పెట్ట లేదు. నాటకాల రిహార్సల్సు రాత్రివేళ జరుగుతైకనుక ఇందులో సందేహించాల్సిందేమీ లేదని మనస్సు సమాధానపరుచుకున్నాడు.

ఉదయంవెళ్ళిన కమల సాయంత్రింవరకు రాకపోయేసరికి గోపాలానికి మళ్ళీ సందేహంకలిగింది. చూసిచూసి చివరికి నాటకంకంపెనీ ఆఫీసుకెళ్ళి వాకబుచేశాడు. కమల అక్కడకు వెళ్ళలేదని తెలుసుకొని సంతోషంతోయింటికి చేరాడు. స్నేహితురాలి బలవంతంమీద సాయంత్రింవరకు అక్కడే వుండివుంటుందని తీర్మానించుకున్నారు.

తరువాత కొద్దిసేపట్లోనే కమల యింటికివచ్చింది. రాగానే "ఇంతసేపుగా ఎక్కడున్నావే" అని తల్లి అడిగింది.

"పొద్దున చెప్పే వెళ్ళానుగా! నాకు మీ నిఘా ఏమిటి?" అని సమాధానంచెప్పి విసురుగా లోపలికి వెళ్ళిపోయింది కమల. వెళ్ళినతరువాత మళ్ళీ ఒక గంటలో తిరిగి వచ్చి మళ్ళీబయటికి వెళ్ళబోతుంటే తల్లి మరల అడిగింది.

"నాటకాల కంపెనీకి" అని తాపీగా సమాధానం చెప్పింది కమల.

ఆ సమాధానంవిని రంగమ్మగారు కూతురుమీద విరుచుకుపడింది. సంసారులకి ఇటువంటివి పనికిరావన్నది. తరు

వాత పెళ్ళికావటం కష్టమని బోధించింది. గోపాలంకూడా నయానా భయానా బోధించి చివరికి "నువ్వు మా మాటలు ఖాతరుచెయ్యకుండాపోతే ఇహ ఇంట్లో అడుగుపెట్టకు. వంశ గౌరవం మంటగలిపింతర్వాత ఇంకా చెల్లెలేమిటి? అన్నేమిటి? నాకు చెల్లెలే లేదనుకుంటాను" అన్నాడు. "నిరభ్యంతర ముగా అనుకోవచ్చు. మీ వంశగౌరవం మీదగ్గరే వుంచు కోండి. నేనుమాత్రం పోతున్నాను, మళ్ళీ ఒస్తాననే భయం మీకెవ్వరికీ వద్దు" అన్నది కమల.

"ఎక్కడికి?" అని మళ్ళీ గద్దించాడు గోపాలం.

"నాభర్త దగ్గరికి. నేనూ, చక్రపాణి ఈరోజే రిజిష్ట్రా రాఫీసులో పెళ్ళిచేసుకున్నాం. శెలవు" అంటూ బయటికివెళ్ళి పోయింది కమల.

కమల సమాధానంవిన్న గోపాలానికి నెత్తిమీదనించి కొండంతబరువు దించినట్లయింది. కమల పెళ్ళిసమస్య యింత సులభంగా పరిష్కారమవుతుందని అతను కలలోకూడా అను కోలేదు. ఇందుకు కమలనీ, చక్రపాణినీ, మనసులోనే అభినం దించాడు. అయితే అతని ఆనందాన్ని రంగమ్మగారు ఎక్కువ కాలం దక్కనియ్యలేదు.

రంగమ్మగారు నెత్తీనోరూ బాదుకుని ఏడవడం మొద లెట్టింది. ఆవిడ ఎందుకేడుస్తున్నదో మొదట్లో గ్రహించని గోపాలం క్రిమేణా అందులో సారాంశం గ్రహించి వెంటనే తేలుకుట్టినట్లు గంతులెయ్యటం మొదలుపెట్టాడు. చక్రపాణిది గమకులంకాదు. ఈసంగతి గోపాలానికి మొదట్లో తట్టనేలేదు,

గోపాలం చెల్లెలిమీద చాలాచిరాకుపడ్డాడు. పెళ్ళి తనం తట తను చేసుకుంటేచేసుకున్నది. కాస్త ఇటువంటివి ఆలోచిం చక్కర్లా! ఈ విషయం కొంత బాధకలిగించినా మొత్తంమీద గోపాలానికి లోలోపల సంతోషంగానేవుంది.

ఈసంగతి తెలిసి గోపాలం మేనమామ గోపాలాన్నిరంగమ్మ గారినిదూషిస్తూ చాలాఘాటుగాఉత్తరంరాశాడు. ఒక్క కమల చేసిన పనివలన మొత్తంవంశానికి తీరని మచ్చ యేర్పడిందనీ, వాళ్ళను చేరదీసి విద్యాబుద్ధులు చెప్పించినందుకు యీవిధంగా తమకు కూడా తలవంపులు తెచ్చినవాళ్ళను తలవనేకూడదనీ దాని సారాంశం. గోపాలం జవాబు వ్రాయలేదు.

పాపం గోపాలంపని చాలా యిరుకునపడ్డట్లయింది. కన పడ్డ వాళ్ళందరికీ సమాధానంచెప్పటం కష్టమైపోయింది గోపా లానికి. అప్పుడప్పుడూ పట్నంలో పనివుండి వచ్చినప్పుడు పలకరించి పోతూవుండే బంధువులూ, చివరకు స్నేహితులు కూడా కనపించటం మానేశారు. తమను వెలివేసినట్లుగా చూడటం మొదలుపెట్టారు. కమల చేసినపనికి సంతోషిం చింది వాళ్ళ బంధువర్గంలో ఒక్క సుబ్బారావే. అతనిసంతో షానికికారణం తమ నాటకకంపెనీలో "హీరోయిన్" కొరత యిహ వుండదని !

అయితే చక్రపాణిని ఒకందుకు మెచ్చుకోవాలి. పెళ్ళయినతర్వాతకూడా చక్రపాణి భార్యస్వేచ్ఛకు ఏ విధం గానూ అడ్డుతగలలేదు ప్రతినాటకంలోనూ కమలతనపాత్రకు న్యాయంచేకూర్చి అద్భుతంగా నటిస్తూవుండేది.

కమలవేసిననాటకాలు చూసిన చాలామంది, కమల నటనను మెచ్చుకోవటం గోపాలం అప్పుడప్పుడూ వింటూ వుండేవాడు. ఒకటి, రెండుసార్లు తనంతటతను కలుగజేసుకుని "కమల మా చెల్లెలేనండీ!" అని తన్నుతాను పరిచయం చేసుకున్నాడు. ఆ సమయంలో వాళ్ళు తనవంకఆశ్చర్యంగా చూడటంచూసి గోపాలం లోపల గర్వపడేవాడు.

శోభనాద్రిగారికి, గోపాలానికి రాకపోకలు ఆగిపోయి చాలాకాలమైంది. కమల పెళ్ళిఅయింతర్వాత ఉత్తరప్రత్యుత్తరాలుకూడా ఆగిపోయినై.

చక్రపాణి కొంతమంది మిత్రుల ప్రోత్సాహంతో సినిమారంగంలోకి దిగాడు. అయితే డబ్బువిలువ తెలిసిన వాడుగనుక సినిమా తీయటంలోని వ్యాపార లక్షణాలు ముందు జాగ్రత్తగా అవగాహన చేసుకున్నాడు. నూటికి నూరుపాళ్ళు అతి జాగ్రత్తగా వ్యాపారదృష్టితో ఒక ఫిలిం తీశాడు.. మొదటిఫిలింతోనే సినిమారంగంలో నిలదొక్కుకున్నాడు. మొదటిఫిలింతోనే కమల మరికొంతమంది నిర్మాతల దృష్టిలోపడింది. కొద్దికాలంలోనే అగ్రశ్రేణి తారలలో చేరింది.

ఈరోజులలోనే గోపాలానికికూడా దశ తిరిగింది. తను పనిచేసే కంపునీలోనే ఒక ఆఫీసరుపదవి ఖాళీఅయితే అందులో గోపాలాన్ని వేశాడు. అతనిజీతం దాదాపు రెండింతలయింది. సంఘంలో గోపాలం పలుకుబడి పెరిగింది. ఇదివరకు అతడు కనపడితే తప్పించుకొనితిరిగే స్నేహితులు,ఇప్పుడు పలకరించి, కుశలప్రశ్నలువేయడం మొదలుపెట్టారు.

గోపాలం తనువుంటున్న చిన్నయింట్లోంచి మకాం మరో పెద్దయింట్లోకి మార్చాడు.

అతనితో మాట్లాడడానికి కంపెనీకి సంబంధించిన పెద్ద వుద్యోగస్తులు వస్తూ వుంటారు. ఇప్పుడు అతను అందరి దృష్టిలోనూ ఆదర్శవ్యక్తి. ఈమధ్య అతన్ని, చెల్లెలికి వర్ణాంతర వివాహం చేసినందుకు చాలామంది మెచ్చుకున్నారు. అయితే ఆ వివాహం జరిగి చాలాకాల మయిందన్న సంగతి ఎవరికీ పట్టినట్లే లేదు.

యిప్పుడు అనేక సభలకు గోపాలం కూడా ఆహ్వానింపబడుతున్నాడు. అనేకమంది పెద్దలతో పాటు తన పేరు, ఫోటోలు కూడా అడపాతడపా పత్రికలలో పడుతున్నయ్!

కష్టాలుగానీ, సుఖాలుగాని ఒకొక్కప్పుడు వుప్పెనలాగా వచ్చిపడుతుంటయ్. గోపాలం పనిచేసే కంపెనీవాళ్ళు మరో కొత్తచోట ఒక బ్రాంచి స్థాపించి ప్రస్తుతం గోపాలం పనిచేస్తున్న ఆఫీసు మానేజరుని ఆ బ్రాంచికి బదలాయించి ఆ ఆఫీసులోనే మంచి అనుభవం గడించుకున్న కారణంగా ఆ ఆఫీసులోనే గోపాలాన్ని మేనేజరుగా నియమించటంజరిగింది. దీనితో గోపాలం పలుకుబడి సమాజంలో ఎంతగా పెరిగిందో చెప్పనవసరం లేదు.

దీనికంతటికి కారణం తన హోదా, తన సంపాదన అని అతను గ్రహించక పోలేదు. అయితే ఒక్కవిషయం మాత్రం గోపాలానికి అర్థం కాలేదు. తన చెల్లెలు కమల మాత్రం మళ్ళీ తమ యింటి గడపత్రొక్కలేదు. అయితే యిప్పుడు కమల కూడా బాగా ధనార్జన పరురాలయిన మాట నిజమే.

కమల మళ్ళీతనను చూడకపోవటానికి వెళ్ళేటప్పుడు తను,తమ యింటి గడప త్రొక్కవద్దని అన్నమాట కారణం కావచ్చు నని గోపాలం అనుకోలేదు.

యిదిట్లావుండగా గోపాలం తన కళ్ళను తానే నమ్మ లేనటువంటి సంఘటన కొద్దిరోజులలోనే ఒకటి జరిగింది.

ఒకరోజు ఆఫీసుకు శెలవుదినం అవటంవలన యింట్లోనే కూర్చుని ఏవో కాగితాలు చూసుకుంటున్న గోపాలం,ఎవరో తనను పేరుపెట్టి పిలిచినట్లు వినపడగా వెళ్ళి చూసి నిర్ఘాంత పోయాడు.ఒక్కనిమిషంలో మళ్ళీ తేరుకుని "రా మామయ్యా! మనవూరినుంచేనా రావటం ?" అని లోపలికి ఆహ్వానించి, లోపలికివెళ్ళి తల్లితో చెప్పాడు. రంగమ్మగారు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ తొందరగా వచ్చి "ఎన్నాళ్ళకు చూశాను అన్నయ్యా! నిన్ను! " అని ఇహ మాట్లాడలేక కళ్లొత్తుకుంది.

"ఏమిటోలే రంగమ్మా!ఎప్పటికప్పుడు ఏవోపనులుండ టంవల్ల రాలేకపోయామేగాని, మీ మీద కష్టా, యేమిటి? ఊరుకో" అని చెల్లెల్ని ఓదార్చాడు.

గోపాలానికూ్కడా చాలాసంతోషం కలిగింది.భోజనా లయింతర్వాత, కాసేపు మాట్లాడుకున్నారు. మెల్లగా శోభ నాద్రి తనమనస్సులో విషయం బయటపెట్టాడు-

"అమ్మాయి సరోజకు ఈయేడే పెళ్ళి చెయ్యాలను కుంటున్నాం. మేనరికం వుండగా మారోసంబంధంచెయ్యటం ఇంట్లో ఎవ్వరికీ యిష్టంలేదు. అందుకనే ఎన్ని సంబంధాలు వచ్చినా తిరగ్గొట్టేస్తున్నాం.సరోజకూడా గోపాలంబావని తప్ప మరెవర్నీ చేసుకోనంటోంది" అని పూరుకున్నాడు.

ఒక్క నిముషం ఎవ్వరూ మాట్లాడలేదు శోభనాద్రి గారు మళ్ళీ ఏదో చెప్పబోతుండగా, గోపాలమే అందుకు న్నాడు.

"క్షమించు మామయ్యా! మీ వంశగౌరవానికి మేం తగం. ఇహ ఈ ప్రస్తావన తీసుకురాకండి" అన్నాడు. శోభనాద్రి నెమ్మదిగా చెల్లెలికి నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు.

"నా కేముందినాయనా! అడదాన్ని. వాడిష్టం" అని వూరుకుంది చెల్లెలుకూడా ఈ విధంగా ఉదాసీనంగా వుంటుం దని శోభనాద్రి వూహించలేదు. ఒకప్పుడు తనకూతుర్నివ్వావల సిందని ప్రాధేయపడిన చెల్లెలు ఇప్పుడు ఆ విషయం తనంత తానువచ్చి కదిలించినా ఉత్సాహంచూపలేదుసరిగదా తనకూ ఏమంత ఇష్టంలేనట్లు వ్యక్తంచేసింది.

కండువా దులుపుకొని "వస్తా" అని మాత్రం అని శోభనాద్రి వెళ్ళిపోయాడు. ఎక్కడకని గోపాలమూ అడగ లేదు, శోభనాద్రి చెప్ప లేదు.

గోపాలానికి వున్నట్లుండి మనస్సులో యేదో మెరుపు మెరిసి నట్లయింది. వెంటనే లేచి,

"అమ్మా!సామానుసద్దు.కమల దగ్గర కెళ్ళాలి"అన్నాడు. అర్థంగాక రంగమ్మగారు కొడుకువంక చూసింది.

చెల్లాయికి క్షమాపణలు చెప్పుకొని వాళ్ళందర్ని ఇక్కడకు తీసుకురావటానికి" అన్నాడు.

(15)

వరద

రచన : శ్రీమతి కోమలాదేవి

తీరికగా యేదో వీక్లీ తిరగేస్తున్న ప్రసాద్‌గారు జీప్ శబ్దంవిని ఏమంతగా చలించలేదు. ఈ నాగార్జునసాగర్‌కు వచ్చినప్పటినించి రోజూ ఓ పదిసార్లయినా జీప్‌లు ఆ యింటికి వస్తూనే వున్నాయి. తీరా గుమ్మంలో అడుగుల శబ్దం వినిపించాక మరి తలెత్తక తప్పిందికాదు. ఆ వచ్చిన వ్యక్తుల్ని చూచి సంభ్రమాశ్చర్యాలలో ఓ కేకవేశారు.

"ఇదిగో అబ్బాయొచ్చాడు."

వేణు చిరునవ్వునవ్వి లోపలికొచ్చి ఆ వచ్చిన మరో వ్యక్తిని పరిచయం చేశాడు తండ్రికి.

"మేమిద్దరం గిండీలో చదువుకున్నాము నాన్నా. స్నేహితులము, రూంమేట్స్. క్లాసుమేట్స్ అన్నీను. వాసు అని చెబుతుండే వాడిని జ్ఞాపకం లేదేమో!...

ప్రసాద్‌గారు షేక్‌హాండ్ యిచ్చి - వాసు చేతిని వదలకుండానే సాలోచనగా ముఖంలోకి చూస్తూ అన్నారు "జ్ఞాపకం వుందోయ్ కానీ ఒక్క సందేహం ...కన్నడపువాళ్ళన్నట్లు చెప్పావు... మరి..."

"ఆ ఆ... వాడే - వీడూను... సారి వీసు... అనాలి కాబోలు వాళ్ళనాన్నగారు కోస్తాలోనే పనిచేశారు. అందుకని తెలుగు చదవటం అంతా వచ్చు...

ఇంతలో తల్లి కమలమ్మ రావటంతో ప్రేమతో తల్లి వైపు చూస్తూ "బాగున్నావా అమ్మా" అని ఆప్యాయంగా అడిగాడు. తల్లి జవాబిచ్చియివ్వగానే వాసును పరిచయం చేశాడు. కాసేపు వారేదో మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఆవిడ కాఫీ ఫలహారం సిద్ధంచేసేందుకని లోపలికెళ్ళింది. "స్నానం ముగించి వచ్చేసరి కాలస్యమైంది... ఓహో వాసు వచ్చాడే... బాగున్నావా? పెళ్ళి... పిల్లా ఏమైనా? లేక మా వేణులాగానే...?" ఆమె చిలిపిగా తమ్ముడివైపు చూచింది.

"లేదండీ... ఇంతవఱకు ఆ విషయాలు తలంచుకోటానికే భయంవేసేది. కానీ తప్పలేదు. అందుకే హైదరాబాదే రావటం."

"ఓహో! పెళ్ళిచూపులకన్నమాట. పిల్లనచ్చిందా? అన్నీ చెప్పవయ్యా! కనీసం నీకథవిన్నైనా మావాడూ ఆ మూడు ముళ్ళూ వేయటాని కంగీకరిస్తాడు. ఆమె నవ్వింది. అందరూ నవ్వేసి మానందాల్చారు.

ఇంతలో ముసలాయన అన్నారు. "ఇంత అకస్మాత్తుగా రావటం ఏదైనా విశేషం వుందేమిటి?"

వేణు కనుబొమ్మలు పైకెత్తి మెల్లగా తిరుగుతున్న ఫాన్‌కేసి చూస్తూ అన్నాడు. "ఉన్నాయి నాన్నా... రెండు ముఖ్యవిషయాలు చెప్పటానికి ఒప్పించటానికి వచ్చాము. అమ్మను రానివ్వండి. మాట్లాడుకుందాము."

తండ్రి కూతుళ్ళు ఒకరి ముఖాలొకరు చూచుకున్నారు. ఏదో నిగూఢంగా మాట్లాడుతున్నాడనుకున్నారు. ఇద్దరిని

అదోకలాంటి భయం ఆవరించింది.

శాంత తమ్ముణ్ణీని, వాసును లోపలికి గెస్టురూంలోకి పిలుచుకొని వెళ్ళింది. వాళ్ళుముఖాలు కడుక్కొని వచ్చేసరికి కాఫీటిఫిను తయారుగావున్నాయి.ఆపని కాస్తా ముగించి హాల్లో కొచ్చారు ప్రసాద్ గారు. సిగార్ పొగ కేసి చూస్తూ కూచున్నారు.

ఎవరి ఆలోచనలో వారు మునిగితేలుతున్నారు. వాసు ప్రారంభించాడు "ఫ్రాన్స్‌లో ట్రైనింగ్ కోసం మాయిద్దర్నీ సెలెక్ట్ చేసుకుంది ప్రభుత్వం ఇంకో నెలరోజుల్లో ఆరుమాసాల కని వెళ్ళాలండి."

"కంగ్రాట్యులేషన్స్ మీ ఇద్దరికీ. చాలమంచి కబురు చెప్పావునాయనా – ఇంకా ఏమి కబురో అని భయపడి పోయాను."

తల్లీ అక్క హాయిగా నిట్టూర్చారు.

"రెండో విషయం మాట్లాడుతూ ఉండండి నేనలా వెళ్ళొస్తాను" వాసు లేచాడు.

"ఉండు వాసూ – ఫరవాలేదు" అన్నాడు వేణు.

వాసు చిరునవ్వునవ్వి లేచినుంచున్నాడు. "నే నుంటే అంత స్వేచ్ఛగా మాట్లాడుకోను వీలుండదేమో...

వేణు అడ్డుతగిలాడు "సరే ... ని యిష్టం ... శాస్త్రీ యింకోగంట కంతా వచ్చేసెయ్యి–"

వాసు వెళ్ళినదిక్కు కేసి చూస్తూ కొన్ని క్షణాలు గడిపాడు సోఫాల్లో ముందుకువంగి తండ్రి ముఖం కేసి తదే కంగా చూస్తూ అన్నాడు" వెళ్ళకముందు పెళ్ళిచేసుకుని వెళ్ళాలని"

గదిలోని మిగతా ముగ్గురు ఫకాలున నవ్వారు. ప్రసాద్ గారు విప్పారిన ముఖంలో తృప్తిదీర నవ్వుతున్నారు. కాని వేణు ముఖంలోని గాంభీర్యాన్ని చూచి కాస్తతగ్గి అన్నారు "అంతేనటోయ్ ... భలేవాళ్ళే మీరు ... నీ నోటినించి యింత చల్లటి కబురెప్పుడొస్తుందా ... ఎప్పుడు నిన్ను వరునిగా చూస్తామా - మనవడ్ని యెప్పుడెత్తుకుందామా అని మే మిద్దరం ఉవ్విళ్ళూరు తున్నాము నాయనా ... యింకేం ... నాకు తెలిసిన సంబంధాలు కొన్ని వున్నాయి ... వెంటనే కదిలిస్తాను. వాళ్ళవేపునించి కదా రావాలి? యివ్వాళే ...

"అంత శ్రమపడక్కరలేదు నాన్నా ... అమ్మాయిని నేనేచూచుకున్నాను తండ్రివైపు చూడకుండా అనేశాడు.

"ఔరా" అన్నట్లు ఆయన కొడుకుముఖాన్ని వింతగా పరీక్షించారు ... "ఏదోలే" అనుకున్నారు కాబోలు నెమ్మ దిగా అన్నారు-

"మంచిదే మరి ... నీకు నచ్చిన పిల్లనే చేసుకో ... ఇందులో మా అభ్యంతరం యేమీ లేదు ... కానీ అన్ని వివరాలు విన్నతర్వాత చూద్దాము ... ఎవరమ్మాయి — ఏమాత్రం ఆస్తి? ఆయనకు కావలసిన ముఖ్యమైన జవాబులు

రెండు. వాటికి కావలసిన ఆ రెండు ప్రశ్నలు వేసి ఆత్రంగా యెదురుచూస్తున్నాడు.

"యిక్కడే. మాచర్లలో ఒక హెడ్ గుమాస్తా గారి అమ్మాయి ... "

"యేమిటీ" అని హుంకరించి లేచి నుంచున్నారు. రిట యిర్డు కలెక్టరిని ... లక్షాధికారిని ... ఒక గుమాస్తాతో వియ్యమందమంటావా? అసలు అలాంటి పిల్లని ఎలా చేసుకుందామనుకున్నావు? ఆ మాత్రం ఆలోచించలేక పోయావా? పోనీ ... యేదయినా ఆస్తి!

"ఏమీ లేదు వుద్యోగం తప్ప"

"హుఁ" అన్నాడాయన.

"యేమయినా చదువుకుందా? శాంత నెమ్మదిగా ప్రశ్నించింది.

"బి. ఎ. చదివింది."

"చాలా అందంగా వుంటుందా ఏమిటి రా? " అన్నది తల్లి.

"ఏమో ... నాకు బావుండవచ్చు. మీకు బాగు లేకపోవచ్చు. సుమారుగా వుంటుంది " అన్నాడు వేణు.

మరి దేన్నిచూచోయ్ నువ్వు ఆపిల్లను ప్రేమించింది? అన్నారాయన వెటకారంగా.

తండ్రి ధోరణి వేణుకు నచ్చలేదు. "యింత సూటిగా అడుగుతున్నారు కాబట్టి చెబుతాను- ఆ అమ్మాయి గుణం చూచి"

ప్రసాద్ గారు లేచి నుంచుంటూ పెద్దగా నవ్వారు. యిప్పుడున్న గుణం రేపుండదు. అందులో ఆడవాళ్ళ గుణం యిక చెప్పనక్కరలేదు. నిన్ను బుట్టలో వేసుకొనేందుకే ఈసద్గుణ ప్రదర్శన. అసలు ఓమాట చెబుతా విను. ఏమీ లేని పిల్ల నిన్ను కట్టేసిందంటే ... అందులోనేవుందోయ్ కిటుకు! మంచి పిల్లయితే యిలాటి ప్రేమపిచ్చి వేషాలేయదు. "నాన్నా" అని గట్టిగా అన్నాడు వేణు. తనస్వరం తనకే భయంకరంగా వినిపించింది. లేచినుంచున్నాడు. ముఖంలో నీలి మబ్బులు తెరలు తెరలుగా వ్యాపిస్తున్నాయి. ప్యాంటు జేబులో చేతులు పెట్టుకొని కిటికీనుంచి బైటకుచూస్తున్నాడు.

కొడుకు కేసి కోపంతో చూస్తున్నా రాయన. తల్లి గబుక్కున అంది. "ఇంతకు మన పెళ్లేనా?"

"ఔనమ్మా - కానీ రాధాస్వామి మతం పుచ్చుకున్నారు"

"అదేమిటోయ్.... అది కూడానా ? నీ వేలంవెర్రి కాకపోతేయిదంతా కట్టిపెట్టి..."

"అసలా మతం ఏమిటి ?" అంది కమలమ్మ ఆశ్చర్యంతో. "దయాల్బాగు, ఆగ్రా... అని వినలేదు ? సత్సంగులంటారే వాళ్ళన్నమాట" శాంతవివరించింది.

"ఒహాఁ" అన్న దావిడ. కనుబొమలు చిట్లించి కొడుకు కేసి చూస్తోంది. -ఇంకా ఏంచెబుతాడో అని.

తల్లి అక్కా సంభాషణ పూర్తయ్యాక వేణు అతి నెమ్మదిగా అన్నాడు. "నాన్నా... ఇవేమైనా పిల్ల చేష్టలనుకున్నారా? కట్టి పెట్టను. చిన్నవాడి ననుకున్నారా? మీరు అంగీకరింపకపోతే..."

తండ్రి కోపం తారా జువ్వలా పైకి లేచింది. "అంగీకరించకపోతే... ఏం చేస్తావోయ్ !... ఆ పిల్లతండ్రిచేత పెళ్ళిచేయించుకుంటావు... అంతేనా ? నిన్ను బెదిరించలేను. మాసాయం- మా అండ లేకుండానే వచ్చే అయిదు వందల రూపాయలతో పెళ్ళాంతో హాయిగా వుంటావు. ఎటొచ్చీ కన్నకడుపులు తరుక్కుపోయి కరిగిపోతాయి. అంతేగా ? కృతఘ్నులు... ఛత్... అంటూ" కూలబడ్డారు.

ఆయన ఉద్రేకం, కోపం అణిగేసరికి కొన్ని నిముషాలు దొర్లి పోయాయి. వేణు తండ్రి పక్కన కూర్చున్నాడు.

"ఆ అమ్మాయితండ్రి అలాంటివాంరు కారు. మీకు నచ్చితేనే వారు పెళ్ళిచేస్తారు. ఈ విషయం నిష్కర్షగా తెలియజేశారు. కాబట్టి ఆ భయం అక్కర్లేదు. మీ ప్రేమను గుర్తింప లేనంత కఠిన హృదయం ఇంకా నాలో ఏర్పడలేదు. అంత పతనానికి దిగజారిపోలేను, పోను... ఈ పెళ్ళంటే మీ అందరికీ అయిష్టం అని తెలుస్తోంది. ..." వేణు బాధగా ఆపు చేశాడు.

"తెలియటమేమిటి? అసలీ పెండ్లి జరగటానికి వీల్లేదు. ఇంకేదైనా..."

వేణు గబుక్కునలేచి నుంచుని చేతులెత్తి తండ్రిని మాట్లాడవద్దన్నట్లు వారిస్తూ గబగబ కిటికీదగ్గరకెళ్ళి నుంచు న్నాడు. కిటికీ తెరలనుంచి అతనిముఖం అస్పష్టంగా అగుపి స్తోంది. వీరివైపు తిరక్కుండానే బయటికి చూస్తూ అన్నాడు.

"ఇక తేలిపోయిందన్నమాట. ... అలాగయితే నా కసలు పెళ్ళే అనవసరం... నాజీవితానికొక లక్ష్యంలేదు. ఆంబిషన్ అంతకన్నాలేదు.... ఫారిన్ను వెళ్ళటం మానే స్తాను. ఈడబ్బు, ఈహోదా, ఈ గౌరవం ఇంతవరకు చాలు నాకు. ఇంతవరకు జీవితం ఎలాగడిపానో అలాగే గడుపుతాను. ఇక ఆ అమ్మాయిజీవితంగూడ నాలాగే మోడుబారి పోతుం ది.... పోనీయండి. మీకు మనఃక్లేశం కల్పింపకుండా ఈ మాత్రం చేయగలను.

కమలమ్మ, శాంత నోర్లుతెరచుకొని వింటున్నారు. వాళ్ళకి తెలుసు. ఆ మాటల్లో ఎంతనిజంవుందో. వేణుమాట లకు విలువవుంది. అవి వృథాగా గాలిలో తేలిపోయేవికావు. ఆచరణరూపంలో వారిదృష్టిలో సదా మెదులుతూనే వుంటా యి. వారి హృదయాలు వేగంగా కొట్టుకుంటున్నాయి. శాంత తమ్ముడివాలకంచూసి కన్నీళ్ళు పెట్టుకుంది. తల్లి ముఖంలో భయాందోళనలు స్పష్టంగా వ్యక్తమౌతున్నాయి.

ప్రసాద్‌గారుమాత్రం తొణకలేదు అలా కొడుకు వయిపు చూస్తున్నారు. దాదాపు ఆరడుగుల యెత్తులో చక్కని దేహచ్ఛాయతో, శరీరసౌష్ఠవంతో, నల్లనివంకీలుతిరి గినజుట్టుతో ఉన్న కొడుకు, మంచి ట్వీడ్‌సూటు వేసుకుని అలా నుంచుంటే అతనికెంతో బాధ అనిపించింది. యెక్కడో...

యెవరో... అతనిని ప్రేమిస్తున్నాను- గోపాలుగారి జీవితం నాశనం చేయాలని... కానీ అతని హృదయం కఠినమైంది. ఇదొకరకం బెదిరింపు... అంతే... ఇంతమాత్రానికే లొంగితే సరా ? యిన్నాళ్ళ ఆ నీళ్ళు పెళ్ళి వద్దన్నవాడు యిప్పుడు కావా లన్నట్లే మానో పరిచయాలు మళ్ళీ కావాలంటాడు. ఈ ప్రేమ, పెళ్ళి గొడవ వినిపిస్తుంది. ప్రమాదంగానే... ఇది జరగ టానికి వీల్లేదు

శాంత తమ్ముడిని అనుసరించింది. వేణుముఖం కంద గడ్డలావుంది. శాంతహృదయం జాలితో నిండి పోయింది. మూగగా దుఃఖించింది.

హాలులో తండ్రి తల్లికి సద్ది చెప్తున్నాడు. ఇదంతా నాటకం - బెదిరింపు అని శాంత వచ్చికూచుంటూ అంది. కళ్ళమ్మట నీళ్ళు దప్ప - వాడెంతెంతో దుఃఖిస్తున్నాడు. ఎదురు తిరిగి పెళ్ళి చేసుకోనిమీరంటన్నట్లుగా వుంటే ఏం చేస్తారు నాన్నా... వాడి హృదయమే నవనీతం... సద్గుణరాసి... వాడి నలా బాధించటం సబబుగా లేదు... ఇంతకాలానికి... ...

ప్రసాద్ గారు చురచురా చూస్తూ అన్నారు. తమ్ముడిని వెనకాలేసుకొస్తున్నావమ్మాయ్ ... మాకు తెలిసినంత నీకు తెలుసా... వీడు ఆవేశంలో మాట్లాడి బెదిరిస్తే బెదరి పోతా మనుకున్నాడేం...

కొడుకు వస్తున్న చప్పుడువిని ఆపారాయన.

వేణు తలనువ్వుకొని వచ్చాడు. ఎంత ముహంకడుక్కొన్నా అతని ముహంలో ఆవేదన ద్యోతకమౌతోంది. శాంతతో

అన్నాడు ఆ టిఫెన్‌లో భోజనం పెట్టి ఆఫ్లాస్కులో కాఫీ పోసి టిఫెన్ బాస్కెట్‌లో పెట్టివ్వు.

"అప్పుడే వెళ్తావానాయనా?" అందితల్లి.

'వాసు' డాం నిర్మాణం చూడాలంటున్నాడు. అక్కడి నించి ఎత్తిపోతలు నాగార్జునకొండ, మ్యూజియం జూచి స్నేహితులను జూసి, వస్తే రేపు మధ్యాహ్నానికి వొస్తాము. సమయం లేకపో తిన్నగా హైదరాబాదు వెళ్ళిపోతాము"

అంతలో వాసు వచ్చాడు. వేణు ముఖం చూచి అంతా గ్రహించుకుని దిగులుపడిపోయాడు. మర్యాదకని ప్రసాద్ గారితో ఏదో మాట్లాడుతున్నాడు.

శాంత అంతా అమర్చి తెచ్చింది. "మీ బావగార్ని పిల్లల్ని చూడకుండానే వెళ్తావురా మరి ?" అంది బాధగా-

వేణు నవ్వేశాడు. "కాన్వెంట్ దగ్గర జీపు ఆపి పిల్లల్ని చూచి వచ్చాను. బావగారిని యిప్పుడు వెళ్ళేటప్పుడు చూస్తాను. పిల్లలకని తెచ్చిన వస్తువులు ఆసంచిలోఉన్నాయి."

యధావిధిగా అందరి దగ్గర సెలవు తీసుకొని స్నేహితు లిద్దరూ జీప్‌లో బయలుదేరారు.

జీప్ వెళ్తున్న వైపు చూస్తూ నుంచుండి పోయాడు తండ్రి. అతని ఆలోచన లేవిధంగా ఉన్నాయో !

ఆ రాత్రి అవతల ఒడ్డున స్నేహితుని యింట్లో మకాం వేశారు. తెలతెలవారుతుండగా నాగార్జునకొండ, మ్యూజియం చూడటానికి బయలుదేరారు.

వేణు అది రెండవసారి చూడటం. తానే గైడ్‌గా వాసుకు అన్నీ విశదపర్చి చెబుతున్నాడు.

ఈ రాళ్ళపై ఎక్కడో రాకుమారి గౌతమిరక్తం ఘోషిస్తోంది వాసూ" అన్నాడు ఒక పెద్దరాతిపై చతికిలబడి.

వాసు వింతగా చూచాడు వేణు ముఖంలో చీకటి నీడలు అలముకుంటున్నాయి. స్నేహితుడి ఆవేదనను క్షణంలో గ్రహించినవాడై అన్నాడు. "ఇంకా అక్కడేదో తీవ్రంగం జరుగుతోందన్నావు. మధ్యాహ్నమైంది అది చూచి భోంచేసి తిరుగు ప్రయాణం. ..."

"గౌతమి చరిత్ర తెలుసా ?" వేణు అసలు వాసు మాటలు విన్నాడో లేదో !

"గౌతమి- అప్పటి ఆంధ్రరాజతనయ... నాగార్జునుని గురువుగా స్వీకరించాలనుకుంటే ఆ మహానుభావుడు తన శిష్యుడిని పంపాడు.... ఇంకేం అతన్ని గౌతమి ప్రేమించింది. రాజు ఒప్పుకున్నాడు... కాని యీ సన్యాసి ఒప్పుకోక పారిపోయాడు. రాకుమారి వలచిన పురుషుడు- అతడికోసం వెదికించారు... చివరకేమైంద ?

... ఈమె బారినుండి తప్పించుకోవటానికి నాగార్జునుని దగ్గరకు వచ్చి దీక్ష యిమ్మన్నాడు... తప్పదుగా- గౌతమి వచ్చేసరికి కేశ ఖండనతో, కాషాయ వస్త్రధారియై భిక్షాపాత్రతో బుద్ధం శరణం... అంటూ అగుపించాడు.... పాపం ఆమె హృదయం ఎన్నివేల శరాఘాతాలకు లోనైందో కదా... వెంటనే బాకుతో పొడుచుకుంది... ఎంతనిస్పృహ చెందిందో... ఎంత... ఎంత... నాలాగే... అనుకుంటూ వాసూ " అని లేచి నుంచున్నాడు!

ఇతనికి పిచ్చి పట్టదుగదా- అనుకుంటూ ఏవేవో కబుర్లు చెబుతూ వేణుతో నడుస్తున్నాడు వాసు... కాని ఆ పరిసరాలు వేణుహృదయాన్ని దగ్ధం చేస్తున్నాయని గ్రహించాడు.

ఆ కాస్త చూడటం ముగించి - భోజనం ముగించి బయలుదేరాను. కొంతదూరం రాగానే జీప్ టప్న ఆగి కూచుంది. "ఛత్...వీటితో యిదేగోల - ఏనాటివో... మొదటి ప్రపంచయుద్ధంనాటి జీప్‌లు కావుగదా?" అంటూ డ్రైవరు దగ్గరకెళ్ళాడు వాసు. వేణుమాత్రం నిశ్చింతగా కూచున్నాడు.

డ్రైవర్ పరీక్షించి చెబుతున్నాడు "ఇక ఇప్పట్లో వెళ్ళలేం బాబూ - ఒకటైరు బర్స్టు అయింది. నిన్న ఇవ్వాళ మరొకటి... ఇక స్పేర్ లేదు. అలా కూచోండి... ఎలాగో చూస్తాను... లోపలగూడ ఏదో ఐంది..."

వేణుకు చిరాకేసింది. జీప్‌లోంచి దూకాడు. వాసు దగ్గరకెళ్ళి అన్నాడు "అలాతిరిగొద్దాం... చూసాయం కావలిస్తే విజిలేయి దగ్గర్లో వుంటాము."

డ్రైవర్‌ను వదలి వారలా చెట్లల్లో రాళ్ళల్లోతిరుగుతున్నారు. దాదాపు అరగంట దాటింది. తిరిగి జీప్ దగ్గర కొచ్చారు. డ్రైవరు, క్లీనరు - అంటే వేణు బోయ్ - నత మత మాతున్నారు...

"సార్... ఇంకా రెడీ కాలేదు" అన్నాడు వాళ్ళని చూచి. వేణు [illegible] మూడివడిస్తె ఏదో ఆలోచిస్తున్నాడు.

"[illegible]..."

"దాదాపు మైలుండవచ్చు సార్" అన్నాడు తలెత్త కుండానే.

"ఐతే ఓపనిచేద్దాం. జీప్ బాగయ్యాక మీరు గెస్టు హౌస్ దగ్గరకెళ్ళి మాకోసం చూస్తుండండి..."

డ్రైవర్ తలెత్తి గబుక్కున అన్నాడు "మరి మీరెలా వెళ్తారు?

"నదిదాటి వెళ్తాము...నీళ్ళసలు లేవస్లేఅన్నీ రాళ్ళేగా. సరదాగా వుంటుంది వాసూ... వెడదామా? అటునించి ఓ రెండుమైళ్ళు వెళ్ళామంటే గెస్టుహౌస్ వస్తుంది. ఇక్కడ కూచునే కంటే అదే నయం...ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. ఒకసారి నేను - శావ ... అలాగే దాటేసి వెళ్ళాము."

వాసు అడ్డం చెప్పలేదు...గోదారి లంకలు గుర్తొచ్చాయి. ఏదో ఆనందం...ఫ్లాస్కు తీసుకొని బిస్కట్లు జేబులో పెట్టుకుని బయలు దేరారు.

"బాబూ జాగ్రత్త" అన్నాడు డ్రైవర్.

"అలాగే...ఆకలేస్తే అందులో బిస్కట్లున్నాయి. కాఫీవుంది తాగండి...త్వరగా తెములుచ్చుకోండి. మీరుగాని రాకపోతే మీకోసం మేమువస్తాంలెండి" అంటూ చెట్లల్లో మాయమయ్యాడు. అది కాలిబాట...అయినా జనసంచారం లేదు. వారిద్దరూ హుషారుగా సాగిపోతున్నారు.

రెండు గంటలు దాటింది. ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలి వీస్తోంది. హాయిగొల్పుతున్న వాతావరణం నీటి కెరటాల సన్నని సవ్వడి కాస్తవృధృతమైంది. లేక్వ్యూ రెస్టు హౌస్ పైన ఒక అమెరికన్ టూరిస్టు బైనాక్యులర్సుతో

ఆ ప్రాంతాన్ని కలియజూస్తున్నాడు. దాదాపు నలభై సంవత్సరాలకు పైబడి ఉండవచ్చు. ఆరడుగుల పొడగరి. పాంట్సు వేసుకుని పిట్టగోడపై కూచుని చూస్తున్నాడు.

దూరంగా అతనికేదో వింతగా తోచింది. మళ్ళీ గమనించి చూచాడు. ఔను సందేహంలేదు. గబగబ మెట్లవలికెళ్ళి "మిస్టర్ స్వామీ" అని కేకేశాడు.

ఆ వచ్చిన వ్యక్తి కూడ దాదాపు అదేవయసు, పొడవుగల్గిన ఆంధ్రుడు. పంచ, లాల్చి ఉత్తరీయం నిండుగా కప్పుకున్న నిండైన గంభీర విగ్రహమాతనిది. వారి సంభాషణ ఆంగ్లంలో సాగుతోంది.

"అలా చూడండి" అని బైనాక్యులర్సు అందించాడు.

అతను అందుకుని ఆ అమెరికన్ చూపించినవైపు చూచి బిగుసుకుపోయాడు.

"మనుష్యులుకదూ! కొద్దిగా యివతలి కొస్తే తెలుస్తుంది."

"వచ్చేశారు సార్ ... మనుష్యులే "

"ఆత్మహత్యా" ఆయన ప్రశ్న.

"కాదనుకుంటా ఫ్లాస్కు-కాబోలు ఎత్తి తాగుతున్నాడాకతను" బైనాక్యులర్సు అందుకుని తిరిగి ఆ వైపు చూస్తున్నాడు.

"మీ అభిప్రాయం?"

స్వామిగారు మౌనందాల్చారు. అతని చేతిలోంచి బైనాక్యులర్సు తీసికొని పరీక్షగా కలయజూచారు

"బహుశః ఎక్స్కర్షన్ పార్టీ ఏమో. అలానది మధ్యలో ఉండగా నీళ్ళొచ్చేశాయి. వారిచుట్టూ బాగా నీళ్ళున్నాయి కదా!" వస్తువు చేతులు మారింది.

ఔను నిజమే. నీళ్ళు ఎప్పటినించి వస్తున్నట్లు ఏదైన రిపోర్టు వచ్చిందా? మీకు తెలుసా?

"గంటక్రితం తెలిసింది. అరగంటకు అడుగు చొప్పున నీళ్లు పైకొస్తున్నట్లు, ఇప్పుడు తెలియదు. మంచివరద వచ్చే సూచనలున్నట్లు తెలిసింది. పైన బాగావర్షాలట. ఇక్కడ వర్షాలే లేవు. డాం నిర్మాణం దగ్గర ఎవరూ ఉండకుండా చేశారు. ఒడ్డున ఉన్న కుటుంబాలు ఎత్తుస్థలాని కెళ్ళాయి."

"వారికే విషయాలూ తెలిసినట్లులేదు." అన్నాడతను సాలోచనగా. కొన్ని క్షణాలు గడిచినై. నీళ్ళు ఎంత లోతు న్నాయో తెలుసుకోగలరా?"

స్వామిగారు మౌనంగా వెళ్ళిపోయారు. క్రింద ఫోన్ మోగింది. కొన్ని క్షణాలకు తిరిగొచ్చి అన్నాడు. "ఇంత వరకు నదిలో మధ్యలో అక్కడక్కడ తప్ప నీరు లేదు. ఇప్పుడు దాదాపు ఐదు అడుగులుండవచ్చునని అంటున్నారు. ఇక్కడ రాళ్ళు కూడ ఎక్కువ అక్కడక్కడ గుంటలు, లోతైవిన కూడ వున్నాయి. అందుకే వాగు నడిచి వెళ్ళటానికి సాహసించి ఉండరు." మళ్ళీ నిశ్శబ్దం, స్వామిగారన్నారు "పాపం-వారిని రక్షిస్తే మంచిది." అది ఎంతో చిన్న వాక్యమైనా అవి హృదయ పూర్వకంగా అన్నమాటలు. అవియెంతో అర్థముతో కూడుకునివున్నాయని ఆయన గ్రహించారు. కళ్ళజోడు సవరించుకొని స్వామిగారివైపు పరీక్షగాచూచి అన్నారు.

నిజమే. అందుకు నేను సిద్ధంగావున్నాను. కావలసిన ఏర్పాటు చేస్తే నేను...

“అలామీరు ఒంటరిగా వెళ్ళటానికి వీలులేదు. నేనూ వస్తాను. యిద్దరమూ సాధించవచ్చు” అన్నారుస్వామివారు.

అమెరికన్ కనుబొమలు పైకెత్తి దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. తనకు ఎవరూ లేరు. ఏమయినా ఫరవాలేదు. కానీ యితను?-

“ వద్దు... నాకు యెవ్వరూ లేరు... అపదవాటిల్లినా ఫరవాలేదు ... మీరు

స్వామిగారు అడ్డువస్తూ అన్నారు. “ నాకు యెవరూ లేరు. అంటేనాపై ఆధారపడినవారెవరూ లేరు. ఇంకొక ప్రాణిని రక్షించటంకన్నా ముఖ్యమైనది మరేంలేదు. పదండి.”

ఇద్దరు క్రిందికి దిగి వెళ్ళారు. సంగతి తెలిసికొన్న ఎస్. ఐ. కారుమీద వచ్చి వారించబోయారు. “మీరు మా అతిథులు- వెళ్ళటానికి వీలులేదు.” అతను వాదించాడు- సరే తను వేరే దేశస్థుడు- మరి స్వామిగారి మాటేమిటి? వారి ననుసరించటంలో కష్టనష్టంగాని, ఆపదగానీ లేదే...

ఎస్. ఐ. అంటున్నాడు“ఎవరుకూడ వెళ్ళటంమంచిది కాదు. ఇప్పుడు తెలిసిన వార్త గంటకు నాలుగడుగుల చొప్పున నీరు హెచ్చుతుంది. ఇంకా భీభత్సం కావచ్చు...”

“ఆలస్యం అవుతుంది...” అని నవ్వుతూ అతను తన గదిలోకి వెళ్ళాడు ఒక తోలుసంచినిండా గుడ్డలు, కొన్ని తిను బండారాలు తీసుకున్నాడు. ఈ సమయంలో స్వామిగారు ఎస్. ఐ. గారితో చేయవలసిన కార్యక్రమం విపులీకరించారు.

చెప్పగా "మీరు మాత్రం చీకటి పడేలోగా మాకీ వస్తువులు అప్పగించండి"

ఇద్దరి నడుములకు తాళ్ళు కట్టారు. ఆ తాళ్ళ ఒక కొసను ఒడ్డువద్దనుంచి కొండను కూలీలు పట్టుకుని అదుపులో వుంచుతున్నారు.

ఒడ్డుదగ్గర నుంచుండి చూస్తుంటే నది గంభీరంగా అమోఘంగా ప్రవహిస్తోంది నీటిమట్టం పది అడుగులకన్న ఎక్కువగా వుంది. అక్కడక్కడ పెద్దపెద్ద రాళ్ళు నీళ్ళలోనించి తొంగిచూస్తున్నాయి. ఈ ప్రాంతంలోని నదీగర్భం అంతా ఒకేరీతిగా యిసుకమయమై యుండక చదునులేక ఎగుడుదిగుడుగా రాళ్ళమయమై తుప్పలు, పొదలతో నిండివుంటుంది. వీరిద్దరు యీతకొట్టటంలో మంచినేర్పరులు. కానీ యీ రాళ్ళ వలన వారు అరగంట దాటినా సగందూరం కూడా చేరుకోలేకపోయారు. నీటిధాటికి, రాళ్ళకు ఢీకొని నీళ్ళను చిమ్ముతున్న అలలను తప్పుకోటానికి చేతులు, కాళ్ళు జోరుగా ఆడిస్తే ఏ రాయయినా తగలవచ్చు, లేదా తగిలి పెద్దగాయం ఏర్పడవచ్చు. దాంతో యీత మరీ కష్టతరమై పోతుంది. ఒక రాయిమీద వారు విశ్రాంతి తీసుకుంటూ ఎక్కారు. వారికి కొన్ని వందల గజాల దూరంలో రాతిమీద వ్యక్తు లగుపించారు. అందరూ చేతులూపిస్తున్నారు. బహుశా అవతలి వారు వీరిని "వద్దు" కాబోలు- వీరుమాత్రం "ఓపికపట్టండి, వస్తున్నాము అన్నట్లుగా సంజ్ఞ చేస్తున్నారు.

ఓ పదిహేను నిమిషాలపాటు విశ్రాంతి తీసుకున్నారు. నీటిమట్టం హెచ్చినట్లు తోచింది. యిద్దరూ మౌనంగా ఒకరినొ

తను చూచుకున్నారు. స్వామిగారు గోచి సర్దుకుని తాళ్ళు ముడి సరిచేసుకున్నారు. యిద్దరు తిరిగి సీటిలో దిగారు ఒడ్డు మీదివాడు వెళ్ళే కొలది తాడును వదులుతున్నారు.

యిప్పుడు వారు రాతిమీది వాటిని బాగా చూడగ లుగుతున్నారు. యింతలో పెద్ద నాగుపామును చూచినలా యిద్దరూ చటుక్కున ఆగిపోయారు. ఒకరికొకరు దగ్గరగా వచ్చారు.

స్వామిగారు నిబ్బరంగా అన్నారు. "సుశీకుండం ... యెంతదో తెలియదు. [illegible] తిరిగి వెళ్దాం."

యిద్దరూ [illegible] తో పాటు కొన్ని [illegible] వెళ్ళి [illegible] వారికి కొంత కష్టం [illegible]ంది. [illegible] – రుద్రకీల ... [illegible] [illegible] చూపించారు. [illegible] [illegible] ఆయాసపడుతు న్నారు. [illegible]

[illegible] నేను కృతజ్ఞతాపూర్వ కంగా [illegible] – "[illegible] ... నీవు లేకపోతే ..." స్వామిగారు [illegible]. కాని అతను మాత్రము "యెందుకేమిటి? [illegible] వెళ్ళటానికి వచ్చాము ... నీవు యిప్పుడే లేవద్దు ..."

తిరిగి నిశ్శబ్దం. దూరంగా యెక్కడో తుపాకి పేలిన శబ్దం. నది ఒడ్డుమీది గుంపు అస్పష్టంగా అగుపిస్తున్నది.

"అదుగో – పడవ సిద్ధం, తాళ్ళులాగండి" అన్నారు స్వామిగారు. తను దగ్గర ఉన్న ఒక కొసను పట్టుకుని బంతుల

ప్రాకారం ఇద్దరేసి లాగుతున్నారు. హనుమంతుడి తోకలా లాగేకొలది తాడు పెరిగి రాతి మీద రాశిలా పడ్తోంది. ఆ తాడికి కట్టబడిన చిన్న పిస్నీసు రాళ్ళను, సుడిగుండాన్ని తప్పకొని వచ్చేసరికి ఇరవై నిమిషాలు దాటాయి. కానీ చివరి పదిగజాల్లో పడవ అతిసులభంగా వచ్చేసింది. ఆ అమెరికన్ నోరు తెరచుకుని చూస్తున్నాడు. "ఎందుకిలావుంది!"

అర్థమైంది. పడవకు కట్టబడిన ఒక తాడు వారిచేతిలో వుంది. మరొక తాడు నదీతీరపు వారి దగ్గరుండాలి. అప్పుడే వారు ఏ భయం లేకండా ఒడ్డుకు చేరగలరు. కానీ అటువైపు తాడు తెగింది. ఏదో రాతికి రాచుకుని తెగివుండాలి. అని తెలుసుకోగానే వారిద్దరిని అదోక లాంటి భయం ఆవరించింది. కానీ వెంటనే సర్దుకున్నారు నలుగురూ కలసి పడవను రాతి పైకి లాగారు.

పడవలో ప్రథమంగా వారి నాకర్షించింది ప్లాస్టిక్ సంచిలో అగుపిస్తున్న కాగితం. ఆ అమెరికన్ గబగబ తీసి బిగ్గరగా చదివాడు. "ఇంకో అరగంటలో జలప్రళయం రాబోతోందని తాజా వార్తలు - తెలియవచ్చిన [illegible] తెరిచేశారు. హెలికాఫ్టర్ కోసం ఫోను చేశాము. [illegible]నుండి పైన రెండు చిన్న నదులు పొంగుతున్నా! [illegible] కావచ్చని వార్త. మీరు రాకుంటే [illegible]. [illegible] సహాయం రాగలదు"

"చూశారా! ఎంతపనైందో" అన్నట్లు చూచారు స్నేహితులిద్దరూ. స్వామిగారన్నారు - మీరేం బాధపడకండి. ఇలాంటి దానికి సిద్ధపడివచ్చాము. కర్తవ్యం ఆలోచించాలి."

రాయి ఎక్కడ దాపాఫు ముప్పది అయిదడుగు లుండ వచ్చు. నీరు ఇరవది అడుగు లుండవచ్చునని వూహించు కున్నారు. ఏమైనా ఒకటి మాత్రం నిజం- వరదవచ్చిందంటే యీరాయి మునిగిపోతుంది న్యూస్ తెలీదు. వారి అదృష్టం! ఆ రాతికి కుడివైపున కొనదేరిన ఎత్తైన రాళ్ళు రెండున్నాయి. ఆరాళ్ళమధ్యలో పడవ మామూలుగా దూరగలదుగానీ అడ్డంగా పోతేను. వెంటనే తాళ్ళతో ఆరాళ్ళకు పడవకట్టే శారు. నీటిమట్టం హెచ్చి పడవను తాళ్ళతోసహా లేపితే ఎలాగని ఆలోచన పట్టింది. కొంతతాడుతో నలుగురు నడుము లకు కట్టుకున్నారు. ఈ పనులన్నీ పూర్తిచేసి పడవలో ఎక్కి కూర్చున్నారు. అది సంధ్యవేళ.

ఆకాశంలో మబ్బులులేవు. ప్రశాంతంగా నిర్మలంగా వుందిగానీ దాని తాలూకు నీడ వరదనీటిలో అతిభయంకరంగా అగుపిస్తోంది. దూరంనించి ఎస్. ఇ. బైనాక్యులర్స్‌తో చూస్తూ మిగతావారికి వివరిస్తున్నారు. అందరూ గుండెలు చిక్కబట్టుకుని కొంత ఎత్తైన స్థలంమీదికెళ్ళిపోయారు! అంతలో ఉన్నట్టుండి ఒక కూలి పదిగజాల దూరంలో ఏదో చూపిస్తూ అనుస్తున్నాడు "అది తాడుకాదా!" కొందరు కాదని, మరికొందరు పామని అంటున్నారు. పడవతాలూకు తాడయితే అదృష్టవంతులే. వారిలో ఒకడు పరీక్షించడానికి సిద్ధమయ్యాడు. సమీపంలో పెద్దరాళ్ళులేవు. నీరు నెమ్మదిగా ప్రవహిస్తోంది! అతడు మాకాడు. పదినిమిషాలకు తిరిగొచ్చాడు. చేతిలో తాడుంది. అందరి ఆనందం వర్ణనాతీతం. తమశ్రమ ఫలించాలి. ఆ తాడును నెమ్మదిగాలాగుతున్నారు.

అనుకున్న విధంగా జీప్‌ను రివర్స్ చేసుకుని గెస్టుహౌస్ దగ్గర మూడు గంటల కల్లా హాజరయ్యారు. డ్రైవరు, ప్ర్యాను ఏరి ? వీళ్ళింకా రాలేదే ? ఎవరినైనా చూడటానికెళ్ళారా? దూరంగా నది అగుపిస్తోంది. డ్రైవర్‌కు ఏదో కొత్తగా వింతగా తోచింది. నడచి నదిని సమీపించాడు. తెల్లారి లేని నీరు యిప్పుడెక్కడినించి వచ్చింది? నదిలో నీరెక్కువ లేకపోయినా పలుచగా ఆ తీరం నుంచి ఈ తీరం దాక నీటితో వుంది. డ్రైవర్‌కు భయం వేసింది. గుండెల్లో ఏదో తీరని వ్యధ - గాబరాతో జీపు దగ్గరకు పరుగెత్తాడు - "వారు మధ్యలో చిక్కుబడలేదు కదా ?" ప్ర్యాన్ నవ్వాడు. మూడు గంటలు దాటింది. ఎంత నెమ్మదిగా నడచినా యీ వేళకి యీ ఒడ్డుకి చేరుకునే వుండాలి. ఇంతసేపు ఆ రాళ్ళలో ఏంచేస్తుంటారు?"

కానీ డ్రైవర్ అనుభవజ్ఞుడు - అతని మనసు కీడు శంకిస్తోంది వెంటనే అక్కడ వాకబు చేశాడు. పేర్లుపిలుస్తూ తిరిగాడు. జవాబు లేదు. కొందరు వీరి వైపు వింతగా చూస్తున్నారు. వెంటనే ఇంటికి మళ్ళించాడు జీపును.

జీపు శబ్దం విని తండ్రి, తల్లి బయటికి వచ్చారు.

"బాబు గారు వచ్చారా" అన్న ప్రశ్న వారిద్దరినీ కలవర పెట్టింది. లేదని తెలుసుకున్నాడు - జీపు చెడిపోవటం వారిద్దరు నడిచి వెళ్ళటం అంతా చెప్పాడు. "ఆఁ - దాటి వుంటారు ఫరవాలేదు" అనుకున్నా ఎక్కడో వారి హృదయంలో అనుమానం బాకులా గుచ్చుకుంటోంది డ్రైవర్ గెస్టుహౌస్‌కు వెళ్ళిపోయాడు.

ఐదు దాటింది- వారి జాడ లేదు. ఇంతలో ఫోన్ మ్రోగింది. డ్రైవర్ అంటున్నాడు "అయ్యగారు – దాట లేకపోయారు. ఒక ఎత్తైన రాతిపై ఉన్నారట... నీరు హెచ్చవచ్చు... మిగతా విషయాలు తెలియవు. వీరారు లేక వ్యాస్ రెస్టు హౌస్‌కు వెళ్తే అన్ని సంగతులు తెలియగలవు. మమ్మల్ని అటు వెళ్ళనీయరు... అంతే. డ్రైవర్ మరేమీ వినకుండానే ఫోన్ పెట్టేశాడు.

వార్తవిని ప్రసాద్ గారు స్తంభించిపోయారు. భయంతో ఒళ్ళు కంపించిపోయింది. సంగతి తెలుసుకొన్న కమలమ్మ, శాంతల దుఃఖం ఆగిందికాదు. శాంత భర్తకు ఫోన్ చేసింది.

"ఏతే వాళ్ళిద్దరు మన వాళ్ళేనన్నమాట!... ఇంత జరిగిందీ!...... నేను వస్తున్నాను...... రక్షించేందుకు... సహాయం చేస్తున్నారు... సరైన వార్తలు తెలియవు... ఎవరో లే అని మా పనులు చేసుకుపోతున్నాము......"

జీపు రాగానే అల్లుడి వెంట బయలుదేరారు ప్రసాద్ గారు. అల్లుడు సుబ్బారావు తీక్షణంగా ఆలోచిస్తున్నాడు. ఉన్నట్లుండి అన్నాడు – "ఈ పని కోరి చేశాడంటారా మామయ్యా!"

ప్రసాద్ గారు అల్లుడి ముఖంలోకి చూస్తున్నారు. పెదాలు కంపిస్తున్నాయి. నోటి మాట స్పష్టంగా రాలేదు. "లేదు – తనొక్కడే కాదుగా– వెంట వాసు కూడ ఉన్నాడు. అంతటి నీచమైన పని చేయడు."

తిరిగి నిశ్శబ్దం; "తాజా వార్తలను బట్టి ఇంకొక అర గంటలో భయంకరమైన వరద వస్తుంది. అందుకు అంగా

సిద్ధం చేశాము — కూలీలు పై ప్రదేశానికి మూటాముల్లె తీసుకుని వెళ్ళిపోయారు. ఈ వరద ప్రభావం ఉధృతంగా వుంటుందని కూడ వార్త లందాయి.

ప్రసాద్ గారు విన్నారు — ఏదో చీకటి అతన్ని ఆవరించింది. నీరసంగా కళ్ళు మూసుకుని సీటుకు చేరగిలబడ్డారు. కొంతసేపటికి గమ్యస్థానం చేరుకున్నారు. అసలుపార్టీని కలుసుకున్నారు.

అక్కడ ఉన్న ప్రతి వ్యక్తి ముఖంలో అశాంతి, భయం, ఏమౌతుందోనన్న అనుమానం, అలసట — తాండవమాడుతున్నాయి ఎస్. ఇ. ఏదేదో చెబుతున్నారు — తదనుగుణంగా కూలీల చేతులు అతి జాగరూకతతో పని చేస్తున్నాయి. అంతా ఇరవై మంది వుంటారు. కానీ... ఏ ఒక్కరిని కూడ ప్రశ్నించేందుకు వీలు లేకపోయింది. వారసలు యీ యిద్దరి రాక గమనించినట్లు లేదు.

సంధ్య దాటుతోంది, చీకటి నలుమూలల వ్యాపిస్తోంది. అంతలో ఫ్లడ్ లైట్లు నాల్గు వెలిగి ఆ అనంతరాశిని వెలుగుమయం చేసినై.

* * * *

పడవలో కూచుని ఆ అమెరికన్ విరగబడి నవ్వాడు. "మా చిన్నతనంలో యిలాగే క్రింద నీళ్ళు లేకపోయినా పడవలో కూచుని ఆనందించే వాళ్ళం."

"ఇంతకు మీ పేరు చెప్పారు కారు" వాసు అడిగాడు.

"ప్రింసిపాలు, నేను, బాబు — అంతా కొలనీకి వెళ్ళాం. అందరూ బాగా అనుభూతి... బాబూ హాయిగా గడిపాం"" అని నవ్వాడు.

"మీరేం చేస్తారు ?..."

"ఇంజనీరుని... ఇంకో ఇంజనీరుతో తేడా వచ్చి మా నాయనా యిచ్చాను. బోలెడు ధనం వుంది. యిలా తిరుగుతూ బయలుదేరాను. ఆ ఎస్. ఇ. కూడా — మిస్టర్ రావు, అతను నేను ఒకసారి ఢిల్లీలో ఒక మీటింగ్‌లో కలిశాము. ఒకే హోటల్లో నెలరోజులున్నాము. వారి గెస్ట్‌గా వచ్చాను... ఇదంతా అనవసరం... మీకు" అంతలో పడవ కదలిస్తు యుంది. అందరూ విస్తుపోయి చుట్టూ కలియ చూశారు. ఒడ్డువైపు కున్న తాళ్ళు కదుల్తోంది... బిగువుగా... అందరి ముఖాలలో ఆశారేఖలు పొడ చూపినై... పడవలో వచ్చిన చిన్న బైనాక్యులర్స్‌తో చూశారు. ఒడ్డువైపు జాడ విడిగా ఉన్నారు. ఎస్. ఇ. రమ్మన్నట్లుగా సైగ చేస్తున్నారు. అంతకన్నా వారికి స్పష్టంగా ఏమీ తెలియదు. చీకటి పడ్తోంది గాని యింకా మసక వెల్తురుంది.

నలుగురు పడవ దిగి పడవను నీళ్ళలోకి దించారు. ఎక్కి కూచున్నారు. సుడిగుండాన్ని తప్పుకోవాలి. నీరు హోరుమని ధ్వని చేస్తూ అల్లకల్లోలంగా ప్రవహిస్తోంది... నీటిలో కొట్టుకుపోతున్న వస్తువు లెన్నో! నీటితో పాటు కొన్ని వందల గజాలు వెళ్ళారు. అలా కాకపోతే సుడిని తప్పించుకోవటం కష్టం. అక్కడి నుంచి నది వెడల్పు మరీ ఎక్కువ. ఇప్పుడు వారు ప్రవాహానికి అడ్డంగా వెళ్ళాలి. నీటి మట్టం

హెచ్చుతోంది. కొంతదూరంలో అగుపిస్తున్న నున్నటినల్లటి గుండ్లు మాయమౌతున్నాయి. వారి గమనం నిదానంగావుంది.

చీకటి పులుముకుంటోంది. అంతలో చక్కని వెలుగు లైట్ హౌస్‌లో వారికా ఫ్లడ్‌లైట్స్ సాయపడిన్నై. ఒడ్డు మీది వారు నెమ్మదిగా లాగుతున్నారు. వేగిరంగా లాగితే ఏదైనా రాతికి తగిలి పడవ ముక్కలయి పోవచ్చు, లేదా మునిగి పోవచ్చు. ఎంత ఆలస్యమైనా పడవ భద్రత పడవ లోని వారిపై ఆధారపడివుంది. కొంతసేపటికి పడవను వారు స్పష్టంగా వ్యక్తులతో సహా చూడగల్గారు.

ఇంతలో ఎస్. ఇ. "ఆగండి అంటూ అరిచాడు. కూలీలు ఆపారు.

పడవ నెమ్మదిగా తూలుతూ సోలుతూ వస్తోంది - వేణు అరిచాడు "అటు చూడండి - ఒక స్త్రీ!"

వారి కల్లంత దూరాన ఒక స్త్రీ కొట్టుకుపోతోంది. ఆమె చేతులు ఆడిస్తోంది. కాని యీత వచ్చినట్లులేదు. నీటి ప్రవాహంలో వేగంగా కొట్టుకునిపోతోంది. అంతా పది గజాల దూరమైనా లేదు. స్వామి గారు మారు మాట్లాడ లేదు. తన నడుముకున్న త్రాటిని వారికందించి నీళ్ళలోకి దూకారు. వెంట్రుకవాసిలో ఆమె అతని చేయిదాటి పోయేది గానీ స్వామిగారి పట్టుదల అతన్ని మరింత ముందుగా త్రోయ గల్గింది. ఆమె కాలు దొరికింది గానీ ఆమెలో చలనంలేదు.

పడవలోని వారంతా త్రాడు లాగారు. ఇద్దరూ సమీపించారు. పడవ స్థిరత్వానికి భంగం కల్గకుండా ఆమెను పడ

వలోకి ఎక్కించారు. ఆమె ముఖం రక్తమయం! బహుశః రాతికి ఢీ కొని వుండాలి. వేణు ఆమెను చూడలేకపోయాడు.

స్వామిగారు నీటిలోనే ఉన్నారు "నా బరువుకు మునుగుతుంది. ఇక తెడ్లు వేయండి..." వారు వారించబోయారు గాని అతను వినిపించుకోలేదు.

అతను పడవ తాడు పట్టుకుని యీదుతున్నాడు. ఇంకొన్ని గజాలే! అబ్బ... శ్రమ ఫలించింది.... ఏం లాభం అంతలో పెనుభూతంలా అనంత జలరాశి గర్జిస్తూ - హోరున శబ్దం చేసుకుంటూ వస్తోంది....... ఒడ్డుపై వారు భయంకరంగా కేకలు వేస్తున్నారు.... క్షణ క్షణానికి ఆ నీరు గోడలా సమీపిస్తోంది. నురగలు క్రక్కుతూ "ఏం చేస్తానో చూడండి" అంటూ పళ్ళికిలిస్తోంది.

స్వామిగారు కేకేశారు- "అందరు నీటిలోకి దిగి యీదండి" మరుక్షణంలో వారు దూకి పడవతాటిని గట్టిగా పట్టుకున్నారు. అంతే! నీరు వారిని కబళించి వేసింది. పడవ బోర్లపడి పైకి లేచింది. కూలీలుతొందర తొందరగా తాడు లాగుతున్నారు. కొన్ని క్షణాలకు వారికి తలలు అగుపించినై. హమ్మయ్య అనుకున్నారు.

నెమ్మదిగా వారిని మోసుకొచ్చి పండవేశారు. తాం సన్ చేయి ఆ అమ్మాయి నడుముచుట్టే బిగుసుకునిపోయింది. అందరి నడుములకు తాడుంది గానీ ఆ అమ్మాయికి లేదు. స్వామిగారు ఆ గాబరాలో ఆ విషయం మర్చారు గానీ తాంసన్ ఆమెను పట్టుకున్నాడు. ఆమె తప్ప మిగతా అందరూ త్వరలోనే కళ్ళు తెరిచి చూచారు.

రాత్రి పది గంటలు దాటింది. వరద భయంకరధ్వని సముద్ర ఘోషలా స్పష్టంగా వినిపిస్తోంది. అందరూ ఆయా గదుల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ శబ్దం వింటుంటే జరిగిందాక పీడకలలా వుంది. అందరి హృదయాల్లో ప్రశాంతత ఆవరించి వుంది.

ఇంతలో బయట వ్యాన్ ఆగింది. ఒక వృద్ధస్త్రీ, ఒక అబ్బాయి-అమ్మాయితో దిగి స్వామి గారి గదిలో కెళ్ళింది. తమ్ముడినిచూచి కన్నీళ్ళు తుడుచుకుంటూగాద్గదికంగా అంది- "ఈ వయసులో యీ వరదలో పోకపోతే ఏం పోయింది ! మమ్మల్నీ మర్చిపోయావా ? మేం ఏమైపోవాలని! ఇంకా చిన్న వాడివా… …"

"సుఖంగా వున్నాగా-ఏడవకు మరి… ఏం చెయ్యను- నీ కూతురు జ్ఞాపకాని కొచ్చింది. వరదలో కొట్టుకు పోతుంటే చూస్తూ నుంచున్నారు గానీ ఏ ఒక్కరూ రక్షించలేక పోయారు. ఆమె లేకపోవటం మనకు, పిల్లలకూ యెంత లోటు యేర్పడిందో చూడు - ఆ గాయం మానిందా అక్కయ్యా ! అందుకే నీటి ధాటి ఎక్కువకాకముందే రక్షించాము… నా మాట అటుంచు; మరి ఆ దొర మాటేమిటి ? ఆ పిల్ల బ్రతకొచ్చట… పెళ్ళికి అంతా ఏర్పాటయివుందట పాపం! తమ్ముడిని రక్షించబోయి వరదలో కొట్టుకుపోయింది. వాడు ఒక చెట్టు కొమ్మను పట్టుకున్నాడట… వాడి అదృష్టం. ఒడ్డు దాకా వస్తే ఎవరో లాగేశారు… "ఆమె కన్నీరు తుడుచు కుంటూ చిన్నగా నిట్టూర్చింది. కొడుకు, కూతురు సమీపంలో కూచున్నారు.

అతనికి విశ్రాంతి అవసరం—ఆమె నడుం వాల్చింది... అబ్బాయి పడుకున్నాడు.

ఆమె అంది- "నాన్నా! ఆ అమెరికన్ ఏదో మాట్లాడుతూ నవ్విస్తున్నారు... ..."

"ఔనమ్మా - అలాంటి వారు లేకపోతే మన జీవిత విధానమే కష్టతర మౌతుంది. ఎంతో సరదాగా నవ్విస్తూ మాట్లాడతారు - అంతా శ్రమ నాదేనని అంటారు... గొప్ప వారి లక్షణం అలా వుండాలి. అతను రాకపోయివుంటే నాకి పని అసాధ్యమయి వుండేది."

"ఇంజనీరు గారి ప్ల్యాన్ వచ్చి మీ సంగతి తెలిపే సరికి ఎంత ఇదైపోయామో - వచ్చి చూచేదాక సంతృప్తి వుండదని తీరా బయలుదేరితే దారిలో చెడిపోయింది వ్యాన్. అక్కడో గంట ఆలస్యమైంది ... మీరు రక్షించినవాళ్ళక్కడే వున్నారా ? చూడాలని వుంది... ఎలావుంటారో.... వారి ముఖాల్లో ఎంత కృతజ్ఞతాభావం వుంటుందో! ఆ భావ ప్రకటన చూడాలని వుంది నాన్నా!"

స్వామిగారు మందహాసం చేశారు. "పక్కగదిలో వున్నారు... రేపుచూద్దువుగాని పడుకోమ్మా... తెల్లారి ఏడు గంటలకు మనం..."

ఆమె వినటంలేదు. ఎటోచూస్తోంది. ముఖం పాలిపోయింది. ఒక్కపరుగున బయిటికి పరుగెత్తింది. మరుక్షణంలో స్వామిగారు లేచి నుంచున్నారు... "నాన్నా... వారినా...రక్షించింది...వారినా..." అంటూ బయట వరండాలోనే కుప్పగా కూలిపోయింది.

స్వామిగారు గబగబ బయటికొచ్చారు అప్పటికే వేణు ఆమెను చేతులమీద ఎత్తుకొని తనగదిలోకి తీసుకు వెళ్తున్నాడు. ఈదృశ్యంచూచి స్వామిగారు నిలువునా కంపించారు. అతిప్రయాసతో అడుగులు ముందుకుపడినై.

ఆమెను మంచంమీద పడుకోబెట్టి "పరిమళా" అని అతిమృదువుగా పిలుస్తున్నాడు వేణు. అతనికంఠ స్వరం, అతని ఆవేదనను వ్యక్తపరుస్తోంది. వాసు నీళ్ళకోసం పరుగెత్తాడు. ప్రసాద్‌గారు విస్తుపోయిచూస్తున్నారు.

స్వామిగారు గబగబవెళ్ళి వేణును లేవనెత్తారు "మీరు వేణుగోపాలరావుగారా? ... విశ్రాంతితీసుకోండిబాబూ నేను చూచుకుంటాను..."

"మీరు స్వామి చరణ్‌గారా? స్వామిగారు అంటే పోల్చుకోలేకపోయాను."

వాసు తెచ్చిన నీళ్ళను కూతురిముఖానికి చల్లుతూ ఆయన "ఔనుబాబూ – అంతా స్వామి అని అంటారు... మీరు దయచేసి వెళ్ళండి... నేనుచూచుకుంటాను..." అతని కంఠం బొంగురుపోయింది. పరిమళకొద్దిగా కదిలింది. వేణు ముఖం మేఘావృతమైంది. తండ్రివైపు ఒక్కసారి చూచాడు. గబగబ బయటికి వెళ్ళాడు. వాసు కాఫీపెట్టమని చెప్పటానికి బట్లర్ దగ్గరకు పరుగెత్తాడు.

"ప్రసాదుగారూ! ప్రక్కగదిలో మా అక్కగారున్నారు – లేపిపంపుతారా? నాకేంపాలుపోవటంలేదు..." గుమ్మంలో నించునిచూస్తున్న ప్రసాదుగారు గబగబ స్వామిగారి దగ్గరలోకెళ్ళి ఆయనచేతులుపట్టుకుని "అమె నెందు

లేపటం... ఇంతవఱకు మీరుచేసినసేవ చాలు - ఇంకా యీ బెడద మనకెందుకు... వేణునే రమ్మంటాను... కావలసినసేవ చేయనివ్వండి...రండి..." స్వామిగారు నమ్మలేకపోయారు. యాంత్రికంగా బయటికొచ్చారు. స్తంభానికానుకుని నుంచున్న వేణు యీమాటలు విన్నాడు. మనస్సు ఆనందంతో గంతులువేసింది. బాణంలా గదిలోకు దూసుకుపోవాలను కున్నాడు కానీ వాళ్ళుచెప్పేదాక వెళ్ళకూడదు ... "వెళ్ళు బాబూ. మాపని అయిపోయింది. వెళ్ళి అమ్మాయినిచూడు" ప్రసాదుగారు అన్నారు.

వేణు ఒక్క అంగలో పరిమళను సమీపించాడు ... వారికి మాటలు కరువయ్యాయి...ఆమె యేడుస్తోంది... వేణు ఆమెపేరు పదేపదే మంత్రపఠనంలో వుచ్చరిస్తూ కన్నీరుతుడుస్తున్నాడు... వెక్కిళ్ళమధ్యలో అంటోందామె- "మీరని... తెలుసుకోగానే యేదోభయం... వేసింది..."

"నేనని ఎలా తెలుసుకున్నావు?"

"మీస్వరం వినబడింది...సుపరిచితంగా అనిపించింది. అంతే. బయటికొచ్చి మీగదిలోకి చూచాను ... ఎదురుగా పండుకుని వున్నారు..."ఆమె యింకా దుఃఖిస్తోంది- హృదయంలోని భారం ద్రవించిపోవాలని కాబోలు...

వాసు కాఫీతెచ్చాడు. వేణు బయటికొచ్చి అందుకుని వెళ్ళాడు. ఆమె సన్నని కంపిస్తున్న పెదాలకు కప్పు అందిస్తూ ఆపెదవుల కదలికను తన్మయత్వంతో చూస్తున్నాడు. ఆమె అప్పుడప్పుడు భారమైన విశాలమైన కళ్ళనెత్తి అతనికళ్ళలోకి చూస్తూ సిగ్గుతో మళ్ళీ కళ్ళువాల్చేసుకుంటోంది...

బయట వరండాలో అందరూ చేరారు. తాంసన్ లేచి వచ్చాడు. స్వామిగారి అక్కగారు తెరతొలగించి ఓ మాటు కాబోయే దంపతులను చూచి చప్పున ప్రక్కకు వచ్చి నిల బడింది. వాసు తాంసన్‌కు అంతా చెబుతున్నాడు.

ప్రసాదుగారు అంటున్నారు- "మీ ఋణం ఎలా తీర్చుకోవాలో'" అన్నాను. మీరు రక్షించుకున్నారు. వాడు మీ వాడే మీ...మీ అల్లునిగా స్వీకరించండి...నా కృత జ్ఞతను యీ విధంగా తెల్పుకో గలను..." అతని కంఠం కంపించింది. స్వామిగారు అక్కవైపు అర్థవంతంగా చూచారు. ఆమె కొంగు నిండుగా కప్పుకొని నెమ్మదిగా అంది_ "ఒక చిన్నమనవి. రాధాస్వామి మతస్థులకు తప్ప వేరే వారి కివ్వటం మత విరుద్ధం...మీరు..."

"అమ్మా...అందుకు సందేహ పడకండి...మీ పద్ధతుల ప్రకారమే కానివ్వండి...వాడికి ప్రాణదానం చేసింది మీరు" ప్రసాదుగారి కంఠం రుద్ధమైంది.

"అలా అనకండి...మాకు జీవితంలో లక్ష్యం ఒక్కటే. అందరికీ అదే అనుకోండి. కానీ మాకు అది చాల ముఖ్యమని పిస్తుంది. మనకు ఏ విధంగాను నష్టం కలక్కుండా ఇతరులకు సహాయం చేయగలశక్తి మనలో వుంటే ఆ సదవకాశాన్ని పోగొట్టుకోకుండా ఆదుకోవటం ఒకటి అలవాటయింది. ఆర్థి కంగా సాయం చేయలేని మాలాటి వాళ్ళం కనీసం యీ విధంగా నైన మానవసేవ చేయలేక పోతే మాజన్మ తరించదు"

చాలా రాత్రయిందంటూ అందరూ నిద్ర కుపక్రమించారు.

తెల్లవారింది ఎక్కడివారు అక్కడి కెళ్ళటానికి తయారవుతున్నారు. కారులో శాంత, కమలమ్మ వాళ్లు వచ్చారు.

"వాసు వున్నపళంగా రమ్మన మన్నాడు" అంటూ శాంత ముందు దిగింది.

"ఏమిటి విశేషం" కమలమ్మ అంది.

"పెళ్ళి చూపులు...అంటే కోడలిని చూడటానికి రమ్మన్నాము"

ఇద్దరూ విస్తుపోయారు. గదిలో కెళ్ళమన్నట్లు ప్రసాదు గారు సైగ చేశారు. వారిద్దరు గదిలో కెళ్ళారు. గదిలో వేణు, పరిమళ - వాళ్ళమ్మమ్మ ఉన్నారు. వాళ్ళని చూడగానే అందరూ లేచినుంచున్నారు. వేణు పరిచయం చేస్తున్నాడు - అతని ముఖంలోని ఆనందాన్ని సంతృప్తిని చూచి కమలమ్మ, శాంతలు లోలోపలే ఆనందించారు.

"ఏరా...అందంగా వుండదు - సుమారుగా వుంటుందన్నావే - శాంత వేళాకోళం చేసింది.

"ఏమో - నాకు సుమారుగానే వుంది..." అన్నాడు నవ్వుతూ.

పరిమళ విశాలనయనాలను వాల్చేసుకుంటూ గులాబి మొగ్గలా ముడుచుకు పోయింది.

ఇంతటి అపురూప సౌందర్యవతిని కోడలిగా పొందబోతున్నందుకు కమలమ్మ ఎంతగానో మురిసిపోయింది

బయట కుర్చీలలో కూర్చుని కాఫీ త్రాగుతూ ప్రసాదు గారు స్వామిచరణ్ గారిని ప్రశ్నిస్తున్నారు. "మీ అమ్మాయిని అంతగా చేసుకోవాలన్నవాడు మీగురించి కొ స్తయినా తెలుసుకోలేదు సరిగదా పేరుగూడ తెలియదు ... ఇవన్నీ రహస్యంగా వుంచారెందుకని ?"

స్వామిచరణ్ గారు అర్ధవంతంగా చిన్న నవ్వు నవ్వారు. "ఇదేదో జరిగే విషయం కాదని నా కనుమానంగా వుండేది. రెండు నెలల క్రితం మా చెల్లి ఆరోగ్యం సరిలేకపోతే సహాయానికని అమ్మాయిని పంపించాను. ఒక భాగంలో మీ అబ్బాయి వున్నారు. వారి హృదయాలు కలసినై. చెల్లెలు అన్నీ రాసింది- మీరు విజయవాడలో వుంటారని, మీ రోడ్ రిటైర్డ్ కలెక్టరని — అబ్బాయి బుద్ధిమంతుడని — యిత్యాదులు రాసింది. నేను, అక్కయ్య ఆలోచించాము. ఎంత ఆలోచించినా యిది మీ తాహతుకు తగ్గ సంబంధమని తోచలేదు. వెంటనే అమ్మాయికి రాశాను. ఏది ఎలావున్నా అబ్బాయి తల్లిదండ్రులను ఒప్పించిన తర్వాత మేము సాంప్రదాయానుగుణంగా ముహూర్తం నిశ్చయిస్తామని. అబ్బాయి యిందులో నెగ్గక పోయినట్లయితే వారి తల్లిదండ్రులకయిష్టం అయితే, వారి కోడలిగా ఆమెయే అన్యమార్గం ద్వారా ప్రవేశింప గూడదని ... కొన్ని కుటుంబ విషయాలు గూడ రహస్యంగా వుంచమన్నాను. ఇందుకు కారణం ఒక్కటే. నా అడ్రసు - తెలుసుకుని మీరువస్తారు- లేదా ఎవరినైన పంపుతారు - ఇష్టపడవచ్చు పడకపోవచ్చు - అందులో - అన్నిటిలో మీతో సరితూగలేము......ధనంపై ఆశతో మా

అమ్మాయి అబ్బాయిని వలలో వేసుకుందనవచ్చు ... ఇవన్నీ జరుగవచ్చు అన్నధోరణిలో ఆలోచించాను. ఇలాంటివి దాగవు.. "స్వామిగారమ్మాయి ఒక ధనవంతుల అబ్బాయిని ప్రేమించిందట ... అబ్బాయి తల్లిదండ్రులుఒప్పుకోలేదట ..." అంటూ అందరు చెప్పుకుంటారు. ఇలాజరగటం సుతరాము నాకిష్టంలేదు. మేమంటే మా సంఘంలోను,మా కాలనీలోను ఎంతో గౌరవం ... ఇంకో విషయంగూడ స్పష్టంగా రాశాను- అబ్బాయి తల్లిదండ్రులను ఒప్పించలేక నాదగ్గరకొచ్చి మీ అమ్మాయిని చేసుకుంటాం-అని అన్నా నేను వారిద్దరికి పెండ్లి చేయలేనని ... ఏదిజరిగినా అబ్బాయి తల్లిదండ్రుల ఇష్టం పై ఆధారపడివుందని రాశాను" ప్రసాదుగారు స్వామిగారి స్వార్థరహితమైన అభిప్రాయాలను విని విస్తుపోయారు.

అందరూ వెళ్ళడానికి ఉద్యుక్తులయ్యారు. ఎందుకో వెళ్ళేముందొకసారి నదిని చూడాలనిపించింది. అందరూ నదిని చూసేందుకెళ్ళారు. నీటి ఒరవడిశబ్దం, చల్లనిగాలి - నురగలు గ్రక్కుతున్న తీరప్రదేశం - తేలిపోతున్న చెట్టు కొమ్మలు - చూస్తూ నించున్నారు ... కానీ ఆప్రవాహం మధ్యలో ఎక్కడా ఒక్క చిన్ననల్లటిరాయికూడ గోచరించ లేదు. కనీసం ఎత్తుగావున్న ఆరాయిగూడ నీటిలో మునిగి పోయింది.

అందరి ముఖాలు భయంతో వెలవెలబోయినై. పరిమళ తండ్రిచేతిని గట్టిగాపట్టుకుంది. శాంత - కమలమ్మలు వేణువైపు, వాసువైపు చూస్తున్నారు ... ఆచూపుల్లోనిభావం తెలుసుకోవటం కష్టంకాదు. ఇదంతా గమనిస్తున్నారు ఆ

అమెరికన్.   వెంటనే థాంసన్‌గారు గట్టిగా అంటున్నారు— "రండి... రండి... వెరీ — వెరీ— హేపీ ఎన్‌డింగ్— సంఘటనను ఎప్పటికి మర్చిపోలేను... అసలు వరద లేకపోతే వీరిద్దరికి పెండ్లి అయ్యేదికాదని". వాసు అన్నాడు— టూ్రీ-టూ్రీ— ఏదీ అలా నుంచోండి ఫొటోతీస్తాను. పెద్దకథవ్రాసి మేగజిన్‌కు పంపాలి. మీఫొటోలుంటే మరీ బాగుంటుంది.

అందర్నీ నుంచోబెట్టి కాబోయేదంపతులను మధ్యలో వుంచి ఫొటోలు తీస్తున్నారాయన.

—•—

వ్యధిత హృదయం

రచన : శ్రీమతి కె. సత్యవతి రెడ్డి.

అది ఒక పెద్దగది. అధునాతన పరికరాలతో అందంగా అమర్చబడిన ఆ గది మధ్యలో సోఫాలలో ఆసీనుడై రమేష్ తన మిత్రులతో టీ సేవిస్తూ కూర్చున్నాడు. రమేశ్ ప్రక్క కూర్చున్న 'ఛటర్జీ' మాత్రం అప్పుడప్పుడు ఎదుట కూర్చున్న శాస్త్రీ, పద్మ, శంకర్ లతో మాట్లాడుతూ టీ సేవిస్తున్నాడు. నిశ్శబ్దాన్ని ఆరాధిస్తున్న దొక్క రమేశ్! తాను నవ్వుతూ, మిత్రులను నవ్విస్తున్నా 'ఛటర్జీ' ఆలోచనలన్నీ 'రమేశ్' చుట్టూ పరిభ్రమిస్తున్నయ్. అతని మనస్సులో అంతా 'రమేశ్'ను గూర్చిన ఆలోచనలే!

వ్యాపార రీత్యా 'బిలాస్ పూర్' చేరిన రమేశ్ కు యీ అయిదేండ్లలో చెప్పుకోదగ్గ స్నేహితుడు తానొక్కడే. నిరాడంబరంగా, మితభాషిత్వంతో గంభీరంగా భావించే రమేష్ అనవసరంగా యితరులతో జోక్యం కలిగించుకునేవాడు కాదు. ఒకే కంపెనీలో పనిచేయటం, ఒకే క్వార్టర్సులో వుండటంతో తామిద్దరి మధ్య చెప్పుకోదగ్గ పరిచయం ఏర్పడింది. కాలక్రమాన అదే బలీయస్నేహంగా రూపొంది రోజూ యిద్దరూ కలుసుకోనిదే వుండలేని స్థితి ఏర్పడింది. తానే యెక్కువగా రమేష్ యింటికి వచ్చేవాడు.

ఒకరోజు తాను వచ్చేసరికి రమేష్ ఎదురుగా బల్లపై బంగారుచట్రం అమర్చిన ఒక యువకుని ఫోటో వంక చూస్తూ కన్నీళ్ళు కారుస్తూ కూర్చున్నాడు. అప్పట్లో అతన్ని పలకరిం

చటం యిష్టంలేక వెనక్కి తిరిగి వచ్చేశాడు. యిలాగే రెండు మూడు సార్లు జరగటం, తాను భుజం పట్టి ఊపితే చప్పున కన్నీళ్ళు తుడుచుకుని తన్నాహ్వానించడం జరిగింది. ఆ ఫోటో సంగతి యేమిటో తెలుసుకోవాలని తాను ప్రయత్నం చేయ నారంభించాడు. యెంతబ్రతిమాలినా అతని నోటినుండి ఒక్క విషయం చెప్పించలేకపోయాడు. రమేశ్ మౌనం వహించే కొద్దీ తనకా సంగతి తెలుసుకోవాలనే పట్టుదల ప్రబలింది.

ఎలాగయితేనేం! యిన్నిరోజులకీనాడు మిత్రునితో పోట్లాడి, అతన్ని విసిగించి, వేధించి ఆ రహస్యం యిప్పుడు చెప్పిస్తున్నాడు. ఆసంగతి చెప్పించటానికి తానెంత అవస్థపడింది జ్ఞాపకం రాగానే చటుక్కున ఛటర్జీ పెదవులపై ఒక చిన్న మందహాసం వెలిసింది.

అంతలో రమేశ్ గంభీరకంఠధ్వని ఛటర్జీ ఆలోచనల కంతరాయం కలిగించింది తలత్రిప్పి మిత్రునివంక చూసేవరకు ఆ ముగ్గురూ తనవంకే చూస్తుండటంతో సిగ్గుపడి తల దించుకున్నాడు ఛటర్జీ. రమేశ్ నవ్వుతూ "ఛటర్జీబాయ్! యిన్ని రోజులు నన్ను వేధించిన ఆ ఫోటో విషయం చెప్పబోతున్నాను కాని అదేమంత తెలుసుకోతగ్గ రహస్యం కాదు. అది జ్ఞాపకం వస్తే ... సరే! విను" ఒక్కక్షణం నిశ్శబ్దానంతరం రమేష్ తన కథనం సాగించాడు-

* * *

"అవి నేను కొత్తగా మద్రాసు చేరిన రోజులు. హాస్టలులో వుంటూ కాలేజీలో బి.ఏ చదివేవాణ్ణి. ప్రొద్దున వెళ్ళి సాయంత్రం కాలేజి నుండి రూము కొచ్చేవాళ్ళం.

అక్కడ హాస్టలులోకూడా ప్రొద్దస్తమానం అలసిన మనసుకు కాస్తయినా విశ్రాంతి లేకుండా వంటవాళ్ళ కేకలు, పని వాళ్ళ అరుపులు, స్టూడెంట్ల అల్లరిపనులు — ఒకటే రణ గొణధ్వనిగా వుండేది. ఆ అల్లరి భరించలేక ప్రశాంత వాతావరణం వెదుక్కుంటూ బీచీ వెంట నడిచేవాణ్ణి. జనసంచారానికి దూరంగా ఏకాంత ప్రదేశంలో కూర్చొనేవాడిని. చల్లగా హాయిగా ముఖంమీద చిందిపడే నీటిజల్లు, శరీరాన్ని చక్కిలిగింత పెట్టే పిల్లవాయువులు ప్రొద్దుటినుండి పడిన శ్రమనంతా చిటికలో పోగొట్టేవి. నిశ్శబ్దం రాజ్యం చేసే అక్కడకూర్చుని గంటలు గడిపేవాడిని. కెరటాలు చేసే ధ్వనిలో తీయని రాగాలాపన నా శ్రవణేంద్రియాన్ని తన్మయపరిచేది. మనసు పరవశత్వం పొందేది. ఆ సముద్ర కెరటాలు వుత్సాహంగా నన్నాహ్వానించేవి ఆ నిశ్చలత, నిశ్శబ్దం, అనంతసాగరం, స్వచ్ఛమైన నీలాకాశం, అందులోని పూర్ణచంద్రుడు, తళతళా కాంతులీనే ఆ నక్షత్రసముదాయం - ప్రకృతిశోభను ద్విగుణీకృతం గావించేవి. ప్రతిసాయంత్రం సముద్రసామీప్యంలో గడిపేవాణ్ణి"

"ఒక రోజు మామూలు వేళకు వెళ్ళి కూర్చున్నాను. ఆరోజు సముద్రపుపోటు అధికంగా వుంది. "హోరు"మనే శబ్దంతో పెద్ద పర్వతాలు ఢీకొన్నట్లు వెండి కొండలవలె కెరటాలు విరిగిపడ్తున్నయ్! వాటి వంక తదేకంగా చూస్తూ కూర్చున్న నాకు "నమస్తే" అన్న అపరచిత స్వరం వినిపించి వెనక్కు చూశాను. ఒక బెంగాలీ యువకుడు "మీ ధ్యానం భగ్నంచేశాను, క్షమించండి." అని

మృదువుగా అంటూ నా ప్రక్కనే చతికిలపడ్డాడు. నా పరధ్యానానికి నన్ను నేనే తిట్టుకున్నాను. "కూర్చోండి" అని అతనివంక పరిశీలనగా చూశాను. అతన్నిదివరకెక్కడో చూసినట్టు ఆ ముఖం పరిచయమైనదేనని అనిపించింది. వుండబట్టలేక అతనినే అడిగాను-

"మిమ్మల్నెక్కడో చూశానులా వుంది"

"ఆఁ! చూసేవుంటారు. నేను మీ కాలేజిలోనే బి.ఏ. ఫైనలియర్ చదువుతున్నాను."

"ఓహో! అదాసంగతి" అనుకుని మెల్లిగా సంభాషణకుపక్రమించాను. ఆ తరువాత మేమిద్దరం చదువుగురించి, కాలేజి గురించి మాట్లాడాము. కొద్దిగా చీకటి పడేసరికి అతడు "అబ్బా! చలిగా వుందండీ!" అంటూ లేచాడు. నేనూ అతనిని అనుసరించాను. రోడ్డు దాకా వచ్చి చెరోవేపు చీలిపోయాం. అప్పటికే చీకటి చిక్కగా అలుముకుంటోంది ధగధగా మెరిసే మెర్క్యురీదీపాలు జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్నయ్! దుకాణాలలో అందంగా అమర్చబడిన అద్దాలలో ఆ దీపాలకాంతి ప్రతిఫలించి వింతసోయగం కల్పిస్తుండగా అన్ని కొట్లు కిటకిటలాడుతున్నయ్. బేరగాళ్ళతో, రంగురంగుల పట్టువస్త్రాలతో అప్సరసలవలె అలంకరించుకున్న అతివలు కొందరు రోడ్డంతా తమదే నన్నట్టు కిలకిలారావములతో ముందుకు సాగిపోతున్నారు. నున్నగా తెల్లగా మెరుస్తున్న తారురోడ్డుపై సర్రున దూసుకుపోయే కార్లు అసంఖ్యాకం. మామూలుగా ఆ వేళల్లోనే మద్రాసు నగరము చూడ ముచ్చటగా వుంటుంది.

సరే! హాస్టలుకు వచ్చి భోజనం చేసి పడుకున్నాను. పడుకున్నానే గాని నా మనస్సంతా ఆ యువకుని గూర్చిన ఆలోచనలతోనే నిండిపోయింది.

"అతని పేరు 'సురేష్ ముఖోపాధ్యాయ్' నిజంగా ఎంత చక్కటి రూపం. బహుశా ఐదు అడుగుల ఆరంగుళాలు వుండొచ్చు. పొడవుకు తగ్గ పుష్టిగల శరీరం, కోలమొహం, ఎప్పుడూ నవ్వుతున్నట్టుండే కన్నులు, సన్నటి పొడవైన నాసిక– కొద్దిగా విచ్చుకున్న లేతపెదిమలు, వాటిమధ్య ఆణి ముత్యాలవంటి పలువరుస– కండ్లకు సన్నని బంగారు ఫ్రేము అమర్చిన కళ్ళద్దాలు, ఎడంచేతికి బంగారపుగొలుసుగల వాచి.. మధ్యవేలికి ఒక్కగానొక్క– వజ్రపుటుంగరం– నీటుగావున్న ఖరీదైన సిల్కుదుస్తులు– నల్లగా ఒంకులు తిరిగిన క్రాఫు అతని రూపం మరింత పుత్కృష్టంగా కన్పింపజేస్తూంది. అంతే కాదు. సంస్కారం, సభ్యత పుట్టిపడే ప్రవర్తన, వినయం సరళత్వం మిళితమైన మృదుస్వభావం, అతని అందానికీ మరిన్ని వన్నెచిన్నెలు తొడుగుతోంది. ఏమైనా, ఆ రాత్రంతా నాకతని రూపం కళ్ళముందు నిలిచింది.

"ఆ రోజు మొదలు తరచుగా మేమిద్దరం సముద్ర తీరంలో కలిసేవాళ్ళం. కాలేజీలో కూడా విశ్రాంతి సమయాల్లో మాట్లాడుతుండేవాళ్ళం. ఇందులో గర్వించతగ్గ విషయమేమిటంటే విద్యార్థులు, లెక్చరర్లు అందరూ సురేష్ స్నేహంకోసం ప్రాకులాడేవారు. అయితే అతను మాత్రం ముక్తసరిగా వాళ్ళడిగినదానికి జవాబిచ్చి వాళ్ళ మనసు నొవ్వకుండా వాళ్ళను బంధించుకొని అతి శీఘ్రంగా బైటపడే

వాడు. కాని, అదేమిచిత్రమో, నాతో తరుచుగా మాట్లాడ టం, నా స్నేహంకోసం ప్రయత్నించటం చూస్తే నిజంగానే నాకు ఆశ్చర్యమేసేది. బీచీలో కలుసుకున్నంత మాత్రాన నాతో స్నేహపాత్రమైన ఏ అంశం గమనించాడో, ఏ ఆకర్ష ణకు లోనయ్యాడో నాకైతే తెలియదు. కానీ, మా స్నేహం మాత్రం కాలక్రమాన దృఢత్వాం పుంజుకొని పటిష్టం కాసా గింది. ఆ నాటికానాడు నాకతనిపట్ల గౌరవంకూడా పె సాగింది అందుక్కారణం అతని గంభీరహృదయమే కావచ్చు. ఎంతటి స్నేహితులమైనా మాకుటుంబాన్ని గురించి అతడడగ టంకాని, నేను అతన్ని ప్రశ్నించటంకాని జరుగలేదు. సాధార ణంగా మేము రాజకీయాలగురించి, సాంఘికసమాచారాల గురించి, లోకంపోకడ గురించీ, చదువుగురించీ మాట్లాడే వాళ్ళం అందువల్ల ఒకరినిగురించి ఒకరికి తెలిసిందేమీలేదు.

"అయితే ఒకరోజు ఆ అదృష్టం కలిసివచ్చింది. నా మిత్రుని గురించి సర్వం తెలుసుకునే శుభసమయు మాసన్న మైంది.

"అది నవంబరు నెల. చలి బాగా మొదలైంది పట్టణ మంతా 'దీపావళి' సంరంభంతో వుత్తేజకరంగావుంది. 'ధాం ధూం' శబ్దాలతో చెవులు దిమ్మెక్కుతున్నాయ్."

"తెల్లవారితే దీపావళి. చీకటి పడింది. కాని బీచీలో సురేష్‌జాడ ఎక్కడా లేదు. ఇక నేనుకూడా వెళ్ళాలని లేచాను. కాని అంతలోనే దూరంగా సురేష్ రావటం కన్పించి నిలిచి పోయాను. ఆయాసంతో రొప్పుకుంటూవచ్చి నాదగ్గర నిలబడి "రమేశ్! రేపు నాపుట్టినదినం.కనుక రేపంతా నీవు మాయిం

ట్లోనే వుండాలి. హృదయం రెడీగావుంది. నేను రూంకొస్తాను" అని ఒక్కనిమిషం నిలబడకుండా ఆదరాబాదరాగా పరుగెత్తి పోయాడు తెల్లబోయి నేను అతడు వెళ్ళిన వైపే చూస్తూ నిలబడ్డాను. అతడి వింతధోరణికి నిజంగానే నాకు మతిపోయి నంతపనైంది. పుట్టినరోజని స్నేహితుడిని ఆహ్వానించాడుగదా! సంతోషంగా కాసేపు కూర్చొని సరదాగా కబుర్లు చెప్పకుండా ఎవరో తరుముకొస్తున్నట్లు పరిగెత్తి పోయిన సురేష్ మనస్తత్వం నాకేమీ అర్థంకాలేదు. నేనూ లేచి బజారువైపు బయల్దేరాను. నలుదిశలు చీకటితో నల్లగా కాటుక పులుముకుంటున్నాయ్. ప్రతియిల్లు దీపాల తోరణాలతో అందంగా అలంకరించబడింది. ఆ చిక్కటి చీకటిలో కోటి సూర్యప్రభా సదృశంగా వెల్గి క్షణంలో అంతర్ధానమయ్యే పూలమతాబులు, రంగురంగుల పూలు వెదజల్లే పూలబత్తీలు చూస్తూ మెల్లిగా నడుస్తున్నాను. పట్టణమంతా పిల్లల వుత్సాహపూరితమైన కేరింతలతో, పెద్దవారి అరుపులతో అమిత కోలాహలంగా వుంది. చీకటిలో మిణుకుమిణుకు మనే దీపాలు, పూలబత్తులు, ఆకాశంలో కాంతికిరణాలు వెదజల్లే చిచ్చుబుడ్లు, అంతా చూస్తూ నడుస్తుంటే అదేదో వింతలోకంలో విహరిస్తున్నట్లే వున్నది.

మరుసటిరోజు నేనింకా బెడ్ మీదుండగానే సురేశ్ హాజరయ్యాడు. తలంటిపోసుకుని తెల్లటి సిల్కుబట్టలు ధరించిఅతి సిరాడంబరంగా వచ్చాడు. అతిసిబలవంతం మీద అయిదునిమిషాలలో తయారయి వచ్చి కారులో కూర్చున్నాను. నున్నటి రోడ్డుమీద కారు రయ్యిన దూసుకు

పోతోంది. చలిగాలి రివ్వున వీస్తోంది. కారు పోయిపోయి అప్పటూరులో ఒక రెండంతస్తుల భవనముందాగింది. హారన్ విని ఒక సేవకుడు పరుగునవచ్చి గేటు తెరిచాడు. గేటు నుండి యింటివరకు సుమారు అరఫర్లాంగు దూరం సిమెంటు రోడ్డువేశారు. దాని కిరుప్రక్కల రకరకాల క్రోటనుపూలు గాలికి ఉల్లాసంగా తలలూపుతున్నయ్! కారు వెళ్ళి పోర్టికో ముందాగింది. సురేష్ దిగి నా చెయ్యి పట్టుకుని లోపలికి దారితీశాడు. వరండాలో ఒక అరవై యేళ్ళ వృద్ధుడు తన గుబురయిన మీసాలలో చిరునవ్వు దాచుకుంటూ నిలబడ్డాడు. సురేష్ తన తండ్రిని పరిచయం చేశాడు. ఆయన నవ్వుతూ మమ్మల్ని లోపలకి తీసుకువెళ్ళారు. అది పెద్ద హాలు. క్రింద పరచిన తెల్లటిపాలరాతి పలకల్ని మూస్తున్న అతిఖరీదయిన రత్నకంబళ్ళు కళ్ళు జిగేల్ మనిపిస్తున్నయ్. వెళ్ళి సోఫాలో కూర్చున్నాను. సురేష్ లోపలికి వెళ్ళాడు. కుర్చీలో కూర్చుని చుట్టూ కలయజూచాను. యెదుటివారి నీడల్ని సైతం ప్రతిఫలింపచేసే స్వచ్ఛందతతో ధవళకాంతు లీనే గోడలు, నాలుగుగోడలకు నాలుగేనాలుగు ప్రకృతిదృశ్యాల ఫోటోలు! హాలు నాలుగుమూలలకు మెత్తని సాటిన్ పరుపులమర్చిన బెంచీలు, వాటికెదురుగా గుండ్రిటి బల్లలు, కిటికీలలో నీడలో పెంచే క్రోటనులు అతి చక్కగా కుంపట్లలో తీర్చిదిద్దారు. అన్ని టేబుళ్ళపై వెండి పూలగుత్తులు! మేము కూర్చున్న సోఫాలు సుమారు రాజుల సింహాసనాలంతేసి వున్నయ్! నేను కూర్చున్న కుర్చీ కెదురుగా నలుచదరపు బల్లపై చుట్టూ ఎంబ్రాయిడరీ చేసిన

తెల్లటి సిల్కుబట్ట పరిచారు. దానికి ఒకమూల చిన్న యాష్‌ట్రే మధ్యలో ఆకులతో కొమ్మలతో చెట్టురూపంగా మలచిన పూలగుత్తి వెండిదొకటి పెట్టారు. ఆ ఆకుల మధ్యనున్న సన్నటి రంధ్రాలలో గుచ్చిన ధూపబత్తీలనుండి ధూమం వయ్యారంగా సుళ్ళుతిరుగుతూ లేచి గదంతా సుగంధం విరజిమ్ముతోంది. అన్ని కిటికీలకు, ద్వారాలకు ఖరీదైన సిల్కు తెరలు రెపరెపలాడుతున్నయ్. సురేష్ ధనికుడని తెలుసుగాని, యింతటి లక్షాధికారి ఏకైక పుత్రుడని తెలియదు. ఆగర్భ శ్రీమంతుడైకూడా ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నవాడివలె విచారంగా, ముభావంగా వుండటం ఎందుకో నాకు తెలియదు. అంతలో అలికిడైతే తిరిగి చూశాను. బహుశా అతని తల్లి కాబోలు సురేష్ వెనుక నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చింది. పసుపుపచ్చటి సిల్కుచీర తలమీదుగా ముసుగు వేసుకొంది. పెద్ద ఫాలభాగంలో రూపాయకాసంత ఎఱ్ఱటి కుంకుమ, చేతులనిండా గాజులు, కండ్లల్లో ప్రతిఫలించే మాతృప్రేమ, సన్నటి లేత పెదిమలపై తొంగిచూసే చిరుదరహాసం— ఎవ్వరికైనా చూసీచూడగానే గౌరవభావం వుదయించక మానదు. లేచి వినయంగా నమస్కరించాను. ప్రతినమస్కారం చేస్తూ "కూర్చో బాబు! అబ్బాయి నిన్నుగురించి చెప్పాడు. నీవు మాకూ సురే లాటివాడివే. ఇక్కడ ఏమీ సంకోచపడనవసరంలేదు" అంది. కాసేపు అవి యివీ మాట్లాడాము. తర్వాత వాళ్ళిద్దరు మేమూ మాట్లాడుతూవుంటే నవ్వుతూ మామాటలు వింటూ కూర్చున్నారు. ఆ యిద్దరిలోనూ వృద్ధాప్యఛాయలు స్పష్టంగాకనపడుతున్నయ్ సురేష్

తండ్రి నందరూ 'విషన్ బాబూ' అంటారు. ఆయనముఖంలో ఎప్పుడూ గంభీరం తొణికిసలాడుతుంటుంది. వృద్ధదంపతులిద్దరూ ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులను దృష్టికి తెస్తుంటారు. కొద్దిసేపయ్యాక సురేష్ తనగదికి, మేడమీదికి తీసుకుపోయాడు. ఆగదిలో కూడా అతి విలువైన సామాన్లే వున్నయ్. ఏమూల చూసినా శ్రీ తొంగి చూస్తుంది. ఆరోజు భలే వుల్లాసంగా గడిపాము. రాత్రివరకు అక్కడే వున్నాను. వచ్చేముందు సురేష్‌తల్లి నేను రోజూ వాళ్ళింటికి వచ్చేలా ఒట్టువేయించు కొంది. ఆ భార్యాభర్తలు నాపై చూపిన ప్రేమ, వాత్సల్యం చూస్తూంటే నాకళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అదే మొదలు ఆయింటికీ నాకూ తెగ్గింపరాని బంధ మేర్పడింది. నాబీచీప్రోగ్రాం మారింది. దానిబదులు రోజూ అడయారుకు బయల్దేరే వాడిని. ముఖ్యంగా ఆయింట్లో నన్నాకర్షించింది వాళ్ళతోట. ఇంటివెనుక పెద్దతోటవుండేది. గులాబీ, జాజి, మల్లె, చేమంతి, పూబంతి, సంపంగి, పున్నాగ, మొగడ, యింకా అనేకరకాల పూలచెట్లు, జామ, సీమరేగి, అంజూరా, అంగూర్, ఆప్రికాటు సేబు, దానిమ్మ యెన్నో వృక్షాలు దట్టంగా వున్నయ్. వుత్తరహిందూస్థాన్ జన్మస్థలం అయినందువల్ల తోటలో అక్కడిరకాలన్నీ తెప్పించివేశారు. స్వేచ్ఛాజీవినైన నాకు తోటలో కూర్చొని వివిధ పుష్ప సౌరభం ఆఘ్రాణిస్తూ, పక్షుల కలకలారావాలు వింటూ బాగాపండిన జామ, సేబుపండ్లుతింటూ కూర్చుంటే యిక ప్రపంచమే అక్కర్లేదనిపించేది.

"ఆ యింటి పరిచయ భాగ్యంతో నేను, సురేష్ సంవత్సరకాలాన్ని నిమిషాలకింద త్రిప్పివేశాం. సురేష్ బి ఏ. పరీక్షలు ముగిశాయి. నేను వేసవి శలవలకు యింటికిపోవాలని సామాన్లు సర్ది, అందరిదగ్గర శెలవుతీసుకొని వూరికి బైలు దేరాను."

"సురేశ్ పరీక్షాఫలితాలు తెలిసినరోజు నా ఆనందానికి హద్దులేదు. అంత సంతోషం ఒక్కడిని ఎలాభరించాలో తెలియలేదు. వెంటనే నా సంతోషం తెలియజేస్తూ సురేశ్‌కు 'గ్రీటింగ్స్' పంపించాను. సురేశ్‌కు వచ్చిన ఫస్టుక్లాసే ఒకవేళ నాకువచ్చినా నేనంత ఆనందం పొందేవాడిని కాదని నిరాఘాటంగా చెప్పగలను. ఆక్షణంలో అతడు నా ఎదురుగా వుంటే ఆపారవశ్యంతో సురేషును నలిపి నమిలేసేవాణ్ణి"

"కానీ నా అంత వుత్సాహము రెండురోజుల్లో చప్పగా చల్లారిపోయింది. సురేశ్ రాసిన వుత్తరంవల్ల తనకు పైచదువులు చదవాలని లేదని రాస్తూ యిలా రాశాడు. "రమేశ్! నాన్నగారు వచ్చి అడిగారు. 'బాబూ! తర్వాత ఏంచేద్దాం అనుకుంటున్నావ్' అని. నాకు పై చదువులపై యిష్టంలేదని, నేను చదివి ఎవర్ని వుద్ధరించేది మాత్రిం ఏముందనీ, కనుక ఎందుకోసం చదవాలని అన్నాను. నాన్న కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది. అవును. నా గొంతులో కూడుకున్న బాధ నాన్న క్షుణ్ణంగా గ్రహించారు. అందుకే పొంగివస్తున్న దుఃఖం అణుచుకుంటూ 'నీయిష్టం' అని లేచి వెళ్ళారు.

రమేశ్! నేను హృదోగ్రిగనన్న సంగతి నీకు తెలుసు కదూ! నన్ను నేనే రక్షించుకోలేని దౌర్భాగ్యుణ్ణి ఇక యితరుల

నేమి వుద్ధరించగలను. గుండె నొప్పితో కృత్రిమంగా జీవించే నాజీవితానికి ఏనిమిషం పరిసమాప్తి పలుకుతుందో, ఏక్షణం నా ప్రాణవాయువు లనంతవాయువుల్లో లీనమౌతాయో ఎఱుగలేని మూర్ఖుణ్ణి. 'విద్య' అనేది ఎంత గురుతర బాధ్యతాయుత కార్య భారమో నీకు తెలియదా ? ఆ బరువు స్వీకరించామంటే యిక చుట్టాలు, పక్కాలు, బంధుమిత్రులు, తల్లిదండ్రులు ఎవ్వరు స్మృతి పథంకు రారు. ఆ మహాసాగరంలో లీనమవ్వాల్సిందే ! ఇప్పటికే తను గర్భశుక్తి ముక్తాఫలము. తమ ఏకైక సంతానం, శ్రీమంతుడు, నవయువ్వన విలాసవంతుడు. సమస్త సౌఖ్యాలతో నిత్యకళ్యాణం పచ్చతోరణంగా నిండు నూరేళ్లు సుఖమయ జీవితాన్ని గడపాల్సింది పోయి, నిత్యం భరింపరాని మనో వేదనా, నిరాశా నిస్పృహలతో సర్వసంగపరిత్యాగివలె ఏ శూన్యలోకాల్లోనో తన జీవిత పరమార్థం వెతుక్కుంటున్న నన్ను, యీ నిర్భాగ్యుణ్ణి చూచి అమ్మా, నాన్నా లోలోన ఎంత కుమిలి పోతున్నారో నాకు తెలియదా! నీకు తెలియదా? అది తెలిసీ యింకా నేను చదువులో పడి వారికి దూరమయ్యేదా ! అయినా నీవే చెప్పు రమేశ్ ! నే నింకా ఎందుకు, ఎవరికోసం చదవాలి ? అన్నీ ఆలోచించి నేనొక దృఢ నిశ్చయాని కొచ్చాను. నేను జీవించే స్వల్పకాలమూ యిక ఏ బాధ్యతలూ లేకుండా నిర్విచారంగా తల్లిదండ్రుల సామీప్యంలో గడుప నిశ్చయించుకున్నాను."

"అంతవరకు వుత్తరం చదువగానే పొరలు పొరలుగా క్రిమ్మిన కన్నీటితో మిగిలిన అక్షరాలన్నీ అలుక్కుపోయి

నట్లు మసగ్గా కనిపించాయి. ఇక చదువలేకపోయాను. అందు లోని ప్రతి వాక్యమూ సురేష్ అంతర్గతా వేదన స్ఫుటంగా బహిర్గతం చేస్తోంది. పాతికేళ్ళు నిండని ఆ వయస్సులోనే అతని మనస్సులో ఎంతటి బడబాగ్ని ప్రజ్వరిల్లుతోందో, పాలుగారే ఆ పసిహృదయంలో ఎంతటి శోకాగ్ని ఆవిర్భూత మైందో తల్చుకోగానే వణికిపోయాను."

అంతవరకు బిరబిర పారే క్రిష్ణవేణిలా సాగిన వాక్ ప్రవాహం తక్కున ఆగిపోయింది. నిశ్చేష్టత దేహంతో, నిశ్చలమనస్సుతో ఏదో లోకంలో విహరిస్తున్న మిత్రులు ముగ్గురు వులిక్కిపడి రమేష్ వైపు చూశారు. భారంగా ఒక నిట్టూర్పు విడిచి తనవైపు కుతూహలంగా చూస్తున్న స్నేహితులవైపు చూసి తన కథ తిరిగి ఆరంభించాడు రమేశ్-

"శంకర్ ! మీకు ఒక చిన్న సంగతి చెప్పటం మరచి పోయాను. సురేష్ తల్లితో పరిచయమైన కొద్ది రోజులకే నే నొక విచారకరమైన సంగతి తెలుసుకొన్నాను. సురేష్ స్కూల్ ఫైనల్ చదివేరోజుల్లో అతనికి హఠాత్తుగ గుండె జబ్బు పట్టుకుంది. మానవుడెన్ని ప్రయత్నాలు చేయగలడో అన్నీ చేసి ఫలితం కనిపించక విసిగి వేసారి తమ దురదృష్టం నిందించుకున్నారు అతని తలిదండ్రులు. అప్పటి నుంచి ఆ ఆగర్భ శ్రీమంతుడు, అష్టైశ్వర్య సంపన్నుడు సురేశ్ తన జీవితంలో అతి విలువైంది ఏదో పోగొట్టుకున్నాననే భావ నతో ఆ భ్రమకు లోనై అన్నిటిని త్యజించి అందరికి దూరంగా మసల్తూ వచ్చాడు. ఏ క్షణంలో తను మృత్యు పరిష్వంగంలో నిబిడీకృతం కావాలో, ఎంత బాధ అనుభ

వించాలో అన్న ఆవేదన, భయం అతనిలో గాఢంగా నరనరాల్లో జీర్ణించిపోయినయ్. దానితో అన్నిటిపైన వైముఖ్యం నిరసన, వేదాంత ధోరణి ప్రబలి పోయాయ్. బంగారు పండు వంటి తమ పుత్రుడి జీవితం యిలా అనుకో[illegible]ంగా మారటంతో అవధుల్లేని అశాంతితో లోపల్లోపలే కుమిలి పోతున్నారు ఆ దంపతులు. ఆ అభిప్రాయంతో తాను జీవించటమే దండుగ అన్న నిరాశతో ఆ విధంగా ఉత్తరం వ్రాశాడు సురేష్."

"సెలవులు పూర్తి కాగానే బి. ఏ. ఫైనలియర్ పూర్తి చేయ సంసిద్ధుడనై మళ్ళీ మద్రాసులో అడుగు పెట్టాను. స్టేషన్ నుండి నేరుగా సురేష్ యింటికి వెళ్ళాను. నేను అక్కడున్న మూడు రోజులు నామిత్రుణ్ణెలాగైనా యమ్. ఎ. చదివేలా చేయాలని శతవిధాల యత్నించి విఫలుణ్ణయాను. నా ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు చందమైంది. సురేష్ తండ్రినీ అడిగి చూశాను. ఆయన భారంగ నిట్టూర్చి వూరుకున్నారు, చివరకు సురేష్ తల్లిని కూడా కదిలించా నీ విషయంలో. ఆమె విషాదంగా నవ్వి ఒక్కక్షణం వూరుకొని మెల్లిగా యిలా అంది- "ప్రయోజనం లేదు బాబూ! సురేష్ ఎంతటి దృఢ మనస్కుడో నాకు బాగా తెలుసు. వాడేదైతే అంటాడో అది అలా జరిగిపోవాల్సిందే! దానికి తిరుగుండదు నేను, వారూ ఎంతో ప్రయత్నించి చూశాము. ఫలితం లేకపోయింది. చదువులో పడితే, యీ వైరాగ్యం మాని మళ్ళీ కాలేజీ, స్నేహితులు,

పరదాలూ అంటూ మన లోకంలో పడ్డాడని చూశాం. కాని లాభం శూన్యం" అంటూ గభాలున మొహం పక్కకు త్రిప్పుకొంది ఏదో వెదుకుతూ. ఆవిడ కనుకొలుకుల్లో నిలిచిన నీరు నేను గ్రహించ లేదనే ఆవిడ భావం. చేసేదిలేక నిరాశావ్యాతుడనై హాస్టలుకు పోయాను. మరల దైనందిన కార్యక్రమం ఆరంభమయింది. కాలేజీకి వెళ్ళటం, రావటం, సురేష్ యింటికి పోవటం, చదువు ఇలాగే జరిగేది. ఎప్పుడైనా ఒక్కరోజు పనివల్ల వెళ్ళకపోతే, మరుసటిరోజే సురేష్ నౌకరు హాజరయ్యే వాడు రూంలో_ "బాబూ! అయ్యగారు తమర్నొకసారి రమ్మంటున్నారు" అంటూ.

"కాల చక్రంలో ఆరు నెలలు అతి వేగంగా దొర్లిపోయాయి. నాకు ఫైనల్ పరీక్షలు యింక మూడు నెలలు మాత్రమే. ఒక రోజు కాలేజీ నుంచి రాగానే మిత్రుని దగ్గరికి బయల్దేరాను. ఇక వాళ్ళింటికి తరుచూ రావటం పడదని అమ్మతో చెప్పాలనుకున్నాను. నేను యింటికి వెళ్ళేసరికి ఎవ్వరూ లేరు. వంటింటి దగ్గరకు పోగానే వంటవాడు నన్ను చూసి గాబరాగా లేచి నిలబడి "బాబూ! ఇప్పుడే అయ్యగార్లిద్దరూ బయటికి వెళ్ళారు." అని చెప్పాడు. అమ్మ ఏదిరా అని అడుగుతే అలహాబాద్ చుట్టాలింటికి వెళ్ళారు బాబూ అన్నాడు. కాస్సేపు కూర్చొని వచ్చాను.

"ఒక దినం వుదయం కాలేజీకి వెడుతూ రూంకు తాళం వేస్తున్నాను. అంతలో సురేష్ నౌకరు వచ్చి "బాబూ! అమ్మగారు మిమ్మల్నిసాయంకాలం రమ్మన్నారు

అన్నాడు. సరేనని నేనారోజు సాయంత్రం అక్కడికి వెళ్లాను. సురేష్ తండ్రినందరూ 'విపిన్ బాబూ' అంటారు అని చెప్పాగా! విపినబాబుతో ఎవరో పెద్ద మనుష్యులుమాట్లాడు తున్నారు. నేను సరుగా వెళ్ళి సురేష్ తల్లి గదిముందు ఆగాను. ఆ సవ్వడికి తలెత్తి చూసి ఆవిడ నన్ను లోపలికి పిల్చి కూర్చోపెట్టింది. ఆవిడ చెప్పిన సారాంశ మేమంటే అలహాబాదులో ఆమె పినతండ్రి కొడుకున్నాడట. బాగా పేరు ప్రతిష్ట వున్న కుటుంబం. అతని పుత్రిక బహు సద్గుణ సౌందర్యవిరాజితఅని విద్యావివేకసంస్కారవతియైన ఆ అమ్మా యిని సురేష్‌కు యివ్వాలని సంకల్పం కలగటంచేత నా మిత్రుణ్ణి ఒప్పించే భారం నాదని చెప్పింది. చెప్తూ యిలా అంది. "ఏమిటో బాబూ! వాడి ధోరణి మా కర్థం కావటం లేదు- పొద్దుట భోజనాల సమయంలో అబ్బాయితో మా వారు ఆ సంగతి చూచాయగా ఎత్తారు. వాడి సమాధానం వింటే భయంతో ఒళ్ళు జలదరిస్తుంది. ఇప్పటికీ గుండెదడ తగ్గలేదు. ఏదో కొద్దిగా గుండె నొప్పి వుందని పెళ్ళి వద్దం టారా? నా జీవితానికి పెళ్ళి వొకటి తక్కువా? అన్నట్లు మాట్లాడాడు." చెపుతూ హఠాత్తుగ ఆపేసింది. అమిత వ్యథ వల్ల ఆమె మొహం క్రమంగా వివర్ణమైంది. ఇక చెప్పలేక దీర్ఘంగ నిట్టూర్చి మెదలకుండా వూరుకొంది. ఆ మాతృదేవి క్షోభ ఎవరర్థం చేసుకోగలరు?

"నేను అక్కడనుంచి లేచి తిన్నగా పైకి సురేష్ దగ్గ గరకు వెళ్లాను. నన్ను చూచి ఆనందంగా ఆహ్వానించాడు.

కాసేపు అవీ యివీ మాట్లాడిన తరువాత నేను పెళ్ళి సంగతి ఎత్తాను. పెళ్ళంటే ఏమిటి? పెళ్ళివల్ల కలుగబోయే లాభాలు, జీవితం ఎంత సరదాగా, సంతోషంగా గడిచేదీ, సురేష్ భావి జీవితం బంగారు పంటలతో ఎల్లా కళకళ్ళాడేదీ, వివరిస్తూ వృద్ధులై ఏకాంత వాసులై యున్న తల్లి తండ్రి, కొడుకుపెళ్ళి వల్ల ఎంత ఆనందం పొందగలరో వర్ణిస్తూ గంట, గంటన్నర అనర్గళంగా వాగాను. అన్నిటికి సురేష్ చిరునవ్వే జవాబయ్యింది. చివరిలో "రమేశ్ ! నీకు పిచ్చా ఏమిటి ! నాకు యీ నిరర్థక జీవికి పెళ్ళా" అన్నాడు. ఇహ అప్పుడతన్ని వేధించి లాభం లేదని ఆరోజుకు వెళ్ళి పోయాను.

"తర్వాత మరి మూడు రోజులకు సురేష్ యింటికి వెళ్ళాను. ఆ రోజంతా అక్కడే వుండాలని మావార్డెన్‌తో పర్మిషన్ తీసుకున్నాను. భోంచేసి రాత్రి సురేష్ నేను సైటకి వెళ్ళాము. తర్వాత మా యిద్దరి మధ్య వాగ్యుద్ధం జరిగింది. ఎంత బ్రతిమాలి బామాలినా, మందలించినా, తిట్టినా కూడ ఆ మొండి మానవుని దగ్గర లాభం లేక పోయింది. నేను జీవితంలో ఎప్పుడూ ఎవ్వరితో వాదించని విధంగ నా మిత్రునితో వాదించాను. ఫలితం శూన్యం అన్నింటికి ఒక్కటే జవాబు. "నేను జన్మలో వివాహం చేసుకోను" అని చిట్ట చివరకు అనునయంగా, ప్రాధేయ పూర్వకంగా యిలా చెప్పాను.

"చూడు సురేష్ ! బ్రతుకు భగవంతు డిచ్చిన వరం. దాన్ని మన చేతనైన విధంగా అనుభవించి, సుఖించటం మన

జీవిత ధ్యేయం. ఎప్పుడో, ఏదో వస్తుందని యిప్పుడన్ని సుఖాలు త్యజించి వుండగలవా? నీకేం తక్కువయింది? చదువా? రూపమా సంపదా? ఆగర్భ శ్రీమంతుడవు. అతి రూపసివి. ఆరోగ్యం లేదా? ఏ ఏడాదికో, రెండేండ్లకో నొప్పి వస్తుందని యిక నీవు పూర్తి అనారోగిష్టివనుకుంటు న్నావా? 'ఆశ' అనేది మానవ జీవితానికి మహత్తరమైన శక్తి. ప్రపంచంలో "ఆశ" అనేదే లేకుంటే మనుష్యుడెన్నడో మృత ప్రాయుడయ్యేవాడు. ఆశతోనే జీవిత పురోగమనం పృధివిలో నిరభ్యంతరంగా సాగుతుంది. వివాహం వల్ల సంభ వించిన సంతోషంతో నీవు పూర్తి ఆరోగ్యవంతుడవు కాగల వేమో! ఎంతో బలాఢ్యుణ్ణనుకున్న నేను యీ క్షణంలో అపమృత్యువు వాత పడకూడదా? చచ్చే రోగియైనా, పుట్టుగుడ్డియైనా, ఆ జన్మ అవిటియైనా పెళ్ళి అంటే పరమా నందం పొందరా? శరీరమంతా కుష్ఠుతో కృళ్ళి చీము కారుతూ నెత్తురోడుతున్న దరిద్రుడామోదరుడు కూడ పెళ్ళాం, పిల్ల లతో అతి సంతోషంగా జీవించటం నీ కళ్ళతో చూడటం లేదా?

"అయినా అదేమిటయ్యా! ఎప్పుడో నీకు నొప్పి వస్తుందనుకుందాం. అంత మాత్రంలోనే నీవు చచ్చి పోతావా? చస్తే మాత్రమేం? అంత వరకు సౌఖ్యం అనుభ వించ కూడదా? పుట్టినప్పుడు గిట్టక తప్పుతుందా? నొప్పి వచ్చిన వెంటనే హఠాత్తుగ చస్తానని భయపడతున్నావ్? ఏం? అలా అని నీకు కలవచ్చిందా? లేక ఎప్పటికి అమరుడివి

కావాలనుకుంటున్నావా ? ఏ క్షణంలో గుండె నొప్పి సంభవిస్తుందో అని మూర్ఖుడివై, భీరువై నాకు పెళ్ళివద్దూ పేరంటం వద్దని హఠం పట్టటం బాగుందా ? అయినా చూడు సురేష్ ! మనం లోకంలో జీవించేటప్పుడు మన కిష్టం లేకపోయినా, మన ఆత్మకు వ్యతిరిక్తంగా అనేక కార్యాలు సలపవలసి వస్తుంది. అది తప్పదు. నిన్ను మోసి కని పెంచి పెద్దజేసి నీవు తుళ్ళుతూ. గెంతుతూ హాయిగా జీవిస్తుంటే చూచి ఆనందిద్దామనుకున్న తలిదండ్రులనెంత కింత క్షోభ పెడ్తావ్? తమ యావజ్జీవితం నీకై ధారపోసి, నీ సుఖం కోసం వాళ్ళెంత ఆ వేగంతో ఆరాటంతో, ఆత్రతతో నిరీక్షిస్తున్నారో, నీకు తెలియదా ? నిన్ను పువ్వుల్లో పెట్టి కంటికి రెప్పలా కాచినందుకు వారి నిలా వ్యధ ననుభవింపమంటున్నావా? జీవితంలో తమకూ కోడలంటూ వస్తుందా అని ప్రాణాలతో బాటు సర్వ ఆశలూ అరచేతిలో వుంచుకొని జీవిస్తుంటే చూసి ఎలా భరింపగల్గుతున్నావ్ ? నీ కోసం కాదు. అవును నీ కోసం కాకపోయినా మానసిక సంక్షోభంలో మగ్గిపోయే తల్లిదండ్రులను; అనురాగ హృదయులను సంతోషింప జేయటానికి నీ జీవితంలో ఒక్కసారీ, ఒక్కసారి త్యాగం చేయలేవా ? వాళ్ళనెందుకలా ఆశలకు, అనురాగాలకు, అనురాగాలకు, అగ్రహానుగ్రహాలకు, దూరంచేస్తావ్ ? వారు చేసిన పాపం ఏమిటి సురేష్! దుఃఖంతో నాగొంతు పూడిపోయింది. వారి మనస్తాపం తల్చుకొని వెక్కి వెక్కి వడ్చాను. అన్నిటికీఅతీతంగా, నిశ్చలపాషాణ ప్రతిమలాగా కూర్చున్నాడా ధర్మాత్ముడు.

"ఆరాత్రి మేమిద్దరం ఒక్కక్షణం కన్నుమూయలేదు. ఇటో, అటో తేలాలన్న గట్టిపట్టుదల, పౌరుషం ప్రబలాయ్ నాలో. నేననా ఒళ్ళు తెలియని వుద్రేకంలో మాట్లాడుతుంటే తెల్లబోయి చూస్తూ సురేష్ మెల్లగ యిలా అన్నాడు. "చూడు రమేష్! నాన్న, అమ్మే కాదు. నీవూ నన్నర్థంచేసుకో లేదు. నాదురదృష్టం నాతోనే అంతమవనీ! బుద్ధుగప్రాయమైన జీవితం ఆశించి వెర్రివ్యామోహంలో పడమంటావా! ఏనిమిషంలో నేను మీకు దూరమౌతానో తెలియదు. అలాటప్పుడు క్షణికసుఖాలకు వశమై ఒక అభాగ్యురాలి హృదయంలో చిచ్చుపెట్టి ఆజన్మాంతం ఆక్రోసించమని ఆమెను నేనెలా శాసించగలను. ఘోరమైన గుండెజబ్బుతో బాధపడే నేను కేవలం తల్లిదండ్రుల సంతృప్తి పరచేధ్యేయంతో అందర్నివంచించి ఒక అమాయకురాలి యావజ్జీవితం దుఃఖభాజనం చేయటం న్యాయమా! అమ్మా, నాన్నా అనుక్షణం నాకో సముఅలమటించిపోతుంటే చూసి భరించలేకే యీపుస్తకా న్నాశ్రయిస్తున్నాను. ఇక యీ జీవితంలో వివాహమాడటం అసంభవం" బ్రహ్మరుద్రాదులు దిగివచ్చినా తన నిశ్చయం మారదన్నంత ఖండితంగా చెప్పి తలవంచుకొని ఏదోపుస్తకం చూస్తూ కూర్చున్నాడు సురేష్.

"నాకేంచేయాలో తోచలేదు. సర్వఆశలు నాపై కేంద్రీకరించి, ఆదంపతులు నా జవాబు కోసం ఎంతవుత్సుకతో ఎంత ఆరాటంతో, ఎంత ఆతృతతో నిరీక్షిస్తూంటారో నాకు తెలియదా! నాఅసంతృప్త సమాధానం వారినెంత అధఃపాతా

శానికి అణగదొక్కుతుందో నేనెరుగునా! అయినా యీ అప్రియకరసమాచారం వారికెలా అందివ్వగలను. నిరాశా నిస్పృహావతులై భరింపరాని బడబాగ్ని జ్వాలల్లో వారు కుమిలికమిలి పోతుంటే చూస్తూ భరింపగలనా! కన్న కడుపు కన్న ప్రేమగా నన్ను యీ రెండు సంవత్సరాలు సేదదీర్చిన ఆ చల్లని తల్లి అమిత వేదనతో అల్లల్లాడుతుంటే ఎలాచూడ గలను! సురేష్ నాకు ప్రియమిత్రుడైనా కావచ్చు. అతన్ని మార్చటం యిక యీ జన్మలో సాధ్యంకాదన్న విషయం ధృఢంగా తెలుసుకున్నాను. ఇక ఆ మాతాపితలకు నా మొఖం ఎలా చూపగలను. మిత్రుడనయినా నామాటమన్నించని ఆ పాపాంసుని ముఖం యికచూడదల్చుకోలేదు. సురేష్‌పై కోపంతో శరీరం స్వాధీనం తప్పిపోగా, అవమానంతో అధరాలు కంపించి పోతుంటే, కళ్ళనుండి విస్ఫులింగాల్ని విరజిమ్ముతూ ఆవేశంతో ఒక్కవిసురున లేచి తలుపులు 'ధఢ్' మని తన్ని సుడిగాలిలా 'రయ్' మని దూసుకొని బైటికివెళ్ళి పోయాను. ఆక్షణంలో నాలో అంతవరకు అంతర్లీనమైవున్న సంస్కారం, సభ్యత, వివేకం అన్ని అంతరించి పోయాయి"

ఒక్కక్షణం కళ్ళుమూసుకొని బాధగా మళ్ళీ యిలా చెప్పటం ప్రారంభించాడు రమేష్.

"అదిమొదలు నేను సురేష్ యింటికి పోవటం పూర్తిగా తగ్గించి వేశాను. అప్పటికి అయిదారు సార్లు నౌఖర్ని పంపించారు నాకోసం. అయినా నేను వెళ్ళలేదు. నేనైతే అప్రయోజకున్ని, అసమర్థున్ని, కృతఘ్నున్ని అని వాళ్ళకీ

మాదరాలు మర్చిపోగల్గాను. కాని నన్ను మాతృవాత్సల్యంతో ఆదరించిన ఆమహాతల్లి నన్నంత తేలిగ్గా మర్చిపోలేదు తానే స్వయంగ ఒకవుత్తరం రాసింది హాస్టలుకు వస్తానని. దాంతో యిక ఆలసిస్తే అసభ్యంగా వుంటుందని సురేష్ లేని సమయం చూసి యింటికి వెళ్ళి ఆమెతో మాట్లాడి వచ్చాను. తర్వాత ఏ నెలకొక్కసారో వెళ్ళేవాణ్ని. క్రమంగా పరీక్షలు దగ్గర కొచ్చాయి. అకుంఠిత దీక్షతో నిర్విరామంగా చదివాను. చివరకు బాగానే రాశాననిపించింది. అంతవరకు నెత్తి మీద వున్న బండ దిగినట్లయింది. స్వేచ్ఛగా వూపిరి పీల్చుకున్నాను. వూరికి పోయేముందు సురేశ్ దగ్గరకు వెళ్ళాను. అయితే అతడింట్లో లేడు. ఆమెతో మాట్లాడి వస్తుంటే ఆవిడ యిలా అంది "బాబూ! నాకు నీవొకటి, సురేశ్ వొకటి కాదు. నీ వెక్కడున్నా, ఏం చేస్తున్నా మమ్మల్ని మరచి పోకు. వెంట వెంటనే వుత్తరాలు రాస్తూండు అన్నట్టు ఒక్క విషయం వెళ్ళి అబ్బాయితో మాట్లాడి రా. వాడు నీకోసం ఎంత మథన పడ్తున్నాడో, ఎంత మూగ బాధ అనుభవిస్తున్నాడో నీ కర్థం కాదు. నా మొహం చూసైనా వెళ్ళి వాడ్ని పలకరించు" అని చెప్పి కళ్ళు తుడుచుకున్నారు. కాని నేను నిర్లక్ష్యంగా నవ్వి వచ్చేశాను.

"వూరికి వచ్చానే కాని ఎప్పుడు సురేశ్ రూపమే గోచరించేది. దీనంగా, జాలిగా చూచే ఆ చూపులే నన్ను వెన్నాడేవి. తన స్నేహం కోసం ప్రాకులాడే అందర్నీ కాదని నన్ను మన్నించి, ఆదరించి, ఆహ్వానించి తనంతటి స్థానం కల్పించి. యింట్లో అందరి గౌరవాభిమానాల కర్హుణ్ణిగావించి

ప్రాణప్రదంగా ప్రేమించినందుకు ప్రతిఫలంగా 'అతిస్వల్ప' నేరారోపణతో ఆ అమాయకుణ్ణి అంత ఘోరంగా శిక్షించిన నన్ను నేనే క్షమించలేకపోయాను. వెనక్కి తిరిగి గతం పరికిస్తే నా అపరాధం సహస్రాకారాలతో భయంకరరూపంతో అట్టహాసం గావిస్తూ నా మీదికి దూకేది. అందుకే నా హృదయంలోకి చూచే ధైర్యమే నాకు లేకపోయింది. సురేశ్ మూడు, నాలుగు ఉత్తరాలు రాశాడు. అవి చూడాలంటే కూడా శరీరమంతా చెమటపట్టేది. మనసుభరింపలేని బాధతో మూల్గేది. ప్రత్యుత్తరంలోని ప్రతివాక్యం అతని నిష్కల్మష హృదయ సౌకుమార్యమంతా సేకరించి సుగంధాలు విరజిమ్మేది. ప్రతి పదంలో అతని ప్రశాంత వదనం చిరునవ్వుతో వికసించిన గులాబీ వలె భాసించేది. అతని ప్రతి పిలుపులో ప్రపంచాన్నే కదలించివేసే ప్రేమ అనురాగాప్యాయతలు ప్రతిబింబించేవి. దాంతో నా అసభ్యకర ప్రవర్తన అతని పట్ల నా అనాదరణ జ్ఞప్తికి వచ్చి నన్ను నిలువునా చిత్రవధ గావించేవి. ఆనాడలా అర్థం తెలియని ఆవేశంతో అతన్నలా తిట్టానే గాని ఆలోచిస్తే అతని తప్పు ఆవగింజంతైనా లేదు. నా ప్రవర్తన జ్ఞప్తికి వస్తే సిగ్గుతో కుంచించుకపోయేవాడిని. మీద నాకే విపరీతమైన అసహ్యం వేసేది నా పనిని నేనే సమర్థించుకోలేక పోయానంటే యిక ఏ మొహం పెట్టుకొని సురేశ్‌ను క్షమాభిక్ష నర్థించేది! అసలా సహృదయునికి, ఉదారబుద్ధికి క్షమించలేనిదనేది అర్థరహితంగా కన్పించేదే. ఒక్కసారి నేను వెళ్లి సురేశ్ ముందు నిలబడివుంటే మనస్సు కరిగించేలా ఆర్ద్రహృదయంతో నన్నతిగాఢంగా కౌగలించు

కొనే వాడ నేది నిస్సందేహం. కాని కేవలం సిగ్గు వల్ల కలిగిన సంక్షోభంతో అతనికి నా ముఖం చూపించే ధైర్యం లేక పిరికి పందనై పారిపోయి వచ్చాను.

నా కప్పట్లో ఆ పిరికితనమే కల్గకుంటే నాలో ఏ ఒక్క కణమైనా ధైర్యం పుంజుకొని ముందుకు జ్వలించి వుంటే యీనాడు నాలో జరిగే యీ భీకరసంగ్రామానికి నేను కారణుణ్ని కాకుండా వుండేవాణ్ని. కాని విధి బలీయం. రెండేళ్లు నిరంతరాయంగా వర్ధిల్లిన స్నేహలత అర్థరహితమైన నా ఆవేశంతో ఒక్క క్షణంలో పుటుక్కున తెగిపోయింది.

"ఎవరి జీవితం ఎటు గాడి తప్పినా కాలం మాత్రం తన గమనం ఆపకుండా సాగిపోతూంటుంది. వారాలు నెలలుగ మాకేసరికి మా రిజల్ట్సు తెలిశాయి. నేను సెకండు క్లాసులో పాసయ్యాను. అయితే నాకు సంతోషం కల్గించిందేమంటే మరుసటిదినం నా ప్రియమిత్రుడు సురేష్ వ్రాసిన జాబు. అది నా కిప్పటికీ బాగా జ్ఞాపకం !" నుదుట పట్టిన చెమటతుడుచుకుంటూ ఒక్క క్షణం ఆగాడు రమేశ్.

వుత్తరం వచ్చిందని చెప్పాను కదూ ! ఇతరులను అణుమాత్రం నొప్పించని అతని సరళ హృదయం చూడండి ఎలా రాశాడో ! "ప్రియమైన రమేష్ ! ఈ శుభసమయంలో నా ఆనందం నీ కెలా వ్యక్తీకరించాలో నా కర్థం కావటం లేదు. ఇంతకన్న సంతోషించదగ్గ సమయం వుండదనుకుంటాను."

రమేష్ ! రెండు మూడు వుత్తరాలు వ్రాసినా జవాబు లేదు. నీ వెంత జాలిగలవాడవో ఎంత సుకుమార

హృదయుడివో నాకు తెలియదా ? ఆ రోజు - నాకు బాగా జ్ఞాపకం. కన్నకొడుకునై వుండి కూడా తలిదండ్రుల కష్టాల్ని చూస్తూ కూడా నేను నిబ్బరంగా వుండగల్గాను. కాని కేవలం స్నేహితుడివైనా నీవు నా తల్లిదండ్రుల దుఃఖం వూహించి ఎంత బాధ పడ్డావో నేను చూడలేదా ? వారి కోమల హృదయాల కెక్కడ అఘాత మేర్పడుతుందోనని నీ వెంత విలవిల్లాడావో నేను గమనించలేదా ? వారి సుఖం కోసం వారిని సంతృప్తి పరిచేలా చేయటంకోసం నీ వెంత ఆరాట పడ్డావో నేను మరువగలనా ? అంతటి కరుణామయుడివి నీవు నాపై చూపే యీ నిర్దాక్షిణ్యానికి కారణం నా దురదృష్టం కాక మరేమనుకోను ? నీ మాట నిరాకరించాననా నాపై నీ కోపం ! ఏం చెయ్యను రమేష్ ! దైవోపహతుడ్ని- ఎక్కడా నాకు శాంతిలేదు. అలా ప్రవర్తించక తప్పదు.

నిన్ను కలుసుకోవాలని రెండుసార్లు నీ రూము కొచ్చాను. కాని కల్లోలితమైన నీ మనసు కాస్త సర్దుకోని నీ వప్పుడే చదువుల్లో పడ్డావని స్నేహితుల వల్ల విని గిరుక్కున వెనక్కి వచ్చేశాను. ఆ స్థితిలో మరల నీవు నా ముఖం చూడటం తటస్థిస్తే ఆ కారణంగా నీ మనస్సు అల్లకల్లోల పడచి నిన్ను కర్తవ్యతా విమూఢుణ్ణి చేసే సాహసం లేక అలా వచ్చేశాను. ఫలితంగా నిన్ను చూడలేకపోయాను,

నీ పరీక్షయినరోజే నేను, నాన్నగారు నీ రూం కొచ్చాము. కాని నీ వప్పుడే వెళ్ళిపోయావని తెల్సింది. తిరిగి యింటికి రాగానే అమ్మ నీవు వచ్చి వెళ్లిపోయావని చెప్పింది.

నన్ను తప్పించుకోవాలని ఎందుకలా తిరుగుతున్నావు రమేష్. నేనేమి అపరాధం చేశాను ? నా దుఃఖం తెలుసుకోలేవా?

నీకేం! అదృష్టవంతుడివి. సర్వఆశలూ నీపై కేంద్రీకరించి కొండంత ఆశతో ఎదురుచూచే తల్లి తండ్రి నీస్నేహం అభిలషించే స్నేహితులు, నీ శ్రేయస్సుకోరే బంధువులు నీకు కొల్లలు. కాని నాకో! అమ్మా నాన్నా మినహాయిస్తే నీవు తప్ప నాకీ ప్రపంచంలో మరే మిత్రుడూ లేడు. నేను ఏకాకిని. కనుకనే అమ్మ నాన్నలతో వున్నప్పుడుతప్ప ఎప్పుడూ నామనస్సు నీ సాహచర్యంకోసం ఆరాటపడ్తూంటుంది. అదృష్టవంతుడివయిన నీకందరూ చుట్టాలే. అందరూ మిత్రులే. అందర్ని కాదని ఎక్కడోవున్న ఈ నిర్భాగ్యమిత్రుడు నీకు జ్ఞాపకం వుంటాడా ? వుంచుకోమనికూడా నేనర్థించను. కాని ఎప్పటికయినా, ఏనాడయినా నా ప్రియమిత్రుని స్వహస్త లిఖితమయిన వుత్తరం నా హృదయాన్ని చల్లపరచగలదనే ఆశతో అనుక్షణం ఎదురుచూస్తుంటాను.

అమ్మా నాన్నా హృదయపూర్వకమయిన తమ అభినందనములు నీ కందజేస్తున్నారు. అమ్మ ఎప్పుడూ నిన్ను కలవరిస్తూంటుంది. నా మొహం చూస్తేచాలు, ఆమెకు చటుక్కున నీవు గుర్తుకొస్తుంటావు. అగాథమైన నాన్న హృదయపులోతులు తెలుసుకోగల సమర్థత లేదునాకు. కాని వారుకూడా నిన్నధికంగా ప్రేమిస్తున్నారనేదాంట్లో సందేహములేదు. నిన్ను తల్చుకుని గాఢంగా నిట్టూరుస్తారు. మనసులో ఏమనుకుంటారో తెలియదు.

" ఒక్కసారి ఇక్కడికి రావటానికి ప్రయత్నించ కూడదా రమేష్ ! అమ్మకోసమైనా రాగలవా? అసలంతటి అదృష్టఘడియలు నా జీవితంలో వున్నాయంటావా ? చెప్పు రమేష్! ఏమో! నా మనస్సు మాత్రం యీ జీవితంలో ఇక నిన్ను కల్సుకోలేనని ఘోషిస్తోంది. ఇది నాకెంత వ్యథకలి గిస్తుందో నీ వూహించలేవు. ఇకఏమయినా నిన్ను బాధపెట్ట దలుచుకోలేను. బహుశా ఇదే చివరి ఉత్తరం కావచ్చు. అతీతమయిన నాయీ స్నేహానికి ప్రపంచంలో ఏ అవరోధాలూ అడ్డంకులూ వుండవు. ఆనాటి సుఖప్రదమైన దినాలూ, నీ సహచర్యంలోని సంతోష సంఘటనలు నా మనస్సులో ము ద్రితమయినాయ్. అభిలాషనీయమయిన నీ స్నేహమాధుర్యాన్ని మననంజేసుకుంటూ నా శేషజీవితం ముగిస్తాను.

ఏదో అంతర్వాణి నా అంతిమఘడియలు సమీపిస్తున్నాయని సూచిస్తోంది. చివరిసారిగా నిన్ను హృదయపూర్వకముగా ఆశీర్వదిస్తున్నాను. కృపానిధియయిన భగవాన్ కరుణతో నీకు అనుదిన్యం సిరియు శ్రేయస్సు కలగాలని, సతతం నీకు జయంకలగాలని నీ భావిజీవితం ఆనందమయకాంతులతో ప్రజ్వరిల్లాలని దీవిస్తున్నాను ప్రియరమేష్ " అంతవరకు చెప్పి ఆగాడు రమేష్. మనస్సునూ, ఆత్మనూ ఐక్యంజేసి అపూర్వమయిన ఆ 'మిత్రత్వం' తదేకధ్యానంతో ఆలకిస్తూన్న మిత్రులు వులిక్కిపడి కన్నులు తెరిచారు. మనస్సులో కరుడుగట్టిన దుఃఖం కన్నీళ్ళ రూపంలో ప్రవహిస్తూవుండే హృదయాన్ని చేతితో అదిమి ప్రవాహాపు పొంగులా వెలికివస్తూన్న దుఃఖాన్ని అంతరంగపు అవధుల్లోకి నెట్టివేసేప్రయత్నంలో మానం

వహించిన రమేష్‌ను చూడగానే అంగరికళ్ళు జలజలా వర్షిం చాయి.

కొన్నిక్షణాలలో తన్నుతా సంభాళించుకుని రమేష్ తిరిగి ప్రారంభించాడు-

“ ఆ ఉత్తరం ఆద్యంతం అమితంగా నన్ను కదల్చివేసింది. ఎలాగైన ఒక్కసారి వెళ్ళి సురేష్‌ను కలుసుకోవాలని ప్రబలాటపడ్డాను. కాని విధిబలీయం. మనిషి ఆలోచిస్తూనే వుంటాడు. కాని అంతలోనే జరుగవలసిందేదో జరిగిపోతుంది. మన ఆలోచనకు ఆ జరిగేదానికి ఏమీ సంబంధం వుండదు. నేను వెళ్ళాలని సంకల్పించుకొనేంతలో నాన్నవచ్చి పొలం పని జూచుకోమని, తాను వేరేవూరు వెడుతున్నానని చెప్పారు. ఆ వప్పగించటం శాశ్వతంగా వప్పగించటమే అయింది. ప్రొద్దునలేచి కాఫీత్రాగి వెళితే మధ్యాహ్నం అక్కడే భోజనముచేసి ఏరాత్రికో యింటికిరావడం. పగలల్లా అలసిన శరీరం క్షణంలో నిదురకొరిగేది. ఉద్యోగంకోసం దూరం వెళ్ళటం అమ్మకిష్టంలేనందున వున్నవూరిలోనేవుండి వ్యవసాయం చూడవలసివచ్చింది పొలంపనుల ఉధృతంవలన క్షణంతీరికవుండేదికాదు. ఎప్పుడయినా విశ్రాంతిసమయంలో సురేష్ జ్ఞాపకంవస్తే మనస్సు కలుక్కుమనేది. అతన్నివెళ్ళి చూద్దామనుకోటంతోనే సరిపోతుంది. నా యీ నిర్లక్ష్యానికి హేతువేమిటో నాకే అవగాహన కాలేదు. అలానే రోజులు దొర్లిపోతున్నాయి.

“ఒకరోజు - మామూలువేళకే లేచాను. కాని శరీరం అంతా అతినీరసం ఆవహించింది. మంచం దిగటానికి కూడా

ఓపిక లేకుండా పోయింది. కాని యెలాగో అతికష్టం మీద లేచి కాఫీ తాగి పొలం బయలుదేరాను. అక్కడ కూర్చున్నా నన్నమాటే కాని మనస్సంతా యేమిటో గుబులుగా వుంది. ఏపని చేయటానికిగాని ఎవ్వరితో మాట్లాటటానికి కూడా యిష్టంలేదు. ఏమిటో ఆరాటం. ఏదో తెలియని వేదన. మనస్సంతా ఎందుకో తెలియని తపనతో మథనపడ సాగింది. ఏదీ ఆలోచించే శక్తి లేక హృదయాన్ని శూన్యం ఆవరించింది. అమితమయిన ఆందోళనతో నరాలు బిగుసుకు పోతున్నయ్యి. ఆ నీరసంతో, ఆ నైరాశ్యంతో అక్కడుండ లేక యింటికి బయలుదేరాను. నడిచే ఓపిక బొత్తిగాలేదు. కాళ్ళు గాలిలో తేలుతున్నయ్. ఎట్లాగో యింటి దరిదాపుల లోకి వచ్చాను. అంతలో ఎదురుగా మా పాలేరు వస్తూ, "అయ్యగారూ ఈ చీటీ మీ కిమ్మన్నా" రంటూ ఒక కవరు నా చేతి కిచ్చాడు. అది చూడగానే గుండె ఝల్లుమంది. శరీరమంతా కంపించింది. భయంతో వళ్ళంతా చమట పట్టింది. అది సురేష్ తండ్రి వ్రాసిన జాబు. ఏదో అమంగళం గోచరిస్తోంది. అది తెరిస్తే ఏ అశుభం వినాల్సి వస్తుందో! భరింపరాని ఏ అసంగతమయిన విషయం అందులో రాశారో! క్షణకాలం బుర్రలో వేల ఆలోచనలు పరుగెత్తాయి. యెలాగో ధైర్యం తెచ్చుకొని చింపిచూచాను. అంతే! ఏవో అస్పష్టమయిన కేకలు, ఎవరో నన్ను పట్టుకొన్న స్పర్శ మాత్రం నాకు తెలిశాయి.

తెలివివచ్చి కళ్ళు తెరవగానే నా చుట్టూ ఎన్నో పరిచయముఖాలు యింటిల్లిపాదీ అక్కడే వున్నారు. ప్రక్కనే

డాక్టరుగారు. ఒళ్ళు సలసల కాగిపోతోంది. ఏదో మందు తాగించారు నా చేత.

పూర్తిగా జ్వరం తగ్గేదానికి మూడురోజులు పట్టింది. మూడు దినాలు యించుమించు అచేతనావస్థలో వున్నాను. నాలుగోరోజు కళ్ళు తెరవగానే సురేష్ తండ్రి వ్రాసిన ఉత్తరము జ్ఞాపకం వచ్చింది. వెంటనే లేచి కూర్చున్నాను. "సురేష్ డెత్ బెడ్ (Death Bed) లో వున్నాడు. వెంటనే బయలుదేరు. అన్న అక్షరాలు ముందు గంతులు వేస్తున్నయ్ తూలిపోయే శరీరాన్ని అదుపులో పెట్టుకుని లేచి నిలబడ్డాను. అమ్మా నాన్న పరుగున వచ్చి నన్ను పట్టుకున్నారు ఒక్క విదిలింపుతో వాళ్ళను విసిరికొట్టాను. పిచ్చివాడివలె బయటికి పరుగెత్తాను. నావెంట నాన్న పాలేరులు అందరూ పరుగెత్తుకుంటూ వచ్చారు. నేరుగా స్టేషనుకు దారితీశాను. నాన్న కూడా నన్నాపే శక్తి లేక నాతోనే వచ్చారు.

"మనోవేగం" అంటే అర్థం ఆనాడే తెలుసుకున్నాను. రైలుమీద విపరీతమైన కోపంవచ్చింది. కారణం లేకుండానే అందర్నీ విసుక్కున్నాను. ఏ క్షణంలో సురేష్ దగ్గర వాలదామా, ఎప్పుడతని తలని నా హృదయానికి అతిగాఢంగా అనుముకుందామా అన్న ఆతురిత అధికమయింది. "భయం" అనేది మనిషిని ఒక్కటి ఎలా పిప్పిచేస్తుందో అనుభవిస్తేగాని అర్థంకాదు

సురేషుకు ఏ అశుభం కల్గకూడదని ఎన్నివేలదేవతలకు మొక్కానో, ఎన్ని కోట్లనమస్కారాలు చేశానో నాకు కాక మరెవ్వరికి తెలుసు! అతనికే ఆపదైనా తటస్థించగలదన్న

ఊహాకే కంపించిపోయాను. ఆ మానసికక్షోభనుండి కోల్కొని మెడ్రాస్‌లో దిగి టాక్సీతీసుకొని బయల్దేరాం. అర్థంకాని అశాంతి దావానలంలా దహిస్తోంది. ఓ క్షణంజీవితంపై అంతులేనివిరక్తి. మరోక్షణం ప్రపంచంపైనే వివేకంలేని వృక్రోశం. అంతలోనే నిరాశమేళవించిన దుఃఖం. కారు ఇంటిముందు ఆగగానే లోనుండి ఏవో ఆర్తనాదాలు వినిపించాయ్. అబ్బ! అవి ఆర్తనాదాలా! కాదు! కాదు! ఆత్మను సలిపినాశనంచేసే ప్రళయ ప్రభంజనాధ్వనులు. వెర్రెత్తిన ఎగశ్వాసతో ఒక్కపరుగున లోపలికివెళ్ళాను. కలలోకూడా కాంచనేరని అభయంకరదృశ్యం చూడ్డంతోనే శరీరం అచేతనమైపోసాగింది. పైనపొంగిన గుండెలు అలాగే చలనరహితాలైపోయాయ్. పగిలిన హృదయం ముక్కలైంది. ముఖంలో నరాలు ఉబ్బినయ్. భావవ్యాకోశాలు దద్దరిల్లే ఆ ఆర్తనాదంతో శరీరం మంచుముద్దగా మారిపోయింది. శిరస్సులోని రక్తనాళాలు పుటుక్కున తెగిపోగా, మరుక్షణంలోనే వివశుడినై క్రిందపడిపోయాను. ఎవరివో ఉపచారాలతో తెలివివచ్చిన నేను ఎదురుగా క్రింద శయ్యపై పరుండబెట్టిన నాప్రాణస్నేహితుడ్ని, నా ఆత్మబంధువును ఆ కరుణామయ స్నిగ్ధహృదయుడిని, ఆ, నా అనురాగహృదయుడిని, నా సర్వస్వమైన నాప్రేమపాత్రుడిని విగతజీవిగా చూచాను. పూలమాలలతో మరుగుపడిన ఆ మధుమూర్తి యిక తిరిగిరాడా? నా మనసు లోలోపలే అతి దారుణంగా విలపించసాగింది. ఓరీ దౌర్భాగ్యుడా! మలినపడిన నీ మనసు కంటటె పవిత్రవరం ఎక్కడిదిరా! సదాపరిపూర్ణ మనోమందహాస మొలికించే ఆమెడప్రు

తీగ ఇలా బిగిసిపోవాల్సిందేనా! అప్రతిమానమైన ఆ హృదయ సౌకుమార్యాన్ని విషపుకోరలతో నాశనం చేసిన చండాలుడిని నేను గాక మరెవ్వరు! ఆ పవిత్రమూర్తి దివ్యతేజస్సులో పునీతం కాగల అదృష్టం యిక నాకెక్కడిది? ఓరీ మానహీనుడా! ఆ కన్నతల్లి కళ్ళనుండి వర్షించిన కవోష్ణభాష్ప (కవోష్ణ) ధారలు నిన్నమాడ్చి మసిచేయవా! ఆకాశం విరిగి మీదపడగా, తమ సర్వస్వమైన సంతానాన్ని కోల్పోయి కంటికి మింటికి ఏకధారగా ఏడ్చే ఆ తల్లిదండ్రుల నేనెలా ఓదార్చగలను! గుండెనీరై కన్నీరు మున్నీరుగా విలపించే ఆ బంధుజనాన్ని ఏమని అనునయించగలను? సురేశ్ హృదయమే అమృతభాండము. కుటిలమైన నాకపట ప్రవర్తనతో ఆ అమృతభాండం తూట్లుపడి తునాతునకలై చెదిరిపోయింది. దాంతో ఆ ముసలి దంపతుల బ్రతుకు బుగ్గలైంది. 'సురేశ్ మరణానికి కారణం నీవే' అన్న వికటాట్టహాసం నా అంతరాంతరాళంలో ప్రవహించసాగింది. సహజప్రేమ పూర్ణాలైన సురేశ్ సుందరమైన చూపులు నా నేత్రాలముందు నాట్యంచేయసాగాయ్. వుండండి అనిన తియ్యని పలుకులు నా కర్ణకుహరాల్లో ప్రతిధ్వనింప సాగినయ్. అంతవరకు ఏ కల్పిత శంకతో నా మనస్సు భయభ్రాంతమైందో, ఆ శంకే స్పష్టంగా కన్నుల ముందు సాక్షాత్కారం కాగానే నా మస్తిష్కం పూర్తిగ స్తబ్ధత్వం వహించింది. నాలో అగ్నిపర్వతాలు బ్రద్దలైపోగా, భీకర ప్రళయనాదంతో నా సమస్తస్వాభిమాన భస్మీపటలం కాగా, మెల్లిగా లేచి నిర్జీవమైన ప్రేతకళేబరంవైపు నడిచాను. అహా! ముద్దులు మూటగట్టే ఆ సుందరవదనం నల్లగా

మాడిపోయింది. దుర్వ్యసనం పొంగులువారే ఆ శరీరం చిక్కి, శల్యమై భయంకర మృత్యు (మృత్యు) కరాళకౌగిలిలో మైమరచి పోయింది. దివ్యకాంతులీనే ఆ సువిశాల నేత్రాలింక తెరుచుకోవు. అన్యాయం ధిక్కరించే ఆ హృదయమిక ఎన్నటికీ స్పందించదు. ఆ చైతన్యరహిత కళేబరంపై బడి భూమిదద్దరిల్లేలా ఆక్రోశించే ఆ వృద్ధ జీవితాలింక శోకపూర్ణమే! వారి జీవన జ్యోతి ఆరిపోయింది. దుఃఖావేదనలను, లోభం, మోహం, మద, మాత్సర్యాలకు, ఆగ్రహానుగ్రహానుభూతులకు అతీతం ఆజీవి! అది యిక అంతే!

వున్నట్టుండి నాలో ఆవేశించిన స్తబ్దభావం వదిలిపోయింది. శూన్యమావరించిన ఆత్మ, బుద్ధి, మనస్సు పనిచేయుడంతో "యిక జీవితంలో సురేషని ఎన్నటికీ చూడలేవు" అని "ఏ అజ్ఞాతచేతస్సో గట్టిగా అరిచి ప్రబోధించటంతో నాలోని దుఃఖం కట్టలు తెంచుకుని పొంగిపొర్లింది. వెంటనే వంగి సురేష్‌పై కప్పిన పూలమాలలన్నీ విసిరికొట్టాను. సురేష్ చేతులు, కాళ్ళు శరీరం అంతా ప్రేమగా నిమిరాను. సురేష్ తలను గాఢంగా హృదయంలో ఏ శక్తి మమ్మల్ని విడదీయలేనంత గాఢంగా నా గుండెల కదుముకున్నాను. పై నుండి క్రిందివరకు నిశ్చలంగా నిర్నిమేష దృష్టులతో తిలకించాను. నా ప్రాణమిత్రుడైన ఆతని కాళ్ళు, చేతులు తనివితీరా ముద్దుపెట్టుకున్నాను. అయినా అది నా సురేష్ స్వరూపమేనా? పచ్చటి పసిడిఛాయలీనే కాంతి నల్లగా, వికృతంగా మారింది. ఆ ఆకర్ణాంత విశాల నేత్రాలు శాశ్వతంగా మూసుకుపోయాయ్! ఎర్రటి పెదవులు

యొండి ముకుళించుకు పోయాయి. సురేశ్‌ను ఆలింగనం చేసుకొని ఏడ్చాను ఏడ్చాను. నా పాపఫలమంతా ప్రక్షాళిత మయ్యేలా ఏడ్చాను. హృదయం ద్రవించి, నీరయ్యేలా శోకించాను. జుట్టు పీక్కుంటూ క్రిందపడి దొర్లాను. గుండెలవిసి పోయేలా విలపించాను. మృదుమధుర మంజులనాదంగా 'రమేశ్'అంటూపిల్చేఆ ప్రేమపూరితవాక్కు యిక వినగలనా?

సురేశ్ శరీరం నానుంచి తీసుకుపోవటం దుస్సాధ్యమైంది. పదిమంది నా రెక్కలు విరిచి బలవంతంగా, నిర్దాక్షిణ్యంగా నా ప్రాణమిత్రుడ్ని, నన్నింక క్షమించానని చెప్పకముందే నా పశుప్రవర్తనకు నన్ను మధురంగా మందలించక ముందే అమానుషంగా, జీవితంలో యిక మే మెన్నడూ కలుసుకో లేనిరీతిగా విడదీశారు. అలా శాశ్వతంగా సురేశ్‌ను నానుండి విడదీసి దహనసంస్కారాలకు తీసుకుపోయారు. అయ్యయ్యో! ఏడీ సురేశ్! ఎక్కడ? నాదగ్గర వుండకుండా లాక్కు పోయారా? ఇహ సురేశ్ లేనే లేడా? ఈ కఠోర దరిద్ర సత్యం నేనెలా భరించగలను?

జరాభారంతో, వుడిగిపోయిన శక్తితో, అవిరళధారగా కన్నీరు కరిగిపోతుంటే, తమ పుత్రుడు తిరిగి రాగలడేమో అన్న అత్యాశతో ఏ అనంతలోకాల్లోకో తేరిపార చూస్తూ శూన్యహృదయంతో, భరింపలేనివ్యధతో కూర్చొన్న ఆ తండ్రిలో, ఆ ధర్మమూర్తిని విపినబాబులోనూ, ప్రకృతి నియోగంతో కృంగి కృశించి జీర్ణావశిష్టంగా వున్న ఆ తల్లిలో జీవనజ్యోతి యింక ఎన్నాళ్ళో వెలుగదనిపించింది. అంతవరకు దేదీప్యమానంగా, సుఖ సంతోషాలకు, సౌభాగ్య స్వర్గసుఖా

ఒకు ఆటపట్టైన ఆ గృహంలో నేడు మృత్యువు ప్రసాదించిన అనంత విషాదభరిత చిహ్నాలు!

కనికరం అవంతయినా లేక నా నిరంకుశ ప్రవర్తనతో నా దయాహీనతతో సురేశ్ సున్నితహృదయం ఎన్ని ముక్కలు చేశాను! మృత్యు సన్నిధుడయికూడా ద్వారంవైపే చూస్తూ రమేష్ రమేష్ అంటూ కలవరించాడని అతనిప్రాణవాయువు లనంతజగత్తులో అనంత యోజనాలదూరం వెళ్ళే ఆఖరి నిమిషందాకా కూడా నైరాశ్యం ముఖంనిండా దోబూచులాడగా ర... మే.. ష్... అంటూనే తల్లివైపు ఆఖరిసారిజూచి కన్నుమూశాడని విని నా పాపిష్టిమనస్సు ముక్కలుకాలేదే. తన జీవితంలో చరమదశలో చివరిక్షణంలోకూడా నాకై కలవరించి అలమటించి పరితపించిన ఆ అమృతమూర్తి అంతరించి పోయాడని విని నేనింకా బ్రతికేవున్నాను. నా మహాపరాధముతో ఆ మానసికుడిని అంతగా బాధించినఅపరాధం సహస్రముఖాలతో విజృంభించి నన్నింత కల్లోలపరచినా నేనేమాత్రము చెదరక నిలిచివున్నానే!

సురేష మరణంతో శుష్కమై, శూన్యమైన నాహృదయ మరుభూమిలో యిక నిజమయిన స్నేహానికి ఆప్యాయతకు ప్రేమకు తావులేదు. భగభగమండే నామనస్సులోయిక తొలకరివానల ప్రసక్తి లేనేలేదు.

ఇన్నిరోజులు అనుక్షణం నా అంతర్యాన్ని తొలిచివేస్తున్న అంతర్వేదన మీముందుంచాను. జ్ఞాపకంరాగా నా నరనరాల్ని పీల్చిపిప్పిచేసే భయంకరగాధఇది. ఇదేనాకు తీయని బాధ. తీరని నాగాధయిది. అణచరాని ఆవేదన. భరింప

లేని మనోవేదన.భగభగజ్వలించే హృదయపు మంట దుఃఖించి లాభంలేదు. చింతించటం అంతకంటే అనవసరం. చేజేతులా అవివేకంలో చేసిన నా ఈ మహాపరాధం నీకలా నన్నెప్పుడూ వెన్నంటే దుఃఖపుటలలలో ముంచెత్తుతూవుంటుంది"

కృతికాలం చెప్పటంఆపి మిత్రులనంక చూస్తూ రమేష్ యిలాఅన్నాడు.

" ఆ! ఇప్పుడు చెప్పండి. చెప్పుశంకర్. నాకన్న నికృష్టజీవి ఏడీ ! నేను మీ స్నేహపాత్రుడినేనా! ఇంకా స్నేహం అంటూ అర్థం తెలియని పదాలతో మిమ్మల్నే కాదు. ఎవ్వరిని వంచింపదలుచుకోలేదు మమత అనే వస్తువుగల మనిషినా నేను. కేవలం స్నేహం ఒక్కదానికోసం అంతగా అలమటించి తపించి పరితపించిన ఆ మహోన్నతుడిని ఆ పవిత్ర సరళ స్వభావిని అతిదారుణంగా కష్టపెట్టి చివరికి అతని ప్రాణాలనే బలిగొన్న నేనూ మానవత్వంగల ఒక మనిషినేనా! "

చెప్తూ చెప్తూ హఠాత్తుగా అతిదారుణమయిన దుఃఖపటలం హృదయాన్ని చీల్చివేయగా ' సురేష ' అంటూ గట్టిగా అరిచి సోఫాలో ఒరిగిపోయాడు రమేష్.

అబ్బ! గుండెలు పిండిచేసే ఈ భయంకర విషాదసంఘటన యిన్నిఏండ్లు రమేష్ ఒక్కడూ తనలోతానే ఎలాభరించాడోగదా ! తమ ఏకైకపుత్రునిగురించి ఆ వృద్ధదంపతులు కన్నకలలు ఎన్నెన్ని యీ తరగని బాధతో చెరిగి చెదరిపోయామో! పాపం! అణచరాని ఆవేదనతో, భరింపరాని మనోవేదనతో,భగభగ మండే హృదయపు మంటతో రమేశ్ యిన్ని నాళ్ళు ఎలా వెళ్ళదీశాడో!

కాలం తన గర్భంలో దాచుకొన్న అతి విచిత్రగాథ యిది!!!

మూసుకొన్న రమేశ్ కళ్ళనుండి అవిరళధారగా అనుతాపాశ్రువులు జారి సోఫాలో బడి యింకి పోతున్నాయి.

ఈ గాథ ప్రసాదించిన విషాదభరంతో మనసు మూగ పోగా ముగ్గురుమిత్రులు శిలాప్రతిమల్లా కూర్చుండిపోయారు.

మహామనీషి

రచన : శ్రీమతి కె. సత్యవతీరెడ్డి.

[illegible] కూర్చొని చేటలోని బియ్యం లోని [illegible] అప్పటికింకా బాగా తెల్లవారలేదు. [illegible] పూర్తిగా లోకాన్ని విడక ముందే [illegible] గృహకృత్యాల్లో పాల్గొనటం ఆమె రివాజు. ఆరోజు [illegible] బులుగా వుంది. [illegible] వున్నాయి [illegible] బియ్యం [illegible] అకస్మాత్తుగా [illegible] "పాయా" [illegible] తన [illegible] చేతిలోని ఖాళీ చెంబుతో [illegible] ఆరోజున ! [illegible] శరీరం [illegible] చిరు [illegible] తెల [illegible], [illegible] చలి [illegible] రక్త [illegible], "పాయా ! మా వదు ..." [illegible] చేతి. 'వదిన' అన్న [illegible] ఆమె [illegible] దానంతట దే

ఎగిరిపోయింది. చేతిలోని బియ్యం చేట చటుక్కున క్రింద పడివేసి భర్తను సమీపించింది పార్వతమ్మ. "ఏమండీ! ఏమైనది మా వాసుకు!" భార్య కంఠంలోని ఆతృత గమనించిన రామయ్య యిక జాప్యం చెయ్యకుండా "మీ వదిన గుండె ఆగి హఠాత్తుగా మరణించిందట" బొంగురు గొంతుతో మెల్లిగా చెప్పి తలెత్తి భార్య వంక చూశాడు. "ఆఁ" అంటూ! మరి పార్వతమ్మ గొంతులో మాట పెగిలి రాలేదు. అనుకోని దుర్వార్త చెప్పబడగానే భరించలేని పార్వతమ్మ స్పృహ తప్పి నేలకొరిగింది. తత్తరపాటుతో గబుక్కున వంగి భార్య తలతీసి తన తొడమీద పెట్టుకున్నాడు రామయ్య. ఆక్షణంలో ఎవరినైనా పిలవాలనికాని, ఏమైనా చేయాలని గాని అతనికి తోచలేదు. అసలే సున్నిత హృదయుండటంతో ఆ ఘోరవార్త వినగానే కల్గిన దుఃఖంలోంచి తేరుకోలేదు. రామయ్య కళ్ళ నుండి స్రవించే బిందువులు భార్య నుదుటిపైబడి ప్రక్కలకు జారిపోయాయ్!

అది అటు పూర్తిగ పల్లెటూరూ కాదు, ఇటుపట్నమూ కాదు. రెండింటి వాసనల్ని గుబాళింపజేస్తున్న ఒక చిన్న ఊరది. ఆ ఊరిలో మోతుబరి రైతు రామయ్య చౌదరి. అతడా ఊరికి మకుటంలేని మహారాజు. పిత్రార్జితమైన సగాభై ఎకరాల మాగాణిని, అహోరాత్రులు చెమటోడ్చి కష్టించిన శ్రమ ఫలితంగా డెబ్బై [illegible]రాల వరకు సాగుచేసిన ఘనత రామయ్యకే దక్కింది. [illegible]లాభ్యం [illegible] ఇచ్చిన ఇల్లు రామయ్య [illegible] తీర్చి దిద్దబడింది. అసలా [illegible] అతనికి సంక్రమించేనాటికి

పూర్తి శిథిలావస్థలో వుంది. పెచ్చులూడి తడిసిపోయిన గోడలు, చెల్లాచెదరైన రెల్లుకప్పు, ఇప్పుడో అప్పుడో అంటూగాండే ద్వారబంధాలూ, మూల్గుతూ, మూల్గుతూ కిర్రు కిర్రున గోదించే కిటికీలు, ఎండాకాలంలో సూర్యుడికి, వానాకాలంలో వరుణుడికి స్వాగతం యిచ్చే అద్భుతమైన యిల్లు అదే! చూస్తూ, చూస్తూ రామయ్య ఆయింట్లో కాపురముండగలడా ? అందుకే రూపురేఖలు తీర్చిదిద్దుకొని ఆ ఇల్లు కూడా ముచ్చటగా కొత్తపెళ్ళికూతురిలా ముస్తాబైంది. రిపేరు చేయించి, తెల్లగా సున్నం కొట్టిన గోడలూ. పదితరాల వరకు చెక్కు చెదరని ద్వారాలు కంటికి నదరుగా కన్పించే రంగులద్దుకొన్న కిటికీలూ! ఆ యింటి స్వరూపమే మారిపోయింది. అన్ని వాకిళ్ళకూ, కిటికీలకు రెపరెపలాడే సిల్కు తెరలు, యింట్లో విలువైన సామానులు, అతిథుల గదిలో ఖరీదైన కుర్చీలు, ఆడవారికి నాజూకైన బట్టలూ అంతా పట్నవాసపు ఫాషనుతో వెల్గొందే ఆ యింటిని గాంచిన వృద్ధులు కొందరు "అవ్వ! మట్టిదిన్న పామే పడగవిప్పి ఆడుతోందే!" అని విస్తుబోయిన మాట నిజం.

రామయ్య భార్య పార్వతమ్మ. పార్వతమ్మ స్వతహాగా మితభాషి. అనవసరంగ అధిక పెత్తనాల జోలికి పోయేది కాదామె. ఎప్పుడూ, ఎవరితో పల్లెత్తు మాటనకుండా మహా యిల్లాలు. దాన, ధర్మ, దయా సత్యశీలాది సుగుణాల్లో ఆ ఊళ్ళో ముందు పార్వతి పేరెత్తిగాని వేరొకరి పేరు చెప్పేవారు కారు. అడగనివాడిదే పాపం! అర్ధరాత్రయినా, అపరరాత్రియైనా, వచ్చిన అతిథి, అభ్యాగతులకు వండి వార్చి వడ్డించే

పనిలో [illegible] ప్రతి ఒక్క రూ[illegible] సంతృప్తి [illegible] [illegible] పెంగి [illegible] సమిష్టంగా [illegible] [illegible] పొలం పనులు, [illegible] [illegible]

పార్వతమ్మ [illegible] జరిపించారు. [illegible] పాటు [illegible] [illegible] వైభవంగా జరిపించారా [illegible] బిడ్డయె పెరిగే ప్రసాద్ [illegible], [illegible] పాట, ఆ యింట్లో! ప్రసాద్ [illegible] [illegible]దే వాడు. ఇంటి [illegible] పార్వతమ్మ. అయినా, [illegible] కాపాడేవా [illegible] సంతోషం [illegible]

నేర్పుతుంది. అంతవరకు ఏ ఒడిదుడుకులూ లేకుండా ప్రశాం
తంగా జీవించే పార్వతమ్మ హృదయంలో అకస్మాత్తుగా ఒక
అల్లకల్లోలం ప్రారంభమైంది.

పార్వతమ్మ [illegible] ... [illegible] మాత్రమే. [illegible] ... [illegible] ... [illegible] మాత్రమే.

[illegible] - వీరాడుతూ [illegible] ... [illegible] ... అల్లారు ముద్దుగా [illegible] వాడు. పార్వతి [illegible] ... [illegible] ... రోజే [illegible] తన భర్తను చెల్లెంటే ఎంత ప్రేమో! [illegible] ... [illegible] ... [illegible] ... అంతులేని ఆనందం [illegible] ... పార్వతిని చూస్తే [illegible] ... సుగుణాలు [illegible] ... [illegible] ... చాలు [illegible] ... [illegible] ... పార్వతి [illegible] ... అనుకుంటూండేవి. "వదిన [illegible]

య్యా రూపం ధరించిన దేవత" అని. ఆమె హృదయంలో వదిన ప్రతిమ ముద్రించుకుని మనోహర దేవిమూర్తి.

కాని వదిన స్నేహం ఎన్నోరోజులు లభ్యం కాలేదు పార్వతికి. ఆ మరుసటి సంవత్సరమే పార్వతి వివాహం స్థిర పడింది. మొదట్లో శంకరయ్య ఆసంబంధానికి తూగగలమో లేమో అని సందేహించినా భార్య పట్టుదలవల్ల పిల్ల సుఖపడుతుం దని చివరకు తెగించి పార్వతికి ఆ సంబంధమే చేశాడు.

పెళ్లైందన్నమాటే గాని పార్వతి ఎక్కువ అత్తింట్లో వుండేదే కాదు. అత్తింటికి వచ్చి నెలతిరక్కముందే వదిన పూజ రమ్మంటూ పార్వతిని పుట్టింటికి పంపించమంటూ. ఆమె మాటంటే శాస్త్రి రామయ్యగారు నవ్వాపేది కాదు. "ఏమమ్మా! నెల రోజుల పనికే మీ పిల్ల అలసిపోయిందా?" అంటూ నవ్వే వాడు. "కాదుటమ్మా మరి! అది మాత్రం చిన్నపిల్ల కాదా! ఇంత సంసారం ఒక్కసారి నెత్తిన పడితే భరించ గలదా? ఏదో ఓ పది రోజులు అక్కడ విశ్రాంతి తీసుకొని మరీ వస్తుందిలే" అంటూ సమర్థించేది మనోహరమ్మ. "చిన్న పిల్లా! సరే! సరే! తీసుక వెళ్ళండి" అంటూ భార్య నాయత్తం చేసేవాడు రామయ్య.

పార్వతికి కొడుకు పుట్టాడని వినగానే సంతోషంతో పుప్పొంగిపోతూ భర్తను వెంటబెట్టుకొని [illegible] సామానులు కొక్కుతూ వురుకులు పరుగులతో [illegible] వచ్చిపడి లక్ష్మి. ఆ క్షణంలో ఆమె కళ్ళకి ప్రపంచంలో తన [illegible] మించిన భాగ్యవంతురాలే లేనన్న భావం కలిగింది. [illegible]

వేసుకొని పడుకొన్న పార్వతిని చూస్తుంటే వింతగా కనిపించింది లక్ష్మికి.

ఆ రోజు రాత్రి అన్నం వడ్డిస్తూ తమ్ముడు రామయ్యను బాగా చీవాట్లేసింది లక్ష్మి. "మామా నా తమ్ముడా! పారును పురిటికి తీసుకువెళ్లావని నెత్తీ నోరూ బాదుకున్నా వినావు కాదు. అసలు ఏ స్త్రీ అయినా ప్రథమంలో పుట్టింట్లోనే పురుడు పోసుకోటం లోకం రివాజు. ఇదిగో అదిగో అంటూ పంపకేపోతివి. సరిగ్గా ఆ కష్ట సమయంలో దాన్ని వూరడించే ఆడదక్షత కూడా కరువైంది. పాపం! ఎంత బాధ పడిందో!" మరదలు బాధపడి వుంటుందన్న తలంపు రాగానే గిరుక్కున ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయ్. ఆశ్చర్యంతో తలెత్తి చూసిన రామయ్యకు అనిపించింది. "ఈమె మంచితనానికి లోకంలో ఏదీ సాటి రాదు" అని.

మూడేళ్ళు గడిచేసరికి దేవుడు లక్ష్మిని కూడా చల్లని చూపు చూశాడు. పండంటి బిడ్డను కన్నది శంకరయ్య భార్య. తల్లి పోలికలు సంతరించుకొని ఆ పిల్ల అపర శ్రీ మహాలక్ష్మిలా జన్మించింది.

కాలగర్భంలో పదేళ్ళు గతించాయ్. ఆ వేళ మామూలు ప్రకారం కోడికూతతో లేచిన రామయ్య చెంబుతో మారుభూమి కెళ్ళి తిరిగి వచ్చే సమయంలో దూరంగా ఎద్దుల వదిల్పు చప్పుడు వినిపించింది. 'ఇంత పొద్దుటే వేళ ఎవరబ్బా ఆ వచ్చేది' అనుకుంటూ నిలబడి తేరి పార చూసిన రామయ్యకు తన బావమరిది పాలేరు కనిపించాడు. చూసి చూసి నాలుగడుగులు ముందుకు వేసిన చౌదరి

'[illegible]!' అని [illegible] నోట [illegible]
[illegible]

[illegible] "బాబూ! [illegible]" [illegible] "[illegible]!" [illegible]

* * * *

[illegible]

[illegible]

అంతవరకు లోపల్లోపలే దావానలంలా దహించి వేస్తున్న శోకం చెల్లెల్ని చూడగానే గప్పున ఎగసింది. హృదయాంలో కరుడు గట్టుకున్న దుఃఖం కన్నీళ్ళ రూపంలో ప్రవహిస్తూంటే అన్నా చెల్లెళ్ళు ఏడ్చి ఏడ్చి అలసిపోయారు.

తల్లిలేని పిల్ల ఏడేండ్ల సరోజను చూడగానే ఎంత ఆపుకున్నా శోకం ఆగేదికాదు పార్వతికి. కోడల్ని హృదయాని కదుముకొని కుమిలి కుమిలి ఏడ్చేది పార్వతమ్మ. వుత్సాహం వురకలు వేసే ఆ యింట్లో నేడు భయంకర మృత్యు నిస్తబ్ధత ! ప్రాణసమానమైన భార్య మరణంతో శంకరయ్య మనసు మూగపోయింది. తన బిడ్డ ముఖం చూసినప్పుడల్లా బాధతో మనసు మెలికలు తిరిగిపోయేది. ఎప్పుడూ ఏదో అసంతృప్తి, అర్థం తెలియని అశాంతి అతని ఆత్మను కార్చిచ్చులా కాల్చివేస్తోంది. తన జీవితంలో పన్నీటిజల్లు కురిపించిన ప్రియపత్ని మాయంకావటంతో అతనికి జీవితంపై రోత, అసహ్యం పెల్లుబికినయ్.

ఎవరి దయామృత రసవాహినిలో ఆ యిల్లు కలకలలాడేదో ఆ గృహిణి మృత్యువుతో ఆ యింట్లో నిరాశా, నిస్పృహలు తాండవింపసాగాయ్. గృహ జీవితంలో తనకు సురభోగాల రుచి చూపిన భార్య చివరి స్మృతి చిహ్నంగా ఆమె దహనక్రియ లతి వైభవంగా జరిపించి నిట్టూర్పు విడిచాడు శంకరయ్య.

లోలోపలే కృంగిపోతున్న బావమరది నొంటరిగా వుంచటం ప్రమాదమని గ్రహించిన రామయ్య మేనకోడలు సరోజను, శంకరయ్యను తమతో పాటే తీసుకుపోవాలనియత్నిం

కాదు. శంకరయ్య కూడా లక్ష్మి నిష్క్రమణంతో పాడుపడిన కొంపవలె తయారైన ఆ యింట్లో వుండటం యిష్టంలేక చెల్లెలితో ప్రయాణమయ్యాడు.

క్రమంగా పిల్లల పెంపకంలో వాళ్ళ చదువుసంధ్యలలో అన్న సంరక్షణంలో పార్వతమ్మ తన బాధ మరచిపోగలుగుతుంది. కాని శంకరయ్య ఆవేదన ఎవరివల్లా ఆరేది కాదు, తీరేది కాదు. అతని బాధ చూసి రామయ్య లోలోన మథన పడేవాడు. లోపల దావానలం చెలరేగుతున్నా పైకి నిర్లిప్తంగా కన్పించేవాడు శంకరయ్య. ఆ పిల్లల ఆటపాటల్లో ముద్దుమురిపాల్లో వాళ్ళ మనసుల్లోని కారుమబ్బు లొక్కొక్కటి తొలగిపోసాగాయి. తల్లిజ్ఞాపకాలు సరోజ పసి హృదయాన్ని కలచి వేయకుండా పార్వతమ్మ కళ్ళల్లో వత్తులు వేసుకొని సంరక్షించేది.

అప్పుడప్పుడే జ్ఞానాన్ని జీర్ణించుకుంటున్న ప్రసాద్ మనసు సరోజ దుస్థితికి జాలిపొందేది. క్రమంగా అదే ఆ పిల్ల పట్ల అనురాగంగా మారటంతో ప్రసాద్ సరోజ నతిగారాబంగా చూచేవాడు. పొరపాటుగానైన సరోజ మనసు నొప్పించేవాడు కాదు. అసలు సరోజ బాధ పడుతుందని వూహాలో కూడా సహించనంత హృదయ సౌకుమార్యం పెంచుకున్నాడు ప్రసాద్. తరుచుగా సరోజను తన స్నేహితుల యిండ్లకు తీసుకు వెళ్ళి ఆటపాటల్లో ఆ [illegible] ఉత్సాహం కల్గించ ప్రయత్నించేవాడు. ఎలాగైతేనేం [illegible] పెంపట్లో అ[illegible]త వాత్సల్యంతో బాధ [illegible] చూపే [illegible] సరోజ పూర్తిగా యీ లోకంలో పడింది.

ప్రసాదు స్నేహితుల్లో ముఖ్యుడు మధు. ప్రసాదు క్లాసే. ఇద్దరికీ ఏదో దూరపు బంధుత్వం వుండటం, సమవయస్కులు కావటంతో యిద్దరి మధ్య స్నేహం బలీయమైంది. సరోజ, మధు, ప్రసాదు ముగ్గురూ బడికి రావటం పోవటంలో ఆట పాటలలో ఒకే జట్టుగా వుండేవారు.

వయసుతో పాటు ప్రసాదులో జ్ఞానం, పట్టుదల, తెలివి తేటలు, మృదుస్వభావం నానాటికి అభివృద్ధి చెందుతున్నాయ్. పిల్లలకు సహజమైన బాల్య చాపల్యం ప్రసాదులో కంచు కాగడా వేసి వెతికినా కన్పించేది కాదు. ఒక్క రూపమేగాదు గుణాలు కూడా తల్లిదండ్రుల నుండే సంక్రమించాయ్ ఆ బాలునికి. తండ్రి రామయ్య మాదిరే అతి గంభీర వ్యాగయు డిగా మారాడు ప్రసాదు. ఎప్పుడో గాని నోరు విప్పేవాడు కాడు. అతని గంభీరం, వినయం స్ఫురించే సరళ స్వభావం చూసిన ఆ వూరి పెద్దలకు ప్రసాదు పట్ల అవ్యాజానురాగం! తండ్రి తర్వాత తండ్రింతటి పేరు ప్రతిష్ఠలు సంపాదించగల డితడు అనుకొనేవా రందరూ. సరోజ కూడ సహజ తెలివితేట లతో చదువులో పైకి రాసాగింది.

శంకరయ్య, బావ పొలం పనుల్లో అప్పు డప్పుడూ సహాయం చేస్తూండేవాడు.

సరోజ బెరుకుతనం వదిలి బావతో చనువుగా వుండేది. పిల్లల అన్యోన్యం చూసి మనసులో సంతోషించినా పైకి వెక్కిరించి వేళాకోళం పట్టించేది పార్వతి రోజూ ప్రసాదు, సరోజ సహపంక్తిలో భోంచేయటం అలవాటు. సరదాగా బావ కబురతో తుళ్లుతూ, నవ్వుతూ భుజించే సరోజ,

ప్రసాద్ రావటం ఏ రోజైన ఆలస్యం అయితే అన్నం కెలికి వెళ్ళిపోయేది. ఆ సమయం చేజిక్కించుకొని అత్త కోడల్ని ఆట పట్టించేది-

"ఏమే ! సరూ ! బావ సరసన లేకుంటే అన్నం వంటబట్టదా !" నవ్వుతూనే వడ్డించేది చీవాట్లు. "పో అత్తయ్యా ! నీ వెప్పుడూ యింతే ! ఇద్దరం కూర్చుంటే కబుర్లతో కాలం గడిచిపోతుంది. ఒంటరిగా బిక్కు బిక్కు మంటూ ఎలా తినను ?"

"అయ్యొయ్యో ! అప్పుడే ఒంటరి తనమటే నీకు ! అయితే బావ ఎప్పుడూ చెంత వుండాల్సిందేనా ? కొంగుకు ముడేసుకొని తిరిగే కాలం ముందుందిలేవే !" అత్త ముసి ముసి నవ్వుల్లో ధవళకాంతులీనే సరోజ చెక్కిళ్ళు అరుణవర్ణం దాల్చేవి. ఏదో తెలియని సిగ్గు తనావరించగా అత్తవైపు చూడలేక తల తిప్పుకొనేది సరోజ.

ఒకో్కరోజు కొడుకు మొండిపట్టు చూస్తే అసహనం రేగేది పార్వతమ్మలో. కొడుకును తీవ్రంగా మందలించేది చీకాకుతో. ఆసమయంలో బావను వెనుకేసుకొచ్చి అత్తతో పోట్లాడేది సరోజ. అది చూసి శంకరయ్య ఆప్యాయంగా అల్లుడితో అనేవాడు-"ఒరేయ్ ప్రసాద్! చూడు దీని గడుసు తనం. నీదా సుతిమెత్తని స్వభావం. నాకూతురా పరమ గయ్యాళి. రేపు పెళ్ళి చేసుకుంటే ఎలా వేగుతావ్‌రా దీనితో"

ప్రసాద్ తక్కువతిన్నాడా? గబుక్కున అనేవాడు- "పర్వా లేదు మామయ్యా!అత్త దేవీమూర్తి. ఆ చల్లని తల్లి కూతురు గయ్యాళికాదనే నానమ్మకం. ఆమె ఆశీస్సులే మాకు రక్ష!"

దాంతో లక్ష్మి జ్ఞాపకం రావటంతో అందరి కళ్ళు ఆర్ద్రా లయ్యేవి.

అలాగే దొర్లిపోతున్నాయ్ రోజులు. ఎవరికోసం ఆగని కాలచక్రంలో ఓ సం॥రాలు గిర్రున తిరిగి పోయాయ్. కాల గమనం ప్రసాదించిన మార్పులతో స్థిమితపడుతున్న ఆ అన్నా చెల్లెళ్ళపై అనుకోని విపత్పర్వతం విరిగిపడింది. "తగిలిన కాలికే తగుల్తుంది దెబ్బ" అన్న నానుడి ఎంత అనుభవం జీర్ణించు కున్న పెద్దలనోటినుండి వెలువడిందో! మూడురోజుల విష జ్వరంతో రామయ్యచౌదరి యిహలోక యాత్ర ముగించు కున్నాడు. కుప్పలా కూలిపోయింది పార్వతమ్మ. ఆమె బ్రతుకు బ్రద్దలైంది. హృదయం వ్రయ్యలైంది. ఆమె జీవి తంలో ఏ 'విధి' ఐతే వెన్నెలలు వెలయించిందో, ఆ క్రూరవిధే నేడు తన కర్కశహస్తాలతో నిర్దాక్షిణ్యంగా పార్వతమ్మగొంతు నులిమి కారుచీకట్లోకి విసరివేసింది. ఏక్షణంలో ఏం జరుగ బోతుందో వూహించలేడే మానవుడు! బుద్బుదప్రాయమైన యీ జీవితంలోనే ఎన్ని ఆవేశకావేషాలు! ఎన్ని కుట్రలు! ఎన్ని మోసాలు!!

పార్వతమ్మ మరి ఆ ఆఘాతంనుండి తేరుకోలేకపోయింది. అందరి ముఖాల్లో వ్యథాపూరిత విషాద చిహ్నలే! అలాగే జీవచ్ఛవాలమాదిరి కర్మకాండలు చేశారు.

*   *   *

అది సూర్యోదయవేళ. అరుణుడి అరుణవర్ణపు కిరణరే ఖల అపూర్వశోభతో దిగంతాలు క్రొత్తతేజస్సు సంతరించు కొంటున్న సుప్రభాతసమయం. మే[illegible] భాగమంచు దూస్తు

కుంటూవచ్చి తను అవర్ణనీయమైన కుంకుమశోభతో క్షితి జాన్ని అలంకరిస్తున్న సూర్యకిరణాలవంక తదేకంగా చూస్తూ కూర్చున్నాడు ప్రసాద్. ముఖంలోని అలసట, కన్నుల్లోని కెంపుదనం అతని నిద్ర లేమితనం వెల్లడిస్తోంది. ప్రభాకరుని ఆగమనంలోని క్రొత్తఅందాల్ని అతనికళ్ళు పరీక్షిస్తునా మస్తిష్కం మాత్రం ఆలోచనలతో సతమతమౌతోంది. అనంతమయిన ఆలోచనాతరంగాల అలికిడితో అతనితల భార ముగా వుంది. తనకు సంభవించిన దుస్థితిని గూర్చి, సంసార సంగతుల గూర్చి రాత్రినుండి నిర్విరామంగా ఆలోచించి ఒక నిశ్చయాన్ని సమీపించాడు ప్రసాద్. సూర్యోదయంతో పాటు అతని హృదయాకాశంలో క్రమ్ముకున్న కారు మేఘాలు ఒక్కొక్కటే చెదిరిపోయి మనసు నిర్మల ప్రభాతకాంతులతో నిండింది. దానితో గాఢంగా నిట్టూర్చి తన నిశ్చయాన్ని మరొక్కమారు నెమరు వేసుకు న్నాడు ప్రసాద్.

"తండ్రిమరణం విచ్చలవిడిగా విహరించే నా సమస్త మార్గాల్ని మూసివేసి నన్ని వాస్తవిక వర్తమాన ప్రపంచం లోకి గిరాటు వేసింది. తన జీవనజ్యోతి ఆరిపోగా దుర్భరదీనా వస్థలో కుమిలిపోతున్న అమ్మకు యీ సమయంలో తన ఆసరా యెంతో అవసరం. అటువంటి సమయంలో పైచదువు కని తను వున్నవూరు విడిచిపోవటం న్యాయమా? అప్పుడు అమ్మ అసలు తనకు దక్కుతుందా? సగంలో వదిలేస్తే భూమి పుట్రా సంగతేమిటి? వాటిని వేయికళ్ళతో కాపాడి సరక్షిం చేదెవరు? మామయ్యా ఒట్టి అర్భకుడు. లోకంపోకడ నెరు

గని అమాయకుడు. యిటు బావమరిది మరణంతో, అటు భార్యామరణంతో దుర్బలస్థితిలో వున్న అతనివలన సహాయు మపేక్షించడం వట్టి భ్రమ. తండ్రిమరణంతో తన భవిష్యజ్జీవితం ఎంత కంటకావృతమయిపోయింది! మూలాధారం లేకుండా గాలివాటుకు అల్లల్లాడే తన కుటుంబాన్ని అధోగతి పాలుచేసి పైచదువుల నాశించటమూ లేక సమాజం విధించే శృంఖలాలు ధరించి యింత సంసారభారం తలపై మోయుడమూ! దండించే నాధుడు లేకుంటే పండించే నాధుడెవ్వరు? పొలాలు అవి అలా పాడుపడవలసిందేనా! ”

దీర్ఘంగా కొన్నిగంటలు తనలో తానే చర్చించుకుని యిక చదువుమానటం తప్ప గత్యంతరం లేదనుకున్నాడు ప్రసాద్ తనకు కాలేజీ చదువుల యోగమే వుంటే అంత అర్ధాంతరంగా తండ్రి చనిపోయేవాడే కాదు. యిన్ని అస్వాభావిక పరిస్థితులు సంభవించేవీ కావు. కనుక విధి తన జీవితంతో చెరలాటలాడుతోంది. యిహ చదువుపై ఆశ వదలి తనకు సంప్రాప్తించినదే మహాభాగ్యమని యిక యింటిపట్టునేవుండి యిటు తల్లిని, అటు వ్యవసాయాని చేజారిపోకుండా రక్షించి తన బాధ్యతలని సక్రమంగా నిర్వర్తించడం వుత్తమం అన్న దృఢనిశ్చయానికి తలొంచాడతను.

ఆ నిశ్చయం కలగడమే తడవుగా తల్లిని వెతుక్కుంటూ యింట్లోకి వెళ్ళి పెరటిలో వేపచెట్టుక్రింద మంచం మీద అన్యమనస్కంగాకూర్చున్న తల్లిని చూశాడు ప్రసాద్. పీక్కుపోయి కళ తరిగిపోయిన ఆ ముఖం చూడగానే అతని కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. మెల్లగా వెళ్ళి తల్లిప్రక్కనే చతికిల

పడ్డాడు. పరధ్యానంగా ఎటో చూస్తున్న పార్వతమ్మ వులిక్కి పడి కొడుకువంక చూసి "ఏం బాబూ!" అంది. ఎలా చెప్పటమా అన్న సందిగ్ధంలోనే,

"అమ్మా! మొన్న మా రిజల్ట్సు వచ్చాయి. నేను S. S. L. C పాస్ అయ్యాను. జ్ఞాపకం వుందా అమ్మా!" అన్నాడు తల్లి కళ్ళల్లోకి చూస్తూ.

"అవును. యిక్కడ కాలేజి లేదుకదా! ఎక్కడకి వెళ్ళాలనుకుంటున్నావు? అప్లికేషను అదీ తెప్పించావా?"

"లేదమ్మా! కాని నేనింకా చదవదలుచుకోలేదు"

"ఎందుకూ ?" ఆశ్చర్యంతో వింతగా కొడుకు ముఖంలోకి చూసింది పార్వతి.

"ఇప్పుడున్న చదువు చాలదామ్మా నాకు! వున్న వూళ్లోనే వుండి పొలం పనులు చూసుకోవాలనుకుంటున్నాను. కొడుకు మనసు అవగతం చేసుకున్న పార్వతమ్మ ముఖం క్షణంలో నల్లబడింది. వ్యవసాయమంటే మగసాయం లేకుండా జరిగేది కాదు. అదీగాక తన భర్త దానికోసం చేసిన అప్పులూ అవి అలాగే వున్నాయి. రేపు కొడుకు లేని సమయంలో అందరూ వచ్చి వత్తిడి తెస్తే తాను ఎలా భరించగలదు ? ఒకవేళ ప్రసాదు పై చదువులకు వెళ్ళినా వ్యవసాయం చేస్తే గాని డబ్బులు రావే తమకు ? ప్రతినెలా తప్పకుండా క్రమంగా డబ్బుపంపించగలదా తాను? అయినా పార్వతమ్మకు కొడుకింతటితో చదువు ఆపటం యిష్టం లేకపోయింది. నెమ్మదిగా యిలా అంది-

"మాత ప్రసాద్ ! మామయ్య సాయంతో ఎలాగో యీ పనులు నేను చూసుకోగలను. తండ్రి లేకున్నా నీ తల్లి బ్రతికే వుంది కదా !"

తన సహజ మృదుహాసం పెదవులపై చిలికిస్తూ, స్థిర చిత్తంతో చెప్పాడు ప్రసాదు- "నాకు చదువంటే అంతఆసక్తి లేదమ్మా ! అయినా నిన్ను విడిచి యిప్పుడు దూరంగా పోలే నమ్మా !" ప్రసాదు నవ్వుతూనే చెప్పినా అతని ఆ నిశ్చయం వెనుక ఎంత అగాధవిషాదం దాగి వుందో గ్రహించిన తల్లి మారుపల్కలేక లోనుంచి పొంగివచ్చే దుఃఖావేగం అణచుకుంటూ శోకామలిత నేత్రాల్తో కొడుకు ముఖంలోకి తదేకంగా చూస్తూ కూర్చుంది.

ప్రసాదు చేరే కాలేజీలోనే తానూ చేరాలని వుబలాట పడుతున్న మధు యీ వార్త విని చలించిపోయాడు. ఒక్క-పరుగున స్నేహితుడ్ని సమీపించి ప్రశ్నించాడు- "ప్రసాద్! నీకేం పిచ్చెత్తలేదు కదా !" ఆయాసంతో అడుగుతున్న మధును చూసి నవ్వాడు ప్రసాదు. తీరిగ్గా కూర్చొని శాంతంగా నవ్వుతున్న అతన్ని చూస్తుంటే మధులో కోపం కట్టలు తెంచుకు ప్రవహించింది.

"అల్ప విషయాల కంత ప్రాధాన్యం యిచ్చి గొడవ చెయ్యటం నీకు మొదటి నుంచి అలవాటేగా ! నీవు లేకుంటే సంసారం సాగదా ? అలాగని నీ భవిష్యత్తు నాశనం చేసుకుంటావా ?" అంటూ అనర్గళంగా గంటసేపు వాదించి ఫలితం లేక చిన్నబుచ్చుకున్నాడు మధు.

శెలవులు పూర్తి కాగానే కాలేజీలో చేరటానికి మధు గుంటూరెళ్ళిపోయాడు. ప్రసాదు వ్యవసాయ పనులు చూసు కుంటున్నాడు. ప్రొద్దున్నే ఫలహారం తిని పొలంవెళ్ళి మధ్యా హ్నంగా వచ్చి భోంచేసేవాడు. మూడు నాలుగు గంటలకు వెళ్ళి తిరిగి రాత్రికి యిల్లు చేరేవాడు. నూనూగుమీసాల నూతనయువ్వనంలో, కులాసాగా ఆడుతూ పాడుతూ సరదాగా తిరగవలసిన కొడుకు, ఎండనక వానక రాత్రింబవళ్లు సంసార భారాన్ని యీదుకు రావటం చూస్తుంటే పార్వతమ్మమాతృ హృదయం గిలగిలా తన్నుకునేది. ఆ బాధ ఆమె నరనరాల్ని నలిపి రంపపుకోత పెట్టేది తన భర్తే బ్రతికి వుంటే ప్రసాదు యీ చిన్న వయసులో యింత శ్రమించాల్సి వచ్చేదికాదు. ఈ భావన తట్టినపుడల్లా ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యేవి. అటువంటి సమయాల్లో అన్న శంకరయ్య ఆమెను ఓదారు స్తూండేవాడు.

"ఏమిటమ్మా పార్వతీ! నీవు మరీ పిచ్చిదానివౌ తున్నావ్! అబ్బాయికేం మహారాజులా తన స్వంత ఆస్తి సంరక్షించుకుంటూ కులాసాగే వున్నాడు. మనుష్యుల బుద్ధి వికాసాల్ని కొలిచే సాధనం చదువా! అనుభవం నేర్పే పాఠం కన్నా మహోత్కృష్టమైంది వేరే లేదమ్మా! నలుగు రిలో వన్నెగా బ్రతుకుతూ ప్రసాద్ తన ఆస్తిపాస్తుల నొప్పుగా పరిష్కరించుకుంటూ మన కళ్ళెదుట తిరుగుతూంటే కాదా? పెద్ద చదువులు చదివుతేనేనా తెలివితేటలు వికా

సించేది !" అని సంతలిస్తూంటే మారుపల్కేదికా దాపె. కాని అన్న మాటలతో ఆమె పరితప్త హృదయం కొద్దిగా శాంతించేది.

వారాలు, నెలలు, సంవత్సరాలు దొర్లిపోతున్నయ్. ఈ మధ్య కాలంలో అనుకోని మార్పులు అనేకం సంభవించినయ్.

ఇప్పుడు సరోజ గృహకృత్యాల్లో పాల్గొంటూ అత్తకు విశ్రాంతి కల్పించేది సాయంత్రం స్కూలు నుండి తిరిగిరావటంతోపాటే వంటా - వార్పూ తానే చూసేది. బావకు అన్ని పనులు సమకూర్చటంలో సరోజకు అతి వుత్సాహం జనించేది. ఇంట్లో పాలేళ్ళకు పనుల్లో పురమాయించటం, పనిమనిషిని అజమాయిషీ చేయటం, యింట్లో లేనిసరుకులను తెప్పించుకోవటం అంతా కోడలు చేస్తూ వుంటే నిర్విచారంగా చూస్తూ కూర్చునేది అత్త

ప్రసాదు నడవడిలో కూడా అనేక మార్పులు సంభవించాయి. ఇప్పుడు అతని భావాలు, ఆలోచనలు, వాంఛలు ఒక క్రమ మార్గం పొందాయి. అతని ప్రతికదలికలో జీవితం మధించి తెలుసుకొన్న నగ్నసత్యాలు తల చూపసాగాయ్. కాలం అతని వ్యక్తిత్వాని కొక మహత్తర విలువ సృష్టించింది. ఉదాత్త హృదయంతో గంభీరాకృతితో భాసించే ప్రసాదు పట్ల వూరిజనాని కమిత వాత్సల్యం గురి వేర్పడినయ్. తత్ఫలితంగా నేడు ప్రసాదుకు తెలియకుండా వూర్లో ఏ చిన్న పని కూడా జరగటానికి వీల్లేదు. సునిశిత ప్రజ్ఞాశాలియైన ప్రసాదు తీర్పులు పెద్దవాళ్ళ మనస్సుల్ని సైతం రంజింపచేసేవి.

తనకంటే అనుభవజ్ఞులతో మాట్లాడవలసివస్తే ముందు వెనుక లాలోచించి తూచి తూచిమాట్లాడేవాడు. పొరపాటుగానైనా యితరుల మనసు నొప్పించటం గాని దురుసుగా మాట్లాడటం గాని అతని స్వభావానికే విరుద్ధం.

రసాయనిక ఎరువు లుపయోగించి పంటలు అధికంగా పండించటంలో ప్రస్తుతం ప్రసాద్ చెయ్యొదిరిగినదిట్ల. అప్పటి కన్న పంటలమీంది రాబడి యిప్పుడు అధికమైంది. డబ్బుతో బాటుగా ఆత్మీయుల అనురాగం, సానుభూతి, ప్రేమ లభించ టంతో అతని మొహం- సంతోషం, చైతన్యం, ఉత్సా హంతో ప్రసన్నమైంది. నిరంతరం అతని పెదవులపై చిందే చిరు మందహాసమే అతని ఆనందాన్ని వెల్లడించుతూండేది. పంట విషయంలో తనకేదైనా అవసరం కల్గినా, అనుమానం వచ్చినా వెంటనే తనకు తెలిసిన వారిని సంప్రదించి అనుమాన నివృత్తి చేసుకోటంలో ప్రసాదు మొహమాటపడేవాడుకాదు. అహం,అధికారం,అభిజాత్యంలేనిఅతని నిర్మలప్రవర్తనకాడు.నిష్కా పట్య హృదయం ప్రసాదు భవిష్యత్తు జీవితం సుఖమయం కావడానికి తోడ్పడింది.

ఇప్పుడు పార్వతమ్మ యింటి పనుల్లో కేవలం నిమిత్త మాత్రురాలు. అన్నిపనులు సరోజ, ప్రసాద్ చేతులమీదు గానే సాగుతున్నాయ్.

P. U. C. పాసై మధు ఉత్సాహం పుంజుకొని తిరిగి ఊరు చేరాడు. పల్లెటూరు వేషమంతాపోయి పట్నందొర య్యాడు. స్వచ్ఛత నలగని చలువదుస్తులు, సూటూ, బూటూ

పాటూ, యింట్లో నడిచేసమయంలో అకుజోళ్ళు, మైలుదూరం పరిమళం గుబాళించే హేరాయిల్స్, స్నో, పౌడర్లూ చెదరిపోని ఒత్తైన క్రాపూ—యిదీ అతని బస్తీవేషం. ఎప్పుడూ తృళ్ళుతూ, గెంతుతూ, నవ్వుతూ యితర్లను నవ్విస్తూ వుండేవాడు. మధువస్తేచాలు- సరోజకు, ప్రసాద్‌కు బాగా ప్రొద్దుపోయేది. గుంటూరు విశేషాలు, కాలేజీ సంగతులు, తాము అమ్మాయిల నెలా ఏడిపించేదీ తమాషాగా వర్ణించి చెప్తూంటే సరోజ అతి ఆసక్తిగా వినేది. ప్రసాద్‌కూడా కుతూహలం కనబర్చేవాడు. మధు జల్సారాయుడయ్యాడు. పూర్వపు బెరుకుదనం పూర్తిగా మాయమై దాని స్థానే క్రొత్త సరదాలు చోటుచేసుకున్నాయ్.

ఈలోగా సరోజ పుష్పవతి అయింది. భర్త మరణఖేదంతో దుర్భరదీనావస్థలో కృశించి నశించిపోతున్న పార్వతమ్మకి వార్త సంతోషప్రదమైంది. బక్కచిక్కి, శల్యమైన ఆమె మ్లానవదనంలో ఒకింత నూతనోత్సాహం పొటమరించింది. దుర్బలమైన తన శరీరంలో కరిగి తరిగిపోయిన శక్తినంతా కూడగట్టుకొని, లేని ఓపిక తెచ్చుకొని చురుగ్గా తిరుగాడే తల్లినిచూస్తూంటే ప్రసాద్‌కు ఒక్కసారి వెయ్యేనుగుల బలంకల్గింది. తల్లి, ఎక్కడ ఏపనిచేస్తున్నా అతనికళ్లు తల్లిని నీడలా వెంటాడేవి. తల్లికి ఏవస్తువు కావలిసివచ్చినా క్షణంలో అమర్చిపెట్టేవాడు. చివరిరోజు పండుగ రెండు రోజులుండనగా తల్లికొడుకును చేరబిలిచింది -

“చూడు నాయనా! ఎల్లుండే సరోజ స్నానం. ఆరోజు పూరంతటికీ సంతర్పణ చేయించాలని వుంది. ఇక నేనెన్నాళ్ళో

జాలు బ్రతుకుతానని తోచదు. నానాటికీ నా పరిస్థితి అధ్వాన్నంగా తయారౌతోంది కనుక చివరిసారి నాచేత్తో పదిమందికి వండి పెట్టి హాయిగా శ్వాస పీలుస్తాను."

"అలాగే కానీయమ్మా! ఇంట్లోకి ఏసరుకులు కావాలో చెప్తే పట్నంపోయి తెస్తాను"

"ఒట్టి సరుకులే కాదు నాయనా! మేనత్తగా నేనింత వరకు సరోజకు ఏ నగా చేయించలేదు. కనుక దానికి సరిపోయే విలువైన నగలు ఏవైనా తేవాలి బాబూ. ఖర్చుకు వెనుదీయకుండా ఘనంగా జరగాలీ పండుగ!" తల్లి మాటలు విని ఆరోజే పట్నం బైలుదేరాడు ప్రసాదు.

ఆరోజు శుక్రవారం. సరోజను స్నానం చేయించి కూర్చోబెట్టారు. ఇంటినిండా గలగలామంటూ ముత్తయిదువలు తిరుగుతూంటే పార్వతమ్మ ముఖంలో మునుపటి కాంతి కొద్దిగ తిరిగి వచ్చింది. అబ్బబ్బ! ఎన్నిరకాల పట్టు-చీరెలు! గాలికి రెపరెపమంటున్నయ్. ఒకోక్క అమ్మ దిగేసిన నగలు చూస్తుంటే సరోజ కెక్కడలేని నవ్వు వస్తుంది- "వున్న నగలన్నీ దిగేసుకోవాలా!" అని అందరినీ పరకాయించి చూస్తూ చిన్నగా తనలో తానే నవ్వుకుంటుంది. అందరు హడావిడిగా చేసే పనిలేకున్నా అటు యిటు బంగారుగా తిరుగుతూంటే ముచ్చటగా చూస్తూ కూర్చుంది సరోజ తలారువ్వుకుంటూను.

వంటింట్లోనుండి వచ్చే కమ్మటి పిండివంటల వాసనలు నాసికారంధ్రాల్ని తాకి సరోజ కమిత ఆకలి కల్గిస్తున్నయ్. ఘుమఘుమలాడే నేతి వంటల్ని ఆప్యాయంగా తిందామన్నా

తనకు పెట్టేవాళ్ళే లేరే అని దిగులుగా చూస్తూ ఆలోచిస్తోంది సరోజ.

సాయం సమయం. ఇల్లంతా దీపాల తోరణాలతో అందంగా అలంకరించారు. పెళ్ళికూతురులా ముస్తాబుచేసి ముత్తయిదువులు సరోజను పీటపై కూర్చోబెట్టి పాటలుపాడు తుంటే దూరంగా నిలబడి చూస్తోంది పార్వతమ్మ.

దీపాల కాంతిలో మిలమిలా మెరిసిపోయే దాని శరీర లావణ్యం ఎంత మనోహరంగా వుంది! లలిత లావణ్య కాంతు లీనే ఆ ఫాల భాగం, విల్లులా వంగిన దాని కనుబొమ్మలు, పారవశ్యంతో ముకుళించుకుపోయిన ఆ పద్మదళాయిత నేత్రాల్లో తళుక్కున మెరసి మాయమయ్యే ఆవిద్యుత్కాంతి సంపెంగతో సరిదూగే ఆ సన్నటి దీర్ఘ నాసిక, దొండ పండులా ఎర్రగా పండిన ఆ సన్నటి లేత పెదిమలమధ్య తురి మిన ముత్యాలవంటి పలువరుస – దాని అందాన్ని రెట్టింపు చేస్తున్నయ్. రుతుస్నానమై ఆరబెట్టుకున్న దాని పట్టుకుచ్చు లాటి బారెడు వెంట్రుకలు భూమిని తాకుతున్నయ్. శంఖం లాంటి దాని నునుపైన కంఠంలో ప్రసాద్ యిచ్చిన రవ్వల హారం ధగద్ధగాయమానంగా మెరుస్తోంది. అటుయిటు కదలి నపుడల్లా చెవుల్లోని రవ్వల కమ్మలకాంతి దాని అరుణవర్ణ చెక్కిళ్ళపై ప్రసరించి మరింత అపూర్వశోభ కల్గిస్తోంది. పసుపు పూసి, పారాణి అలంకరించిన సౌందర్యశ్రీ చెన్నారే దాని పాదద్వయం మరింత చూడమనస్సు కలుగుతోంది. తన చేతులతో అలంకరించిన ఆ జలతారు పట్టుచీరె, అ జరీరెవికె ధరించిన సరోజ దివినుండి భువికి జారి వచ్చిన అప్సరసనే

మరపిస్తోంది కదా ! ఆహా ! తీర్చిదిద్దిన దాని అంగలావణ్యాం అసలైన లక్ష్మి ప్రతిమ అది. నవయౌవ్వనావిర్భూతమైన దాని అనన్యసామాన్య అనుపమ సౌందర్యం ఎంత శోభాయమానంగా మనసు నలరిస్తోంది ! ఈ క్షణంలో వదినే బ్రతికి వుంటే యీ సుందర చంద్రి శిలాప్రతిమవంటి అందాల రాణి తన కూతురుని ఎంత పొంగిపోయేదో కదా !" కళ్ళనుండి జారిన అశ్రువుల చీర చెరగుతో తుడుచుకొని అలాగే రెప్ప వేయకుండా ద్విగుణీకృతమైన సరోజ సౌందర్యం చూస్తూ ఏవో లోకాల్లో తేలిపోయింది పార్వతమ్మ.

వైభవంగా ముగిసింది పండుగ. సంతృప్తిగా భుజించి అందరూ తమతమ నెలవులకు వెళ్ళిపోయాక, పార్వతమ్మ కోడలికి దృష్టిదోషం తగలకుండా దిగదీసి పోసింది వుప్పు.

ప్రసాదు తన పనులన్నీ నిర్మొహమాటంగా సరోజకు పురమాయించే వాడు. "సరోజా ! ఇలారా ! ఓ రెండొందలు తీసివ్వు అర్జెంట్"అంటూ హడావుడి చేసేవాడు.

'ఇదిగో సరోజా ! ఈ బట్టలన్నీ యిలా మురిగి పోయాయేం చాకలికి వేయలేదా ?'

"అమ్మకు అన్నం పెట్టావా :" ఇలా అధికారం చెలాయించే బావనుచూస్తే సరోజకు నవ్వు,కోపం రెండూ వచ్చేవి. "నా ముఖం చూస్తే అన్ని విషయాలు జ్ఞాపకం వస్తాయా బావా !" అనేది.

"కాదా మరి ! నీ అద్దాల్లాంటి చెక్కిళ్ళల్లో సమస్తం ప్రతిబింబిస్తాయ్ సరూ!" అంటూంటే సరోజ పారిపోతుండేది.

"అరరె! అప్పుడే పోతున్నావేం! నిన్న నేను యిచ్చిన కాగితాలు జాగ్రత్తగా పెట్టావా? చాలా ముఖ్యం సుమా!"

"ఆ ఆ! పెట్టాను జాగ్రత్తగా పొయ్యిలో పెట్టాను! అని తుర్రుమనేది సరోజ.

మఘునడిగి పుస్తకాలు తీసుకొని విరామ సమయంలో పొలంలో చదువుకుంటూండేవాడు ప్రసాదు. రాత్రి యింటికి వచ్చి భోంచేయగానే పగలు తాను చదివిన ఇంగ్లీషు పుస్తకాల్లోని అద్భుత గాథలు అతి రమ్యంగా వర్ణించి చెప్పేవాడు సరోజకు. ఎక్కడా పట్టు చెడకుండా చమత్కరించి రసవత్తరంగా కథ చెప్పే బావ మొహంలోకి తదేకంగా చూస్తూండేది సరోజ. ఎర్రటి శరీర ఛాయతో, నల్లగా, ఒత్తుగా, ఎత్తుగా పెరిగిన ఒంకుల జుట్టుతో, దట్టమైన కనుబొమ్మలతో, విశాలమైన నుదుటితో ఆకర్షణీయంగా కన్పించే బావనెంత చూసినా తనివితీరదు. ఒడ్డూ, పొడవు కలిగి వయసుకు మించిన దేహపటుత్వం పెంచుకున్న బావ దృఢశరీరం చూస్తూ తన్మయురాలయ్యేది సరోజ. అతని పెద్దపెద్ద కళ్ళల్లో పరవళ్ళు త్రొక్కే మోహ వీచికల్ని గాంచి విస్తుపోయేది. శాంత, గంభీర, కరుణ భావాలు చిలకరించే బావ ప్రఫుల్ల వదనంవంక అలా రెప్పలల్లార్చకుండా చూస్తూంటే కల్గే ఆనందం ఎంతో గొప్పది! మధుర మందహాస మొలికించే ముఖ వర్చస్సు, అతని వినయ శిష్ట సభ్యతం అతనొక అసాధారణ ప్రతిభా సంపన్నుడిగా గోచరింపచేసేది సరోజ అంతర్నేత్రాలకు. అలాగే విస్ఫారిత విశాలనయనాల్తో బావ విగ్రహం చూస్తూ ఒక్కోసారి అతడేం చెప్తున్నాడో కూడా వినదికాదు తను.

ప్రసాదు కూడా సరోజ సమక్షంలో అనంతానందం అనుభవిస్తూండేవాడు. పరోక్షంలో కూడా అతని వూహాలు సరోజ చుట్టూ పరిభ్రమించేవి. యువతీ యువకులను స్వప్న సీమల్లో విహరింపజేసే మహత్తర శక్తి ఒక్క యవ్వనానికే వుంది. తియ్యని కలలతో జీవితమాధుర్యమంతా తమ చేతుల్లోనే వుందని విఱ్ఱవీగటమే యువకుల నైజం. పొరబాటుగానైనా జీవితంలో అపశృతి తలపలేరు. వారి హృదయంలో జనించే భావ తరంగాలు విశ్వవిహారం చేస్తాయి. భవిష్యత్తు బంగారుమయంగా మలచుకోవటమే వారి పని.

నవయావ్వనోత్సాహంతో పొంగిపొరలే ప్రసాదు మనసు కూడా కాల్పనిక జగత్తులో కరిగిపోయేది. అతనిలో జనించే మహోన్నత వుత్తుంగ తరంగాలు నభోమండలాన్ని కూడా దూసుకువెళ్ళేవి "సరోజ సాన్నిధ్యంలో తన బ్రతుకు బంగారు పంటలు పండించదా? ఆమె ప్రణయరసాస్వాదనలో మైమరచే సమయంలో తన యింట స్వర్గద్వారాలే తెరుచుకోవా? సురలకు కూడా అసాధ్యమైన భోగభాగ్యాలు ఆనాడు తన సొత్తు కావా?" అనే విచిత్ర కలలతో పులకరించి పోయేవాడు.

ఊహాలోకపుటంచుల్లో విహరిస్తూ తనచుట్టూ తానే ఒక అపూర్వ స్వర్గవలయం సృష్టించుకొనేవాడు ప్రసాదు. తన భావిజీవితం ఎలా స్వర్గతుల్యంగా మార్చుకోవాలో ఆలోచించేవాడు.

తాను చెప్పే కథల నుత్సుకత దృష్టితో నాలకించే ఒక ముగ్ధ మోహన స్నిగ్ధచ్ఛాయాసుందరీ ప్రతిరూపం

ప్రసాదు మనోఫలకంపై ముద్రితమైంది. మిసమిసలాడే ఆ తరుణి శరీరచ్ఛాయ, అమాయకత్వాంస్ఫురింపజేసే ఆఆకర్ణాంత విశాల నేత్రాలు, నిర్మలంగా నవ్వినప్పుడు గులాబీరేకులా అందంగా విచ్చుకునే ఆ లేత పెదిమలు, వాటి మధ్య ధవళ కాంతులీనే స్ఫటిక శిలల్ని సైతం మరపింపచేసే పలువరుస, గాలి తాకిడికి వూగిపోయే సన్నటి నడుంపై స్వేచ్ఛా విహారం సలిపే వినీలకుంతలాలు ప్రసాదు దృష్టి పథంలో ఏ క్షణం చెరిగి చెదిరిపోయేదిగాదు.

నవ నవోన్మేష కాంతులీనే భావిజీవితం ప్రసాదు అంత శ్చక్షువులముందు జ్వాజ్వల్యమానంగాప్రకాశిస్తూండేది. అతని ఆలోచనాప్రవాహం నిర్నిరోధంగా సాగిపోతూండేది. ప్రసాద్ నరనరమూ, అతనిలోని ప్రతి అణువూ సరోజకోసం తపించి పోయేది. కాని ఏనాడూ హద్దులుమీరిన అనౌచిత్యభావప్రకటన అతనినుండి వెలువడేది కాదు. సరోజ కూడా శ్రద్ధగా గమనిం చింది. బావ తన్నెంత గాఢతమంగా ప్రేమిస్తున్నాడో తెలు సుకోలేని ముగ్ధరాలు కాదామె. నిత్యము తనసాహచర్యంలో మసలుతూండే మరదలిపై ఏమరుపాటుగానైనా చెయ్యి వేయని బావ నిగ్రహశక్తికి సరోజ ముగ్ధురాలై లోలోనే జోహారు లర్పించేది.

ఒకరోజు రాత్రి భోంచేసి ఆరుబయట మంచంలో కూర్చున్నాడు ప్రసాదు. పుస్తకం తీసుకొని సరోజ వచ్చి బావ కెదురుగా కూర్చుంది. ఏదో ఆలోచిస్తూ అన్నాడు ప్రసాదు– "సరోజా! మామయ్యస్థితి ఎలా వుంది ?"

"ఏం చెప్పను బావా !" తండ్రి దుస్థితి తల్చుకో గానే ఆమె కంఠం రుద్ధమైంది. "నాన్న పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారౌతోంది బావా ! దినదినమూ దిగజారే శరీరస్థితి తప్ప ఏమీ మార్పులేదు ఆయనలో. ఒక్కడూ కూర్చుని దిగులుగా తనలోతానే ఏదో గొణుక్కుంటాడే తప్ప పైకి ఏమీ చెప్పడు. పోనీ నీతోపాటే నాన్నను పొలంతీసుకు పోరాదా !" సరోజ కళ్ళల్లో కనిపించిన వ్యాకులత చూసి విచారపడ్డాడు ప్రసాదు.

"మామయ్య కదలలేడు కదా ! అడుగు తీసి అడుగు వేస్తే ఆయాసభాగం బాధిస్తుం దాయన్ని. ఆయన్ని పొలం తీసుకువెళ్ళి ఏం చేయాలి సరోజా ! "

"పని చేయటానిక్కాదు బావా ! మధ్యాహ్నం ఏ పెలాగూ పుస్తకాలు చదువుతుంటావుగా ! ఆయనకు కాస్త చదివి వినిపిస్తుంటే మంచిది. కాస్త మాటా - మంచీ వుంటే యీ ఒంటరితనము వదిలిపోతుంది బావా !"

"సరే ! అలానే చేద్దాంలే !"

ఆ రోజు నుండి ప్రసాదు మామను తనతో పొలం తీసుకువెళ్తూండేవాడు. రోజూ పేపరు చదివి లోక వ్యవహారాలు చెప్పేవాడు. అప్పుడప్పుడు తాను చదివే పుస్తకాల్లో కథలు చెప్పి నవ్వించేవాడు. విదేశీయుల పద్ధతులు, వారి ఆచార వ్యవహారాలు, వారి సాంఘిక వ్యవస్థలు, అక్కడి వ్యవసాయ పద్ధతులు విశదీకరించేవాడు.

విరామసమయంలో కూలీ నాలీ జనంతో మాట్లాడుతూ శంకరయ్య కొద్దిగా తన నిస్తేజభావం సడలించేవాడు.

అది డిసెంబరు నెల; గజగజ వణికిస్తోంది చలి. అప్పుడే వరికోత లారంభమైనయ్. రివ్వున వీచే ఆ ఎముకలు కొరికే చలిలోనే గొంగళ్ళు కప్పుకొని రైతులు పొలాలవైపు బయల్దేరేవారు. పనుల వత్తిడిలో తీరిక చిక్కని ప్రసాదు రెండు గంటలకు యిల్లు చేరాడు. ఆదరా బాదరాగా నాలుగు మెతుకులు గతికే సమయింలో మధు వచ్చి ప్రసాదు కెదురుగా పీట వాల్చుకొని కూర్చుంటూ అడిగాడు–"ఏమిటోయ్ అంత హడావుడి ! ఎక్కడికి వెడుతున్నావేమిటి !" అని . కొడుక్కి చారు వడ్డిస్తూన్న పార్వతమ్మ వెనక్కి తిరిగి నీవా అని తిరిగి కొడుక్కి రసం పోస్తు అడిగింది–

"ఏం మధూ ! అక్కయ్యా వాళ్ళు వెళ్ళిపోతున్నారటగా వూరికి ?"

"అవును పెద్దమ్మా ! ఎల్లుండి వెడుతున్నారు. అందుకే రేపు అందరం 'కోన' వెళ్లాలనుకుంటున్నాము. అమ్మ నిన్ను, ప్రసాదును, సరోజను తయారుకమ్మని చెప్పింది అది చెప్పాలనే యిలా వచ్చాను."

"కోనకా ! ఎవరెవరు వెడుతున్నారు ? అయినా నా కెక్కడిది బాబూ ఓపిక ! ప్రసాదును తీసుకువెళ్ళు !" అంది వంటింట్లోకి వెళ్ళిపోతూ పార్వతమ్మ.

"కాదు పెద్దమ్మా ! అందరూ రావాల్సిందే !" అని గట్టిగా కేకవేస్తూ ప్రసాదు వైపు తిరిగాడు "ఏమంటావ్" అన్నట్లు. అంతవరకు మౌనంగా భోం చేస్తున్న ప్రసాదు "నేను రాను" అన్నాడు.

"ఏం ఎందుకని రావు ?"

"నీకేమోయ్ ! పార్కులు, పిక్నిక్కులు ఎన్నైనా తిరగ్గలవు. వరి కోతలా యిప్పుడు! ఒక్క నిమిషం తీరికుండదు నాకు !" పెద్ద చారు ముద్దను నోట్లో కుక్కుకుంటూ మెల్లిగా అన్నాడు ప్రసాదు.

"చెప్పావులే కథలు ! లోకంలో మహా నీకొక్కడికే పనులున్నట్లు మాట్లాడతా వేమిటోయ్ ! ఒక్క రోజుకేం మునిగిపోదులే ! పొద్దున్నే తయారుగా వుండు !"

"కాదు మధూ! ఒక్క క్షణం కనుమరుగైనా కూలీలు పనిమానేస్తారు. ఎప్పుడూ ఎవరో ఒకరు కళ్లెదుట వుంటేగాని వళ్ళువంచి పని చేయరు !" తాను రావటం కుదరదు అన్నట్టుగా చెప్పాడు ప్రసాదు. అంతలోనే అక్కడికి వచ్చిన పార్వతమ్మ "పోనీ ! ఒక్కరోజుకేం మామయ్య వెళ్తాడులే పొలం" అంది ఎవరూ వెళ్ళకపోతే మధు కోపగించుకుంటాడన్నట్టుగా. కాని ప్రసాదు వింటాడా!

"నీకు తెలియదులేమ్మా ! ఇంత చలిలో మామయ్య అక్కడొక్క నిమిషం నిలబడలేడు" చెయ్యి కడుక్కుంటూ అన్న కొడుకువైపు చూసింది పార్వతమ్మ. ఆమెకు తెలుసు— ఇక కొడుకు దృఢనిశ్చయం మారదని. అందుకే మధు చిన్న బుచ్చుకోవటం యిష్టంలేక సరోజ వస్తుందిలే బాబూ!"అంది. ప్రసాదు ఆశ్చర్యంగా తల్లి ముఖంలోకిచూశాడు. తనూ,అమ్మ లేకుండా సరోజను పంపటమా అన్నట్లు. కాని మధుముందు ఏమనటానికీ యిష్టంలేక బైటికెళ్ళిపోయాడు ప్రసాదు.

సాయంత్రం బడి నుంచి సరోజ రాగానే అంతా చెప్పింది పార్వతమ్మ.

ఏదో ఆలోచిస్తూ "బావ ఏమీ అనలేదా ?" అంది సరోజ.

"ఆ! నీవు వెడతానంటే వాడేమంటాడు ! ఏమీఅనడు కాని బటలవీ సర్దుకో" అత్త మాట కెదురు చెప్పలేదు మేనకోడలు సరోజ.

* * * *

ఇంకా పూర్తిగా చీకటి తెరలు విడమనుండి పోక ముందే రెండు(ఎద్దుల) బండ్లు 'కోన' వైపు సాగిపోయినయ్.

'శివకోన'ఆ చుట్టుపట్ల ప్రసిద్ధి చెందిన యాత్రాస్థలం. ప్రతి శివరాత్రికి అక్కడ రథోత్సవాలతివైభవంగా జరుగుతాయి. ఎక్కడెక్కడి నుండో జనులు తండోపతండాలుగా ఆ మహోత్సవాలు చూచి ఆనందించి రావటం కద్దు. ప్రకృతి రమణీయకత కది ఆలవాలం. మనసులోనిబాధలు, క్లేశాలూ విచారాలు మరచిపోవడానికి అప్పుడప్పుడుజనులు 'కోన'వైపు పరుగులెత్తేవారు. ఎంతటి మనో కల్మషాన్నైనా మరపింప చేయగల మహాత్వపూర్ణ ప్రశాంతత అక్కడ వెల్లివిరుస్తూంటుంది.

తొమ్మిదయ్యేప్పటికి బండ్లు రెండూ శివాలయం ముందాగాయి. అందరూ బళ్ళు దిగారు. ఆ గతుకుల బాటలో బండ్ల కుదుపులతో నడుం పట్టుకుపోయిన సరోజ నిటారుగా నిలబడి 'అబ్బా !' అనుకుంటూ చుట్టూ చూపులు పోనిచ్చింది. ఎదురుగా నవ్యశిల్ప కళలతో శోభాయమానంగా

విరాజిల్లే దేవాలయం చుట్టూ అంబరాన్ని చుంబించే మహోన్నత పర్వత సానువులు. ఒకవైపు గలగలాపారే సెలయేరు. కోవెలలో అన్ని గోడాలూ, తలుపులూ "శివలీలలు" చిత్రించిన వర్ణచిత్రాలతో అత్యంతాకర్షణీయంగా కళ్లుజిగేల్మనేలా వున్నాయి.

వంట చేయటానికి వారితో వచ్చిన బ్రాహ్మణులిద్దరూ సామాను దింపి పెద్ద పెద్ద రాళ్ళు పొయ్యిగా అమర్చి వంట ప్రయత్నంలో మునిగిపోయారు. కాఫీ తాగి అందరూ బట్టలు తీసుకొని సెలయేటివైపు బయల్దేరారు. సెలయేటిలో స్నాన మాచరించి అనుష్టానాలన్నీ నెరవేర్చుకొని దైవ దర్శనానికి తయారయ్యారు. గర్భగుడిలో నిలువెత్తు స్ఫటికశిలా నిర్మిత శివలింగం స్వచ్ఛందకాంతులీనుతోంది. పవిత్ర జలంతో స్వామి నభిషేకించి ధూప దీప నైవేద్యాలతో దేవుని అర్చించి తీర్థ ప్రసాదాలు స్వీకరించేసరికి పొద్దు నెత్తి కెక్కింది. చుర చురమనే ఆకలితో అందరి కడుపులు లుంగచుట్టుకు పోతున్నాయి. వారు బండి దింపిన స్థలానికి చేరేసరికి బ్రాహ్మలు విస్తళ్ళుపరిచి భోజనమమర్చారు. అందరూ తృప్తిగా భోం చేశారు. అంతవరకు కలిగిన బడలిక, సుష్టుగా భోంచేయటం చుట్టూవున్న అరటితోటనుంచి వీచే చల్లటిగాలి పెద్దలందరికి నిద్రముంచుకొచ్చింది. మాట్లాడుతూనే మధుతల్లి తండ్రి, బావ గాఢ సుషుప్తిలో కొరిగిపోయారు. మధు అక్క ఏదోపుస్తకం చదువుతూ పడుకుంది. మధు కూర్చుని, కూర్చుని విసుగెత్తి లేచి చెప్పులు వేసుకుంటూంటే చూసి సరోజ అడిగింది 'ఎక్కడికి వెళ్తున్నారు?" అని. "అలా తిరిగొస్తాను. ఘ్వారికే

కూర్చోబుద్ధి కాలేదు" అన్నాడు. అని తిరిగి "మీరూ వస్తారా? "అన్నాడు. అక్కడ కూర్చొని ఆ నిద్రపోయే వాళ్ళ ముఖాలు చూస్తూ ఊరికే కూర్చోవటం యిష్టంలేక "నేనూ వస్తాను పదండి!" అంది లేస్తూ సరోజ. ఇద్దరూ అలా బయల్దేరారు. అరటితోటలో అడుగు పెట్టగానే "హాయి" అనిపించింది వాళ్ళ ప్రాణాలకి. అక్కడక్కడ భూగర్భం తొలుచుకొని పైకి ఆవిర్భవించిన శివలింగాలు అనేకం గోచరించాయ్ వాళ్ళకు. పడిపోయిన మొండి గోడలతో, కూలిపోయిన గోపుర శిఖరాలతో 5,6 దేవాలయాలు కూడ వాళ్ళ దృగ్గోచర మయ్యాయ్. అవన్నీ చూస్తూ వాళ్ళు ఒక చిన్న వాగు సమీపించారు. ఆ 'వాగు' కటువైపు కెట్టెదుట చిన్న గుట్ట. ఆ గుట్టమీద ఒక కోవెల. చెక్కుచెదరని ఆ గుడిచూసి ఆశ్చర్య పడింది సరోజ. మధువైపు తిరిగి "అదేమిటండీ! చుట్టు పక్కల వున్న దేవాలయాలన్నీ పూర్తిగా శిథిలమైపోయాయ్. కాని ఆ గుడి చెక్కు చెదరనే లేదే !" అంది. ఆ స్థలాలన్నిటికీ మధు చిరపరిచితుడు. ఎన్నోసార్లు బంధువులతో, స్నేహితులతో వచ్చినవా డవటం వల్ల ఎక్కడెక్కడ ఏముండేది అతనికి కొట్టినపిండి. ఉత్సుకతతో తనవైపే చూస్తున్న సరోజను చూసి అన్నాడు మధు- "అది కూడా ఒక దేవాలయమే. అందులో అతి స్వల్పమైన శివలింగం ప్రతిష్టించ బడింది. మతకలహాలతో తురుష్కులు యీ చుట్టూ వున్న గుళ్ళన్నీ విధ్వంసం చేశారు. ఆ గుట్టమీద గుడికూడా నాశనం చేయాలనుకున్నారట కాని సాధ్యం కాలేదు. ఎంతో మంది ముష్కరులు కలిసినా ఆ లింగాన్ని పెకలించలేక

పోయారట. అది మహిమాన్వితమైన లింగమని చెప్తూండగా విన్నాను" అన్నాడు మధు అటువేపే చూస్తూ.

"అయితే మనం చూసి వద్దాం" అంది సరోజ.

"చూడటానికేముంది సరోజా! అక్కడ అడుగు పెట్టగానే గబ్బిలాల కంపు 'గుప్పు' మంటుంది. అన్ని గబ్బిలాలు ఒక్కసారి మనల్ని చుట్టేస్తయ్. అంతేకాదు, లోపల కటిక చీకటి. ఏదైనా వెలుతురుంటే తప్ప మనకేమీ కన్పించదు" అన్నాడు మధు. కాని సరోజ చూడాలనటంతో యిద్దరూ బయలుదేరారు.

అప్పటికి సుమారు రెండు గంటలు కావస్తోంది. అయినా ఎండ తీక్షణత ఇసుమంతైనా శాంతించలేదు. అంత వరకు నడిచిన అలసట కొంత, ఏటవాలుగా వున్న ఆ కొండ నధిరోహించే ప్రయాస కొంత- పైగా మింటినుండి ప్రజ్వరిల్లే ప్రభాకరుని ప్రచండమైన వేడిమి వల్లకలిగిన బాధ వల్ల సరోజ చెంపల నుండి చెమటలు దిగజారి పోతున్నయ్. ఆయాసంతో అడుగులు తటబడుతూంటే కొద్దిగా ముందుకు తూలింది సరోజ. ప్రక్కనే నడుస్తున్న మధు తటాల్న తన రెండు చేతులూ ఆమె చుట్టూ వేసి తనవైపు లాక్కున్నాడు- ఆమె కిందపడుతుందేమోనన్న ఆతృతతో. అప్రియత్నంగా జరిగిన అనాలోచిత క్రియ అది. సరోజ కూడా భయంతో మధును గట్టిగా పట్టుకుంది. ఆమె బిగువైన వక్షస్థలం మెత్తగా తగిలింది మధుకు. ఆ సమయంలో యోగ్యతాయోగ్యతల గూర్చిన విచక్షణాజ్ఞానం అంతరించిం దతనిలో. దాంతో సరోజను బలంగా తన ఛాతీకి అదుముకున్నాడు. అంత వరకు

నిద్రితమైన అతని యవ్వనం మేల్కొంది. అతని శరీరంలో రక్తం సలసలా కాగింది. అతనిలో ఏవో అవ్యక్త మధురకోరికలు విజృంభించాయ్. ఏదో అపూర్వ మధుర వేదన అతన్ని తొందరించింది. రాగరంజితాలైన ఆమె పెదవుల్ని అతి గాఢంగా చుంబించాడు. అంత వరకు పురుష స్పర్శ నెరుగని ఆ మదవతి అతని కౌగిలింతల కమ్మదనంలో బాహ్యస్మృతే కోల్పోయింది. మధు ఆలింగనలో హాయిగ పరవసించిన ఆమె మనసులో విచిత్ర మనస్తత్వం తొంగి చూసింది. ఒక్క క్షణం ఆ యిరువురూ అమందానంద మకరంద మాధురీ ఝురుల్లో మైమరచి పోయారు. నవయవ్వన విలాసితులైన ఆ యువతీ యువకు లిద్దరు మానవ సహజమైన మధుర భావాలకి దాసులయ్యారు. అయితే ఆ యిద్దరిలో ఏ ఒక్కరికి అపవిత్రిత ఆపాదించడం సమంజసం కాదు. అది ప్రకృతి సహజం. తృటి కాలం లభ్యమయిన ఆ అలౌకికానందంలోనే ఆ తరుణి స్నిగ్ధ హృదయంలో ప్రణయరసావిర్భావ ఘట్టం మొదలైంది.

ఈ లోకంలో పడి గభాల్న మధు కౌగిలి విడిపించుకుంది సరోజ. సిగ్గుతో మొగ్గ పోయిందా యువతి. ఆమె నరనరాల్లో ఏవో విచిత్రమైన పులకలు, ప్రకంపనాలు కలిగినయ్. ఆమె మనస్సుకు చక్కిలిగింతలు పెట్టి నట్లయింది. ఏదో విలక్షణ సుఖానుభూతితో సజలాలైన ఆమె ఆర్ద్ర నయనాలు అవర్ణనీయ కళాత్మక సౌందర్యం వెదజల్లాయ్. అనుకోకుండా అసంకల్పితంగా జరిగిన ఆ క్రియతో అనుభవించిన స్వర్గ సౌఖ్యంతో వారిద్దరు వొకరికొకరు నాపేక్షగా తిలకించు కున్నారు. తన విశాల వినీల నయనాలు నెత్తి ఒక్కసారి

సానురాగంగా మధు వైపు చూచి తల దించుకుంది. ఆ ముకు ళిత నేత్ర పద్మదళాల్లో స్పష్టంకాని మధురాను భూతి ఏదో ద్యోతకమైంది మధుకు.

ముందుకు నడుస్తూన్న సరోజ నామూలాగ్రింగా పరీ క్షించాడు మధు. తానింతకు పూర్వం చూసిన సరోజయేనా యీమె! శృంగారం, సౌందర్యం మూర్తీభవించిన అప్సరస భామిని కాదుగదా! ఇంద్రనీలాల మరిపింపజేసే ఆ కురుల సోయగం, యవ్వనం జాలువారే ఆ వక్షద్వయం, సర్వబాధల సంహరించే ఆ ఆకర్ణాంత విశాల నేత్రాలు చాలవా - ఆమె భువనైక మోహిని అనటానికి! తీయని కోరికలు అతనిలో పర వళ్ళు తొక్కుతున్నయ్, ఏవేవో మధురస్మృతులు, యవ్వ నపు వలపు తలంపులు తన్నాహ్వానిస్తున్నట్లే వున్నయ్. ఆవే శంతో ఉప్పొంగిన అతని మనసు చల్లబడటం లేదు. ఆ ఆనందం, తీరని ఆ తృష్ణ, తీక్షణంగా స్పందించే ఆ హృదయ స్పందన, యీ వుద్రేకం యిలాగే శాశ్వతంగా వుండిపోతే!" అనిపించింది మధు యువక హృదయానికి. ఆమె నేత్రాల్లో లాలసాపూర్ణమైన ఏదో ఆకాంక్ష, అస్పష్టతృష్ణ అతనిని పూర్తిగా విచలితుణ్ణి చేశాయ్. ఇది నా భ్రిమజనిత ఊహ కాదు గదా! అనుకున్నాడు. కాని పరమోల్లాసంతో ప్రదీ ప్తమయిన ఆమె ముఖం అతని అనుమానం తుడిచి వేసింది. అతి కష్టం మీద తన్ను తాను సంబాళించుకున్నాడు మధు.

సరోజ కూడా పూర్తిగా విలీనమయింది ఆభావపరం పరల్లో. ఆ సంఘటన కల్గించిన సిగ్గువల్ల రక్తరంజితమైన ప్రదీప్త ముఖంలో కూడా మధుర మందహాసం నాట్యం

చేస్తోంది. ఆ పులకాంకురాలు ఆమె శరీరాన్నే కాదు, ఆత్మను కూడా ఒక్క వూపు వూపినయ్. సుదీర్ఘంగా తీస్తున్న ఉచ్ఛ్వాస నిశ్వాసాల్తో ఆమె వక్షాలు పైకి కిందికి వూగుతున్నయ్. ఆమెకు తెలియకుండానే ఆమెలో ఏదో వినూత్నమైన కోరిక వుద్భవించి వృద్ధి చెందింది. ఒక్కసారి మధు బాహుబంధంలో ఒదిగిపోతే ! మరొక్కసారి ఆ చుంబన క్రియలోని చురుకుదనం రుచి చూస్తే ! అన్న జిజ్ఞాస బైలు దేరింది. తన్మయత్వంతో అర్ధనిమీలితాలైన ఆకలువకన్నుల్లో అపూర్వ లావణ్య జ్యోత్స్నలు తళుక్కుమన్నయ్. ప్రకృతం ఆమెను జాగ్రదావస్థలోకి లాగింది.

కోననుండి తిరిగి వచ్చిన తరువాత సరోజ ప్రవర్తన పార్వతమ్మ ప్రసాద్‌ల కాశ్చర్యం కల్గించింది. ఇప్పుడామె చేసే బావ పనుల్లో వుత్సాహంగాని ఆప్యాయత గానీ కనిపించడం లేదు. యాంత్రికంగా యాదాలాపంగా చేసుకు పోతోందిపనులు. మధు వాళ్ళింటికివస్తే సరోజ అక్కడినుండి తుర్రుమనేది. కాని అతడేఃల్పించుకొని మాట్లాడుతుండేవాడు- "సరోజా! పెద్దమ్మవుందా? సరూ! బావ పొలంవెళ్ళాడా?" అంటూను. ఆమెఎంతకీపలక్కపోతేనవ్వేవాడు. "ఏం! ఇవాళ స్కూలు ఎగ్గొట్టావా?" అంటూ ఏడ్పించేవాడు. ఏఅపూర్వవిషయం జరగనట్లు నిర్వికారంగా నిర్మొహమాటంగా ప్రవర్తించే మధును చూస్తూ చకిత అయ్యేది ఆమె. కానీ పార్వతమ్మకు సరోజ తీరు అనుమానానికి కారణమైనది. మధు రావటంతోనే విప్పారే ఆమెముహం ఆకళ్ళలో గంతులువేసే అనిర్వచనీయానందం చూస్తే ఆమె మనస్సు శంకతో నిండిపోయేది. మరిఅన్నియేళ్ళ

అనుభవంవున్న స్త్రీహృదయంకదా ఆమెది! ఇక సరోజనక్కడ ఒంటరిగా వుంచడం మంచిది కాదనుకొంది. సాయంత్రం వంటరిగా కూర్చున్న అన్ననుకదిలించినది– "అన్నయ్యా! ఇది ఫాల్గుణం కదా? రేపువైశాఖంలోయిద్దరికీ ముడిపెట్టి ప్రశాంతంగా వూపిరి పీల్చుకుందామనుకున్నాను" అంది అన్న చేతికి పాగాకు కాడ అందిస్తూ! "అలాగే నమ్మా! నాఅభ్యంతరమేముంది? నీయిష్టమొచ్చినట్లేకానీయ్"అన్న నవ్వుచూడగానే పార్వతమ్మకు కొండంతధైర్యం కలిగింది.

ఆరోజు రాత్రి సరోజ సహపంక్తిని భోంచేస్తున్న కొడుకుతో పార్వతమ్మఅంది– "ఒరేయ్ ప్రసాద్! రేపువైశాఖంలో మీాయిద్దరిని ఒక యింటివాళ్ళనుచేసి విశ్రాంతి తీసుకుందామనుకుంటున్నామురా! నాకు,మామయ్యకు పూర్తిగా జవసత్వా లుడికిపోయాయ్. ఈవున్న ఒక్కభారము తీసివేస్తే నిశ్చింతగా వుందామని వుందిరా!"అంది. యెంత దాచుకున్నా దాగని సంతోషోద్వేగాలు ప్రసాద్ముఖంపై నాట్యమాడాయ్. అతని కళ్ళలో వెలుగురేఖలు తళుక్కు మన్నాయ్. అంత ఆనందం లోపలేదాచుకుంటూ"సరే తర్వాతచూద్దాంలే"అన్నాడు. అతనిసుముఖత్వంచూసి తృప్తిగా నిట్టూర్చిందితల్లి. కాని సరోజ గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయ్. యిక ఒక్కమెతుకు తినలేకపోయింది. గబ గబా చెయ్యికడుక్కొని తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆలోచనా ఝుంఝూమారుతంతో నిలువెల్లా కంపించిపోయింది సరోజ. ఆమె అంతరాంతరాలలో తీవ్రమథనం చెలరేగింది. స్వప్నజగత్తులో స్వర్ణమయకాంతులతో సముజ్వ

లంగా ప్రకాశించిన భావిజీవితపు సమస్య నేడతి కఠోరరూపం లో దర్శన మిస్తూంది. వివాహ విషయం ఆమె జీవన్మరణ సమస్య! మానవ జీవితపు కఠోర నగ్నవాస్తవికత నేడామె కళ్ళముందు భయంకరరూపంలో విలయతాండవంచేస్తూంది. ఆమెజీవితంలో కొద్దిరోజులలోనేఆశ్చర్యకరమైనఅనూహ్యమైన మార్పు గోచరించింది. బాల్యంనుండి ఆరాధించిన బావప్రతిమ నేడు కాంతిహీనంగా ఆమెకళ్ళముందు నాట్యంచేస్తోంది. అయినా ఎంత చిత్రంగా తన మనసు మారిపోయింది! అసలు మానవులమనసే అతి విచిత్రమైంది. అది దేనివల్ల విరుగు తుందో, మరిదేనివల్ల కరుగుతుందో, ఏభావంవల్ల అతుకు తుందో తెలియదే! కాకపోతే పసితనమునుండి తను ఫూరూ వాడ ఏకమై ప్రసాద్ భార్యనన్న భ్రమలో వూగుతోందే! దానికేనాడూ విఘ్నం వాటిల్లలేదు. తనుకూడా ఆవిషయంలో ఏనాడు వుదాసీనత కనబరచలేదు! ఇన్నినాళ్ళు తనమనసు బావపై లగ్నమైందనుకుంది! కాని నేడు ఏ విపరీతశక్తివల్లో అది అబద్ధమని రుజువైంది. తన ఆత్మ, బుద్ధి, శరీరం సమస్తం నేడు మధు పాదాక్రాంతమయ్యాయి! ఇది ఎంత కఠినతర సత్యమో తనకు తెలుసు. నవయవ్వనంతో, తియ్యనికోరికలతో పరవశించే, తన హృదయవీణ సరిచేసి సరైన తరుణంలో మ్రోయించిన నేర్పు మధుదే! అంతవరకు నిద్రాణమైన తన వలపు మధు కౌగిలింతలో కళ్ళు విప్పింది. అతని సమక్షంలో అనిర్వచనీయానందం కల్గుతుంది తనకు. తన్ను మురిపించి మరపించగల శక్తి ఒక్క మధుకే వుందేమో! తానేమో నిరాధార, నిస్సహాయ కాదుగా! తను మెచ్చినవానితో

వైవాహికబంధం స్వీకరించేశక్తి, స్వాతంత్ర్యం తనకు లేవా! అజ్ఞానతిమిరంలో ప్రేమఅంటే తెలియని పసితనంలో తాను బావను చేసుకుంటానన్నమాట నిజంకావచ్చు. కాని, అంత మాత్రానికే, తన ఆత్మను, బుద్ధిని నలిపి నేడు బావతో వివాహానికి సమ్మతించగలదా! ఆనాడు క్షణకాలమైన ఆ సంఘటనతోనే తనలో మధు స్త్రీ సహజమైన కోరికలు, పుదేరి కాలు పొంగులువారేలా చేయగలిగాడు ఇన్నేళ్ళ సాహచర్యంలో తానొక్కనాడైనా బావవల్ల ఆ అనుభూతి పొందగలిగిందా? అనుకునేంతలో ఆమె కానాటి సంఘటన ప్రకాశవంతంగా కన్పించసాగింది. అది అతి సామాన్యసంఘటనే కావచ్చు. కాని అదే ఆ సుకుమారి హృదయంలో ఉత్కృష్టతరస్థాన మాక్రమించుకొంది. ఎన్ని విధాల తన్నుతా సంభాళించుకోవాలన్నా సాధ్యంకాలేదామెకు. తన శరీరంలో ప్రతి కణం మధునే తన జీవిత భాగస్వామిగా చేసుకోమని హెచ్చరిస్తోంది. అది ఎంత అస్వాభావికమైనసంగతో, దానివల్ల ఎందరి హృదయాల్లో పెనుతుఫాను రేగుతుందో తెలియక కాదు.

కన్నతల్లి కన్న మిన్నగా కంటికి రెప్పలా కాచిన అత్త హృదయంలో ఎంత బడబాగ్ని ప్రజ్వరిల్లుతుందో, దుర్బలులైన తండ్రి ఆశలు సమూలంగా ఎలా నాశనమౌతాయో తనపై అన్ని ఆశలు రంగరించుకొన్న బావ ఎంత అధఃపాతాళానికి కృంగిపోతాడో వూహించలేని ముగ్ధకాదామె! తనకు వూరివారివల్ల సంభవించే అవమానము, నమ్మిన అందర్ని వంచించిన ఫలితంగా కలిగే సిగ్గూ, సంకోచమూ తన నరాల్ని

రంపపుకోత కోస్తాయన్నది ఆమె ఎరుగక కాదు: అనుక్షణం సంఘటిల్లే చీదరింపులూ, అసహ్యాలు మనోనేత్రాల్లో సుస్పష్టంగా వికటాట్టహాసం గావిస్తున్నయ్. అయినా ఏ కల్పిత సుఖాన్ని జీవితంలో ఆశించి, తానింత స్థిరభావంతో, స్థైర్యంతో తలెత్తి బావకు చేసుకోనని చెప్పగల్గుతుంది! అన్న ఆశ్చర్యమే ఆమెలో పాతుకుంది.

"చిన్ననాటినుండి, తన్నాదరించి, అభిమానించి, ఆప్యాయంగా నేను తనదాన్నేనన్న గాఢనమ్మకంతో తన్నాశించి, తన జీవితజ్యోతిని నేనేనని ప్రాణప్రదంగా ప్రేమించిన బావనెలా మోసం చేయగలదు? అమృతం కురిపించి తన్ను గారాబాలా బాలగా గారవించిన అత్త ఆప్యాయతాదరణాన్ని ఎలా కాలితో తన్నగలదు? తన అంతరాత్మలో తొణికే జీవశక్తి కల్గించే మాతుగు ఘోరంగా తన్ను దయావిహీనంగా వదిలివేస్తే ఆ పితృహృదయం సహించగలదా? కొండంత ఆశలు తమపై నిలుపుకొని అహర్నిశలూ తమ శ్రేయస్సు కాంక్షించే యిందరి హృదయాల్లో హాలాహలం సృష్టించబోతుందా తను? సర్వఆశలు తనపై కేంద్రీకరించి తనే అతని జీవితం నందనవనంగా మార్చగలదన్న ధైర్యంతో ప్రశాంతంగా జీవించే బావను చూస్తూచూస్తూ కరాళకాలగర్భంలోకెలా తన్నగలదు? తన్ను నమ్మి విచ్చలవిడిగా విహరింపనిచ్చిన ధర్మమూర్తి, శాంత స్వభావి, గంభీరహృదయుడు బావ తన విచిత్రమైన కోరిక విని ఆ అగాధ మార్మిక వేదననుండి కోలుకోగలడా!"

ఆమె మనస్సులో ఘోర సంగ్రామం ప్రారంభ మైంది. ఆత్మకూ, బుద్ధికీ గాఢ సంఘర్షణ ప్రారంభమైంది. తన్ను దహించివేసే జ్వాలలనుండి తప్పించుకోలేక పోయిందా అమాయికురాలు. మనస్సు మధును వాంఛిస్తుంటే ఆత్మ బావ వైపు మొగ్గుతోంది.

"ఓసీ! మతిమాలినదానా? క్షణిక దౌర్బల్యానికిలోనై ఎదురుగా వున్న అమృత భాండం కూలద్రోయకు. మంద మతివై ముందు అడుగు వేయకు. ఆదర్శమంటూ నిన్ను నీవే మోసగించుకుంటూ అంధురాలివి కాబోకు. దేవుడు లాటి బావను త్యజించకు. వచ్చో భాగ్యం వదలకు. ఆపదలో, ఆదు కొని, ఆదరించి ఆశ్రయ మిచ్చి, అధిక్యత ప్రసాదించిన మధుర మూర్తి ప్రసాద్ మనసులో దావానలం వెదజల్లకు. అను కున్నదానికీ, ఆచరించేదానికీ, నీకు అనుబంధం ఏమీ లేదా? ఏ అవరోధాలూ, అడ్డంకులూ, లేకుండా యిన్ని ఏళ్ళ నుండి పెరిగిన గాఢ బాంధవ్యం ఒక్క విదిలింపుతో వదల్చగలవా! కళ్ళుమూసుకుపోయి, దురహంకారంతో మోహపరవశవై బావ విజ్ఞానాన్ని, విద్యా సంస్కారాన్నీ, అతని విశిష్ట నిర్మల మనఃప్రవృత్తినీ నిరసించి అధఃకూపంలో పడి నీ అల్పహృదయాన్ని వ్యక్తం చేయకు. తొందరపడి లాభం లేదు. అన్ని స్థితిగతులు ఆలోచించి నిబ్బరంగా, నిలకడగా నిల బడ గలిగే దృఢనిశ్చయం నిర్ణయించుకో" అంటూ అంత రాత్మ తీవ్రంగా గర్జించింది. ఆమె అభిప్రాయాన్ని నిరశిం చింది. దాంతో ఆ బేల తన మోహపటలం విచ్ఛిన్నం చేసుకో ప్రయత్నించింది. కాని పట్టు సడలించే కొద్దీ మనసు

మధు వైపు బలంగా ఆకర్షించ సాగింది. ఏ అజ్ఞాతశక్తి ప్రేరణతో తాను మధుపై మనసు నిలుప గలిగిందో, అది ఏ క్షణంలో, ఎక్కడ, ఎలా ప్రారంభమైందో, ఆమె కీ నాటికీ స్పష్టం కాలేదు. కాని ఆమె గమనించిం దొక్క విషయం- కామ పరవశయై క్షణికావేశంతో తాను మధు సాంగత్యం కోరడం లేదు ఎప్పుడో బలీయంగా ప్రసాద్ కు బదులుగా మధు మూర్తి తనలో నిశ్చలంగా నిలబడ గలిగింది అన్న భయంకరసత్యం పురివిప్పి నాట్యమాడ్తోంది తనలో. ఏ విధంగా గూడా సరోజ ఆ భావసంచలనం నుండి దూరంగా తప్పించుకో లేక పోయింది. అంతరాత్మ యిలా నీతులు బోధిస్తూంటే బుద్ధి మరోమూల నుండి బరువుగా మూల్గింది.

"బావ ధర్మమూర్తే; కాదనటంలే దెవ్వరు. కాని ఎవరిక్కావాలి ఆ ధర్మం? జీవితంలో సుఖ పడటానికి ధర్మ మతి ముఖ్యమా ? మగువ మనసు రంజింప చేయలేని బావతో తనెలా సుఖ పడ్తుంది? సంపూర్ణ సౌందర్యం సంతరించుకొని అపరిమిత సౌందర్యవతిగా తనకళ్ళ ముందే నడయాడే నా సౌందర్యం బావ ఏనాడైనా మెచ్చుకో గల్గాడా? క్షణక్షణం తన కళ్ళల్లో కదుల్లాడే కన్నె పిల్ల కోరికల బావ అర్థం చేసుకో ప్రయత్నించాడా ? అనుభవింపదగిన వస్తువు అతి సమీపంలో వున్నా జడత్వం వహించే ప్రసాద్ హృదయం శృంగారం చిలికించ గలదా? అనవరతం అతని సాన్నిధ్యంలో సంచరించే తన అందం అనుభవించ లేతగాని నిరసుడా బావ? అతని నిమీలితనేత్రాల్లో మహాన గంభీరసుద్ర కేతప్ప అనురాగం లేశమైనా ప్రతిఫలించ దే! శాంత, సముద్రభావాలే

తప్ప జీవితాన్ననుభవించే వుద్వేగం, చురుకుదనం అతనిలో ఏంచుకాగడా వేసి వెతికినా కనుపించదే! ఎప్పటికీ బావను చేసుకొని సుఖించలేను. ఎలాగైతేనేం మధు మృదుస్పర్శతోనే స్త్రీ సహజమైన కోరికలూ, వుద్రేకాలూ తనలో వుప్పెనలా వుప్పొంగినయ్. ఆ మధురయామినిలోనే తనలో అనురాగలత చిగురించింది ఆ కాంతి అప్పుడే మొగ్గతొడిగింది. ఇక ఏమైనా సరే!ఇది ఎంత అవాస్తవిక తలంపైనా కావచ్చు. ప్రపంచం మొత్తం తనమీద దండెత్తినా సరే!తన నిశ్చయం సడలదు. తాను చలించదు. మధుతోనే తన వైవాహిక జీవితం మధురతరంగా భావించాలి.”

ఇన్ని ఏళ్ళుగా నేను ఏనిష్కామప్రేమతో బావ నారాధించగల్గానో ఆ గౌరవభావం కల్పాంతమువరకు తనలో చెక్కుచెదరదు. అదే పూజ్యభావంతో బావ సుందర మంగళ స్వరూపాన్ని, అతని మహోన్నత వ్యక్తిత్వాన్ని అజన్మాంతం ఆరాధిస్తుంది. అంతేకాని అతనితో తన పెళ్ళి అసంభవం. ఎన్నో యోచనలతదుపరి దృఢంగా నిశ్చయించుకోగల్గింది సరోజ. అయినా ఆ భావ సుడిగుండంలో, మానసికవ్యధతో నీరసంగా,అలసిపోయిన ఆమె కళ్ళనుంచి ధారాపాతంగా అశ్రువులు వర్షించసాగాయ్. ఆ నిశ్శబ్ద నిబిడాంధకారంలో, నిస్సహాయమై కరుణాకాతరంగా వెక్కివెక్కి ఏడుస్తున్న ఆ జవ్వని నెవ్వరూ ఓదార్చరాలేరు. ఆ అసాధారణ పరిస్థితుల్లో అతిదీనంగా విలపించే ఆయువతి అవస్థ ఎవరికి అవసరంలేకపోయింది. అకస్మాత్తుగా ఏదో అదృశ్యశక్తి తనకేదో సంకేతం బోధిస్తున్నట్లు పాడగట్టింది.“ఏమాత్రం నీవు సుఖించగోరినా,

హఠాత్తుగా నీజీవితపరిధిలోకిపరుగెత్తి వచ్చిన ఆవ్యక్తినే సంపూర్ణంగా నీవాణ్ని చేసుకో!" అని తన కర్ణకుహరాల్లో ఎవరో ఎలుగెత్తి అరిచినట్లు అనుభూతిపొందింది. దానితో ఒక స్థిర నిశ్చయాన్ని స్వీకరించి లేచి బావగదివైపు త్వరితగమనంతో సాగిపోయింది.

గాఢాంధకారం- కన్నుపొడుచుకున్నా కనుపించని కాళరాత్రి. వూరంతా నిశ్చల సమాధిలో నిద్రపోతోంది. అక్కడక్కడా అరచే గ్రామసింహాల అరుపులధ్వని తప్ప ఎక్కడా ఏశబ్దమూ లేదు. ఆ నీరవ, నిశ్శబ్ద నిరీహావాతావరణంలో అదురుతున్న గుండెలతో, లయ తప్పిన నడకతో తూలుతూ సరోజ బావగది సమీపించింది. గాఢనిద్రలో, ఏ స్వప్నజగత్తులోనో విహరిస్తూన్న ప్రసాద్ వులిక్కిపడి లేచాడు. ఎవరో తలుపుతట్టూన్న శబ్దం! చెవులు ఓరబెట్టి ఆలకించాడు. 'టక్! టక్! టక్!' అవును- నిస్సందేహంగా ఎవరో తన్ను పిలుస్తున్నారు. గభాల్న లేచి లైటు వేసి వాకిలి తెరిచిన ప్రసాద్ విస్మయ విభ్రాంతదృష్టితో నిశ్చేష్టుడయ్యాడు. ఎదురుగా సరోజ! ఇదేమిటి! ఇంత అర్ధరాత్రిలో ఆమె రాకలోని అంతరార్థమేమిటి! సంశయాకులిత దృష్టితో తన్నాపాదమస్తకం తీక్షణంగా పరికిస్తున్న బావ చూపులు తప్పించుకుంటూ లోపలి కడుగుపెట్టింది సరోజ. ఆమె నిస్సిముంజ్జ, ఆ చొరవ చూడగానే చైతన్యరహితంగా ఆమె కళ్ళలోకిచూసిన ప్రసాద్ నిర్ఘాంతు డయ్యాడు. 'అరె! అదేమిటి! ఆ కళ్ళు అలా జ్యోతుల్లా రక్త వర్ణంతో ప్రకాశిస్తున్నయ్! ఆ బుగ్గలపై ఆరిపోని ఆ కన్నీ రేమిటి! ఆ కళ్ళలో, ఆముఖంలో తొణికిసలాడే ఆ దారుణ

వేదనా, ఆ భయసంకోచాలు ఎందువల్ల?" అపరిమిత వ్యధతో, మూర్తీభవించిన దైన్యంతో తన ముంగిట నిలచిన సరోజను చూడగానే అతని అంతర్మనస్సేదో అమంగళం వూహించింది. ఇదమిద్ధమని నిర్వచింపరాని భయాందోళన లాతనిలో బుస్సున విజృంభించాయ్. అమిత ఆదుర్దావ్యక్తపరుస్తున్న కంఠంతో ప్రశ్నించాడు- "ఏమిటి సరోజా! ఏంజరిగింది?" అతని కంఠస్వరంలో మిళితమైన ఆవేగం, ఆరాటం, ఆతురత గమనించిన సరోజ పెనుతుఫాను తాకిడికి గురైన తిరిగే నావలా కంపించిపోయింది. శరీరమంతా జలదరించింది. ఎలా చెప్పాలో ఏంచెప్పాలో తోచక నిర్విణ్ణదృష్టితో తలవంచుకుంది. విషణ్ణ హృదయంతో, విషాదవదనంతో చలనరహితంగా నిలబడిన మరదల్ని చూస్తుంటే ఈసారి ప్రసాద్‌కు చిరాకు కల్గింది. "ఏంజరిగిందో చెప్పకుండా అలా నిలబడ్తే ఎలా?" అన్నాడు తీవ్రంగా. విసుగువ్యక్తమౌతున్న బావ ముఖంలోకి చూసి మెల్లిగా దగ్గుత్తికతో అంది సరోజ- 'బావా!' అంతే! ఇక ఆమెనోటినుండి ఏమాటారాలేదు. పరిస్థితి గమనించిన ప్రసాద్ బెదిరిపోతున్న సరోజను దగ్గరగా ఒరిగి ఆమె తల నిమురుతూ ప్రేమ వుట్టిపడగా చుబుకంపట్టి పైకెత్తి "చూడు సరూ! నా మీద ఒట్టే! ఏం జరిగిందో చెప్పితీరాలి" అన్నాడు. అబ్బ! ఆ మాటల్లోని మార్దవం తాను భరించగలదా? అనునయించే కొద్దీ అవిరళధారగా బాష్పాలు ఆమె చెంపలు తడిపేస్తున్నయ్. ఉబికివచ్చే వుద్వేగం అణచుకోలేక బావ గుండెల్లో తలదాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. భారం కొద్దిగా తీరాక క్షీణ స్వరంతో మెల్లిగాఅంది సరోజ- "బావా! నేను... నేను...

మధును చేసుకుంటా బావా!" చెప్పలేక చెప్పలేక ఎలాగో తెగించి చెప్పివేసింది. 'సరోజా!' కెవ్వున కేకవైచాడు ప్రసాద్. అతని హృదయాన్ని చీల్చుకొని వచ్చిందామాట. బావబాధ చూడలేని సరోజ గట్టిగా కళ్ళుమూసుకొని మంచంమీద తల వాల్చింది. ఈ క్షణంలో ఏ అదృశ్యపిశాచమో నన్ను నమిలి పారవేయకూడదా అనిపించిందామెకు. ఆమాటవినగానే రక్త వర్ణంతో శోభించే ప్రసాద్ మొహం తెల్లగా పాలిపోయింది. కనీ వినీ ఎరుగని భీకరదృశ్యం ఏదో తన కళ్ళెదుట ఘోరా కృతితో నిలబడగా స్తబ్ధుడై పోయినట్లు అతనిసర్వేంద్రియాలూ స్తంభించి పోయాయ్. కాళ్ళక్రింద భూమి కంపిస్తోంది. తాను, గది, సరోజ సర్వప్రపంచమే ఏదో కాల్పనికవ్యూహా జగత్తులో వలె గిర్రున తిరిగిపోతున్నయ్. తన మస్తిష్కంలోని రక్తనాళా లన్నీ పుటుక్కున తెగిపోయాయా అన్నంత భ్రాంతి గల్గిం దతనికి. సరోజ పలికిన ప్రతిపలుకూ ములుకువలె తనశరీరాన్ని కోసి కుప్పలు పెడుతోంది. కర్ణకఠోరమైన ఆ మాటలతో అతని హృదయం స్తంభించిపోయింది. రక్త ప్రవాహం ఆగిపోయింది. ప్రళయసృష్టి విలయతాండవం అతని కళ్ళముందు ఘోర, విచిత్ర భీభత్స్వరూపంతో వికటాట్టహాసం గావిస్తోంది. అసం ఖ్యాక భూతప్రేత పిశాచాలు తనచుట్టూ నర్తిస్తూ తన శరీ రంలో కణకణము తమ వాడిగోళ్ళతో పెళ్ళగించి కబలిస్తు న్నట్టు వణికిపోయాడు ప్రసాద్. ఏదో అలౌకికభయం అతన్ని ఆవరించింది. అనంతమైన, అభేద్యమైన అంధకారం అతని జీవి తాన్ని చుట్టుముట్టింది. దుస్సహ వేదనతో త్రుటికాలంలోనే అతని రూపం విచిత్రంగా మారిపోయింది. అతని ముఖమంతా

ప్రీతకళ అవరించగా, నామమాత్రంగా నైనా చలనంలేని ప్రసాద్ తల తలుపుకుఆనిచ్చి వివశుడయ్యాడు.

బావనుచూడగానే చలించిపోయింది సరోజ. భయకంపితురాలై గడగడ వణికిపోతూ 'బావా' బావా' అంటూ గట్టిగా వూపింది ప్రసాద్‌ను. అప్పుడు మెల్లిగా తలెత్తి విహ్వాల దృష్టితో ఆమె వైపు చూస్తూ ఏదో అస్పష్టంగా గొణిగాడు ప్రసాద్. కాని అదేమిటో అణుమాత్రం కూడా ఆమెకు వినిపించలేదు. తన్ను చూసి ఆమె భయపడుతుందని గ్రహించిన ప్రసాద్ అతి కష్టంమీద తన్నుదా సంభాళించుకొని సరోజనడిగాడు- 'సరూ! బాగా ఆలోచించే మాట్లాడుతున్నావా? సిగ్గుతో సంకోచంతో నలిగిపోతూ మెల్లిగా తలూపింది. సరోజా! యిది త్వరపడాల్సిన సంగతి కాదు. బాగా యింకోసారి ఆలోచించు. ఏ మాత్రమైనా నీవుత్వరపడ్డావో నీజీవితం అమాంతం ఘోర తిమిరాంధకారంలో కుమిలి కమిలి పోతుంది. పసిహృదయంతో పరాచకాలాడే ఈ నిర్దాక్షిణ్య ప్రపంచంలో ఎక్కడికెళ్ళినా నిరసన తప్ప మరేం లభించదు. ఏం పలకవేం! తనవైపే చూస్తూ సూటిగా ప్రశ్నించేబావఅగాధమైన కళ్ళలో కళ్ళు నిలిపి నిస్సంశయంగా చెప్పింది సరోజ- "నేను బాగా ఆలోచించి చేసిన నిర్ణయం బావా యిది" దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు ప్రసాద్-"సరే నీయిష్టం. కానీ యింకోసారిహెచ్చరిస్తున్నానుసరూ తాత్కాలికావేశాలతో నిండు నూరేళ్ళ జీవితం బుగ్గిపాలు చేసుకోబోకు బంగారుపంటలు పండించాల్సిన భావిజీవితాన్ని భావోద్రేకాలకు బలిచేయకు. నిత్యకళ్యాణంపచ్చతోరణంగా వెలయాల్సిన వైవాహిక జీవితం

చేజేతుల మసిచేసుకోకు. ఆపైన నీ యిష్టం. చె. ప్రంజాబి కిటికీ లోగుండా అంధకారంలోకి తదేకంగా చూస్తున్న బావ వైపు తన కలువల్లాంటి కళ్ళెత్తి చూసిందోసారి సరోజ. చెంప వారేమున్న ఆ బావ కళ్ళల్లో దోబూచులాడే ఆవేదన ఎంతటి పాషాణాన్నైనా కరిగిస్తుందేమో. అతని ముఖంలో దైన్యం, వికారం, శోకం, తప్ప తనకంత తీవ్రాఘాతం కల్గించిన సరోజపై లేశమైనా క్రోధం, ఈర్ష్యాసూయాద్వేషాలు కన్పించటమే లేదు. అతని ప్రతి పదంలో ఔదార్యం, మృదుత్వమే తప్ప యితరులను నొప్పించే ఏ దురావేశము మచ్చుకైనా కన్పించదు. నిష్క ల్మష ప్రేమతో ఆత్మనే అర్పించిన ఆ మహనీయుణ్ణి అం... నిరాశా నిస్పృహల్లోకి నిరాఘాటంగా తోసివేసిన ... తప్పిదం క్షమార్హమా? ఆ నిర్మల హృదయాన్ని తా... హక్కు కూడా ఈ పాపభాగినికి లేదేమో! 'తాను ప్రే... బడటం లేదుగదా' అన్న భావన తోచగానే మనస్సు మథి... వేసే శోకం పొంగి పొరలగా బావ పాదాలు గట్టిగా పట్టు కుని భోరున విలపించింది సరోజ. "నన్ను క్షమించు బావా" అంది వెక్కి పడుతూనే! 'క్షమా' గుండెలు పిండివేసే అంత దారుణ బాధలో కూడ ప్రసాద్ పెదవులపై నిర్జీవమైన ఒక చిరునవ్వు తొంగి చూసింది. అతి కరుణాపూర్ణ దృష్టితో వంగి సరోజ భుజాలను సున్నితంగా లేవనెత్తుతూ అన్నాడు- "క్షమ ఎందుకమ్మా! భగవత్ ప్రసాదితమైన మనసు మరొ కరికి అర్పించినందుకా! అది తప్పుకాదు." ! 'అమ్మా' అన్న మాట వినపడ గానే అదిరి పడింది సరోజ. చలించి లేసి వున్న ఆ కళ్ళతో అలాగే చూస్తూ నిలబడి పోయింది.

"అమ్మనా ! అవును. రేపటి నుండి తను అతనికి అమ్మ కాక మరేమౌతుంది ?" సరోజ రెండు చేతుల్లో ముఖం దాచుకొని గబుక్కున బైటికెళ్ళిపోయింది. స్త్రీ హృదయం ఎంత చిత్రమైంది ! అది ఏ క్షణంలో వజ్రకఠినత్వం దాలుస్తుందో, ఏ నిమిషం నవనీతంకన్న సుకుమారంగా కరిగిపోతుందో సృజించిన ఆ విధాతకన్నా తెలుస్తుందనటం సందేహాస్పదమే. అంతవరకూ మధును తప్ప మరెవరిని పరిగ్రహించలేనని ప్రసాదును తృణీకరించిన ఆ జవ్వని ప్రసాదు నోటినుండి వచ్చిన అమ్మ శబ్దమే భరింపలేక పారిపోయింది ! స్త్రీ శక్తిలోని విభిన్నతత్వమదే !

సరోజ నిష్క్రమణంతో అతనిలోని పరితాపం తిరిగి విజృంభించింది. అతని హృదయంలో ప్రళయదావాగ్ని బహుముఖాల వ్యాపించి అతని జీవిత స్వప్నాన్ని చెరిపివేసింది. మానసంలో అగాధమైన హృదయపులోతుల్లో గడ్డకట్టి ఘనీభవించిన దుఃఖం కన్నీళ్ళ రూపంలో ప్రవహించసాగింది. తన జీవితం ఒక్కసారి తిరగదోడి చూసుకున్నాడు ఆ నిస్సహాయ యువక మూర్తి.

"ఏమిటీ జీవితం ? సృష్టి వైపరీత్యమంటే యిదేనా! తానే అపరాధం చేశాడని విధి తనతో యిలా చెలగాటం ఆడుతోంది? తన జీవితంలోని ఆకాంక్షల్ని, ఆశల్ని ఆశయాల్ని యింత క్రూరంగా ఎందుకు నాశనం చేసింది ! యౌవనకాలపు సహజోద్రేకాల్ని స్వప్నసీమా నిర్మిత ఆశాసౌధాల్ని యిలా విధ్వంసం చేయటానికి తానే పాపం చేశాడని ? ఇరవై వసంతాల నుండి నిర్విఘ్నంగా సాగే తన

బాంధవ్యం ఎందుకిలా అకస్మాత్తుగా విచ్ఛిన్నమైంది! సరోజ ఏదుర్బోధ ప్రేరణవల్లనో యిన్నినాళ్ళ సాహచర్యంవిస్మరించి తన్ను విడనాడిందన్న మాట !"

ఎంత కఠోర సత్యం! అమ్మ యిది విని జీవిస్తుందా! శిథిలమైన ఆ శరీరంలో కొడిగట్టి వున్న ఆ జీవజ్యోతి యీ భయంకర సత్యంతో ఏ పరలోకాలకో పయనించదుగదా! అబల అయిన సరోజ యింత నిస్సంకోచంగా నిర్లజ్జగా ఎలా ప్రవర్తింప గలిగింది! అయినా భగవత్ సృష్టిలో ఏనిముషం ఏ విచిత్రం సంభవించగలదో చెప్పగల్గటం ఎవరి తరం! ఇన్ని రోజులు నా హృదయంలోనే స్వర్గం చూడగల్గాను. కాని యీ కల్లోల వాతావరణంలో యీ కల్మషపూరితమైన మనసులో యిప్పుడే నరకం చూడగలుగుతున్నాను గదా! అన్ని స్వర్గాలూ, నరకాలూ మానవ మందిరంలోనే వున్న నగ్నసత్యం యీ రోజు తెలుసుకోగల్గాను. నిమిషం నిలకడలేని యీ మనసులో యిన్ని ఈర్ష్యాసూయలూ, ప్రలోభాలూ, మోసాలు, నటనలూ, రాగద్వేషాలు ఎందుకు నిబిడీకృతం చేశాడో భగవంతుడు ?

మన ఆలోచనలకు, ఆచరణలకూ అవకాశం ఎక్కడావుండ బోదు. కాకపోతే ప్రాణాధికప్రాణం ఫణంపెట్టి ప్రేమించిన అమాయకుణ్ణి నన్ను మోసం చేయటానికి సరోజ ఎలా సాహసించ గల్గింది! కానియ్! ఇది నా స్థైర్యాన్ని నిరూపించుకోవటానికి భగవంతుడు సృష్టించిన పరీక్ష. అంతిమవిజయం నాదే! నిర్మలంగా, సరోజను కోరిన వరుడికిచ్చి అటు తర్వాత ఎంతటి రౌరవ నరక యాతనైనా భరించగలనని స్పష్టం చేస్తూ చిరు

నన్ను నవ్వగలను. కాని యీ విశాల విశ్వంలో మరిఎప్పుడూ ఏ స్త్రీ నుండి నన్ను వంచితుణ్ని చేయకు భగవాన్" ! ప్రసాదు కళ్ళు కాల్వలు కట్టాయి.

ఏ విపత్కర పరిస్థితుల్లోనూ ధీరత్వం వీడని ప్రసాదు అంతరాత్మకే విజయం లభించింది. అంతవరకు దుర్భర వేదనతో అలముకొంచిన ఆత్మ సమస్త బాధల్ని భారాల్ని వదిలించుకొని తేలికపడింది. హృదయంలో పేరుకొన్న కటిక చీకటి తెరలు తొలగి మనసు స్వాస్థ్యం పొందింది. అనూహ్యమైన ఆ మానసిక పరివర్తనకతడే ఆశ్చర్యపోయాడు- ఆనందించాడు.

*   *   *   *

అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది, గంటలు కొట్టి నిలిచిపోయింది గడియారం. పార్వతమ్మ ఆందోళనకంతులేదు. ఎనిమిదైనా ప్రసాదు తలుపులు తెరుచుకోలేదు. ఖంగారుగా తలుపు తట్టూ అరిచింది పార్వతమ్మ-

"ప్రసాద్ ! ఒరేయ్ ప్రసాదు !" బాగా తెల్లవారిన తరువాత నిద్ర కుపక్రమించిన ప్రసాదు తల్లి కేకలకు తృళ్ళిపడి లేచాడు. తలుపు తీస్తూనే పార్వతమ్మ లోపలి కడుగు పెట్టింది. "అదేమిట్రా ! రాత్రంతా నిద్ర పోలేదా ?" అంది కొడుకు చెయ్యి పట్టుకుంటూ.

ప్రసాదు సందర్భంలో పడ్డాడు. డిసెంబరు సెలవులు అయిపోతున్నాయి. మధు గుంటూరు [illegible] [illegible]లో వున్నాడు. అతడు రాకముందే అటో యిటో తేల్చుకోవలసిన విషమ సమస్య. ఎప్పటికైనా చెప్పక తప్పదు !

ఇప్పుడే ఎందుకు చెప్పరాదు ? ఆలోచిస్తూ ప్రసాదు తల్లి చెయ్యి పట్టుకొని మంచంమీద కూర్చోబెట్టాడు. అల్లుడు అంతవరకు లేవకపోవడానికేదో ప్రబల కారణముంటుందనే అనుమానంతో శంకరయ్య కూడా ఆ గదివేపు వచ్చాడు; ప్రసాదు నవ్వుతూ, "రా ! మామయ్యా !" అని తల్లివైపు తిరిగి "అమ్మా ! రాత్రి నన్నో విషయం అడిగావ్, జ్ఞాపక ముందా !" అన్నాడు.

"అవును ! నీ పెళ్ళి విషయమే కదా !" అంది పార్వతమ్మ.

"ఆ ! అదేమ్మా ! సరోజ కూడా యుక్త వయస్కురాలైంది. దాని బాగోగులు అదే ఆలోచించుకోగలదు గదా! కనుక దాన్ని ఒక్క మాటైనా అడగ వద్దామ్మా !"

"అడుగు ! అందులో ఏముంది? ఇది ఈరోజనుకున్న వింత విషయమేం కాదుగదా !" అంది పార్వతమ్మ సంశయిస్తూనే.

"అడిగానమ్మా ! సరోజ మధును ప్రేమిస్తోంది !" ఎవ్వరి వంకా చూసే ధైర్యం లేక బైటికి చూస్తూ అన్నాడు ప్రసాదు.

"ఏమిటీ!" ఇద్దరూ కొయ్యబారిపోయారు. వాళ్ళనెత్తిన పిడుగు పడినట్లైంది. తాము వినేది సత్యమేనా ? కలకాదు గదా ? అన్న అనుమానం యిద్దరికీ కల్గింది. "ఏమిటార్రా ! ఏమిటీ నువ్వనేది !" గాబరాగా అడిగింది పార్వతమ్మ అదేదో నమ్మరాని అభూత కల్పన అన్నట్లుగా పాలిపోయిన స్వరంతో.

"నిజమేనా బాబూ!" అన్నాడు శంకరయ్య. అవ్యక్త బాధతో. అతని ముఖం పాలిపోయింది. ఇది నమ్మవలసిన సత్యమో,నమ్మకూడని అసత్యమోకూడా అర్థం కాలేదతడికి. తన కూతురు జీవితం ఏ వినాశకర భయంకర పరిస్థితుల్లోకి లాగబడ్తోందో వూహించలేకపోయాడతడు. మామయ్య దీనావస్థ చూసే సరికి ప్రసాదుకు జాలి కలిగింది. పాపం! ఈ వృద్ధునికిది · ఎంత సమ్మెటపోటో! ఈ శరాఘాతాన్ని తట్టుకోగలడా! అనుకుంటూ "నిజమే మామయ్యా; సరోజ మధునే చేసుకుంటుందిట" అన్నాడు.

పార్వతమ్మను అవమానం క్రోధం రెచ్చిపోయాయి. "దానికి బుద్ధి లేకపోతే నీకు లేకుండా! చదువేస్తే వున్న మతి పోయిందిట. నా కంఠంలో ప్రాణముండగానే అది అడ్డగాడిదలా యింత బరి తెగించిపోయిందా! ఇన్నేళ్ళు అనుకున్న మేనరికం కాదని అది వేరేవాణ్ణి చేసుకుంటుందా! ఇద్దర్నీ నిలువునా చీరేస్తాను!" గట్టిగా రౌద్రాకారంతో కళ్ళల్లో నిప్పులు కురిపిస్తున్న తల్లిని చూసి "ఈమెనా నేను శాంతింప చేయగల్గేది!" అనుకున్నాడు ప్రసాదు. అందుకే ప్రార్థనా పూర్వకంగా అనునయిస్తున్న స్వరంతో యిలా అన్నాడు-

"చూడమ్మా! నీ కిన్నేళ్ళ అనుభవముంది. శాంత సహనాది సద్గుణాలకు పేరొందిన దానివి. ఇలా యుక్తాయుక్త విచక్షణ లేకుండా రెచ్చిపోవటం ఏం బాగుంటుంది! ప్రేమ అనేది ప్రకృతి సిద్ధంగా, సహజంగా, అప్రయత్నంగా జనించాలేగాని ఏ బలవంతం వల్ల ప్రేమ లభ్యం కాదమ్మా!

సరోజ హృద్గతాభిప్రాయం మధును చేసుకోవాలని! బలవంతంగా నీ చేతుల్లో దొరికిందని, మేనరికమని దాని మెడలు వంచి నాశం చేసినా దానికీ సుఖం వుండదు, నాకూ శాంతి మృగ్య మౌతుంది. కొడుకూ కోడలూ ఎడముఖాలు, పెడ ముఖాలుగా వుత్తర దక్షిణ ధృవాలుగా సంచరిస్తూంటే చూసి నీ మాతృహృదయం సహించగలదా? మమ్మల్నే కాదు! పూరందరికి చల్లని తల్లివై శాంతి ప్రసాదించే, నీవు తల్లిలేని పిల్ల సరోజను బలవంతంగా అధోగతిపాల్జేస్తావా? దాని తల్లి బ్రతికి వుంటే కూతురికి అసంతృప్తి కల్గించేపని కంఠంలో ప్రాణముండగా జరుగనిస్తుందా? ఇన్నేళ్ళు చూపిన నీ దయామృతం యేమైంది? నిస్సహాయురాలైన సరోజను నీ యిష్టమనే పేరుతో చిత్రవధ చేస్తావా? ఆజన్మాంతం నిన్నుతిట్టుకొంటూ అశాంతితో వేగిపోయే సరోజ వల్ల నీకు సుఖం లభిస్తుందా? చెప్పమ్మా. చెప్పు! సరోజకు తల్లివి నీవే! ఎన్ని తిట్టినా ఎంత కొట్టినా నీ కన్నా, దాన్ని ప్రేమతో దగ్గరకు తీసేవాళ్ళెవరమ్మా నీ ఒడిలో తలదాచుకొని నీ కరుణలో ఓలలాడి పెరిగి పెద్దదయిన సరోజను క్షమించి మన్నించి ఆశీర్వదించలేవా అమ్మా! నిన్ను తల్చుకొని ఆనందంతో సరోజ జీవించటం కన్న నీకు వేరే ఏం కావాలి? నా మనసాక్షిగా చెప్తున్నా! నాలో ఏ కల్మషమూ లేదు, ఎంతటి బాధనైనా ఓర్చుకోగలశక్తి ఆ మహనీయుడుప్రసాదించాడమ్మా! హృదయమార సరోజ మధును చేసుకోటానికి నా సమ్మతిని తెల్పుతున్నానమ్మా! నా మాట కాదనకు!" సరోజ సుఖంచేలా చేయాలని, ఆమె కే మనోక్లేశమూ కల్గించకూడదని

ప్రసాద్ పడే తపనచూస్తుంటే శంకరయ్య హృదయం ద్రవించి పోయింది తాను గాఢంగా ప్రేమించి, వాంఛించిన స్త్రీ తన్ను నిరాదరణగా కాలితో తన్నినా ఆమెను క్షమించి ఆ స్త్రీ సుఖపడేలా చేయాలని సింధుహృదయంతో కోరే ప్రసాద్‌ను చూసి 'ఇతను మానవ మాత్రుడు కాడు' అనుకున్న శంకరయ్య ఒక్క అంగలో లేచి ప్రసాదు తల తన హృదయాని కదుముకుంటూ గద్గదంగా అన్నాడు- "బాబూ మనిషివై జన్మించినందుకు మానవత్వం లోని మార్దవత నిరూపించావ్ ! నా దురదృష్టం వల్ల అల్లుణ్ణి చేసుకోలేకపోయినా, నా మేనల్లుడిగా నీ మహోత్కృష్ట జన్మ జల్చుకొని నా జీవిత చరమాంకం వరకు గర్వంతో పొంగి పోతాను." శంకరయ్య కళ్ళు జలజలా వర్షించాయ్.

ఒంట్లో మిగిలిన కొద్ది ఓర్పూ, ఓపికా నశించిపోగా, గోడకు తలను ఆనిచ్చి నీరసంగా కళ్ళు మూసుకుని పార్వతమ్మ తనలో తానే మెల్లిగా గొణుక్కుంది-

"ఎంత ఉన్నత హృదయం బాబూ నీది!"



రచయితలు - రచయిత్రులు

1. శ్రీమతి జి. ఎస్. పి. శర్మ:- జననం 1937 విజయవాడలో. ప్రఖ్యాత రచయిత శ్రీ ఘట్టి ఆంజనేయశర్మగారి సతీమణి. సాహిత్యానికి ఒక విశిష్టమయిన ప్రయోజనం, లక్ష్యం ఆదర్శంగా వుండాలని ఆశయం.

కథారచనలో ఇదే ప్రథమ ప్రయత్నం. అయినప్పటికీ సాహిత్య స్వరూపాన్ని బాగా ఆకళింపు చేసుకున్న విశిష్టమైన శిల్పం, కల్పనా వున్నవి.

2. శ్రీ తన్నీరు లక్ష్మీనారాయణ:- ఈ కాల్పనిక జగత్తులో అట్టడుగున పడివున్న వాస్తవికతను పైకి ఎత్తిచూపటమేగాక ఒక విశిష్టమైన మార్గం చూపి, తద్వారా తాను ఆశించు ప్రయోజనం సాహిత్యంలో సాధించాలని ప్రయత్నించుచున్నట్లు ఈయన రచనలు నిరూపించుచున్నవి- కథాకథనము, పాత్రలు ప్రత్యేకమైనవి.

3. శ్రీ ఘట్టి ఆంజనేయశర్మ:- జననం 19-12-1928 కొల్లూరు (గుంటూరుజిల్లా). గిండీ ఇంజనీరింగు కళాశాలలో బి. యి. డిగ్రీ పుచ్చుకున్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ నిర్మాణంలో అసిస్టెంటు ఇంజనీరుగా వుంటూ-సాహిత్యంలో ప్రధాన ప్రక్రియలయిన కథ,

నవల, నాటిక రచనంలో మిక్కిలి కృషిసల్పి, తెలుగు సాహిత్యంలో కొన్ని ఉన్నత ప్రమాణాలు సృష్టించారు. విద్యార్థి దశలోనే కాలేజీ వ్యాసరచనల పోటీలలో పాల్గొని బహుమతులు పొందారు. ఆ తర్వాత పత్రికలకు కథలు పంపడమే కాక, బహుమతులుకూడా పొందారు. నాటికలు కొన్నింటిని ఆకాశవాణి ప్రసారము చేసింది.

సాధన సంపత్తివల్లనే మానవుడు సర్వతోముఖముగా ప్రకాశిస్తాడనే విశ్వాసం. మంచి చతురులు.

4. శ్రీ శివరామప్రసాద్ :- జననం 1943 గుంటూరులో— 1953 నుండి సాహిత్యంలో పరిచయం. అప్పటినుండీ రచనలు చేస్తున్నారు. సి. యస్. ఆర్. లక్ష్మీప్రసాద్ వీరి అసలు పేరు. కాని శివరామప్రసాద్ అనే పేరుతో రచనలు చేస్తుంటారు. చిత్రలేఖనంలోకూడా మంచి అభిరుచి, ప్రవేశము వున్నవి. ప్రస్తుతం నాగార్జున సాగర్‌లో టైపిస్టుగా వుంటున్నారు. 'కాగితంపడవ' అన్న వీరి తొలి నవల అచ్చుకానున్నది.

5. శ్రీ చోడవరపు బాబూరావు :- జననం కోలవెన్ను, కృష్ణాజిల్లా. వయస్సు 36 సంవత్సరాలు. బి. ఏ. వరకు బందరులో చదివి— ఆ తరువాత ఇంజనీరింగు చదివి, తుంగభద్రా డాంలో అసిస్టెంటు ఇంజనీరుగా వుంటున్నా[illegible]గడ వీరి కథలు భారతి, తెలుగుస్వతంత్ర

మొదలయిన పత్రికలలో ప్రచురిత మయినవి. రచనలలో అతి భావుకతకంటె వాస్తవికత కెక్కువ ప్రాధాన్యత యిస్తారు. పది మాటల్లో చెప్పగల విషయాన్ని సూటిగ ఒక్కమాటలో చెప్పడమే గొప్ప కథకుని లక్షణమని వీరి భావన. ఇదే వీరి రచనలలో కూడా స్పష్టం. కథావస్తువుతో బాటు శిల్పము సమపాళ్ళలో వున్నప్పుడే ఉత్తమరచన సాకారమవుతుందని వీరి విశ్వాసము.

6. శ్రీమతి కోమలాదేవి :- జననం ఆదోని (కర్నూలుజిల్లా). గుంటూరు స్త్రీల కళాశాలలో బి. ఏ., సెంట్‌జోసెఫ్ కళాశాలలో బి. యిడి. చదివారు. ప్రస్తుతం బరెలీలో జాతీయ సమైక్యతా పథకం క్రింద ప్రభుత్వోద్యోగులకు రెండు సంవత్సరాలనుండి తెలుగు నేర్పుతున్నారు. తెలుగు పత్రికలకు అప్పుడప్పుడు కథలు వ్రాస్తూంటారు.

ఆంధ్రవారపత్రికవారు 1962లో జరిపిననవలాపోటీలలో వీరి 'బంగారు పంజరం' అన్న నవలకు ప్రథమ బహుమతి వచ్చినది.

వీరి భర్త అసిస్టెంటు రీసెర్చి ఆఫీసరుగా ఇజత్‌నగర్ ఉన్న ఇండియన్ వెటర్నరీ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్నారు.

7. శ్రీమతి సత్యవతీరెడ్డి :- 5-12-1938 డోర్నాల, కర్నూలుజిల్లా. 1955 ఎస్. ఎస్. ఎల్. సి. లో ప్రథమశ్రేణిలో నెగ్గినందుకు వెండి ట్రోఫీ బహుమతి - 57 వరకు కర్నూలు ఉస్మానియా కళాశాలలో విద్యాభ్యాసం - ఆంధ్రప్రభ, పత్రిక, ప్రజామత, జాగృతి- మొదలగు పత్రికలలో కథలు, వ్యాసాలు, ప్రచురితమైనవి.

తెలుగు సాహిత్యంలో భారతీయరచనలయం దభిమానము. తొలి ప్రయత్నం చేస్తున్నారు. సాహిత్యములో ఒక క్రొత్తదనం సృష్టించాలని అభిలాష- ప్రస్తుత నివాసం హైద్రాబాద్.



ప్రతులకు -
క్వాలిటీ పబ్లిషర్సు, విజయవాడ-2.
శ్రీవాణీ పబ్లికేషన్స్, విజయవాడ-2.



	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	BPLA 1013B 486
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	[illegible] copy
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	249
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	[illegible]
స్కాన్ చేసినది	Haseena
పరీక్ష చేసినది	RAMYA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	No
పరిస్థితి	good